సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 197

బుధవారం 8-10-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'




ఏఐతో గుత్తాధిపత్యం..

బడా సంస్థల చేతుల్లోనే భవిష్యత్తు.. అల్గారిథమ్‌ల ద్వారా కుమ్మక్కు -16లో



ఏఐ దుర్వినియోగానికి చెక్

రిస్క్ మేనేజ్‌మెంట్‌ని పటిష్టం చేసుకోవాలి ఫిన్‌టెక్ సంస్థలకు నిర్మల సూచన -15లో



తొలగించిన ఓటర్ల వివరాలివ్వండి

బిహార్ తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 3.66 లక్షల మంది వివరాలను తమకు అందజేయాలని ఈసీని సుప్రీం ఆదేశించింది.

- వివరాలు 6లో



సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

కేసుల విచారణల సమయంలో జడ్జీలు సరదాగా చేసే వ్యాఖ్యలనూ సోషల్‌మీడియాలో తప్పుగా చూపుతున్నారని సీజేఐ జస్టిస్ గవాయ్ అన్నారు.

- వివరాలు 6లో



తొలి డ్యూయల్ చాంబర్ పేస్‌మేకర్

దేశంలో తొలిసారి ఓ రోగికి 'డ్యూయల్ చాంబర్ పేస్‌మేకర్'ను ఢిల్లీలోని మ్యాక్స్ హాస్పిటల్ విజయవంతంగా అమర్చింది.

- వివరాలు 6లో



డాల్ఫిన్ పేరెంటింగ్.. కింగ్

పేరెంట్స్ ఎవరు చేసేది వారికి కరెక్టుగానే అనిపిస్తుంది. మరి, వీరిలో ఎవరు బెస్ట్ పేరెంట్? ఏది బెస్ట్ పేరెంటింగ్?

- వివరాలు 3లో

పొన్నంకు 'లక్ష్మణ' రేఖ!

నేటిలోగా పొన్నం క్షమాపణ చెప్పాలని అడ్లూరి అల్టిమేటం

- లేదంటే ఖర్గే, సోనియా, రాహుల్‌ను కలుస్తానని హెచ్చరిక
- మంగళవారం వైరల్ అయిన 'లక్ష్మణ్‌కుమార్ వీడియో'
- ఆ వీడియోలో ఘాటు వ్యాఖ్యలు చేసిన మంత్రి
- అడ్లూరి లక్ష్మణ్‌పై పొన్నం ప్రభాకర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు
- మరో మంత్రి వివేక్ వెంకటస్వామి వైఖరినీ తప్పుబట్టిన లక్ష్మణ్
- వాడి లెక్కెంత అన్న ఆలోచనతోనే 'నేను వెళ్లిపోతా' అన్నాడని వ్యాఖ్య
- మాదిగ సామాజికవర్గంలో పుట్టి మంత్రిని కావడమే నేను చేసిన పొరపాటా? అంటూ ఆవేదన
- ముదురుతున్న మంత్రుల వ్యాఖ్యల వివాదం
- టీపీసీసీ చీఫ్‌తో దళిత ఎమ్మెల్యేల భేటీ
- బుధవారం మంత్రులను పిలిపించి మాట్లాడతానన్న మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఇద్దరు మంత్రుల మధ్య మాటల వివాదం చినికిచినికి గాలివానగా మారుతోంది. ఒక మంత్రి.. మరో మంత్రిని ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు రావడం, బాధిత మంత్రి..ఆ వ్యాఖ్యలపై క్షమాపణలకు డిమాండ్ చేయడం, అవసరమైతే పార్టీ అధిష్టానం పెద్దల్ని కలుస్తానంటూ హెచ్చరించడం దుమారం రేపుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ సమావేశానికి ఆలస్యంగా వచ్చిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఉద్దేశించి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభ్యంతరకర పదజాలం ఉపయోగించారన్నది ఆరోపణ. కాగా దీనిపై మంత్రి లక్ష్మణ్‌కుమార్ స్పందించకపోవడంతో వివాదం సద్దుమణిగినట్టేనని అందరూ భావించారు. కానీ మంగళవారం ఉదయం ఆయన మరో వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడిన వీడియో వైరల్ అయింది. అందులో లక్ష్మణ్ మాట్లాడుతూ.. పొన్నం ప్రభాకర్ ఇంకా తప్పు తెలుసుకోకపోవడం సమంజసం కాదని, బుధవారంలోగా ఆయన తనకు క్షమాపణలు చెప్పకపోతే తదుపరి పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పొన్నం తననుద్దేశించి మిగతా 2వ పేజీలో ▶

ఇది మా ఇంటి సమస్య: పీసీసీ చీఫ్

దళిత ఎమ్మెల్యేలతో సమావేశం అనంతరం పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఇది తమ ఇంటి సమస్య' అని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో అన్ని కులాలకు సముచిత గౌరవం ఉంటుందని చెప్పారు. ఇద్దరు మంత్రులతో తాను ఫోన్‌లో మాట్లాడానని, మరో మంత్రి శ్రీధర్‌బాబు కూడా మాట్లాడారని, ఇద్దరినీ బుధవారం పిలిపించి మాట్లాడతానని వెల్లడించారు.

పీసీసీ చీఫ్‌కు చెప్పిందే ఫైనల్: మంత్రి పొన్నం

అడ్లూరి లక్ష్మణ్ వ్యాఖ్యలపై తాను మాట్లాడేదేమీ లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ విషయమై తనతో పీసీసీ చీఫ్ మాట్లాడారని, రహ్మత్‌నగర్‌లో ఏం జరిగిందో ఆయనకు వివరించానని, అదే ఫైనల్ అని మంగళవారం మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. పార్టీ పరంగా మహేశ్‌గౌడ్ ఆదేశాలు తమకు శిరోధార్యమని చెప్పారు.



సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో జరిగిన సమావేశంలో భట్టి, మీనాక్షి, పొంగులేటి, పొన్నం, మహేశ్‌గౌడ్, ఉత్తమ్, వాకిటి

మూడంచెల వ్యూహం

- బీసీ రిజర్వేషన్ల జీవోను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ప్రభుత్వం
- హైకోర్టులో సమర్థ వాదనలు వినిపించేలా కార్యాచరణ
- సానుకూలంగా వస్తే ఎన్నికలకు.. ప్రతికూలంగా వస్తే సుప్రీంకోర్టుకు
- హైకోర్టు సానుకూల తీర్పుపై ఎవరైనా సుప్రీంకు వెళితే అక్కడ బలమైన వాదనలు విన్పించాలని నిర్ణయం
- ఏజీ, అభిషేక్ మను సింఘ్వీతో మాట్లాడిన ముఖ్యమంత్రి

సాక్షి, హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీవో అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం మూడంచెల వ్యూహంతో ముందుకెళ్లనుంది. ఇప్పటికే సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా అనుసరించిన వ్యూహాన్ని అమలు చేయాలని, బుధవారం హైకోర్టులో విచారణ సందర్భంగా సమర్థమైన వాదనలు వినిపించాలని నిర్ణయించింది. కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వస్తే యథావిధిగా ఎన్నికలకు వెళ్లిపోవాలని, ప్రతికూలంగా వస్తే వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించినట్టు తెలిసింది. అదే విధంగా కోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇస్తే మళ్లీ కొందరు సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశముంది కాబట్టి.. అక్కడ కూడా బలమైన వాదనలను వినిపించడం ద్వారా ఎట్టి పరిస్థితుల్లో ఈ జీవో అమలయ్యేలా చూడటం ద్వారా మిగతా 2వ పేజీలో ▶

బీసీ రిజర్వేషన్ల ఉద్యమం బలంగా జరగాలి

బీసీ సంఘాల సమాలోచన సమావేశంలో పలువురు వక్తలు - 2లో

న్యూస్‌రీల్

బూత్‌ల వారీగా ప్రచార బాధ్యతలు



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ కీలక నేతలు మంగళవారం భేటీ అయ్యారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బూత్‌లవారీగా ప్రచార బాధ్యతలు అప్పగించే అవకాశముంది.

- వివరాలు 12లో

ఆర్టీసీ డ్రైవర్లు, శ్రామిక పోస్టులకు నేటి నుంచి దరఖాస్తులు



టీజీఎస్ ఆర్టీసీలో డ్రైవర్లు, శ్రామిక్ పోస్టుల నియామకానికి బుధవారం (అక్టోబర్ 8) ఉదయం 8 గంటల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు టీఎస్‌ఎల్పీఆర్బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు తెలిపారు.

- వివరాలు 3లో

కాకి లెక్కలతోనే క్రాప్ బుకింగ్!



రాష్ట్రంలో పంటల నమోదు విధానం లోపభూయిష్టంగా మారింది. క్రాప్ బుకింగ్ అంతా కాకి లెక్కలతోనే ఉండడంతో ఎరువుల పంపిణీ మొదలుకొని పంటల సేకరణ వరకు అంతా లోపభూయిష్టంగానే సాగుతోంది.

- వివరాలు 2లో

32 అడుగుల ఎత్తు.. 45 కి.మీ. నిడివి



హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి వెళ్లే మార్గంలో 32 అడుగుల ఎత్తు, 45 కి.మీ. నిడివితో 4 వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించింది.

- వివరాలు 16లో

గుడ్లు & చికెన్ ధరలు : హైదరాబాద్ జోన్

12 గుడ్ల రిటైల్ ధర ₹72	ఫారం బర్లర్ లైవ్ బర్డ్	115	డ్రెస్డ్ స్కిన్‌తో	199
	రిటైల్ లైవ్ బర్డ్	137	స్కిన్ లెస్	226

ఇదండీ జగత్



పత్తి.. ఎంతైనా కొంటాం

- తెలంగాణ పత్తి రైతులకు అండగా ఉంటాం.. కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ హామీ
- రైతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం క్రూరంగా వ్యవహరిస్తోందని ధ్వజం
- పత్తి రైతుల సమస్యలపై గిరిరాజ్‌సింగ్‌తో చర్చించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బృందం



మీడియాతో గిరిరాజ్‌సింగ్, కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో పత్తి రైతులు ఎంత పండిస్తే అంత పత్తిని కొనుగోలు చేస్తామని.. పత్తి చివరి కిలో వరకూ సేకరించేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ భరోసా ఇచ్చారు. రాష్ట్రంలోని పత్తి రైతులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రైతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం క్రూరంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. బాధ్యతల నుంచి మిగతా 3వ పేజీలో ▶

భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

- క్వాంటమ్ మెకానిక్స్‌పై లోతైన పరిశోధనలకు గుర్తింపు
- జాన్ క్లార్క్, జాన్ ఎం మార్టినిస్, మైఖేల్ హెచ్ డెవొరెట్‌లకు ఉమ్మడిగా పురస్కారం
- ఇద్దరు అమెరికా శాస్త్రవేత్తలు, ఒకరు ఫ్రాన్స్ వాసి
- ప్రకటించిన నోబెల్ కమిటీ

6లో



జాన్ క్లార్క్ | మార్టినిస్ | మైఖేల్



హిమాచల్‌లో ఘోర ప్రమాదం

- బిలాస్‌పూర్ జిల్లాలో బస్సుపై విరిగిపడిన కొండచరియలు
- 15 మంది మృతి.. నుజ్జునుజ్జయిన బస్సు
- బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం
- ముగ్గురిని కాపాడిన సహాయక బృందాలు

మృతుల కుటుంబాలకు ప్రధాని రూ.2 లక్షల సహాయం

- వివరాలు 6లో



ప్రజల జీవితాల్లో మార్పే లక్ష్యం

- ఈ గొప్ప దేశానికి సేవ చేయటం నా అదృష్టం
- గత 11 ఏళ్లలో దేశంలో గొప్ప మార్పు తీసుకొచ్చాం
- ప్రధాని నరేంద్రమోదీ వెల్లడి.. ఎక్స్‌లో వరుస పోస్టులు
- ప్రభుత్వాధినేతగా 25వ సంవత్సరంలోకి ప్రధాని మోదీ

6లో

మద్యం ఆదాయం బాబు మాఫియాకే

రీజినల్ కో–ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకుల సమావేశంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మండిపాటు

మాఫియా వ్యవహారంలా సరఫరా, విక్రయాలు

- పెదబాబు, చినబాబు అండదండలతో ప్రాంతాలవారీగా ఫ్రాంచైజీలు, వసూళ్లు
- ప్రతి నాలుగు బాటిళ్లలో ఒకటి నకిలీనే
- అమాయకుల ప్రాణాలు హరిస్తూ కాసుల దందా..
- ప్రభుత్వ ఆధ్వర్యంలోని మద్యం దుకాణాల తొలగింపు
- ఊరూరా బెల్టు షాపులు, పోలీసు రక్షణతో వేలం పాటలు
- తప్పనిసరి పరిస్థితుల్లోనే ర్యాండమ్‌గా ఎక్సైజ్ దాడులు..



సాక్షి, అమరావతి: ఏపీలో మద్యం సరఫరా, విక్రయాలన్నీ ఒక మాఫియా వ్యవహారంలా సాగుతున్నాయని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అధికారంలోకి రాగానే ప్రభుత్వ దుకాణాలన్నీ మూసివేసిన సీఎం చంద్రబాబు నాయుడు ఆయన మాఫియాకు సంబంధించిన ప్రైవేటు దుకాణాలను తెరపైకి తెచ్చారని ధ్వజమెత్తారు. ఊరూరా 70 వేలకుపైగా బెల్టు షాపులను నెలకొల్పి పోలీసు ప్రొటెక్షన్ ఏర్పాటు చేసి మరీ మద్యం దుకాణాలకు వేలం పాటలు నిర్వహించారని దుయ్యబట్టారు. వేలం పాటలు పాడి డబ్బులు వసూలు చేసి.. మంత్రులకు ఇంత, ఎమ్మెల్యేకు ఇంత, పోలీసులకు ఇంత, పైన పెద్దబాబుకు, చిన్నబాబుకు ఇంత.. అంటూ మొత్తం డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను వారి నియంత్రణలోకి తీసుకున్నారన్నారు. ప్రతి మూడు బాటిళ్లలో ఒకటి నకిలీ మద్యాన్ని విక్రయిస్తూ ప్రాణాలను హరిస్తున్నారన్నారు. కుటీర పరిశ్రమలా నకిలీ మద్యం తయారీతో ఒకవైపు మిగతా 12వ పేజీలో ▶

క్లుప్తంగా...

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాల్లో మౌలిక, కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. పోలింగ్‌లో ఓటర్లు చురుగ్గా పాల్గొనేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల్లో హెల్ప్ డెస్కులు, తాగునీరు, ఫ్యాన్లు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంప్‌లు, వీల్ చైర్లు, ప్రథమ చికిత్స కిట్‌లు, పారామెడికల్ సిబ్బంది ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎస్‌ఈసీ కార్యదర్శి మంద మకరందు ఉత్తర్వులు జారీ చేశారు.

రిజర్వేషన్లపై జీవో కొట్టివేతకు పిల్

నేడు హైకోర్టులో విచారణ

సాక్షి, హైదరాబాద్: స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9ని కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. రామాంతపూర్‌కు చెందిన విద్యార్థి శ్రీరామ శ్రీలేఖ ఈ పిటిషన్ దాఖలు చేశారు. పిల్‌తోపాటు మరి కొన్ని పిటిషన్లు కూడా దాఖలయ్యాయి. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి దాఖలైన పిటిషన్ల పై బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మోహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

మంత్రి పొన్నం సారీ చెప్పాల్సిందే

మంద కృష్ణమాదిగ



లాలాపేట: మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పాల్సిందేనని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఎంఎస్‌ఎఫ్ విద్యార్థులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కించపరిచేలా మాట్లాడిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన మంత్రి పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని సమాజంలో ఎవరూ అంగీకరించరని చెప్పారు. వెంటనే పొన్నం స్పందించకుంటే తమ కార్యాచరణ ప్రకటించాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర కోఆర్డినేటర్ కొమ్ము శేఖర్, పల్లెర్ల సుధాకర్ పాల్గొన్నారు.

'మంత్రి పొన్నం వెంటనే క్షమాపణ చెప్పాలి'

సాక్షి, హైదరాబాద్: దళిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కించపరిచిన మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ నేత, తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ డిమాండ్ చేశారు. పొన్నం చేసిన అనుచిత వ్యాఖ్యలను మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దళిత ప్రజా ప్రతినిధులను కించపరచడం కాంగ్రెస్ సర్కార్‌కు పరిపాటిగా మారిందని ఆరోపించారు.

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌ది మోసపూరిత ప్రచారం

బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

సాక్షి, హైదరాబాద్: బిహార్ అసెంబ్లీ, తెలంగాణలో ఉపఎన్నిక సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తున్నట్టు కాంగ్రెస్ చేస్తున్న మోసపూరిత ప్రచారాన్ని ప్రజలు గమనించాలని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ కోరారు. మంగళవారం కుమార్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారి, ఖజానా నిండుకుందని తెలిసి కూడా సుప్రీంకోర్టులో కేసులు పెట్టే ప్రయత్నాలతో నాటకాలు చేస్తున్నారని మండిపడ్డారు. సుప్రీంలో బీసీ రిజర్వేషన్లపై కేసు విచారణ సందర్భంగా డిప్యూటీ సీఎం, ఇతర మంత్రులు, తామే కోర్టులో వాదించినట్లుగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కించపరిచేలా పొన్నం ప్రభాకర్ చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు.



కాకి లెక్కలతోనే క్రాప్ బుకింగ్!

- ఖరీఫ్ పూర్తి కావొచ్చినా ఇంకా కొనసాగుతున్న వైనం
- ఇప్పటివరకు అధికారికంగా 60 శాతం మించని పంటల నమోదు
- ఏ రైతు ఎంత విస్తీర్ణంలో, ఏ పంట వేశారో తేల్చడంపై వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం
- గత ఏడాది గణాంకాలతో పని కానిచ్చేస్తున్నారనే విమర్శలు
- లెక్కలు సరిగా ఉంటేనే ఎరువులు, మద్దతు ధర, కొనుగోళ్లపై సరైన అంచనాలకు చాన్స్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులు పండించే పంటలకు సంబంధించి ప్రతి సీజన్‌లో అనుసరించే క్రాప్ బుకింగ్ (పంటల నమోదు) విధానం లోపభూయిష్టంగా మారిందనే విమర్శలు విన్పిస్తున్నాయి. శాస్త్రీయ పద్ధతిలో, జియో ట్యాగింగ్ ద్వారా పంటలు నమోదు చేయాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం ఏడాదిన్నర క్రితం ప్రకటించినప్పటికీ..ఇప్పటివరకు ఆ దిశగా ఎలాంటి ప్రయత్నం జరగలేదు. క్రాప్ బుకింగ్‌తో పాటు వివిధ పంటలకు ఆశించే తెగుళ్ల, నివారణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు సెక్టార్ల వారీగా నియమించిన వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు) ఇచ్చే నివేదికల పైనే ప్రభుత్వం ఆధారపడుతోంది. రైతు పంటలు వేసినప్పుడే ఎన్ని ఎకరాల్లో ఏ పంట వేశారనే వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి పంపిస్తే, కచ్చితమైన సాగు విస్తీర్ణం, సాగైన పంటల వివరాలు తెలుస్తాయి. తదనుగుణంగా ఎరువుల పంపిణీ, మద్దతు ధరకు కొనుగోళ్లు, అందుకయ్యే నిధులు సమకూర్చుకోవడం వంటి ప్రక్రియ సజావుగా జరిగే వీలుంటుంది. కానీ రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదు. క్రాప్ బుకింగ్ అంతా కాకి లెక్కలతో సరిపెడుతున్నారని, ఎరువుల పంపిణీ మొదలుకొని పంటల సేకరణ వరకు అంతా లోపభూయిష్టంగానే సాగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఈ సీజన్‌లో 60శాతం మించని క్రాప్ బుకింగ్

రాష్ట్రంలో ఖరీఫ్ (వానాకాలం) సీజన్ గత నెల 30వ తారీఖుతో పూర్తయింది. ఆనాటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 133.25 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయినట్లు వ్యవసాయ శాఖ నివేదిక చెబుతోంది. ఇవి కాకుండా ఎర్ర మిర్చి, పసుపు 1.34 లక్షల ఎకరాల్లో సాగయినట్లు చెపుతున్నారు. అయితే అధికారికంగా పంటల నమోదు మాత్రం సెప్టెంబర్ 30 నాటికి 70 లక్షల ఎకరాల (53 శాతం) మేరకే పూర్తయింది. సెప్టెంబర్ 30 నుంచి ఈనెల 7 వరకు వారం రోజుల్లో మరో ఏడు శాతం క్రాప్ బుకింగ్ అయిందనుకున్నా, 60 శాతం మించలేదు. ఒకవైపు వరి కోతలు ప్రారంభం కాగా, మరోవైపు పత్తి ఏరడం కూడా ప్రారంభమైంది. అయితే ఇప్పటివరకు వరి క్రాప్ బుకింగ్ 53 శాతం, పత్తి పంట నమోదు 57 శాతం మాత్రమే పూర్తయింది.

చేతులు దులుపుకొంటున్నారా?

ఒక గ్రామంలో ఒక ఖరీఫ్ సీజన్‌లో సాగైన పంటల విస్తీర్ణం ఆధారంగా మరుసటి సంవత్సరం పంట నమోదును కొంత అటు ఇటుగా నమోదు చేస్తున్నారనే విమర్శలు వ్యవసాయ శాఖలోనే ఉన్నా యి. గత ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో యూరియా కొరత అత్యంత తీవ్ర రూపం దాల్చడానికి సరైన క్రాప్ బుకింగ్ డేటా లేకపోవడమే కారణమ నే అభిప్రాయం వ్యక్తమైంది. రైతులు పంటలు సాగు చేసినప్పుడే ఆయా పంటలను కచ్చితమైన విస్తీర్ణంతో నమోదు చేస్తే, ఏ గ్రామానికి ఏ పంటలకు ఎంత యూరియా, ఇతర ఎరువులు అవసరమవుతాయనే అంచనాలకు అవకాశం ఉంటుంది. కానీ అది జరగడం లేదు. అలాగే వరి ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు రైతులు వచ్చినప్పుడు కూడా ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. పత్తి, జొన్నలు విక్రయించే సమయాల్లో వేసే లెక్కలకు పొంతన ఉండడం లేదు. పంటల నమోదు ప్రక్రియ శాస్త్రీయ పద్ధతిలో ఉంటే ఈ పరిణామాలు ఉత్పన్నం కావని వ్యవసాయ, మార్కెటింగ్‌అధికారులు చెపుతున్నారు. వ్యవసాయ విస్తరణాధికారులకు జిల్లా, మండల స్థాయిలో చేయాల్సిన వ్యవసాయ పనులు అప్పగించడం వల్ల పంట నమోదు కాకుండా ఇతర పనులపైనే ఎక్కు వ సమయం గడిపే పరిస్థితి ఉందంటున్నారు. ఈ కారణంగానే గత ఏడాది అదే సీజన్‌లో నమోదు చేసిన పంటలకు కొంత ఎక్కువ, తక్కు వగా నమోదు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

పొన్నంకు 'లక్ష్మణ' రేఖ!

▶ మొదటి పేజీ తరువాయి

మాట్లాడిన సమయంలో అక్కడే ఉన్న మరో మంత్రి జి.వివేక్ వెంకటస్వామి పట్టించుకోక పోవడాన్ని ఆయన తప్పుబట్టారు. ఆయనపై కూడా ఆ వీడియోలో లక్ష్మణ్ ఘాటైన వ్యాఖ్య లు చేశారు. అవసరమైతే రాహుల్‌గాంధీ, సోనియా గాంధీని కూడా కలుస్తానని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఇద్దరు మంత్రుల మధ్య సయోధ్య కుదిర్చేందుకు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ రంగంలోకి దిగారు. ఇద్దరితో మాట్లాడిన ఆయన సంయమనం పాటించాలని సూచించారని, వివాదం సమసిపోయినట్టేనని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ ప్రకటన అనంతరం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన దళిత ఎమ్మెల్యేలు వీరేశం, మందుల శామేల్, కాలె యాదయ్య పీసీసీ చీఫ్‌తో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

పొన్నం ప్రభాకర్ తప్పు తెలుసుకుంటాడని అనుకున్నా..

తనకు ఫోన్ చేసిన వ్యక్తితో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడినట్టుగా రికార్డయిన ఓ వీడియో మంగళవారం ఉదయం బయటకు వచ్చింది. ఆ వీడియోలో మంత్రులు పొన్నం, వివేక్‌లనుద్దేశించి అడ్లూరి వ్యాఖ్యలు చేశారు. 'పొన్నం ప్రభాకర్ తప్పు తెలుసుకుంటాడని అనుకున్నా. అక్కడ మా వర్గానికి చెందిన మరో మంత్రి వివేక్ ఉండి ఆయన వస్తాడా రాడా? ఆయన వస్తే నేను వెళ్లిపోతా అని నన్ను ఉద్దేశించి అనడం ఇంకా అవమానించడమే. ఇద్దరం ఒకే వర్గం నుంచి వచ్చిన వాళ్లం. ఆయన కష్టసుఖాల్లో ఉన్నా. ఆయన కుమారుడు ఎంపీగా నిలబడితే మీదేసుకుని గెలిపించాం. ఆయన తండ్రి సమయం నుంచి మా తండ్రితో స్నేహితం ఉంది. పెద్దపల్లి నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలుగా ఆ కుటుంబానికి ఓట్లేసి గెలిపించడంలో మా పాత్ర ఉంది.

నన్ను అంటుంటే వివేక్ ఒక్క మాట అనడా?

తోటి మంత్రి ఆ మాట అంటుంటే మా వాడిని దున్నపోతు అని ఎలా అంటావని వివేక్ ఒక్క మాట అనడా? మైనార్టీలకు సంబంధించి ఆ శాఖ మంత్రిగా నేను ఆ కార్యక్రమానికి వెళ్లాలి. వక్ఫ్‌బోర్డు చైర్మన్ నాకు ఫోన్ చేసి మీ కోసం ఇద్దరు మంత్రులు వెయిట్ చేస్తున్నారని అంటే.. వాళ్లు నేను వచ్చేంతవరకు ఆగరు. మీరు కార్యక్రమం ప్రారంభించండి. నేను జాయిన్ అవుతా అని చెప్పా. నేను సామాన్య కార్యకర్తను. డబ్బు ఉన్నవాడిని కాదు. మా తండ్రి కేంద్ర మంత్రి కాదు. సామాన్య కార్యకర్త నుంచి ఈ స్థాయికి వచ్చా. కష్టాలు తెలిసిన వ్యక్తిని.

పొన్నం అలా మాట్లాడతాడని ఊహించలేదు..

పొన్నం ప్రభాకర్‌లాగా ఉద్రేకపూరితంగా మాట్లాడేంత శక్తిమంతుడిని కాదు. చిన్న స్థాయి వ్యక్తిని నేను. ఆయన ఆ విధంగా మాట్లాడతాడని నేను కలలో కూడా ఊహించలేదు. ఆ కార్యక్రమానికి నేను కేవలం 15 నిమిషాలు మాత్రమే ఆలస్యంగా వెళ్లా. వారితో సమానంగా డాక్టర్ వివేక్ పక్కన నేను కూర్చోవడం వారికి ఇష్టం లేదు. మొదటి నుంచీ మా వర్గీకరణను ఆయన వ్యతిరేకిస్తారు. ఆ వర్గానికి చెందిన వాడు నా పక్కన కూర్చుంటాడా? వాడి లెక్కెంత అనే ఆలోచనతోనే నేను వెళ్లిపోతా అన్నాడు.

పొన్నం ఇప్పటివరకు ఫోన్ కూడా చేయలేదు..

పొన్నం నన్ను ఉద్దేశించి ఒక మాట అన్నాడంటే నన్ను కాకపోవచ్చులే అనుకున్నా. అదే విషయాన్ని చెప్పా. ఒక పార్టీ జెండా కింద పనిచేసేటప్పుడు పొరపాట్లు జరుగుతాయి. నాతో కూడా పొరపాట్లు అవుతాయి. కానీ పొరపాట్లను సరిదిద్దుకోవచ్చు. నాకు ఫోన్ చేసి.. అన్నా పొరపాటున ఒక మాట అన్నా. మనిద్దరి స్నేహితంతో దాన్ని మనసులో పెట్టుకోకు. ఇద్దరం ఒక్క జిల్లా వాళ్లమంటూ ఒక్క మాట అయినా మాట్లాడతాడని అనుకున్నా. ఇంతవరకు నాకు ఒక్క ఫోన్ కూడా చేయలేదు. ఎవరు ఫోన్ చేసి అడిగినా నేను ఆయన్ను అనలేదు అంటున్నాడు. నేను కాంగ్రెస్ జెండాను నమ్ముకుని కార్యకర్త స్థాయి నుంచి ఈ స్థాయికి వచ్చా.

నా జాతిని తిట్టడం కరెక్ట్ కాదు..

ప్రజలకు, పేదలకు అందుబాటులో ఉండి మంత్రిగా పనిచేస్తున్నా. ఆవేశపడే విధంగా ఎక్కడా తప్పు చేయడం లేదు. అయినా లక్ష్మణ్‌కుమార్‌ను ఏమైనా అనొచ్చు. కానీ నా జాతిని తిట్టడం కరెక్ట్ కాదు. నేను మాదిగ సామాజిక వర్గానికి చెందిన వాడిని కాబట్టే నాకు మంత్రి పదవి ఇచ్చారు. ఇప్పటికైనా వేచి చూస్తా. రేపటి వరకు (బుధవారం) చూస్తా. ఆయనలో మార్పు వస్తే ఫర్వాలేదు. అప్పటికీ నన్ను అనలేదు ఇంకా ఎవరినో అన్నాను అంటే మాత్రం రేపటి నుంచి జరిగే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాలి. మాదిగ సామాజికవర్గంలో పుట్టి మంత్రిని కావడం నేను చేసిన పొరపాటా? ఆ సామాజికవర్గంలో పుట్టి ఇన్ని అవమానాలు భరించాల్సి వస్తోందన్న విషయాన్ని మల్లికార్జున ఖర్గే దృష్టికి తీసుకెళ్తా. మీనాక్షి నటరాజన్‌కు ఇప్పటికే లేఖ రాశా. రాహుల్‌గాంధీని కలుస్తా. సోనియాగాంధీని కూడా కలుస్తా..' అని లక్ష్మణ్ అన్నారు.

మూడంచెల వ్యూహం

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం.

సీఎం కీలక భేటీ

బీసీ రిజర్వేషన్ల జీవోపై బుధవారం హైకోర్టులో విచారణ జరగనున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కీలక సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ, ప్రముఖ న్యాయవాది అభిషేక్ మనూ సింఘ్వీతో కూడా మాట్లాడారు. హైకోర్టులో సమర్థ వాదనలు వినిపించేందుకు హాజరు కావాలని సింఘ్వీని కోరగా, ఆయన వర్చువల్‌గా హాజరవుతానని తెలిపారు. దీంతో హైకోర్టులో ప్రభుత్వం తరఫున వాదించాల్సిన అంశాలపై వివరణ ఇచ్చారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో పేర్కొన్న అన్ని నిబంధనలను అమలు చేసిన తర్వాతే బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ జీవో ఇచ్చామని తెలిపారు. సుప్రీంతీర్పును ఎక్కడా ఉల్లంఘించడం లేదనే విషయం కోర్టు దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. మరోవైపు ఎట్టి పరిస్థితుల్లో జీవోను కోర్టు నిలిపివేయకుండా ఉండేలా బలమైన వాదనలు వినిపించాలని, ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఆయన ఏజీ సుదర్శన్‌రెడ్డికి సూచించినట్టు సమాచారం.

కాంగ్రెస్ బీసీ నేతల భేటీ

సీఎంతో భేటీ ముగిసిన అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ నేతలు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అధికారిక నివాసంలో మంగళవారం సాయంత్రం మళ్లీ సమావేశమయ్యారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, మాజీ ఎంపీ వీహెచ్, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ఎంపీలు సురేష్ షెట్కార్, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకరయ్య, రాజ్ ఠాకూర్, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, పీసీసీ నేతలు లక్ష్మణ్ యాదవ్, చరణ్‌కౌశిక్ యాదవ్, ఇందిరా శోభన్, ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కూడా హైకోర్టులో వినిపించాల్సిన వాదనలపై చర్చించినట్టు తెలిసింది. బుధవారం కోర్టులో జరగనున్న విచారణకు రాష్ట్రంలోని బీసీ మంత్రులు హాజరు కావాలని నిర్ణయించారు. బీసీ సంఘాలు, ప్రజాప్రతినిధుల తరఫున అడ్వకేట్లను పెట్టి కోర్టు అడిగే ప్రతి ప్రశ్నకు బదులిచ్చేలా సమర్థ వాదనలు వినిపించాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

కాగా బుధవారం హైకోర్టు ఇచ్చే తీర్పును బట్టి సాయంత్రం మరోమారు సమావేశమై భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికలకే..!


కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై సర్కారు దృష్టి

సాక్షి, హైదరాబాద్: స్థానిక ఎన్నికల నిర్వహణ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకే వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. బుధవారం హైకోర్టు.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల జీవోను, తదనుగుణంగా ఎస్‌ఈసీ జారీ చేసిన షెడ్యూళ్లను కొట్టేసినా..ఇప్పటికే జారీ చేసిన షెడ్యూళ్లకు వారం, పది రోజుల జాప్యంతో అన్ని దఫాల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది. 2024 ఫిబ్రవరితో గ్రామ పంచాయతీ పాలకమండళ్ల కాలపరిమితి, 2024 జూలైతో మండల, జిల్లా ప్రజాపరిషత్‌ల పదవీకాలం ముగిసిన విషయం తెలిసిందే. పంచాయతీలకు ఎన్నికలు జరగక 20 నెలలు, మండల, జిల్లా పరిషత్‌లకు జరగక 15 నెలలు పూర్తి కావడంతో కేంద్ర ప్రభుత్వం , కేంద్ర ఆర్థిక సంఘం నుంచి వచ్చే నిధులు నిలిచిపోయాయి. గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి నేరుగా వచ్చే నిధులు నిలిచిపోవడంతో గ్రామాల్లో పాలన, అభివృద్ధి పనులన్నీకూడా అస్తవ్యస్తంగా మారిపోయాయి. ఈ విధంగా గతేడాది రూ.1,500 కోట్లు, ఈ ఏడాది మరో రూ.1,500 కోట్లు ఆగిపోవడంతో గ్రామీణ స్థానిక సంస్థలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయి. ఈ నేపథ్యంలోనే హైకోర్టు ఉత్తర్వులు, ఇతరత్రా ఆదేశాలు ఎలా ఉన్నా వెంటనే ఎన్నికలు నిర్వహించి కేంద్రం నుంచి నిధులు సాధించే దిశలో చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది.

బీసీ రిజర్వేషన్ల ఉద్యమం బలంగా జరగాలి

పోరాటాలు రచించాలి.. పదునెక్కిన తీర్మానాలు చేయాలి

- మనకోసం మనం పోరాటాలు చేయక తప్పదు
- బీసీలకు 42శాతం రిజర్వేషన్లు – న్యాయ వివాదాలు పరిష్కారం.. బీసీ సంఘాల సమాలోచన సమావేశంలో వక్తలు



అభివాదం చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, ఈశ్వరయ్యగౌడ్, చిరంజీవులు, విశారదన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ ఉద్యమం కంటే పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలి. పదునెక్కిన తీర్మానాలు రచించాలి. ఇదేదో ఒక్కరిద్దరి కోసం కాదు. యావత్తు తెలంగాణ బీసీల భవిష్యత్ అని గుర్తించాలి. ప్రతి ఒక్కరు యుద్ధవీరులు కావాలి. ఇప్పటి వరకు ఇతరుల కోసం పోరాటాలు చేశాం. ఇప్పుడు మన కోసం పోరాటాలు చేయక తప్పదు. పల్లె నుంచి పట్నం వరకు ప్రతి ఒక్కరు కదలివస్తేనే మన హక్కులను సాధించుకుంటాం. భూకంపం సృష్టిస్తేనే.. ప్రభుత్వాలు దిగి వస్తాయి. ఇవ్వాల్సిన బీజేపీ ఇవ్వడం లేదు. పోరాడాల్సిన కాంగ్రెస్ పోరాటం చేయడం లేదు. నిరసనలు చేస్తామన్న బీఆర్‌ఎస్ పట్టించుకోవడం లేదు. కేవలం బీసీల ఓట్ల కోసం అన్ని రాజకీయ పార్టీలు తమ ఎత్తుగడలు చేస్తున్నాయి. అన్నీ ఉన్న మనం మన రిజర్వేషన్లు ఎందుకు సాధించుకోలేకపోతున్నాం. ఇదే చిట్ట చివరి అవకాశం. ఒక తెలంగాణ కోసం పోరాటం చేస్తేనే ఇన్ని వచ్చాయి. రిజర్వేషన్లు అమలైతే దానికి రెట్టింపు ఫలితాలు పొందుతాం అని బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం కోరింది. మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'బీసీలకు 42శాతం రిజర్వేషన్లు- న్యాయ వివాదాలు పరిష్కారం'పై బీసీ సంఘాల సమాలోచన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, జాతీయ ఓబీసీ చైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్యగౌడ్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ చైర్మన్ డా.విశారదన్ మహరాజ్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగొని బాల్‌రాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్‌తోపాటు అనేక బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

- శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు సాధించేందుకు నిరాహారదీక్ష చేయడానికైనా సిద్ధమన్నారు. బీఆర్‌ఎస్ పరంగా మద్దతు ఇస్తామని చెప్పారు.
- జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రపతి ఆమోదం పొందే వరకు పోరాటం చేయాలన్నారు. యుద్ధం ఆపేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ జాతిని సర్వనాశనం చేస్తున్నారని ఆరోపించారు. క్రెడిట్ అంతా మాకే రావాలని రెండు బిల్లులు చేసి పంపిన కాంగ్రెస్.. దాని అమలు కోసం చిత్తశుద్ధి ఏది అని ప్రశ్నించారు. హైకోర్టు జడ్జిమెంట్ రాక ముందే ప్లాన్‌ఆఫ్ యాక్షన్ చేసుకోవాలని హితవు పలికారు.
- చిరంజీవులు మాట్లాడుతూ రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తామన్న బీఆర్‌ఎస్ ఏమీ చేయడం లేదని, బీసీల ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. ఒక్కరిద్దరు మాత్రమే రిజర్వేషన్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. కేసీఆర్ చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అన్నట్టుగా రిజర్వేషన్ల కోసం ఉద్యమం చేయాలన్నారు.
- విశారదన్ మాట్లాడుతూ రేవంత్ తన గెలుపు కోసం 420 హామీలు ఇచ్చారని, అందులో బీసీ రిజర్వేషన్లు అనే ఒక ఆయుధంతో బీసీలను ఆటాడిస్తున్నారన్నారు. తనకు ఇష్టం వచ్చినట్టు ఆ ఆయుధాన్ని వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. రిజర్వేషన్లు అమలు చేయాల్సిన బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిల మీదే ఉందని, అవి అమలు కాకపోతే వారిద్దరని సంఘ బహిష్కరణ చేయాలన్నారు.

విజయవంతంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు: మంత్రి పొంగులేటి

బెంగళూరులో ఖర్గేను పరామర్శించిన శ్రీనివాస్‌రెడ్డి



ఖర్గేతో భేటీ అయిన మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతంగా అమలవుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను బెంగళూరులో మంగళ వారం మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, చెల్లింపులు లబ్ధిదారుల ఎంపిక విధానం, ఒక్కో ఇంటికి యూనిట్ కాస్ట్ తదితర అంశాలపై ఖర్గే మంత్రిని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో పదేళ్లుగా పేదలు ఆశించిన మేరకు ఇళ్ల నిర్మాణాలు జరగకపోవడంతో ఇందిరమ్మ ఇళ్లకు డిమాండ్ అధికంగా ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని, పేదరికమే అర్హతగా ఇళ్లను మంజూరు చేస్తున్నామన్నారు. అడవులను నమ్ముకొని జీవించే చెంచులకు సైతం తొలిసారిగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామన్నారు. తెలిపారు. ఇతెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు బాగుందని ఇలాగే ముందుకు సాగాలని ఖర్గే సూచించారని, మంత్రి చెప్పారు.

ఖర్గేకు మంత్రుల పరామర్శ



ఖర్గేతో మాట్లాడుతున్న మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: ఇటీవల అనారోగ్యానికి గురై పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్ చికిత్స చేయించుకున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను.. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పరామర్శించారు. బెంగళూరులో విశ్రాంతి తీసుకుంటున్న ఖర్గేను మంగళవారం కలిసి.. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ఖర్గే త్వరగా కోలుకుని, తిరిగి ప్రజా జీవితంలో క్రియాశీలకంగా పాల్గొనాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా వాస్తవాలు వేరేగా ఉన్నాయి

బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పదేపదే బీసీలకు న్యాయం చేస్తున్నామంటూ గొప్పలు చెబుతోందని, అయితే వాస్తవ పరిస్థితులు మాత్రం పూర్తిగా భిన్నంగా ఉన్నాయని బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు విమర్శించారు. మహర్షి వాల్మీకి వారసత్వానికి సంబంధించిన వర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా వాల్మీకి బోయల సంక్షేమం, సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి వేడుకల సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన స్ఫూర్తిదాయక జీవితాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ..మానవ సమాజానికి సత్యం, ధర్మం, న్యాయం, నైతికత మార్గాలను చూపిన వాల్మీకి బోధనలు అందరికీ మార్గదర్శకమన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సామాజిక వర్గాలకు గురుకులాల్లో అన్ని వసతుల కల్పనకు తగిన నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

'స్థానికం'లో మాకూ వాటా

- పొత్తు ధర్మంలో భాగంగా సీట్లు కేటాయించాలని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ను కోరిన సీపీఐ
- బలమున్న చోట నియోజకవర్గానికి ఒక్కో జెడ్పీటీసీ స్థానంలో పోటీకి అవకాశమివ్వాలని వినతి
- జెడ్పీటీసీల జాబితా అడిగిన మహేశ్‌గౌడ్.. నేడు భేటీకానున్న సీపీఐ కార్యదర్శివర్గం

సాక్షి, హైదరాబాద్: పొత్తు ధర్మంలో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు తగిన వాటా ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీని సీపీఐ కోరింది. తమకు బలమున్న స్థానాల్లో పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో మంగళవారం సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సీట్ల సర్దుబాటుపై చర్చించారు. ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాలతోపాటు రంగారెడ్డి జిల్లాలో తమకు బలమైన యంత్రాంగం ఉందని పీసీసీ అధ్యక్షుడి దృష్టికి సీపీఐ నేతలు తీసుకెళ్లినట్లు సమాచారం. ఆయా జిల్లాల్లో ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో సీటు తమకు కేటాయించాలని.. మెజారిటీ మండలాల్లో ఒక్కో ఎంపీటీసీ స్థానాన్ని కేటాయించేలా చొరవ చూపాలని కోరినట్లు సమాచారం. దీనిపై స్పందించిన టీపీసీసీ చీఫ్.. ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జి మంత్రులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఏయే జెడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేయాలనుకుంటున్నారో జిల్లాలవారీగా ఆయా స్థానాల పేర్లు ఇస్తే పార్టీ ఉన్నతస్థాయి కమిటీ నిర్ణయం తీసుకుంటుందని తేల్చిచెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం ఏర్పాటు చేసినట్లు సీపీఐ నాయకులు తెలిపారు.

క్లుప్తంగా...

సత్యసాయి శత జయంతికి సీఎంకు ఆహ్వానం



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న రత్నాకర్

సాక్షి, హైదరాబాద్: శ్రీ సత్యసాయి 100వ జయంతోత్సవాలకు హాజరు కావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఎండీ ఆర్‌జే రత్నాకర్ ఆహ్వానించారు. ఈ మేరకు సీఎంను ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను ఈ సందర్భంగా సీఎం కొనియాడారు. ఉత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టమన్నారు.

నిమ్స్‌లో చేరిన వైద్యశాఖ మంత్రి

దగ్గుతో బాధపడుతున్న దామోదర



లక్డీకాపూల్ (హైదరాబాద్): వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దగ్గుతో బాధపడుతున్నారు. మెరుగైన చికిత్సకు ఆయన మంగళవారం నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. ఆయనకు డైరెక్టర్ నగరి బీరప్ప పర్యవేక్షణలో.. నిమ్స్ పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ పరంజ్యోతి వైద్య సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో మంత్రికి పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. రెండు రోజుల పాటు ఆయన ఆస్పత్రిలోనే ఉండాల్సి వస్తుందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

ఉద్యోగులకు వేతనాలు అందడం లేదు

హరీశ్‌రావు ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రచార ఆర్భాటం ఆచరణలో కనిపించడం లేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు ప్రతీ నెలా రెండు లేదా మూడో వారంలో వేతనాలు అందుతున్నాయని, ఇదే వ్యవస్థలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి నెలల తరబడి వేతనాలు అందడం లేదన్నారు. బస్తీ దవాఖానాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చుక్కలు చూపిస్తోందని మండిపడ్డారు. వేతనాల చెల్లింపులో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఖండిస్తూ మంగళవారం హరీశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్యులకు, ఇతర సిబ్బందికి ప్రభుత్వం దసరా పండుగ సంబురం లేకుండా చేసి మానసిక క్షోభకు గురి చేసిందన్నారు. మాటల్లో ఫేకుడు.. ఢిల్లీకి వెళ్లి జోకుడు అన్నట్లుగా రేవంత్ పాలన సాగుతోందని హరీశ్‌రావు విమర్శించారు.

రేపు వాక్‌ఇన్ కౌన్సెలింగ్

ఏజీ వర్సిటీ డ్యూయల్ డిగ్రీ, బీఎస్‌సీ (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులకు..

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం - వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీ (డబ్ల్యూఎస్‌యూ) సంయుక్తంగా అందిస్తున్న డ్యూయల్ డిగ్రీ కోర్సులు, ఎన్‌ఆర్‌ఐ ప్రాయోజిత కోటా బీఎస్‌సీ (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులలో ప్రవేశం కోసం ఈనెల 9న ఉదయం 10 గంటలకు వాక్ ఇన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పీజేటీఏయూ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 2 గంటలకు ఎన్‌ఆర్‌ఐ/ ఎన్‌ఆర్‌ఐ ప్రాయోజిత కోటా బీఎస్‌సీ (ఆనర్స్) అగ్రికల్చర్, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ), బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్), బీఎస్‌సీ (ఆనర్స్), కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో సీట్ల భర్తీకి వాక్ ఇన్ కౌన్సెలింగ్ జరగనుందని తెలిపారు. ఈ రెండు కౌన్సెలింగ్‌లు రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ విభాగ కేంద్రంలో నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, వెబ్‌సైట్లో పేర్కొన్న రుసుము తో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలు విశ్వవిద్యాలయం వెబ్‌ సైట్ www.pjtau.edu.inలో చూడవచ్చని రిజిస్ట్రార్ తెలిపారు.

సీజేఐపై దాడి యత్నం.. రాజ్యాంగంపైనే..

టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై బహిరంగ కోర్టులో సోమవారం జరిగిన దాడి యత్నాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల వద్ద న్యాయవాదులు ఆందోళనలు నిర్వహించారు. సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిపై దాడికి ప్రయత్నించడమంటే అది రాజ్యాంగంపై దాడి చేసినట్లేనని టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. న్యాయవాదులతో కలసి హైకోర్టు వద్ద నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, బీజేపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో హైకోర్టు వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

డాల్ఫిన్ పేరెంటింగ్.. పిల్లల పెంపకంలో కింగ్!

కొందరు తల్లిదండ్రులు చండశాసనులు
మరికొందరు 'బొమ్మరిల్లు' ప్రకాష్‌రాజ్‌లు
'డాల్ఫిన్ పేరెంటింగ్'కే సైకాలజిస్టుల ఓటు

తమ పిల్లలకు కష్టం తెలియకూడదని పెంచే తల్లిదండ్రులు కొందరు...
తమ పిల్లలు క్రమశిక్షణతో ఉండాలని కఠినంగా ఉండే పేరెంట్స్ ఇంకొందరు..
ఏదైనా మాట అంటే వెంటనే భయపడిపోతారని
కోప్పడటానికే భయపడిపోయే తల్లిదండ్రులు ఇంకొందరు.
తమ మాటే శాసనంగా పిల్లలు భావించాలనుకునేవారు..
పిల్లల విషయాల్లో అతిగా జోక్యం చేసుకునేవాళ్లు..
పిల్లలు చదువులో రాణించాలని వారిపై తమ ఇష్టాయిష్టాలు రుద్దేవారు..
ఇలా రకరకాల పేరెంట్స్. ఎవరు చేసేది వారికి కరెక్టుగానే అనిపిస్తుంది.
మరి, వీరిలో ఎవరు బెస్ట్ పేరెంట్? ఏది బెస్ట్ పేరెంటింగ్?

> ఈ రోజుల్లో పేరెంటింగ్.. అత్యంత కష్టమైన పని.
> కృత్రిమ మేధనైనా సృష్టించవచ్చు. నియంత్రించవచ్చుగానీ
> పిల్లల పెంపకం మాత్రం సులభంగా చేయలేం.
> – ఈ రోజుల్లో తల్లిదండ్రులు చెబుతున్న మాటలివి.

నిజమే. ఒకప్పటిలా ఇప్పటి రోజులు లేవు. ఇన్ని ప్రభావాలూ లేవు. తల్లిదండ్రుల ఆలోచనా విధానం కూడా ఒకప్పటిలా లేదు. రకరకాల తల్లిదండ్రులు మనకు సమాజంలో కనిపిస్తున్నారు. మూడు ప్రధానమైన పేరెంటింగ్ విధానాల్లో 'డాల్ఫిన్ పేరెంటింగ్' మంచిదని సైకాలజిస్టులు చెబుతున్నారు.



-సాక్షి, స్పెషల్ డెస్క్

హెలికాప్టర్ పేరెంటింగ్..: చెప్పాలంటే బొమ్మరిల్లులోని ప్రకాష్ రాజ్ లాంటి తండ్రి లేదా తల్లి. తమ పిల్లలు కాలు కింద పెట్టకుండా.. ఎండ కన్నెరుగకుండా.. వారికి ఏమాత్రం కష్టం కలగకుండా చూసుకునేవారు. వారి గురించి అతిగా ఆలోచిస్తూ.. నిరంతరం వారిని పర్యవేక్షిస్తూ.. వారికి సంబంధించిన అన్ని విషయాల్లోనూ జోక్యం చేసుకునేవాళ్లు. ఈ విషయాన్ని తమ బంధుమిత్రులకు గొప్పగా చెప్పుకోడానికి కూడా ఇష్టపడతారు.

పిల్లలపై ప్రభావం..: ఇలాంటి పేరెంట్స్ ఉన్న పిల్లలు స్వతంత్రంగా ఆలోచించలేరు, నిర్ణయాలు తీసుకోలేరు, సమస్యలను పరిష్కరించలేరు, భావోద్వేగాల నియంత్రణ ఉండదు. ఇది పిల్లలను స్వతంత్రంగా ఎదగనివ్వదు. ఇలాంటి తల్లిదండ్రులంటే పిల్లలకు భయం ఉండదు కానీ.. వారిని తప్పించుకు తిరగాలన్న మనస్తత్వం ఉంటుంది.

టైగర్ పేరెంటింగ్

వీళ్లు చండశాసనులు. చాలా స్ట్రిక్టుగా ఉంటారు. తమ పిల్లలు చదువులోనూ, సంగీతం వంటి ఇతర అంశాల్లోనూ కచ్చితంగా రాణించాలని, పేరు ప్రతిష్ఠలు (తమకూ వస్తాయన్న స్వార్థం కూడా అంతర్లీనంగా ఉంటుంది) సంపాదించాలని వారిపై ఒత్తిడి తెస్తుంటారు. క్రమశిక్షణ, కఠోర శ్రమ, లక్ష్యాల పేరిట పిల్లలను నిత్యం పర్యవేక్షిస్తుంటారు. పిల్లలను ఆధిపత్య ధోరణితో పెంచుతారు. వారిలో తమ పట్ల భయం ఉందన్న విషయాన్ని తమ చుట్టుపక్కల వారికి తెలియాలని అనుకుంటారు.

పిల్లలపై ప్రభావం

ఇలాంటి పేరెంట్స్ అంటే పిల్లలు భయపడతారు.. వీలైనంతవరకు తప్పించుకు తిరగాలని చూస్తారు. పిల్లలపై నిత్యం ఒత్తిడి ఉంటుంది. ఎక్కడ విఫలమవుతామోనన్న భయం వెంటాడుతుంటుంది. తమ తల్లిదండ్రులు ఉన్నంత వరకు క్రమశిక్షణతో ఉన్నట్టు కనపడే ఈ పిల్లలు.. వాళ్లు లేరని లేదా తమ గమనించడం లేదని తెలిస్తే మాత్రం కట్టుబాట్లన్నీ పక్కనపెట్టేస్తారు.



డాల్ఫిన్ పేరెంటింగ్

వీళ్లు పిల్లలతో ఆడుతూ పాడుతూ సరదాగా ఉంటారు. పిల్లలతో మరీ కఠినంగానూ ఉండరు, అలాగని పూర్తిగా వదిలేయరు. అన్ని విషయాల్లోనూ సమతూకం పాటిస్తారు. అతిగా షరతులు పెట్టరు. అలాగని క్రమశిక్షణకూ విలువిస్తారు. పిల్లలను స్వతంత్రంగా ఆలోచించనిస్తారు. వారికి మరీ కష్టంగా ఉన్నప్పుడు లేదా ఇక వారికి సాధ్యం కాదు అనుకున్నప్పుడు చేయూతనిస్తారు. వారితో ఆత్మవిశ్వాసం నింపుతారు. దీన్ని స్మార్ట్ గ్యాడ్జెట్లు, సోషల్ మీడియా మాటల్లో చెప్పాలంటే.. కొన్ని విషయాల్లో స్పష్టమైన నిబంధనలు పెడతారు. ఉదాహరణకు.. రాత్రిపూట పడుకునేముందు ఫోన్లు ఉండకూడదు. ఒక వయసు వచ్చే వరకూ సోషల్ మీడియాను ఎంకరేజ్ చేయరు. ప్రతిరోజూ స్క్రీన్ టైమ్ విషయంలో కచ్చితంగా ఉంటారు. అయితే ఈ విషయాలను ఆధిపత్య ధోరణితో కాకుండా.. వారికి అర్థమయ్యేలా చెప్తారు. హార్వర్డ్‌లో శిక్షణ పొందిన కెనడాకు చెందిన ప్రముఖ సైకియాట్రిస్ట్ షిమి కాంగ్ దీనిపై 'ద డాల్ఫిన్ పేరెంట్ : ఎ గైడ్ టు రెయిజింగ్ హెల్తీ, హ్యాపీ అండ్ సెల్ఫ్ మోటివేటెడ్ కిడ్స్' పుస్తకం కూడా రచించారు.

పిల్లలపై ప్రభావం

పిల్లలకు తమ హద్దులేంటో తెలుస్తాయి. అందువల్ల అలాంటి విషయాల్లో తల్లిదండ్రులు కఠినంగా ఉన్నా దాన్ని శిక్షలా కాకుండా.. తమ మంచి కోసమే అని అర్థం చేసుకోగలుగుతారు. ముఖ్యంగా తమ తల్లిదండ్రులతో సత్సంబంధాలు ఉంటారు. వాళ్లంటే భయపడకుండా.. వారితో ప్రతి విషయాన్నీ షేర్ చేసుకుంటారు.

విద్యార్థులకు 'ఆర్టీఐ' పాఠాలు

- వర్సిటీలు, కాలేజీల్లో వారం రోజులపాటు అవగాహన వారోత్సవాలు
- వీసీలు, రిజిస్ట్రార్లతో ఉన్నత విద్యామండలి చైర్మన్ జూమ్ మీటింగ్



వీసీలతో జూమ్ సమావేశం నిర్వహిస్తున్న బాలకిష్టారెడ్డి

సాక్షి, హైదరాబాద్ : విద్యార్థులను మేల్కొలిపేందుకు ఉన్నత విద్యామండలి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. సమాచార హక్కు చట్టంపై ఉన్నత విద్యా సంస్థల్లో అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తోంది. విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లు, రిజిస్ట్రార్లతో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి మంగళవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఆర్టీఐ చట్టంపై సమగ్ర అవగాహనను కల్పించేందుకు అన్ని సంస్థలూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చట్టం ఉద్దేశాలు, సమాచార హక్కు చట్టం ప్రయోజనాలు, దీనికింద వేయాల్సిన ప్రశ్నలు, వేయకూడని ప్రశ్నలపై యువతకు వివరించాలని సూచించారు. దీనిపై ప్రతీ కాలేజీ చేపడుతున్న కార్యక్రమాలపై నివేదిక ఇవ్వాలన్నారు. యూనివర్సిటీలు, విద్యా సంస్థలకు ఆయన కొన్ని మార్గదర్శకాలను పంపారు.

ఎందుకీ కార్యక్రమం ?

ప్రశ్నించే తత్వం యువతలో తగ్గుతోందని ఇటీవల కొన్ని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. అవినీతి జరుగుతోందని తెలిసినా, వాటి మూలాలను తెలుసుకోవడంలో విఫలమవుతున్నారు. అధికారి సమాచారం ఇవ్వని పక్షంలో ట్రిబ్యునల్‌కు వెళ్లడంపై యువత ఆసక్తి చూపడం లేదు. గ్రాడ్యుయేషన్ చేసిన యువతే సమాచార హక్కు చట్టంపై అవగాహన కోల్పోవడం వల్ల సమాజానికి నష్టం జరుగుతుందని ప్రభుత్వం భావించింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని గ్రాడ్యుయేషన్ స్థాయి విద్యార్థులను ఆర్టీఐలోని విలువైన సెక్షన్లపై బలమైన అవగాహన కల్పించాలని ప్రభుత్వం సూచించింది. ఈ బాధ్యతను ప్రభుత్వం బాలకిష్టారెడ్డికి అప్పగించింది. దీన్ని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆయన విలువైన సెక్షన్లు, తేలికగా యువతను సన్నద్ధం చేసే మార్గనిర్దేశాన్ని రూపొందించారు.

టెన్త్, ఇంటర్‌కు ప్రత్యేక తరగతులు

- ఉదయం, సాయంత్రం గంట చొప్పున నిర్వహించాలి ఉన్నతాధికారుల ఆదేశం
- వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలే లక్ష్యం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ కాలేజీలు, పాఠశాలల్లో టెన్త్, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. సాధారణ తరగతులు మొదలవ్వక ముందు, పూర్తయిన తర్వాత గంట సేపు ఇవి ఉండేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. తద్వారా వార్షిక పరీక్షల్లో ప్రైవేటు కాలేజీలు, పాఠశాలలకు దీటుగా, మంచి ఫలితాలు వచ్చేలా చూడాలని పేర్కొన్నారు. ప్రత్యేక క్లాసులపై క్షేత్రస్థాయిలో పరిశీలన నివేదికలు రూపొందించాలని ఈసారి అధికారులు నిర్ణయించారు. ఇంటర్ సెకండియర్‌తో పాటు జేఈఈ, ఈఏపీసెట్‌కు కూడా శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్‌ను రూపొందించినట్టు వారు తెలిపారు.

వెనుకబడ్డ వారిని గుర్తించాలి

ప్రత్యేక క్లాసుల్లో కొన్ని మార్గదర్శకాలను పాటించాలని ఇంటర్, టెన్త్ బోర్డు అధికారులు సూచించారు. 'క్లాస్ టీచర్లు ముందుగా విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించాలి. ప్రత్యేక బోధనకు ముందు విద్యార్థులకు ఈ మేరకు పరీక్ష నిర్వహించాలి. చాప్టర్ వారీగా విశ్లేషణ చేయాలి. మెరిట్ ఉన్న విద్యార్థులకు అవసరమైన మేర బోధన చేపట్టాలి. వెనుకబడి ఉన్న వారిని ముందుగా స్టడీ చేయాలి. వారిలో సబ్జెక్టు పట్ల భయం పోగొట్టాలి. ఏయే చాప్టర్లు కష్టంగా భావిస్తున్నారో తెలుసుకోవాలి. వాటిని సులభంగా బోధించే ఏర్పాట్లు చేయాలి. వీలైనంత వరకూ ఫార్ములా పరంగా బోధన చేపట్టడం, మనసులో నాటుకుపోయేలా చెప్పడం చేయాలి. ప్రత్యేక క్లాసుల తర్వాత ప్రతి వారం పరీక్ష చేపట్టి, పురోగతిని అంచనా వేయాలి. జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక క్లాసులను పర్యవేక్షించాలి. అవసరమైన సూచనలు చేయాలి..' అని స్పష్టం చేశారు. ప్రైవేటు కాలేజీల్లో ఇంటర్ సిలబస్ ఇప్పటికే పూర్తి కాగా రివిజన్ చేపడుతున్నారు. డిసెంబర్ ఆఖరు నుంచి జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడానికి కాలేజీలు సిద్ధమవుతున్నాయి. మరోవైపు ప్రభుత్వ కాలేజీల్లో ఆలస్యంగా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తవడంతో సగం సిలబస్ కూడా పూర్తవ్వలేదు.



కూచిపూడి నృత్య కళాకారులతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

గాంధీ బోధనలతో మానవాళికి మేలు

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, హైదరాబాద్: మహాత్మాగాంధీ బోధనలైన శాంతి, ప్రేమ, సోదరభావం, కరుణ.. మానవాళికి ఎంతో ఉపకారం చేశాయని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. సర్వోదయ ట్రస్ట్ తెలంగాణ, ఏపీ చాప్టర్ ఆధ్వర్యంలో రాజ్‌భవన్‌లో నిర్వహించిన గాంధీ జయంతి ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గాంధీకి ఇష్టమైన భజనలను లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు, అబైడ్ విత్ మీ..అనే గేయాన్ని నవీన్ రాజేశ్ బృందం, సఫ్దరియా పాఠశాల విద్యార్థులు ముస్లిం ప్రార్థన గీతాన్ని ఆలపించారు. దీపికారెడ్డి బృందం కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించింది. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు రిటైర్డ్ ఐపీఎస్ ఏకే ఖాన్, ట్రస్ట్ కార్యదర్శి, రిటైర్డ్ ఐపీఎస్ అరుణ బహుగుణ, చందన చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఈ దశలో జోక్యం చేసుకోలేం

- గ్రూప్–1 నియామకాల వివాదంపై సుప్రీంకోర్టు ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: గ్రూప్–1 సర్వీసుల నియామకాల వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో మంగళవారం ఊరట లభించింది. ఈ అంశంపై దాఖలైన స్పెషల్ లీవ్ పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. ప్రధాన అప్పీళ్లు హైకోర్టులో ఈ నెల 15న విచారణకు రానున్నందున ఈ దశలో జోక్యం చేసుకోలేమని తెలిపింది. అయితే ఈలోగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే నియామకాలన్నీ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉండాలని తేల్చిచెప్పింది. అదే సమయంలో ఆయా పోస్టుల్లో నియమితులైన వారికి ఎలాంటి సమానత్వ హక్కులు వర్తించవని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ అంశంపై వీలైనంత త్వరగా విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాలని హైకోర్టుకు సూచించింది.

వివాద నేపథ్యం ఇదీ..

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల మార్కులు, ర్యాంకింగ్ జాబితాను రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి ఈ ఏడాది సెప్టెంబర్ 9న తీర్పు ఇచ్చారు. సమాధాన పత్రాలను సరైన మోడరేషన్‌తో తిరిగి మూల్యాంకనం చేయాలని లేదా కొత్తగా మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ తీర్పును తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తోపాటు ఎంపికైన కొందరు అభ్యర్థులు హైకోర్టులోని డివిజన్ బెంచ్ ముందు సవాల్ చేశారు. ఈ అప్పీళ్లను విచారించిన డివిజన్ బెంచ్.. సింగిల్ జడ్జి తీర్పుపై స్టే విధిస్తూ సెప్టెంబర్ 24న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ప్రభుత్వం ఒకవేళ నియామకాలు చేపడితే అవి రిట్ అప్పీళ్ల తుది తీర్పునకు లోబడి ఉండాలని షరతు విధించింది. డివిజన్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ కొందరు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుతాం

జర్మనీ పరిశోధన సంస్థ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి ,హైదరాబాద్ : వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం, రసాయనాల వినియోగాన్ని తగ్గించి రైతులకు లాభసాటిగా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. డిజిటల్ వ్యవసాయంలో తెలంగాణను అగ్రగామిగా నిలపాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. కృత్రిమ మేధ(ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ) లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌ను రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతులకు ఎలా అనుసంధానం చేయాలనే అంశంపై మంగళవారం సచివాలయంలో జర్మనీకి చెందిన ప్రముఖ పరిశోధన సంస్థ 'ఫ్రాన్‌హోఫర్ హెచ్ హెచ్‌ఐ' ప్రతినిధుల బృందంతో మంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. డిజిటల్ వ్యవసాయం దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. అనంతరం రెండేళ్లుగా వేములవాడకు సమీపంలోని మూడు గ్రామాల్లో 'ఫ్రాన్‌హోఫర్ హెచ్ హెచ్‌ఐ' ఆధ్వర్యంలో అమలవుతున్న 'యాక్సిలరేటింగ్ క్లైమేట్-రెసిలియెంట్ అగ్రికల్చర్ ఇన్ తెలంగాణ' ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. ఈ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు చొరవ చూపాలని సంస్థ ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్ రెడ్డి, జర్మనీ రాయబార కార్యాలయం (న్యూఢిల్లీ) ఫుడ్, అగ్రికల్చర్ డివిజన్ హెడ్ వోల్కర్ క్లైమా, ఫ్రాన్ హోఫర్ హెచ్ హెచ్ఐ ప్రతినిధులు డా.సెబాస్టియన్ బోస్సే, డా.రఘు చలిగంటి పాల్గొన్నారు.

గ్రామాల్లో 'ఏకగ్రీవ' లొల్లి

పోటీ లేకుండా సర్పంచ్‌గా చేస్తే గ్రామాభివృద్ధికి రూ.లక్షలు ఇస్తామంటున్న ఆశావహులు

నవాబుపేట: పోటీ లేకుండా ఏకగ్రీవంగా సర్పంచ్‌గా చేస్తే గ్రామాభివృద్ధికి రూ.లక్షలు ఇస్తామని ఆశావహులు పోటాపోటీగా ప్రకటనలు చేస్తున్నారు. మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించినా, గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి ఏకగ్రీవాల లొల్లి మొదలైంది.




- మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం కాకర్లపహడ్‌లో 1,962 మంది ఓటర్లు ఉన్నారు. పంచాయతీ బీసీ జనరల్‌కు రిజర్వేషన్ అయ్యింది. గ్రామానికి చెందిన ఓ యువ నాయకుడు నరేశ్ తనను గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవం చేస్తే గ్రామాభివృద్ధికి రూ.40 లక్షలు నజరానా ఇస్తానని ప్రకటించి వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయగా అది వైరల్‌గా మారింది.



- కాకల్‌జాల్ గ్రామంలో 453 మంది ఓటర్లు ఉన్నారు. ఈ పంచాయతీ కూడా బీసీ జనరల్‌కు రిజర్వు అయ్యింది. ఆ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అలీ రూ.75 లక్షలు అభివృద్ధి కోసం ఇస్తానని ప్రకటించారు.
- ఇదే మండలంలోని దయాపంతులపల్లిలో 557 మంది ఓటర్లు ఉన్నారు. ఈ పంచాయతీ ఎస్సీ మహిళకు రిజర్వు కాగా, గ్రామానికి చెందిన ఓ నాయకుడు తన భార్యను ఏకగ్రీవ సర్పంచ్‌గా చేస్తే గ్రామానికి రూ.20 లక్షలు ఇస్తానని గ్రామ ముఖ్యనాయకులతో సంప్రదింపులు జరుపుతున్నాడు.
- జడ్చర్ల మండలం గంగాపూర్‌ను జనరల్‌కు కేటాయించగా.. రఘురాంరెడ్డి మూడు రోజుల క్రితం తనను ఏకగ్రీవం చేస్తే రూ.50 లక్షలు ఇస్తానని ప్రతిపాదన చేశాడు. ఇదే మండలంలోని నసుర్లబాద్‌లో సైతం ఎస్సీ మహిళకు రిజర్వు కాగా, అక్కడ కూడా రూ.10 లక్షలు ఇస్తామంటూ ఏకగ్రీవ ప్రతిపాదన వచ్చింది.

పత్తి.. ఎంతైనా కొంటాం

▶ మొదటి పేజీ తరువాయి



కొనుగోలు చేస్తోంది. గతంలో ఎంత సేకరించామో అంతకు మించి సేకరించేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతుల కమిటీలను ఏర్పాటు చేసి వారి సమస్యలను పారదర్శకంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. పత్తిలో తేమ శాతం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పించాల్సి ఉండగా అలా చేయట్లేదు. ఉపాధి హామీ పథకం నిధులను ఉపయోగించుకొని పత్తిని ఆరబెట్టి ఆ తర్వాతే కొనుగోలు కేంద్రాలకు పంపాల్సి ఉన్నప్పటికీ ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కేంద్రంపై మాత్రం నిందలు వేస్తోంది. ఇది సరికాదు' అని పేర్కొన్నారు.

రైతులు ప్రైవేటు వ్యక్తులకు పంట విక్రయించొద్దు: కిషన్‌రెడ్డి

పత్తి రైతులు ప్రైవేటు వ్యక్తులకు పంటను విక్రయించొద్దని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. తేమ శాతం ఎక్కువుందన్న పేరుతో ప్రైవేటు వ్యక్తులు ధర తగ్గించి కొనుగోలు చేయడం వల్ల రైతులకే నష్టం జరుగుతుందని చెప్పారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌తో సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'పత్తి కొనుగోళ్లలో ఏటా కొన్ని సమస్యలు వస్తుంటాయి. ఇప్పుడు కూడా వాటిని పరిష్కరించేందుకే కేంద్ర మంత్రితో సమావేశమయ్యాం. సీసీఐ చైర్మన్‌తోనూ పలు విషయాలు చర్చించాం. పత్తిలో 12 శాతం తేమ ఉన్నా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంటను సీసీఐ కొనుగోలు చేస్తోంది. పత్తి రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు జరపాలని గిరిరాజ్ సింగ్‌ను కోరాం. హై డెన్సిటీ కాటన్ ప్లాంటేషన్ ద్వారా రైతుల ఆదాయం మూడింతలు అవుతోంది. తెలంగాణలో ఎందుకు ఆ విత్తనాలను వినియోగించట్లేదని గిరిరాజ్‌సింగ్ అడిగారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి. 122 సెంటర్లలోని రైతు కమిటీల ప్రతినిధులు, అధికారులకు సమస్యలను చెబితే వారు వెంటనే పరిష్కరిస్తారు. తేమ శాతాన్ని కచ్చితత్వంతో కొలిచే ఆధునిక మెషీన్లను అందుబాటులోకి తెచ్చాం' అని తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్లు, శ్రామిక పోస్టుల భర్తీకి నేటి నుంచి దరఖాస్తుల ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: టీజీఎస్ ఆర్టీసీలో డ్రైవర్లు, శ్రామిక్ పోస్టుల నియామకానికి బుధవారం (అక్టోబర్ 8) ఉదయం 8 గంటల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్‌ఎల్పీఆర్బీ) చైర్మన్ వీవీ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు ఎస్సీ కమ్యూనిటీ అభ్యర్థులు తమ కమ్యూనిటీ సర్టిఫికెట్లను కొత్త నిర్దేశిత ఫార్మాట్‌లో (నిర్దిష్ట గ్రూప్ అంటే గ్రూప్- ఐ /గ్రూప్- ఐఐ / గ్రూప్- ఐఐఐ యొక్క ఉప-వర్గీకరణతో) ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేయాలని సూచించారు. అభ్యర్థులు సకాలంలో కొత్త సర్టిఫికెట్‌ను పొందలేకపోతే, వారి వద్ద ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎస్సీ కమ్యూనిటీ సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేయవచ్చని సూచించారు. అయితే, ఆయా అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సమయంలో కొత్త ప్రొఫార్మాలో కమ్యూనిటీ సర్టిఫికెట్‌ను సమర్పించాలని స్పష్టం చేశారు. అలా చేయకపోతే ఎస్సీ కేటగిరీ కింద పరిగణించబోమని వెల్లడించారు. కాగా, టీజీఎస్ ఆర్టీసీలోని మొత్తం వెయ్యి డ్రైవర్ పోస్టులకు, 743 శ్రామిక్ పోస్టుల భర్తీకి టీఎస్‌ఎల్పీఆర్బీ సెప్టెంబర్ 17న నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందులో డ్రైవర్‌పోస్టుకు పేస్కేల్ రూ.20,960 నుంచి రూ.60,080 కాగా, శ్రామిక్ పోస్టులకు రూ.16,550 నుంచి రూ. 45,030గా ఉన్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు వివరాల కోసం టీఎస్‌ఎల్పీఆర్బీ వెబ్‌సైట్‌లో www.tgprb.inలో చూడాలని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

పెంచిన బస్సు చార్జీలను వెంటనే వెనక్కి తీసుకోవాలి

ఈనెల 9న చలో బస్ భవన్: తలసాని



సాక్షి, హైదరాబాద్: ప్రజలపై భారం మోపేలా పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను వెంటనే వెనక్కి తీసుకోవాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. చార్జీలు తగ్గించేందుకు ప్రయాణికులు, ప్రజలందరినీ కలుపుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పార్టీ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ మేరకు ఈనెల 9న చలో బస్ భవన్ కార్యక్రమం చేపట్టనున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, పద్మారావు, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు వారి రూట్లలో బస్‌లో ప్రయాణించి బస్‌భవన్‌కు చేరుకొని ఆర్టీసీ ఎండీకి వినతిపత్రం ఇస్తారన్నారు.



మనుషులు చాలా స్వార్థపరులు.
నువ్వు సహాయం చేసిన వారే నీకు వ్యతిరేకంగా మారతారు.
- మున్షీ ప్రేమ్‌చంద్

సాక్షి
బుధవారం, 8 అక్టోబర్ 2025

దిక్కుతోచని ఫ్రాన్స్

తీరి కూర్చుని సమస్యలు తెచ్చుకోవటంలో, ఉన్నవాటిని పెంచుకోవటంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మెక్రాన్‌కు ఎవరూ సాటిరారు. స్వీయ సమర్థతపై అతిగా అంచనా వేసుకుని ఆయన తీసుకుంటున్న వరస నిర్ణయాలు ఫ్రాన్స్‌ను నిలువునా ముంచేశాయి. పీఠమెక్కి నిండా నెల రోజులు కాకుండానే ప్రధాని సెబాస్టిన్ లెకొర్నూ సోమవారం నిష్క్రమించటం వాటి పర్యవసానమే. లెకొర్నూ కేబినెట్ ఏర్పాటు ప్రయత్నంలో మెక్రాన్ తలదూర్చి, తన అనుకూలురకు పదవులు ఇప్పించేందుకు ప్రయత్నించారు. కూటమిలోని ఇతర పక్షాలకు దీంతో ఆగ్రహం కలిగి బడ్జెట్‌కు మద్దతునీయబోమనీ, అవిశ్వాస తీర్మానం తెస్తామనీ చెప్పటంతో లెకొర్నూ రాజీనామా తప్పలేదు. మరో రెండు నెలల్లో బడ్జెట్ ఆమోదించకపోతే దేశం దివాలా స్థితిలో పడుతుందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుండగా, తదుపరి ఏం చేయాలన్నది మెక్రాన్‌కు సైతం బోధపడటం లేదు.

కరోనా మహమ్మారి కాటేయకముందు యూరప్‌లో జర్మనీ తర్వాత రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ ఫ్రాన్సే. ఆ తర్వాత పల్టీలు కొట్టడం ప్రారంభమైంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం దాన్ని మరింత దెబ్బతీసింది. జర్మనీ నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తూ ఏదోమేరకు సఫలీకృతమవుతుంటే, ఫ్రాన్స్ మాత్రం గుడ్లు తేలేస్తోంది. అక్కడ పాలన అసాధ్యమైన స్థితికి చేరుకుంది. సామాజిక అశాంతి పెరగటం, నిజ వేతనాలు పడిపోయి ఉద్యోగ వర్గాల ఆగ్రహావేశాలూ, ఉపాధి కొరవడి యువత నిరాశ, ఆకాశాన్నంటుతున్న ధరలూ, అంతంతమాత్రంగా ఉన్న మార్కెట్లూ ఫ్రాన్స్‌ను కుంగదీస్తుండగా పులి మీద పుట్రలా ఈ రాజకీయ సంక్షోభం ముంచుకొచ్చింది. ఫ్రాన్స్ చరిత్రలో ఇలాంటి పరిస్థితి రాలేదని కాదు. 1946–58 మధ్య ఆ దేశం 22 ప్రభుత్వాలను చూసింది. ఎవరికీ మెజారిటీ రాని దశలో ఏర్పాటైన సంకీర్ణ ప్రభుత్వాలు పేకమేడల్లా కూలిపోవటమే అందుకు కారణం. పర్యవసానంగా అప్పటి అధ్యక్షుడు చార్లెస్ డీగాల్ భవిష్యత్తులో ఇంకెప్పుడూ సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడకుండా నిరోధించేందుకు రాజ్యాంగాన్ని సవరించారు. అటుతర్వాత కూటమికి నాయకత్వం వహించే ప్రధాన పార్టీ మాటే చెల్లుబాటు కావటం రివాజైంది. ఇప్పుడు ఆయన్ను అనుకరించబోయి మెక్రాన్ బోర్లాపడుతున్నారు.

ఫ్రాన్స్ కష్టాలకు కేవలం మెక్రాన్ ఒక్కరే కారణం కాదు. కానీ వాటిని మరిన్ని రెట్లు పెంచటంలో ఆయన పాత్ర కాదనలేనిది. 577 మంది సభ్యులుండే దిగువ సభ అసెంబ్లీ నేషనల్‌లో పాలక పక్షంగా అవతరించాలంటే కనీసం 289 మంది మద్దతు అవసరం. నిరుడు జూలైలో జరిగిన ఎన్నికల్లో వామపక్షాల సారథ్యంలోని న్యూ పాపులర్ ఫ్రంట్ 182 స్థానాలతో అగ్రభాగంలో ఉంది. మెక్రాన్ నాయకత్వంలోని మధ్యేవాద కూటమి ఎన్‌సెంబుల్‌కు 168 లభించాయి. వలసలను వ్యతిరేకించే తీవ్ర మితవాద పక్షం నేషనల్ ర్యాలీ(ఆర్‌ఎన్) 143తో సరిపెట్టుకుంది. తొలి దశలో అందరికన్నా అత్యధిక శాతం ఓట్లు రాబట్టిన ఆర్‌ఎన్‌ను అధికారంలోకి రానీయకుండా రెండో దశలో వామపక్ష, మధ్యేవాద పార్టీలు అనుసరించిన సర్దుబాటు వ్యూహం ఫలించింది. కానీ ప్రభుత్వ ఏర్పాటులో మెక్రాన్ దీన్ని విస్మరించారు. తన విధానాలను వ్యతిరేకించే వామపక్షాలకు అధికారం అప్పగించరాదన్న కృతనిశ్చయంతో మధ్యేవాద పక్షాలతో ప్రయోగాలు మొదలుపెట్టారు. పర్యవసానంగా ఏడాదిలో ముగ్గురు ప్రధానులు వచ్చారు.

పార్లమెంటు రద్దు చేయొద్దని అందరూ ఇచ్చిన సలహాను నిరుడు మెక్రాన్ బేఖాతరు చేశారు. ఎన్నికల తర్వాత మధ్యేవాద పక్షాలు పుంజుకుంటాయనీ, అప్పుడు తాననుకున్న రీతిలో పెన్షన్ల కోత, సంపన్నులకు రాయితీలు, ప్రభుత్వ వ్యయం అదుపు వగైరాలు అమలు చేయొచ్చనీ ఆయన భావించారు. కానీ అదంతా అడియాస అయింది. ఇప్పుడు నిజంగానే పార్లమెంటు రద్దు చేయక తప్పని స్థితి ఏర్పడింది. కానీ అలా చేస్తే ఆర్‌ఎన్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పరిచే స్థాయికి పుంజుకోవచ్చనీ, దాని ప్రభావం 2027లో జరిగే అధ్యక్ష ఎన్నికలపై పడుతుందనీ మెక్రాన్ ఆందోళన. తక్షణ కర్తవ్యమైన బడ్జెట్ ఆమోదానికి తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై ఆయనకు స్పష్టత కొరవడింది. ఏతావతా ఫ్రాన్స్ కింకర్తవ్య విచికిత్సలో పడింది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.పాడ్యమి ఉ.7.33 వరకు, తదుపరి విదియ తె.5.17 వరకు (తెల్లవారితే గురువారం), **నక్షత్రం:** అశ్విని రా.2.14 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** రా.10.30 నుండి 12.00 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.24 నుండి 12.11 వరకు, **అమృత ఘడియలు:** రా.7.26 నుండి 8.56 వరకు.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం: 5.42
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఊహకందని అంచనాలతో ఉత్కంఠ!

విశ్లేషణ



శశి శేఖర్

పండుగల సమయంలోనూ బిహార్ రాజకీయాలలో మునిగితేలుతుంది. బిహారీలకు రాజకీయాలకు మించిన కాలక్షేపం లేదు. బిహార్ శాసన సభ ఎన్నికలు నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో జరగనున్న నేపథ్యంలో ఎన్నికల పండుగ మొదలైపోయింది.

నితీశ్ కుమార్ ఎక్కడుంటే అధికారం అక్కడేనని గడిచిన రెండు దశాబ్దాలలో బిహార్‌లో ఒక కొత్త నానుడి రూపుదిద్దుకుంది. పొత్తు పెట్టుకున్న పార్టీలను దూరం పెట్టేదిగా బీజేపీ పేరు మోసినప్పటికీ, రాష్ట్రంలో అది జూనియర్ భాగస్వామిగా సంతృప్తి పడటానికి బహుశా అదే కారణం. నితీశ్ నేతృత్వంలోని జేడీ(యు)తో పొత్తు పెట్టుకున్నప్పుడు లాలూ ప్రసాద్ యాదవ్ నాయకత్వంలోని ఆర్జేడీ కూడా అదే రకమైన సంకట స్థితిని ఎదుర్కొంది.

నితీశ్ సరసన లేని ఏ పార్టీ అయినా, ఆయనపై విషం చిమ్మడం ఖాయం. అయినప్పటికీ, ఆయనతో అంటకాగాలని రహస్యంగా కోరుకుంటాయి. లాలూ 2022లో నితీశ్‌తో చేతులు కలపడానికి ఇదే కారణం. 2017లో చీలిక చేదును మిగిల్చినా లాలూ దాన్ని దిగమింగుకోవాల్సి వచ్చింది. మహాఘట్ బంధన్ రెండు విడతల హయాంలో నితీశ్‌తో ఎన్నడూ పొత్తు పెట్టుకోమని బీజేపీ నాయకులు బాహాటంగా ప్రతిన బూనారు. కానీ తమ 'సహజ భాగస్వామి'తో రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నారు.

నితీశ్ బలాబలాలు

గతంలో బిహార్‌లో ఎన్నికల విజయాన్ని నితీశ్ ఎలా సొంతం చేసుకున్నట్లు? నితీశ్ 2005లో బిహార్ సీఎం అయినపుడు తన శక్తియుక్తులన్నింటినీ శాంతి భద్రతల నిర్వహణపై కేంద్రీకరించారు. రోడ్లు, విద్యుత్ సరఫరా, రవాణా, విద్యా రంగాలు మెరుగుపడ్డాయి. స్కూళ్లలో అడ్మిషన్లను, హాజరును పెంపొందించేందుకు ఆయన 2006లో 'స్కూల్ చలో అభియాన్' ప్రారంభించారు. బాలికలకు సైకిళ్ళు పంపిణీ చేశారు. అలా 2005లో ఒక మౌన విప్లవం మొదలైంది. రాష్ట్రంలో 2005లో కేవలం 1.8 లక్షల మంది బాలికలు 10వ తరగతి పరీక్షకు కూర్చుంటే, ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న 15.85 లక్షల మంది విద్యార్థులలో సగంపైగా బాలికలే.

ప్రతి ఒక్కరికీ ఇల్లు, తాగునీటి సదుపాయం కార్యక్రమాన్ని నితీశే మొదట ప్రారంభించారు. కానీ, అంతగా సఫలీకృతులు కాలేకపోయారు. రాష్ట్రం నుంచి జనం ఇప్పటికీ వలస పోతూనే ఉన్నారు. అనేక మానవ, అభివృద్ధి సూచికలలో బిహార్ అట్టడుగున ఉంది. నితీశ్ మూడవ, నాల్గవ విడత పాలన అనేక కారణాల రీత్యా అంతగా ప్రభావం చూపలేకపోయింది. ఈసారి నితీశ్ వివిధ వర్గాల నుంచి విమర్శలను ఎదుర్కొంటున్నారు. ఆయన ఆరోగ్య స్థితి కూడా నిశిత పరిశీలనకు గురవుతోంది. ఈ కారణంగానే, ఈసారి నితీశ్ ప్రభుత్వం కోటి మంది మహిళల ఖాతాల్లో రూ. 10,000 చొప్పున నగదు జమ చేసింది. రకరకాల రాయితీలను, వరాలను ప్రకటించింది.



బిహార్ బరిలో: నితీశ్ కుమార్, తేజస్వీ యాదవ్

తేజస్వి ప్లస్ కూటమి

నితీశ్ ప్రధాన ప్రత్యర్థి తేజస్వి యాదవ్, గత ఎన్నికల్లో అద్భుతమైన ఫలితాలు సాధించారు. ఆయన మహాఘట్ బంధన్ కేవలం 16,825 ఓట్ల తేడాతో ఓటమిని చవిచూసింది. కాంగ్రెస్, వామపక్షాలు ఇప్పటికీ ఆయనకే మద్దతు ఇస్తున్నాయి.

కాంగ్రెస్ ఓట్ల పునాదికి కోత పడినప్పటికీ, రాహుల్ గాంధీ తన యాత్రలో తేజస్విని పటిష్ఠపరచేందుకు ప్రయత్నించారు. మొత్తం ప్రతిపక్షమంతా తేజస్వి వెనుకనే నిలిచిందని చాటేందుకు దీపాంకర్ భట్టాచార్య (వామపక్షం), అఖిలేశ్ యాదవ్ (సమాజ్ వాదీ పార్టీ), సంజయ్ రౌత్ (శివసేన), ఎం.కె.స్టాలిన్ (డీఎంకే), హేమంత్ సొరేన్ (జేఎంఎం), యూసుఫ్ పఠాన్ (తృణమూల్ కాంగ్రెస్) ఆయన యాత్రలో పాల్గొన్నారు. అయితే, ఆయన సహచరుల, సొంత కుటుంబ సభ్యుల మితిమీరిన ఆశలు పెను సవాలును విసురుతున్నాయి.

ఎన్నికల కమిషన్ విడుదల చేసిన కొత్త ఓటర్ల జాబితా 69 లక్షల ఓటర్ల తొలగింపును, 21 లక్షల మంది పేర్ల కొత్త జోడింపును చవిచూసింది. మహాఘట్ బంధన్ కొన్ని నెలలుగా దాన్నొక రాజకీయ అంశంగా మారుస్తూ వస్తోంది. సీట్ల పంపకంపై ప్రస్తుతం మహాఘట్ బంధన్‌లో బురద జల్లుకునే కార్యక్రమం సాగుతోంది. ఇది ప్రతిసారీ కనిపించేదే. కూటమిలోని భాగస్వామ్య పక్షాలన్నీ కలసి పోటీ చేయడం మాత్రం ఖాయం.

పీకే ప్రభావం

ప్రశాంత్ కిశోర్, ఆయన 'జన్ సురాజ్' పార్టీ మరో ప్రభావిత అంశం కానుంది. ఆయన గతంలో, 2014 ఎన్నికలకు ముందు బీజేపీకి ఎన్నికల నిర్వహణ సేవలందించారు. తదనంతరం, కాంగ్రెస్, వైసీపీ, తృణమూల్, ఆప్, డీఎంకేలతో పాటు, చివరకు నితీశ్ కుమార్‌కు కూడా సేవలందించారు.

రాష్ట్రంలో ఈ విడత ఎన్నికల సందర్భంగా, ప్రతి జిల్లాలోనూ ప్రశాంత్ కిశోర్ పాదయాత్రలు చేశారు. గత ఏడాదిగా ఆయన రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సందర్శించి ప్రజలతో నేరుగా సంభాషించారు. రాత్రిపూట గ్రామాల్లోనే బస చేశారు. నితీశ్, బీజేపీ, ఆర్జేడీలపై సమానంగా విమర్శలు గుప్పించారు. ఆయన పెద్ద సంఖ్యలో జనాన్ని ఆకర్షిస్తున్నారు. ఆశ్చర్యకరంగా, ఆయన పార్టీకి నిధుల కొరత కూడా లేదు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతారా లేక హంగ్ అసెంబ్లీ ఏర్పడే పక్షంలో కింగ్ మేకర్‌గా మారతారా? విజయానికి పెద్ద సంఖ్యలో జన వాహినులు, ఆకర్షణీయమైన నినాదాలు అవసరమేగానీ, అవి విజయానికి పూచీ నివ్వలేవు.

బీజేపీ గురించి కూడా ముచ్చటించుకుందాం. ఈ కాషాయ పార్టీకి అద్భుతమైన సంస్థాగత బలం ఉంది. కుల సమీకరణలు కూడా దానివైపు పటిష్ఠంగా ఉన్నాయి. జేడీ(యు)తోపాటు, చిరాగ్ పాశ్వాన్, జీతన్ రామ్ మాంఝీ, ఉపేంద్ర కుశ్వాహ ఎన్డీయేను తిరుగులేని కూటమిగా నిలబెడుతున్నారు. గత ఎన్నికల్లో, జేడీ(యు)తో పోల్చుకుంటే బీజేపీ రెట్టింపు సీట్లకు పైగా గెలుచుకున్నా, ముఖ్యమంత్రిగా తమ అభ్యర్థే ఉండాలని పట్టుబట్టలేదు. విశ్వసనీయమైన ముఖం ఏదీ లేకపోవడం దాని బలహీనత. ఈ అంశంపై ఇప్పుడు కాకపోయినా, రాబోయే రోజుల్లోనైనా ఆ పార్టీ కఠిన నిర్ణయం తీసుకోక తప్పదు.

బిహార్ ఒక ఆసక్తికరమైన దశలోకి అడుగిడుతోంది. చివరి నిమిషం వరకు అంతిమ ఫలితం నిర్ణయం కాదని గత అసెంబ్లీ ఎన్నికలు సూచిస్తున్నాయి. ఎన్నికల సంరంభపు హడావిడి సద్దుమణిగి, అంతిమ సంఖ్యా బలాలు వెల్లడైన తర్వాత, అసలు క్రీడ ఆరంభం కాబోతోంది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు
('ది హిందూస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

◆ నితీశ్ మూడో, నాల్గో విడత పాలన అనేక కారణాల రీత్యా ప్రభావం చూపలేకపోయింది. ఈసారి నితీశ్ వివిధ వర్గాల నుంచి విమర్శలను ఎదుర్కొంటున్నారు.

◆ నితీశ్ ప్రధాన ప్రత్యర్థి తేజస్వి యాదవ్ గత ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించారు. ఆయన మహాఘట్ బంధన్ కేవలం 16,825 ఓట్ల తేడాతో ఓటమి చవి చూసింది.

నేటి ప్రపంచానికి ఒక నైతిక పాఠం!

టైమ్ మిషన్

1492 అక్టోబర్ రెండోవారం ప్రపంచ చరిత్రలో మరువరానిది. ఇటలీకి చెందిన నావికుడు క్రిస్టఫర్ కొలంబస్ ఆసియా తీరాలకు చేరడానికి చేపట్టిన సముద్ర యాత్ర అనుకోకుండా అమెరికాకు చేరింది. దీంతో అప్పటివరకూ బాహ్య ప్రపంచానికి తెలియని 'కొత్త ప్రపంచం' (న్యూ వరల్డ్) కనుగొన్నట్లయ్యింది. కొలంబస్ యాత్రను ఆ కాలంలో ధైర్యం, ఆవిష్కరణ, జ్ఞానార్జనలకు ప్రతీకగా చూశారు. యూరోపియన్ చరిత్రకారులు ఈ సంఘటనను 'మానవ నాగరికతకు కొత్త దిశను నిర్దేశించినదిగా అభివర్ణించారు. అయితే... ఇది ఒక ఆవిష్కరణ అన్నమాట నిజమే అయినప్పటికీ, అది దురాక్రమణ, దోపిడీ, స్థానిక సంస్కృతుల వినాశనాలకు నాంది పలికిందనేది ఆధునిక పరిశోధకుల విశ్లేషణ.

1453లో ఆటోమన్ తురుష్కులు కాన్‌స్టాంటినోపుల్‌ను ఆక్రమించడంతో యూరప్ నుంచి ఇండియా, చైనా వంటి దేశాలకు వెళ్లే భూమార్గం క్రైస్తవ వ్యాపారులకు మూసుకు పోయింది. దీంతో ఆ యా భూభాగాల (ఈస్ట్ ఇండీస్)కు సముద్ర మార్గం కనిపెట్టాలని యూరోపియన్లు ప్రయత్నాలు ప్రారంభించారు. అందులో కొలంబస్ ఒకడు. స్పెయిన్ పాలకులు అతడికి ఆర్థిక సాయం చేయడానికి ముందుకు రావడంతో 1492 ఆగస్టులో మూడు నౌకలతో బయలుదేరాడు. అక్టోబర్ 12న అతడు బహమాస్ (ఉత్తర అమెరికా)లోని ఒక దీవికి చేరుకున్నాడు. తర్వాత క్యూబా, హిస్పానియోలా దీవులకు చేరాడు. అక్కడే ఒక కాలనీ స్థాపించాడు. ఇప్పుడు దాన్ని 'హైతీ' అని పిలుస్తున్నారు. ఆ తర్వాత మరో మూడు సార్లు సముద్రయానం చేసి కరేబియన్ దీవులు, మధ్య అమెరికా, దక్షిణ అమెరికా ఖండాలలోని వివిధ భూభాగాలను కనుగొని యూరోపియన్ దోపిడీకి బాటలు వేశాడు.



కొలంబస్ ఉత్తర అమెరికాను కనుగొన్న దృశ్యం (ఊహా చిత్రం)

కొలంబస్ చేరుకున్న ఈ కొత్త ప్రపంచంలో అప్పటికే తమవైన సంస్కృతులతో అలరారుతున్న టైనో, అరవాక్ వంటి స్థానిక జాతులు అనేకం ఉన్నాయి. వీరి జీవన విధానం ప్రకృతితో మిళితమై ఉండేది. కానీ యూరోపియన్ల రాకతో ఆ సమాజాలు కూలిపోయాయి. కొలంబస్ దళాలు స్థానికులను బలవంతపు కూలీలుగా మార్చాయి. బంగారం, ఇతర సంపదల కోసం వారిని హింసించాయి. కొలంబస్ రాక తరువాత కొన్ని దశాబ్దాలలోనే అమెరికా ఖండంలోని ఆదివాసీ జనాభా సుమారు 90 శాతం నశించిందని చరిత్రకారుల అంచనా.

ఈ యాత్రతో కొత్త ప్రపంచానికీ, పాత ప్రపంచానికీ మధ్య ఆదాన ప్రదానాలు జరిగాయి. ఈ ప్రక్రియను చరిత్రకారులు 'కొలంబియన్ ఎక్స్ఛేంజ్' అని పిలుస్తున్నారు. పంటలు, జంతువులు, వ్యాధులు, ఆహార పదార్థాలు, సాంకేతిక జ్ఞానాలు రెండు ప్రపంచాల మధ్య విస్తృతంగా వ్యాపించాయి. ఉదాహరణకు, యూరప్‌కి అమెరికా నుంచి బంగాళా దుంప, మొక్కజొన్న, పొగాకు, కోకో వంటి పంటలు; సిఫిలిస్ వంటి వ్యాధులు చేరగా... అమెరికాకు యూరప్ నుంచి గుర్రాలు, గోధుమలు, మశూచి, తట్టు, ఫ్లూ, టైఫస్ వంటి వ్యాధులు చేరాయి. ఈ మార్పులు ప్రపంచ ఆర్థిక, సామాజిక, రాజకీయ వ్యవస్థలను పూర్తిగా మార్చివేశాయి.

కొలంబస్ 'ఆవిష్కరణ' మానవాళి చరిత్రలో నైతిక సంక్షోభాన్ని తెచ్చింది. యూరోపియన్లు కొత్త ప్రపంచాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవడం కోసం 'వలస వాదా'న్ని ప్రవేశపెట్టారు. స్థానిక ప్రజల భాషలు, దేవతా వ్యవస్థలు, సంస్కృతులు నశించాయి. బానిస వ్యవస్థ, మానవ విలువల పతనం సాధారణమైంది.

కొలంబస్ సముద్ర యానం ప్రపంచాన్ని కలిపింది, కొత్త వాణిజ్య మార్గాలను తెరిచింది... కానీ అదే సమయంలో అనేక జీవులను, సంస్కృతులను నశింపజేసింది. అందుకే కొత్త ప్రపంచ ఆవిష్కరణ, తరువాతి పరిణామాల నుంచి నేటి ప్రపంచం నైతిక పాఠం నేర్చుకోవాలి. ◆

సోషల్ టాక్

ఇన్ని ఉన్నా!



మా తాతగారు పుట్టినప్పుడు హెల్త్ కేర్ లేదు. విమానాలు లేవు. పడవలు లేవు. రైళ్లు లేవు. కమ్యూనికేషన్‌లు లేవు. ఇంటర్నెట్ లేదు. ఇంత విస్తృత జ్ఞానం లేదు. పూర్తిగా భిన్నమైన ప్రపంచం అది. అయితే నేటి ప్రపంచం కంటే మెరుగైనది.

– జేమీ డిమోన్, 'జేపీ మోర్గాన్ చేజ్' సీఈవో

మనిషి-దేశం



పోగొట్టుకున్న నమ్మకాన్ని తిరిగి నిలబెట్టుకోవటం మనిషికైనా, దేశానికైనా అత్యవసరం. కష్టమైన పరిస్థితులను దాటడానికి, విభేదాలను తగ్గించుకోటానికి, పక్షపాత రహితంగా ఉండటానికి, కలిసి పని చేయటానికి మన విశ్వసనీయతే మార్గం ఏర్పరుస్తుంది.

– లీ కియాంగ్, చైనా ప్రధాని

కొత్తవాళ్లు



హాలీవుడ్‌లో కొత్తవారిని ఇష్టపడటం అనేది చాలా ఎక్కువగా ఉంటుంది. అదే... ఇంగ్లండ్‌లో కొత్తవారి పట్ల అనేక అనుమానాలు ఉంటాయి. బ్రిటన్ చిత్ర పరిశ్రమకు అది మేలు చేస్తుందేమో కానీ, సినిమాల్లోకి రావాలనుకున్న వారికి మాత్రం నిరాశను కలిగించే విషయం.

– క్రిస్టఫర్ నోలన్, దర్శకుడు

ఇదేం కాలం!!



మనం జీవిస్తున్న కాలాన్ని చూడండి. చాలా గందరగోళంగా ఉంది. ప్రమాదకరమైన ప్రపంచంలో ఉన్నాం. పిల్లల్ని కనేవాళ్ల ధైర్యాన్ని చెప్పుకోవాలి. ఒంటరి తల్లుల పరిస్థితినైతే నేను ఊహించగలను. అనుక్షణం వారి గురించే ఆలోచిస్తుండాలి.

– షీబా చద్ధా, సింగిల్ మదర్ – నటి

మించినవి లేవు!



సోషల్ మీడియాలో జనం ఎంతగా సమయాన్ని గడుపుతున్నారంటే, పుస్తకాలు చదవటం అనేది ఒకటి ఉందన్న విషయమే వారు మర్చిపోతున్నారు. ప్రపంచంతో నేరుగా కనెక్ట్ అవటానికి పుస్తకాలను మించినవి లేవు. ఆలోచనా శక్తి కూడా పెరుగుతుంది.

– ఇగా స్వియాటెక్, పోలండ్ టెన్నిస్ ప్లేయర్

వదిలేయ్ నాన్నా!




బిల్లు కాగితాలను జాగ్రత్త చేయటం, అవసరం లేని వస్తువులను పడేయకపోవటం... అంత తేలిగ్గా వదిలిపోని మధ్యతరగతి అలవాట్లు. ఈ మధ్య మా అబ్బాయిని అడిగాను – ఆ పాత ల్యాప్‌టాప్ మదర్ బోర్డును ఎక్కడ పెట్టావ్ అని! "వదిలేయ్ నాన్నా" అన్నాడు, విసుగ్గా!!

– రాజేశ్ తైలంగ్, నటుడు

విశ్రాంత పాత్రికేయులకేదీ భరోసా?

సంక్షేమంలో ఛాంపియన్లుగా పేరుపొందిన తెలుగు రాష్ట్రాలు పాత్రికేయుల సంక్షేమాన్ని మాత్రం పక్కన పెడుతున్నట్లున్నది! 1,000 నుంచి 2,500 రూపాయల పీఎఫ్ పెన్షన్ మాత్రమే అందుకొంటూ విశ్రాంత జీవితాన్ని నానాపాట్లూ పడుతూ గడుపుతున్న 60 ఏళ్లు పైబడిన విశ్రాంత పాత్రికేయులను పట్టించుకోవడం లేదని... కేంద్ర ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి.

మన తెలుగు రాష్ట్రాల్లో గౌరవప్రదమైన జీతభత్యాలు ఇస్తూ, పీఎఫ్ చందాలు కడుతూ పాత్రికేయులకు అండగా, ఆలంబనగా నిలుస్తున్న సంస్థలు పరిమితమే. ఉద్యోగ భద్రత, నెలవారీగా వేతనం వస్తుందన్న గ్యారెంటీ లేకుండా జీవితాన్ని గడిపే పాత్రికేయులే ఇప్పుడు ఎక్కువగా ఉన్నారు. అటువంటి వారు రిటైరైన తర్వాత కూడా కనీస అవసరాలు తీరక నరకయాతన పడుతున్నారు. ఉద్యోగంలో ఉన్నంత కాలం సమాజంలోని అన్ని వర్గాల కోసం పాటుపడిన పాత్రికేయులు రిటైరయ్యాక ఎవరూ పట్టించుకోని దైన్యస్థితిలో బతుకుతున్నారంటే అతిశయోక్తి కాదు. అక్షరాన్నే నమ్ముకుని ఉన్న వేలాదిమంది పాత్రికేయుల పరిస్థితి అసంఘటిత కార్మికుల కంటే తీసికట్టుగా తయారైంది.



నిజానికి, తెలుగు రాష్ట్రాలు తప్ప దేశంలో మరో 19 రాష్ట్రాలు విశ్రాంత పాత్రికేయులకై పెన్షన్ పథకాన్ని అమలు చేస్తున్నాయి. మధ్యప్రదేశ్ ప్రభుత్వం అత్యధికంగా నెలకు రూ. 20 వేల చొప్పున పెన్షన్‌ను 60 ఏళ్ళు పైబడిన పాత్రికేయులకు అందజేస్తోంది. అసోం నెలకు రూ. 5 వేలు, ఛత్తీస్‌గఢ్ 10 వేలు, గోవా 10 వేలు, హరియాణా 10 వేలు, మన పొరుగునే ఉన్న కర్ణాటక 10 వేలు, కేరళ 11 వేలు చెల్లిస్తున్నాయి. పంజాబ్‌లో 12 వేలు, రాజస్థాన్‌లో 15 వేలు, తమిళనాడులో 12 వేలు, త్రిపురలో 10 వేల చొప్పున విశ్రాంత జీవితం గడుపుతున్న పాత్రికేయులకు పెన్షన్‌గా అందచేస్తున్నారు.

తెలుగు రాష్ట్రాలు వందల కోట్ల నిధులతో లక్షలమందికి సామాజిక పెన్షన్‌లు అందచేస్తున్నాయి. అయితే అరకొర ఆదాయంతో రిటైర్మెంట్ జీవితాన్ని గడుపుతున్న పాత్రికేయులకు పెన్షన్ వసతి కల్పించడానికి మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీ గత ఎన్నికల ముందు తన మేనిఫెస్టోలో పాత్రికేయులకు పెన్షన్ ఇస్తామంటూ వాగ్దానం చేసిన సంగతి తెలిసిందే. ఇటీవలే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి ఆ వాగ్దానాన్ని గుర్తుచేశారు విశ్రాంత పాత్రికేయులు. త్వరలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సీఎంలనూ కలిసి వినతిపత్రం సమర్పించ నున్నారు. రిటైర్డ్ జర్నలిస్టులకు దేశమంతటా ఒకే పెన్షన్ విధానం కావాలని సీనియర్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సైతం తీర్మానం చేసింది. అక్షరాన్ని నమ్ముకొని, సమాజానికి మార్గదర్శనం చేసిన వయోధికులకు పాలకులు అండనివ్వాలి.

– చొప్పరపు కృష్ణారావు; పాత్రికేయుడు | 84668 64969

డేటా పాయింట్

జీతాలతో సమానంగా 'ఫీజు'

అమెరికా ప్రభుత్వం కొత్త హెచ్-1బీ వీసాల ఫీజును లక్ష డాలర్లకు పెంచింది. 2023లో అక్కడ పనిచేస్తున్న హెచ్-1బీ ఉద్యోగుల మధ్యస్థ (మీడియన్) వార్షిక వేతనంతో ఇది దాదాపు సమానం కావడం గమనార్హం.



ఉద్యోగులు (అంశాల వారీగా)

ఉద్యోగులు (అంశాల వారీగా)	మొత్తం హెచ్-1బీ ఉద్యోగుల్లో శాతం	వార్షిక వేతనం (డాలర్లలో)
కంప్యూటర్ సంబంధిత	64.9	1,23,600
ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, సర్వేయింగ్	9.4	1,15,000
విద్య	6.2	69,700
అడ్మినిస్ట్రేటివ్ ,స్పెషలైజేషన్స్	5	1,20,000
మెడిసిన్, ఆరోగ్యం	4.4	1,04,900
గణితం, భౌతిక శాస్త్రం	2.7	1,22,600

ఆధారం: ప్యూ రిసెర్చ్ సెంటర్

జ్యోతిర్మయం

గరళ ఆవిర్భావం

దుర్వాసుని శాపం వల్ల అసురులకు తన త్రిలోకాధిపత్యాన్నీ, సకల సంపదలనూ కోల్పోయాడు ఇంద్రుడు. అసురుల చేతిలో ఎన్నో బాధలు అనుభవించి ఇతర దేవతలతో కలిసి చివరకు బ్రహ్మను ఆశ్రయించాడు. బ్రహ్మ వారిని విష్ణువు దగ్గరకు నడిపించాడు. ఆయన సాగరమథనం చేసి అందులోంచి పుట్టే అమృతాన్ని దేవతలు మాత్రమే సేవించేట్లుగా చేయడం ఒక్కటే ఈ సమస్యకు సరైన పరిష్కారం అన్నాడు. సత్వరం అసురులను మంచి మాటలతో ఒప్పించి అందరూ కలిసి మందర పర్వతాన్ని కవ్వముగాను, వాసుకిని ఆ కవ్వమునకు తాడుగాను అమర్చి సాగర మథన కార్యక్రమానికి పూనుకొమ్మని చెప్పాడు. అలా మొదలైన 'క్షీరసాగర మథనం' అనే బృహత్కార్యంలో శ్రీమహావిష్ణువు కమఠ (తాబేలు) రూపం దాల్చి, మందర పర్వతం సాగరంలో మునగకుండా అడ్డుతగిలే ఆధారమై అమరాడు.

అసురులు వాసుకికి తలవైపున ఉండి లాగడం వలన వాసుకి నోటి నుండి వెలువడిన విషపు వేడిజ్వాలలు తగిలి నానాటికి కమిలిపోయి, అలిసిపోయి బలహీనులై మిగలసాగారు. దేవతలు తోకవైపు ఉండి లాగి బలవంతులుగానే మిగిలారు. అలా సాగిన సాగర మథనంలో వరుసగా సురభి, వారుణి, కల్పవృక్షము, ఐరావతము, ఉచ్చైశ్రవము, పూర్ణచంద్ర మండలము, అప్సరలు, ధన్వంతరి ఉద్భవించారు. ఆ తరువాత క్షీరసాగరం నుండి అమృతం జనించక ముందు, హాలాహలం ప్రత్యక్షమవడం జరిగిందని కలిదిండి భావనారాయణ రచించిన 'శ్రీవిష్ణుపురాణం' చెబుతోంది. **కం. అక్కజముగ దేవాసురు / లుక్కున, వడి, బట్టితిగుచు నుద్ధతులకడున్ / త్రొక్కుడుపడి, వాసుకి, వడి / గ్రక్కిన గరళంబు భోగిగణములు గొనియెన్.** దేవతలు అసురులు ఎంతో శ్రమపడి చెరొకవైపు పట్టి అవిరామంగా లాగడం వలన త్రొక్కుడుపడిన వాసుకి అలసిపోయి భళ్ళుమని ఒక్కసారిగా గరళాన్ని కక్కాడు. ఆ గరళాన్ని సర్ప సమూహాలు ఆరగించాయి – అని పై పద్యం భావం. అలా క్షీరసాగర మథనం సందర్భంగా పుట్టిన హాలాహలాన్ని నాగులు గ్రహించారని శ్రీవిష్ణుపురాణం కథనం చేసింది.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

ఇంటర్ విద్యార్థినిపై హత్యాచారం

- నల్లగొండ పట్టణంలో ఘటన

నల్లగొండ: నల్లగొండ జిల్లా కేంద్రంలో దారుణం చోటు చేసుకుంది. ఇంటర్ చదివే ఓ విద్యార్థినిపై ప్రేమ పేరుతో ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడి హత్య చేశాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలంలోని అన్నారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బాలిక(17) నల్లగొండలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అదే మండలం గుట్టకింద అన్నారం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గడ్డం కృష్ణతో ఆ విద్యార్థినికి ఆరు నెలలుగా పరిచయం ఉంది. మంగళవారం ఉదయం కళాశాలకు బయల్దేరిన ఆ విద్యార్థినికి.. ప్రేమ పేరుతో కృష్ణ మాయమాటలు చెప్పి నల్లగొండలోని తన స్నేహితుడి రూమ్‌కు తీసుకెళ్లి అత్యాచారం చేసి హత్య చేశాడు. అనంతరం అతనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్టు తెలిసింది. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కృష్ణకు అతడి స్నేహితుడు సహకరించాడని బాలిక తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు నిందితుడిపై అత్యాచారం, హత్య కేసులతో పాటు పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఎస్‌ఐ సైదులు తెలిపారు. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పరిశీలించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

స్టేషన్‌ఘన్‌పూర్/ధర్మసాగర్: ఆర్థిక ఇబ్బందులతో వేర్వేరు చోట్ల ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండ గ్రామానికి చెందిన చిలువేరు రవి (59) అనే రైతు క్రిమిసంహారక మందు తాగి ఈనెల 4న ఆత్మహత్యాయత్నం చేయగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. రవికి రెండెకరాల పొలం ఉంది. వ్యవసాయం చేస్తూ గొర్రెలు కాస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దీంతోపాటు మూడేళ్లుగా మామిడితోటలు పడుతూ వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో కాలం కలిసిరాక దాదాపు రూ.10 లక్షల వరకు అప్పుల య్యాయి. అప్పులు తీర్చే మార్గం లేక ఈనెల 4న వ్యవసాయ భూమి వద్ద క్రిమిసంహారక మందు తాగాడు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులు.. ఆపై అనారోగ్యం

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన దేవరుప్పుల భిక్షపతి (42) పంట పెట్టుబడికి కొంత అప్పు చేశాడు. నాలుగు నెలల నుంచి అనారోగ్యం బారినపడ్డాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగి మనోవేదనకు గురయ్యాడు. సోమవారం మధ్యాహ్నం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకుని భిక్షపతి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్‌రావు తెలిపారు.

సౌర తుపానుతో.. మన ఆరోగ్యానికీ ముప్పే!

మహిళల్లో గుండెపోటు అవకాశాలు ఎక్కువ

- రక్తపోటు కూడా పెరుగుతున్నట్టు వెల్లడి
- ఊపిరితిత్తులు, నాడీ వ్యవస్థపైనా ప్రభావం

'శక్తిమంతమైన సౌర తుపాను భూమిని తాకింది.. ఫలితంగా భూ అయస్కాంత క్షేత్రంలో తీవ్ర అవరోధాలు ఏర్పడ్డాయి. దీనివల్ల శాటి లైట్లు, పవర్‌గ్రిడ్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు ప్రభావితం అయ్యే అవకాశం ఉంది' ఇలాంటి వార్తలు ఇటీవలి కాలంలో ఎక్కువగా వింటున్నాం. ఔను, నిజమే. సూర్యుడి నుంచి ఉత్పన్నమయ్యే సౌర తుపాన్లు అంత ప్రభావవంతమైనవే, ప్రమాదకరమైనవే. అది ఆయా వ్యవస్థలనేకాదు.. మానవుల ఆరోగ్యాన్నీ ప్రభావితం చేస్తుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. తాజా అధ్యయనంలో మరో ఆసక్తికర విషయం వెలుగుచూసింది. సౌర తుపాన్ల వంటి వాటివల్ల ప్రభావితమయ్యే భూ అయస్కాంత క్షేత్రం.. మనుషుల్లో గుండెపోటుకు కారణమవుతోందట.



బ్రెజిల్ అంతరిక్ష పరిశోధనా కేంద్రం (ఐఎన్‌పీఈ), యూనివర్సిటీ ఆఫ్ సావో పాలో సంయుక్తంగా ఒక అధ్యయనం నిర్వహించాయి. గుండెపోటు సమస్య ఉన్న 1,340 మంది.. ఇందులో 871 మంది పురుషులు, 469 మంది స్త్రీల ఆసుపత్రి వివరాలను పరిశీలించారు. భూ అయస్కాంత క్షేత్రం తీవ్రతను... సాధారణం, ఒక మోస్తరు, తీవ్రస్థాయి అనే 3 రకాలుగా విభజించారు. పేషంట్లను కూడా వయసుల వారీగా.. 30 అంతకంటే తక్కువ వయసున్నవారు, 31-60 ఏళ్లవారు, 60 ఏళ్లకు పైబడినవారు.. ఇలా మూడు వర్గాలుగా విభజించారు.

మూడు రెట్లు ఎక్కువ..

సౌర తుపాను వల్ల భూ అయస్కాంత క్షేత్రంలో వచ్చిన మార్పులు గుండెపోటును ప్రభావితం చేశాయని అధ్యయనంలో తేలింది. ముఖ్యంగా సౌర తుపాను సమయంలో గుండెపోటు అవకాశాలు మహిళల్లో ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. భూ అయస్కాంత క్షేత్రం తీవ్రత 'సాధారణం'తో పోలిస్తే 'తీవ్రస్థాయి'లో ఉన్నప్పుడు గుండెపోట్లు మూడు రెట్లు ఎక్కువగా వచ్చాయట.

రక్తపోటు పెరుగుతోంది..: పరిశోధనలో భాగంగా మధ్యస్థాయి అయస్కాంతావరణం ఉండే చైనాలోని రెండు నగరాలను ఎంచుకున్నారు. అక్కడి 5 లక్షలకుపైగా ప్రజల రక్తపోటు స్థాయిల రికార్డులను సౌరతుపాన్ల కాలంతో పోల్చిచూశారు. జీఎంఏలో మార్పులకు తగ్గట్లు అక్కడి ప్రజల బీపీలో హెచ్చుతగ్గులు ఉన్నట్లు కనుగొన్నారు. ముఖ్యంగా మహిళల్లో ఎక్కువగా బీపీలో హెచ్చుతగ్గులు నమోదయ్యాయట. ఇప్పటికే రక్తపోటుతో బాధపడుతున్న వారికి సౌర తుపాను వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని శాస్త్రవేత్తలు వెల్లడించారు.



ఊపిరితిత్తులు.. నాడీ వ్యవస్థ..: 2022లో సైన్స్ డైరెక్ట్‌లో ప్రచురితమైన మరో అధ్యయనంలో.. సౌర తుపాన్ల వల్ల భూ అయస్కాంత ఆవరణలో వచ్చే మార్పులు ఊపిరితిత్తుల పనితీరును ప్రభావితం చేస్తాయని తేలింది. ఆ సమయంలో ఊపిరితిత్తుల పనితీరు మందగిస్తుందని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అలాగే ఆ సమయంలో నాడీ వ్యవస్థ పనితీరు కూడా ప్రభావితమైందట.



సూర్య - ఏఐ..: సౌర తుపాన్లను, వాటి తీవ్రతను అంచనా వేయ డానికి అమెరికా అంతరిక్ష కేంద్రం నాసా, ఐబీఎమ్ కంపెనీ సహకారంతో సూర్య అనే ఏఐ వ్యవస్థను రూపొందించింది. శాటిలైట్లు, పవర్‌గ్రిడ్లు, కమ్యూ నికేషన్ వ్యవస్థలకు ప్రమాదకరమైన సౌర తుపాన్లు వచ్చినప్పుడు ఇది అప్రమత్తం చేస్తుంది.

5 లక్షల మందిపై..

సౌరతుపాన్ల కారణంగా భూమి మీదకు దూసుకొచ్చే వేడి గాలులు భూ అయస్కాంత ఆవరణాన్ని ప్రభావితం చేసి.. మన రక్తపోటు పెంచుతాయని చైనాలో నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. ఆరు సంవత్సరాలపాటు చైనాలోని 5,00,000 మంది ప్రజల రక్తపోటు స్థాయిలను పర్యవేక్షించి శాస్త్రవేత్తలు ఈ విషయాన్ని కనుగొన్నారు. సౌరతుపాన్ల వల్ల భూ అయాస్కాంతావరణంలో (జీఎంఏ) సంభవించే మార్పులు మన ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావాలు చూపుతాయనే దానిపై అధ్యయనం సాగింది.

-సాక్షి, స్పెషల్ డెస్క్

ఏడాదిలో మేడిగడ్డ పునరుద్ధరణ

- ఐఐటీ తరహా ప్రతిష్టాత్మక సంస్థతో డిజైన్ల తయారీ
- నీటిపారుదల శాఖపై సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ సిఫారసులకు అనుగుణంగా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్‌ను ఏడాదిలోగా పునరుద్ధరిస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన బరాజ్‌ల పునరుద్ధరణకు డిజైన్ల రూపకల్పనతోపాటు ఇతర సాంకేతిక అంశాల్లో సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ)కు సహకారం అందించడానికి కన్సల్టెన్సీ సేవల కోసం ఇప్పటికే ఆసక్తి వ్యక్తీకరణ(ఈఓఐ)ను ఆహ్వానించామన్నారు. ఐఐటీ లేదా ఇతర ప్రతిష్టాత్మక సంస్థను కన్సల్టెంట్‌గా నియమించి.. డిజైన్ల రూపకల్పన, బరాజ్‌లకు జియోఫిజికల్, జియోటెక్నికల్ వంటి పరీక్షలతో పాటు పునరుద్ధరణ పనులు నిర్వహిస్తామని చెప్పారు. కుంగిపోయిన మేడిగడ్డ బరాజ్ 7వ నంబర్ బ్లాక్‌కు మరమ్మతులు నిర్వహించాలా? దానిని పూర్తిగా తొలగించి కొత్త బ్లాక్‌ను పునర్నిర్మించాలా? అనే అంశంపై సైతం కన్సల్టెన్సీ సహకారం తీసుకుంటామన్నారు. నీటిపారుదల శాఖపై మంగళవారం ఉత్తమ్ సచివాలయంలో సమీక్షించారు.

6 నెలల్లో కృష్ణా ట్రిబ్యునల్ విచారణ పూర్తి

ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపిణీ విషయంలో కేంద్రం జారీ చేసిన అదనపు మార్గదర్శకాలు (టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్) ఆధారంగా జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్-2 నిర్వహిస్తున్న విచారణ మరో ఆరు నెలల్లో పూర్తికావొచ్చని మంత్రి ఉత్తమ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ వాదనలు పూర్తయిన తర్వాత రిజాయిండర్ వాదనలు వినిపించేందుకు సన్నద్ధం కావాలని అధికారులను ఆదేశించారు.

ప్రాణహితకు రెండు అలైన్‌మెంట్లు

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మించి తీరుతామని మంత్రి ఉత్తమ్ అన్నారు. తుమ్మిడిహెట్టి నుంచి 71.5 కి.మీ.ల గ్రావిటీ ద్వారా మైలారానికి నీటిని తీసుకొచ్చి, అక్కడి నుంచి 14 కి.మీ.ల సొరంగ మార్గం ద్వారా సుందిళ్ల బరాజ్‌కు నీటిని తరలించాలనే ఓ ప్రతిపాదన ఉందని చెప్పారు. మైలారం వద్ద పంప్‌హౌస్ నిర్మించి అక్కడి నుంచి ఎల్లంపల్లి బరాజ్‌లోకి నీటిని ఎత్తిపోయాలనే మరో ప్రతిపాదనను సైతం పరిశీలిస్తున్నామన్నారు. ఈ రెండు అలైన్‌మెంట్లలో సరైన ప్రత్యామ్నాయాన్ని ఎంపిక చేసి ఈ నెల 22లోగా సిఫారసు చేయాలని నీటిపారుదల శాఖ సలహాదారుడు ఆదిత్యనాథ్‌దాస్ నేతృత్వంలోని కమిటీని ఆదేశించారు.

త్వరలో ఎస్‌ఎల్‌బీసీ పనుల పునరుద్ధరణ

శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం పనులు 2027 డిసెంబర్ 9లోగా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ పునరుద్ఘాటించారు. వర్షాలు ముగిసిన వెంటనే పనులు ప్రారంభించాలని, ప్రతి 15 రోజులకోసారి పురోగతిని సమీక్షిస్తామన్నారు. సొరంగం తవ్వాల్సిన ప్రాంతంలో భూగర్భంలోని స్థితిగతులను తెలుసుకోవడానికి నిర్వహించనున్న హెలికాప్టర్ ఆధారిత సర్వేకు త్వరలో పౌర విమానయాన శాఖ డీజీ (డీజీసీఏ) నుంచి అనుమతులు వస్తాయన్నారు.

సమ్మక్కపై సీడబ్ల్యూసీ అనుమానాలను నివృత్తి చేయాలి

సమ్మక్క-సారక్క ప్రాజెక్టు కింద ప్రతిపాదించిన ఆయకట్టు విషయంలో సీడబ్ల్యూసీ లేవనెత్తిన అనుమానాలను సత్వరంగా నివృత్తి చేసి ఆ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులను పొందాలని అధికారులకు సూచించారు. దేవాదుల ప్రాజెక్టు ప్యాకేజీ-6 అంచనాల పెంపుతోపాటు అదనంగా మూడో దశ పనులకు అనుమతించామని చెప్పారు. ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకుగాను తక్షణమే భూసేకరణకు రూ.33 కోట్లు విడుదల చేయాలన్నారు. సమీక్షలో శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, సలహాదారుడు ఆదిత్యనాథ్‌దాస్, ఈఎన్సీ (జనరల్) అంజాద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'కాళేశ్వరం' పిటిషన్లపై కౌంటర్లు వేయలేదేం?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

- 2 వారాల సమయం కోరిన ఏజీ.. అనుమతించిన సీజే

సాక్షి, హైదరాబాద్: జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సమర్పించిన కాళేశ్వరం విచారణ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తమపై చర్యలు తీసుకోకుండా ఆదేశించాలంటూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు మాజీ సీఎస్ ఎస్.కె. జోషి, నాటి సీఎం ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్ వేసిన పిటిషన్లపై ఇంకా కౌంటర్లు ఎందుకు వేయలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. అయితే రెండు పిటిషన్లలో కౌంటర్లు సిద్ధమవగా మరో రెండు పిటిషన్లలో కౌంటర్ల దాఖలుకు రెండు వారాల సమయం కావాలని ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి, అడ్వొకేట్ జనరల్ విజ్ఞప్తి చేశారు. దీంతో అందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం అనుమతిచ్చింది. అలాగే రిప్లై కౌంటర్ దాఖలు చేసేందుకు పిటిషనర్లకు మరో రెండు వారాలు సమయం ఇస్తూ తదుపరి విచారణను వచ్చే నెల 12కు వాయిదా వేసింది. పిటిషనర్లపై చర్యలు తీసుకోవద్దంటూ గత నెల ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తదుపరి విచారణ వరకు పొడిగించింది.

రేవంత్ నిర్ణయం హర్షణీయం

భూములిచ్చే రైతులకు ఇంటి స్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడం భేష్: కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పరిశ్రమలు, అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టే భూసేకరణ విషయంలో రేవంత్ ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం హర్షణీయమని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి, భవానీరెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లాలో 2005 నుంచి హార్డ్‌వేర్ పార్క్, ఫ్యాబ్ సిటీ, ఫార్మా సిటీల కోసం ప్రభుత్వాలు చేపట్టిన భూసేకరణపై చర్చించారు. చిరకాలంగా పెండింగ్‌లో వున్న భూ సేకరణ విషయంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు తగిన నష్టపరిహారం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిందన్నారు. అయితే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత రైతుల అభీష్టం మేరకు దేశంలో ఎక్కడా లేనివిధంగా భూ నష్టపరిహారంతో పాటు ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ప్రకటించడం వంటి నిర్ణయాలు అభినందనీయమని అన్నారు.

ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ అగ్రగామి

- ఈ వానాకాలం సీజన్‌లో 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
- పౌర సరఫరాల శాఖ అధికారుల సమావేశంలో మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గత ఏడాది వచ్చిన ధాన్యం దిగుబడి కన్నా ఈ సంవత్సరం మరింత ఎక్కువ రానుందని తెలిపారు. వానకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లపై మంగళవారం ఆయన పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సీజన్‌లో రాష్ట్రంలో 67.57 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, 40.75 లక్షల ఎకరాల్లో సన్నాలు, 26.82 లక్షల ఎకరాల్లో దొడ్డు వడ్ల సాగు చేశారన్నారు. 148.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనా వేసినట్టు తెలిపారు.దేశ చరిత్రలోనే ఒక సీజన్‌లో ఇప్పటి వరకు ఇంతటి దిగుబడి ఏ రాష్ట్రంలో నమోదు కాలేదని చెప్పారు. ఇందులో రైతుల అవసరాలు, ప్రైవేటు విక్రయాలు పోగా, 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గిడ్డంగుల కొరత ఉందని, ఆ కొరతను తీర్చాలని కేంద్రాన్ని కోరామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, డైరెక్టర్ హన్మంతు, అదనపు డైరెక్టర్ రోహిత్ తదితర అధికారులు పాల్గొన్నారు.



పౌర సరఫరాల శాఖ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పెళ్లికి అడ్డంకులు వస్తున్నాయని...

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

ప్రియుడి మృతి, ప్రియురాలి పరిస్థితి విషమం.. జనగామ జిల్లాలో ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్: పెళ్లికి అడ్డంకులు వస్తున్నాయని ఓ ప్రేమజంట ఆత్మహత్యాయత్నం చేసింది. ప్రేమికుడు మృతిచెందగా, ప్రియురాలి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని తాటికొండ గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాటికొండ గ్రామానికి చెందిన మారపాక అంజయ్య, రేణుక దంపతుల పెద్ద కుమారుడు అన్వేష్ (22), హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలకు గ్రామానికి చెందిన గడ్డం దాసు, ఏలిషా దంపతుల కుమార్తె పావని (20) ప్రేమలో ఉన్నారు. ఇరువురూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో పెద్దలు కూడా అంగీకరించారు. మూడునెలల క్రితం అన్వేష్ ప్రియురాలు పావనిని తాటికొండకు తీసుకువచ్చి ఆమెతో సహజీవనం సాగిస్తున్నాడు. తొందరలోనే వివాహం చేసుకుందామని నిశ్చయించుకున్నారు. అంతలోనే అన్వేష్ అక్క కొడుకు మృతిచెందడం, అనంతరం వినాయక చవితి పండుగ రావడంతో వివాహానికి మంచి రోజులు రాలేదు. నాలుగు రోజుల క్రితం అన్వేష్ సమీప బంధువు మృతిచెందడంతో వారికి చుట్టు వచ్చింది. దీంతో తరచూ పెళ్లికి ఏదో ఒక అడ్డంకి వస్తుండటంతో వారం రోజులుగా వారిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇక తమ వివాహం కాదని, చావే శరణ్యమని భావించిన వారు క్షణికావేశానికి గురై ఈనెల 6న సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగారు. ఇద్దరిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అన్వేష్ మంగళవారం ఉదయం మృతిచెందగా పావని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణు తెలిపారు.

క్షణికావేశం అన్నదమ్ముల ప్రాణం తీసింది

- చెరువులో దూకిన అన్న... కాపాడబోయి తమ్ముడు
- ఇద్దరి మృతితో విషాదం



నరేశ్ (ఫైల్)



నవీన్ (ఫైల్)

నిర్మల్‌టౌన్: క్షణికావేశం ఇద్దరు అన్నదమ్ముల ప్రాణం తీసింది. ఈ విషాద ఘటన నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగింది. పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నాయుడువాడకు చెందిన మాన్పురి నరేశ్ (38), నవీన్ (36) అన్నదమ్ములు. అమ్మానాన్న, భార్యాపిల్లలతో కలిసి ఉమ్మడిగా జీవిస్తున్నారు. నరేశ్ ఓ ప్రైవేట్ కళాశాలలో క్లర్క్‌గా, నవీన్ చిరు వ్యాపారం చేస్తున్నాడు. ఇంట్లో చిన్నచిన్న గొడవలు జరిగేవి. మంగళవారం ఉదయం నరేశ్, నవీన్ ఎవరి పనులకు వారు వెళ్లారు. మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వచ్చారు. ఈ సమయంలో ఇంట్లో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన నరేశ్ క్షణికావేశంతో ఇంటి సమీపంలోని బంగల్‌పేట్ చెరువులో దూకాడు...అన్నను కాపాడేందుకు నవీన్ కూడా చెరువులో దూకాడు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందారు. పోలీసులు జాలర్ల సాయంతో ఇద్దరి మృతదేహాలను బయటకు తీయించారు. నరేశ్‌కు భార్య, ఏడేళ్ల కొడుకు, మూడేళ్ల కూతురు ఉన్నారు. నవీన్‌కు భార్య, మూడేళ్ల కూతురు ఉన్నారు. ఒకవైపు ఇద్దరు కొడుకులను కోల్పోయిన తల్లిదండ్రులు.. మరోవైపు నాన్నలను కోల్పోయిన పిల్లలు.. ఇంకోవైపు భర్తలను కోల్పోయిన భార్యలు ఆస్పత్రి వద్ద రోదించిన తీరు అందరినీ కలచివేసింది.

భార్యను హత్యచేసి.. భర్త ఆత్మహత్య

భద్రాద్రి జిల్లా పాపకొల్లులో విషాదం



గోపి - సునీత (ఫైల్)

జూలూరుపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలోని పాపకొల్లు గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త తాను ఆత్మహత్య చేసుకున్నాడు. పాపకొల్లుకు చెందిన ధరావత్ గోపీ (40)కి టేకులపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామానికి చెందిన సునీత(37)తో 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇంటర్, 9వ తరగతి చదువుతోన్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య అనుమానం కారణంతో గొడవలు జరుగుతున్నాయి. కాగా, సోమవారం ఉదయం ఇద్దరు పొలానికి వెళ్లారు. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లి చూడగా సునీత కత్తి గాయాలతో మృతి చెంది ఉంది. అయితే పొలం పరిసరాల్లో గోపి కనిపించకపోవడంతో భార్యను చంపిన ఆయన పారిపోయి ఉంటాడని, లేదా పోలీసులకు లొంగిపోయి ఉండొచ్చని భావించారు. అయితే, రాత్రంతా పొలం వద్దే గడిపిన గోపి మంగళవారం తెల్లవారుజామునే పురుగుల మందు తాగినట్లు తెలుస్తోంది. ఉదయం పొలానికి వెళ్లిన రైతులకు అపస్మారకస్థితిలో ఉన్న గోపీ కనిపించడంతో కుటుంబ సభ్యులను పిలిపించే సరికే మృతి చెందాడు. భార్యను చంపిన భయంతో ఆయన బలవన్మరణానికి పాల్పడినట్లు భావిస్తున్నారు. గంటల వ్యవధిలోనే తల్లిదండ్రులు మృతి చెందడంతో ఇద్దరు కుమార్తెలు అనాథలుగా మిగిలారు.

కొడుకు మతాంతర వివాహం.. తల్లి ప్రాణం తీసింది

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొడుకు మతాంతర వివాహం ఓ తల్లి మృతికి కారణమైంది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం బస్వాపూర్‌లో జరిగింది. ఎస్‌ఐ కృష్ణారెడ్డి, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓ యువతి డిగ్రీ పూర్తి చేసింది. తనతో కలిసి చదువుకున్న అదే గ్రామానికి చెందిన డీజే నడుపుతున్న ఓ యువకుడితో ప్రేమలో పడింది. ఏడాది క్రితం ఇద్దరూ వివాహం చేసుకొని హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉంటున్నారు. వారు ఉంటున్న అడ్రస్ తెలుసుకొని అమ్మాయి తల్లిదండ్రులు నెలన్నర క్రితం అక్కడకు వెళ్లారు. కూతురికి నచ్చజెప్పి ఇంటికి తీసుకొచ్చారు. అప్పటికే ఆమె ఐదు నెలల గర్భిణి కావడంతో అబార్షన్ చేయించారు. ఆ యువకుడు కూడా స్వగ్రామానికి తిరిగొచ్చాడు. నెలన్నర తర్వాత మంగళవారం ఆ జంట కారులో తిరిగి వెళ్లిపోయారు. పొలం దగ్గరకు వెళ్లిన అమ్మాయి తల్లిదండ్రులు ఇంటికి వచ్చేసరికి తమ కూతురు కనిపించకపోవడంతో ఆగ్రహానికి లోనయ్యారు. అబ్బాయి ఇంటిపైకి దాడికి దిగారు. మాటామాటా పెరిగి అమ్మాయి తల్లిదండ్రులు అబ్బాయి తల్లి తలపై ఇనుపరాడుతో బలంగా కొట్టారు. గాయపడిన ఆమెను గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది.



ప్రజల జీవితాల్లో మార్పే లక్ష్యం

ఈ గొప్ప దేశానికి సేవ చేయటం నా అదృష్టం

- గత 11 ఏళ్లలో దేశంలో గొప్ప మార్పు తీసుకొచ్చాం
- ప్రధాని నరేంద్రమోదీ వెల్లడి.. ఎక్స్‌లో వరుస పోస్టులు
- ప్రభుత్వాధినేతగా 25వ సంవత్సరంలోకి

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వాధినేతగా 24 సంవత్సరాలు పూర్తిచేసుకొని మంగళవారం 25వ సంవత్సరంలోకి అడుగుపెట్టారు. 2001 అక్టోబర్ 7న ఆయన తొలిసారి గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దాదాపు 12 సంవత్సరాలు ఆ పదవిలో ఉన్నారు. 2014 నుంచి దేశ ప్రధానిగా కొనసాగుతున్నారు. దేశంలో ఓటమి ఎరుగని ప్రభుత్వాధినేతగా మోదీ రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఎక్స్‌లో వరుస పోస్టులు పెట్టారు. ఈ గొప్ప దేశానికి సేవ చేసే అవకాశం రావటం తన అదృష్టమని పేర్కొన్నారు. 'నా తోటి భారతీయులు నాపై చూపిస్తున్న ఆదరాభిమానాలకు, ఆశీర్వాదాలకు కృతజ్ఞతలు. ప్రభుత్వాధినేతగా నేను 25వ సంవత్సరంలోకి అడుగుపెట్టాను. ఈ సందర్భంగా ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. నా ఈ సుదీర్ఘ ప్రయాణంలో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేందుకు స్థిర చిత్తంతో గట్టి ప్రయత్నం చేశాను. ఈ గొప్ప దేశ ప్రగతికి నా వంతు కృషి చేశాను' అని పేర్కొన్నారు.

నిరాశ నుంచి గొప్ప స్థాయికి పయనం

తాను 2014లో దేశ ప్రధాని పదవి చేపట్టేనాటికి దేశంలో అవినీతి, ప్రజల్లో నిరాశ, నిస్పృహ నెలకొని ఉన్నాయని.. తన 11 ఏళ్ల పదవీ కాలంలో దేశం ఆ పరిస్థితి నుంచి బయటపడి.. ఎంతో ప్రగతి పథంలో దూసుకెళ్తోందని ప్రధాని తెలిపారు. '2014 సార్వత్రిక ఎన్నికల కోసం 2013లో నన్ను బీజేపీ ప్రధాని అభ్యర్థిగా ఎన్నుకొనే నాటికి యూపీఏ ప్రభుత్వం అవినీతి, కుటిలతత్వం, విధాన వైఫల్యాలకు పర్యాయపదంగా ఉంది. అంతర్జాతీయంగా బలహీన సంబంధాలు కలిగి ఉంది. కానీ, విజ్ఞులైన భారతీయులు మా కూటమికి, మా పార్టీకి ఎన్నికల్లో అద్భుత మెజారిటీ ఇచ్చారు. గత 11 ఏళ్లలో మనమంతా కలిసి ఎంతో మార్పు తీసుకొచ్చాం. ముఖ్యంగా మన మహిళా శక్తి, యువశక్తి, అన్నదాతలు ఎంతో స్వయంసమృద్ధి సాధించారు. 25 కోట్ల మంది పేదరికం కోరల నుంచి బయటపడ్డారు. ప్రస్తుతం ప్రపంచ అద్భుత ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ పరిగణించబడుతోంది' అని ప్రధాని పేర్కొన్నారు.

సవాళ్లే నన్ను బలంగా మార్చాయి

ప్రభుత్వాధినేతగా మొదట్లో తాను ఎదుర్కొన్న సవాళ్లే తనను శక్తిమంతంగా మార్చాయని ప్రధాని మోదీ తెలిపారు. 'నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా మొదట అధికారం చేపట్టేనాటికి భారీ భూకంపం, తీవ్రమైన తుఫాన్, వరుస కరువులతో రాష్ట్ర ప్రజలు తీవ్ర కష్టాల్లో ఉన్నారు. బలమైన సంకల్పంతో ప్రజలకు సేవ చేసేందుకు, గుజరాత్‌ను పునర్నిర్మించేందుకు ఆ సవాళ్లు నన్ను శక్తిమంతుడిని చేశాయి. నాడు గుజరాత్‌ను ఇక బాగు చేయలేం అన్నారు. కానీ, అందరం కలిసికట్టుగా కష్టపడి సుపరిపాలనకు గుజరాత్‌ను పవర్‌హౌస్‌గా మార్చాం' అని చెప్పారు. తన తల్లి చెప్పిన మాటలు ఎంతో స్ఫూర్తిని ఇచ్చాయని మోదీ గుర్తుచేసుకున్నారు. 'సీఎంగా ప్రమాణం చేసే సమయంలో మా అమ్మ నాకు ఒక మాట చెప్పారు. నీ పని ఏమిటో నాకు సరిగా తెలియదు కానీ.. రెండు విషయాలు మాత్రం మర్చిపోవద్దు. ఒకటి.. నువ్వు ఎప్పుడూ పేదల బాగు కోసమే పనిచేయాలి. రెండు.. లంచం తీసుకోవద్దు అని చెప్పారు. నేను కూడా ప్రజలకు అదే చెప్తాను. అవసరంలో ఉన్న చివరి వ్యక్తికి కూడా సేవ చేయటమే లక్ష్యంగా పెట్టుకోవాలి.

జడ్జీల కామెంట్లపై తప్పుడు ప్రచారం

సరదాగా అన్న వ్యాఖ్యలను కూడా సోషల్‌మీడియాలో వక్రీకరిస్తున్నారు

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్



న్యూఢిల్లీ: కోర్టుల్లో కేసుల విచారణల సమయంలో న్యాయమూర్తులు సరదాగా చేసే వ్యాఖ్యలను కూడా సోషల్ మీడియాలో తప్పుగా ప్రచారం చేస్తున్నారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సర్వీస్ కండిషన్స్, వేతనాలు, వృత్తిగతమైన పురోగతిపై ఆల్ ఇండియా జడ్జెస్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కలిసి జస్టిస్ గవాయ్ మంగళవారం విచారించారు. ఈ సందర్భంగా జస్టిస్ కే వినోద్‌తో తన గత అనుభవాన్ని జస్టిస్ గవాయ్ వివరించారు. 'ఇటీవల ధీరజ్ మోర్ కేసు విచారణ సందర్భంగా నా సహోదరుడు (జస్టిస్ కే వినోద్) ఏదో వ్యాఖ్యానించబోయారు. ఆయనను నేను ఆపాను. లేదంటే తెల్లారి సోషల్‌మీడియాలో ఏమేం ప్రచారం చేసేవారో తెలియదు. అందుకే ఆయనను నాకు మాత్రమే వినపడేలా చెప్పమన్నాను' అని జస్టిస్ గవాయ్ తెలిపారు. కాగా, ఈ కేసు విచారణను ధర్మాసనం ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేసింది. కొద్దిరోజుల క్రితం కజురహో ఆలయంలో తొలగించిన ఓ విగ్రహాన్ని మళ్లీ ఏర్పాటు చేసేలా ఆదేశాలివ్వాలని దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) విచారణ సందర్భంగా జస్టిస్ గవాయ్ సరదాగా చేసిన వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు దారితీసిన విషయం తెలిసిందే. సోషల్‌మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు రావటంతో జస్టిస్ గవాయ్ ఆ తర్వాత వివరణ కూడా ఇచ్చారు. సోమవారం కోర్టులోనే జస్టిస్ గవాయ్‌పై ఓ న్యాయవాది బూటు విసిరేయటం సంచలనం సృష్టించింది.

హిమాచల్‌లో ఘోర ప్రమాదం

బిలాస్‌పూర్ వద్ద బస్సుపై విరిగిపడిన కొండచరియలు

- బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం
- ముగ్గురిని కాపాడిన సహాయక బృందాలు
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం

మృతుల కుటుంబాలకు ప్రధాని రూ. 2 లక్షల సహాయం

15 మంది మృతి.. నుజ్జయిన బస్సు

షిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లో మంగళవారం రాత్రి జరిగిన ఘోర ప్రమాదంలో 15 మంది మరణించారు. బిలాస్‌పూర్ జిల్లా ఝున్‌దత్త నియోజకవర్గంలోని భలుఘాట్ బ్రిడ్జి వద్ద ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేటు బస్సుపై సాయంత్రం 6.30 గంటల సమయంలో భారీ మొత్తంలో కొండచరియలు విరిగిపడటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పెద్దపెద్ద కొండరాళ్లు, బురద మట్టి కింద బస్సు మొత్తం కూరుకుపోయి నుజ్జయ్యింది. మరోతన్–కలౌల్ మధ్య తిరిగే ఈ బస్సులో ప్రమాదం సమయంలో 30–35 మంది ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు, విపత్తు నిర్వహణ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ముగ్గురు ప్రయాణికులను కాపాడినట్టు బిలాస్‌పూర్ డిప్యూటీ కమిషనర్ రాహుల్‌కుమార్ తెలిపారు. శిథిలాల నుంచి 15 మృతదేహాలను వెలికితీసినట్టు ఝున్‌దత్త ఎమ్మెల్యే జేఆర్ కత్వాల్ చెప్పారు. ఆయన ఘటనా స్థలానికి వెళ్లి స్వయంగా సహాయచర్యల్లో పాల్గొన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. రాత్రి సమయం కావటంతో సెల్‌ఫోన్లు, టార్చిలైట్ల వెలుగులో సహాయక చర్యలు చేపట్టారు. ఒక జేసీబీతో శిథిలాలను తొలగిస్తుండగా, సహాయక సిబ్బంది మరోవైపు పారలతో మట్టిని తవ్వి బస్సులోనివారి కోసం వెదుకుతున్న వీడియోలు మీడియాలో ప్రసారమయ్యాయి.



నామరూపాలు కోల్పోయిన బస్సు



ఘటన ప్రాంతంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు

బిలాస్‌పూర్ ప్రమాదంపై హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి ఠాకూర్ సుఖ్వీందర్‌సింగ్ సుక్కు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టినట్లు ఎక్స్‌లో తెలిపారు. ప్రయాణికుల ప్రాణాలు కాపాడేందుకు సకల వనరులు ఉపయోగించి సహాయక చర్యలు నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ప్రయాణికుల మరణంపై ఆవేదన వ్యక్తంచేశారు. ప్రధానమంత్రి జాతీయ విపత్తు సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడ్డవారికి రూ.50 వేల చొప్పున ఆర్థికసాయం ప్రకటించారు. సుఖ్వీందర్‌సింగ్‌తో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

తొలగించిన ఓటర్ల వివరాలివ్వండి

- బిహార్ ఎలక్టోరల్ రోల్‌పై ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం
- తుది జాబితా నుంచి 3.66 లక్షల పేర్లు తొలగించినట్లు ఈసీ వెల్లడి
- 9వ తేదీలోగా పూర్తి వివరాలివ్వాలని కోర్టు సూచన

న్యూఢిల్లీ: బిహార్ తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 3.66 లక్షల మంది పూర్తి వివరాలను తమకు అందజేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీ) సుప్రీంకోర్టు ఆదేశించింది. బిహార్‌లో ఈసీ చేపట్టిన ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ (ఎస్ఐఆర్)ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ నిర్వహించింది. ఎస్ఐఆర్ తర్వాత సెప్టెంబర్ 30న ప్రచురించిన తుది ఎలక్టోరల్ జాబితా నుంచి తొలగించిన వారి వివరాలు ఇవ్వాలని కోరింది. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది విచారణకు హాజరయ్యారు. తొలగించిన పేర్లలో చాలావరకు కొత్తగా ఓటు నమోదుచేసుకున్నవారేనని తెలిపారు. వారిలో ఎవరి నుంచీ ఫిర్యాదులు రాలేదని చెప్పారు. అయినప్పటికీ తొలగించినవారి పూర్తి వివరాలు తమకు అందజేయాలని ధర్మాసనం స్పష్టంచేసింది. ఎలక్టోరల్ ముసాయిదాతోపాటు తుదిజాబితాను లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

గందరగోళాన్ని తొలగించేందుకే..

తమ ఆదేశాలు ఎన్నికల వ్యవస్థలో మరింత పారదర్శకతను తీసుకొస్తాయని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఎన్నికల జాబితాపై గందరగోళాన్ని తొలగించేందుకే ఈ నిర్ణయమని తెలిపారు. 'ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, ప్రజలకు మరింత సమాచారం అందుబాటులో ఉండేందుకు మీరు (ఈసీ) మా నిర్ణయంతో ఏకీభవించాలి. మీరు ప్రచురించిన డ్రాఫ్ట్ జాబితా నుంచి 65 లక్షల పేర్లు తొలగించారు. చనిపోయినవారు, రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన వారి పేర్లను తొలగించటం సబబే. కానీ, మీరు ఓటరు జాబితా నుంచి ఒక పేరును తొలగించాలంటే కచ్చితంగా రూల్ 21ను పాటించాలి. ప్రజలకు కూడా ఒక విన్నపం. ఎవరి పేర్లయితే ఓటర్ జాబితా నుంచి తొలగించబడిందో.. వారు తమ వివరాలను ఎన్నికల కార్యాలయాల్లో అందజేయండి' అని సూచించారు.

పుతిన్‌కు మోదీ జన్మదిన శుభాకాంక్షలు

- రష్యా అధ్యక్షుడికి ఫోన్ చేసిన భారత ప్రధాని
- ఇరు దేశాల సంబంధాలపై ఇద్దరు నేతల చర్చ

న్యూఢిల్లీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుతిన్ 73వ జన్మదినం సందర్భంగా ఆయనకు మోదీ ఫోన్ చేసి మాట్లాడారు. పుతిన్ మరింత కాలం ఆయురారోగ్యాలతో ఉండాలని, విజయాలు సాధించాలని మోదీ ఆకాంక్షించారు. గత ఆగస్టు నుంచి మోదీ, పుతిన్ ఫోన్‌లో మాట్లాడుకోవటం ఇది నాలుగోసారి. సెప్టెంబర్ 17న మోదీ జన్మదినం సందర్భంగా పుతిన్ కూడా ఫోన్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. భారత్– రష్యా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపైనా ఇద్దరు నేతలు చర్చించినట్లు భారత ప్రభుత్వం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. భారత్–రష్యా 23వ వార్షిక సదస్సులో పాల్గొనేందుకు పుతిన్ డిసెంబర్ 5న భారత్ రానున్నారు. ఈ సందర్భంగా ఆయన రాక కోసం ఎదురుచూస్తున్నట్లు మోదీ తెలిపారు. పుతిన్ చివరిసారి 2021లో భారత్‌లో పర్యటించారు. పుతిన్ పర్యటనతోపాటు సదస్సు ఎజెండాను ఖరారు చేసేందుకు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ వచ్చే నెలలో భారత్‌కు రానున్నారు. ఈ సదస్సుకంటే ముందే ఇండియా–రష్యా ఇంటర్ గవర్నమెంటల్ కమిషన్ ఆన్ మిలిటరీ అండ్ మిలిటరీ టెక్నికల్ కోఆపరేషన్ (ఐఆర్‌జీసీ–ఎంఅండ్ఎంటీసీ) సమావేశం నిర్వహించాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి.

నేడు ఢిల్లీకి యూకే ప్రధాని స్టార్మర్

లండన్: యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ మొదటిసారిగా బుధవారం భారత్ పర్యటనకు రానున్నారు. మంగళవారం రాత్రి ఆయన తన ప్రతినిధి బృందంతో కలిసి హీత్రూ ఎయిర్‌పోర్టులో విమానమెక్కారు. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు భారత్ వస్తున్న స్టార్మర్ రెండు రోజులపాటు పర్యటిస్తారు. భారత్–యూకే సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంపై సమీక్ష జరుపుతారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక సంబంధాలు సహా ద్వైపాక్షిక భాగస్వామ్యంపై రెండు దేశాల నడుమ పూర్తిస్థాయిలో చర్చలు జరిగే అవకాశముంది. ముంబైలో జరిగే గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో ఇద్దరు నేతలు కీలక ప్రసంగాలు చేయనున్నారు. రెండు దేశాల మధ్య జూలైలో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని యూకే పార్లమెంట్ ఆమోదించాల్సి ఉంది. ఇదే జరిగితే 90 శాతం వరకు వస్తువులపై టారిఫ్‌లు రద్దవుతాయి. స్టార్మర్ వెంట వ్యాపారవేత్తలు, యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్లు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులతో కూడిన 100 మందితో కూడిన బృందం రానుంది. దాదాపు 9 ఏళ్ల అనంతరం ప్రధాని ప్రతినిధి బృందంలో భారత్‌కు వస్తున్నందుకు ఎంతో ఆసక్తితో ఉన్నామని ఇంటర్నేషనల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్(ఐసీసీ)యూకే చైర్మన్ లార్డ్ కరణ్ బిలిమోరియా పేర్కొన్నారు. కాగా, రెండు దేశాల నడుమ ప్రస్తుతం 44.1 బిలియన్ పౌండ్ల మేర వాణిజ్యం జరుగుతోంది. జూలైలో కుదిరిన వాణిజ్య ఒప్పందం ఫలితంగా 2030 కల్లా ఇది రెట్టింపవుతుందని అంచనాలున్నాయి.

'క్వాంటమ్ మెకానిక్స్' పరిశోధనలకు నోబెల్

భౌతిక శాస్త్రంలో జాన్ క్లార్క్, జాన్ ఎం మార్టినిస్, మైఖేల్ హెచ్ డెవొరెట్‌లకు ఉమ్మడిగా పురస్కారం

స్టాక్‌హోమ్: భౌతిక శాస్త్రంలో ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి 2025 సంవత్సరానికి గాను ముగ్గురు శాస్త్రవేత్తలను వరించింది. క్వాంటమ్ మెకానిక్స్ పరిశోధనలకుగాను జాన్ క్లార్క్, జాన్ ఎం మార్టినిస్, మైఖేల్ హెచ్ డెవొరెట్‌లకు ఉమ్మడిగా ఈ బహుమతిని అందజేయనున్నట్లు స్వీడన్‌లోని నోబెల్ కమిటీ మంగళవారం ప్రకటించింది. వీరిలో క్లార్క్(83)బర్కిలీలో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో, మార్టినిస్ శాంటా బార్బరాలో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో, డెవొరెట్ యేల్ యూనివర్సిటీతోపాటు యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలోనూ పరిశోధనలను నిర్వహించారు.



వీరి పరిశోధన ఏమిటి?

'మ్యాక్రోస్కోపిక్ క్వాంటమ్ మెకానికల్ టన్నెలింగ్, విద్యుత్ సర్క్యూట్‌లో శక్తి పరిమాణీకరణ' అనే అంశంపై చేసిన విప్లవాత్మక ప్రయోగాలకు ఈ పురస్కారాలు లభించాయి. ఈ పరిశోధనల ద్వారా క్వాంటమ్ ఫిజిక్స్‌ను చేతిలో పట్టుకునేంత చిన్న చిప్‌లో చూపించగలిగారు. విద్యుత్ సర్క్యూట్‌లో క్వాంటమ్ టన్నెలింగ్, శక్తి స్థాయిల పరిమాణీకరణను స్పష్టంగా నిరూపించారు. ఇది క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ సెన్సార్లు, క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ వంటి రంగాల్లో కొత్త అవకాశాలకు తెరలేపింది. ఈ ముగ్గురు శాస్త్రవేత్తల్లో జాన్ క్లార్క్, జాన్ ఎం మార్టినిస్‌లు అమెరికాకు చెందిన వారు కాగా, హెచ్ డెవొరెట్ ఫ్రాన్స్ దేశస్థుడు.

క్వాంటమ్ మెకానిక్స్ ఆవశ్యకత..

గ్రహాలు, నక్షత్రాలు తదితరాలతో కూడిన విశాల విశ్వాన్ని సాధారణ భౌతికశాస్త్రంతో వివరించవచ్చు. ప్రొటాన్లు, న్యూట్రాన్లు, ఎలక్ట్రాన్లతో కూడిన అణు ప్రపంచాన్ని అర్థం చేసుకునేందుకు క్వాంటమ్ మెకానిక్స్ అవసరం అవుతుంది. ఎనర్జీ క్వాంటిజేషన్, టన్నెలింగ్‌లు అటువంటి అణు స్థాయి కార్యకలాపాలు. శక్తి ఒక ప్రవాహం మాదిరిగా కాకుండా స్థాయిల్లో ఉంటుందని ఎనర్జీ క్వాంటిజేషన్ చెబుతుంది. దీన్ని అర్థం చేసుకునేందుకు ఒక ఉదాహరణను పరిశీలిద్దాం.. ఇంట్లోని బల్బు వెలుగును క్రమేపీ తగ్గించేందుకు డిమ్మర్‌ను ఉపయోగిస్తూంటారు కదా.. అలాగే శక్తి కూడా నెమ్మదిగా హెచ్చుతగ్గులకు గురవుతుందన్నమాట. దీన్నే ఎనర్జీ క్వాంటిజేషన్ అంటారు. అయితే, అణుస్థాయిలో ఇలా ఉండదు. శక్తి అనేది మెట్లు ఎక్కినట్లు దశలు, దశలుగా ఉంటుంది. ఈ ఏడాది నోబెల్ అవార్డు గ్రహీతలు ఈ ఎనర్జీ క్వాంటిజేషన్‌ను కూడా అరచేతిలో పట్టేంత, పూర్తిగా నియంత్రితమైన వ్యవస్థల్లోనూ చూపగలిగారు. క్వాంటమ్ స్థాయి ప్రవర్తన అన్నది అణుస్థాయికి మాత్రమే పరిమితం కాదని నిరూపించడం ఈ ఆవిష్కరణ విశేషం. ఈ ఆవిష్కరణ ఆధారంగా అత్యధిక వేగంతో పనిచేయగల క్వాంటమ్ కంప్యూటర్లకు కీలకమైన క్యూబిట్లను తయారు చేసే వీలు ఏర్పడింది. గూగుల్, ఐబీఎంలు ప్రస్తుతం ఉపయోగిస్తున్న సూపర్ కండక్టింగ్ క్యూబిట్లు ఈ ఆవిష్కరణ ఆధారంగానే తయారయ్యాయి. కంప్యూటింగ్ అంటే లెక్కలు వేసేందుకు ఈ క్యూబిట్లలో ఎనర్జీ క్వాంటిజేషన్, టన్నెలింగ్ వంటివి ఆధారమవుతాయి.

అంతేకాదు.. ఈ ఆవిష్కరణ సాయంతో అత్యంత సున్నితమైన క్వాంటమ్ సెన్సర్ల తయారీ వీలవుతుంది. ఎమ్మారై, అల్ట్రాసౌండ్ వంటి వైద్య పరీక్షలు మరింత వివరంగా స్పష్టంగా చేసే అవకాశ మేర్పడుతుంది. తద్వారా వ్యాధులను చాలా తొందరగా గుర్తించవచ్చు. నావిగేషన్, జియలాజికల్ సర్వేల్లోనూ ఈ సెన్సర్లను ఉపయోగించవచ్చు. స్పేస్ టెలిస్కోపులు, గ్రావిటేషనల్ వేవ్ డిటెక్టర్లలో క్వాంటమ్ సెన్సర్ల వాడకం ద్వారా విశ్వం గురించి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు. హ్యాకింగ్ వంటి సమస్యల్లేకుండా అత్యంత సురక్షితంగా సమాచారాన్ని పంపేందుకు అవసరమైన క్వాంటమ్ క్రిప్టోగ్రఫీని అభివృద్ధి చేయవచ్చు.

4 రాష్ట్రాల్లో రూ.24 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు

కేంద్ర మంత్రివర్గం ఆమోదం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ నాలుగు రైల్వే ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లలోని 18 జిల్లాలను కలిపే ఈ మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టుల మొత్తం వ్యయం రూ.24,634 కోట్లు. ప్రయాణికులు, వస్తు సేవల నిరంతర రవాణా కోసం చేపట్టే ఈ ప్రాజెక్టు పూర్తయితే 894 కిలోమీటర్ల పొడవైన రైల్వే లైను అదనంగా అందుబాటులోకి వస్తుందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు తెలిపారు. కేబినెట్ ఆమోదం పొందిన నాలుగు రైల్వే ప్రాజెక్టులతో వేలాది సంఖ్యలో గ్రామాలు లబ్ధి పొందుతాయని ప్రధాని మోదీ చెప్పారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావడంతోపాటు సరుకు రవాణా సులభతరమవుతుందని, ఉద్యోగావకాశాలు మెరుగవుతాయని తెలిపారు.

దేశంలో తొలి డ్యూయల్ చాంబర్ పేస్‌మేకర్ ఇంప్లాంట్

- విజయవంతంగా అమర్చిన ఢిల్లీ మ్యాక్స్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు
- సాధారణ పేస్‌మేకర్ కంటే ఎంతో ఉపయుక్తం
- కోత, కుట్లు అవసరం లేకుండానే అమర్చే వీలు

న్యూఢిల్లీ: గుండె పనితీరును క్రమబద్ధం చేసేందుకు అమర్చే పేస్‌మేకర్ సర్జరీల్లో ఢిల్లీలోని మ్యాక్స్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ సరికొత్త చరిత్ర లిఖించింది. దేశంలో తొలిసారి ఓ రోగికి 'డ్యూయల్ చాంబర్ పేస్‌మేకర్'(డీసీఎల్‌పీ)ను విజయవంతంగా అమర్చినట్లు మంగళవారం ప్రకటించింది. సాధారణ పేస్‌మేకర్లు అమర్చేందుకు రోగికి ఛాతీ భాగంలో శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. పైగా దానికి వైర్లతో బయటి యంత్రానికి అనుసంధానం చేసి గుండె స్పందనలను క్రమబద్ధం చేయాల్సి ఉంటుంది. డ్యూయల్ చాంబర్ లీడ్‌లెస్ పేస్‌మేకర్లతో ఆ అవసరం ఉండదు. ఇవి చిన్న క్యాప్సూల్ మాదిరిగా ఉంటాయి. వాటిని గుండె పై కర్ణికలో ఒకటి, కింది దమనికలో ఒకదానిని అమరుస్తారు. ఇందుకోసం పొట్టలోకి కృత్రిమంగా ఆహారాన్ని పంపే ఓ గొట్టం లాంటి పరికరాన్ని ఉపయోగిస్తారు. దీనివల్ల శస్త్రచికిత్సతో పని ఉండదు. ఈ క్యాప్సూల్స్‌కు వైర్లు ఉండవు. గుండె కొట్టుకునే వేగాన్ని బట్టి ఈ పరికరాలు రెండు వాటంతట అవే సమాచార మార్పిడి చేసుకుంటాయి. గుండె సాధారణంకంటే వేగంగా కొట్టుకోవటం ప్రారంభించగానే ఇవి పనిచేయటం మొదలుపెట్టి సాధారణ స్థితికి తీసుకొస్తాయి. అలాగే గుండె వేగం సాధారణంకంటే తగ్గితే వెంటనే కృత్రిమంగా వేగాన్ని పెంచుతాయి.

83 ఏళ్ల వ్యక్తికి...

మ్యాక్స్ హాస్పిటల్‌లో 83 ఏళ్ల ఓ రోగికి వీటిని అమర్చారు. ఆస్పత్రి కార్డియాలజీ విభాగం చైర్మన్ డాక్టర్ బల్బీర్‌సింగ్ నేతృత్వంలోని వైద్యుల బృందం ఈ అరుదైన చికిత్స నిర్వహించింది. ఆ రోగికి గుండెలో కర్ణిక, దమనికల మధ్య సమన్వయం లోపించటంతో గుండె వేగం సాధారణంకంటే తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వయసు కారణాల రీత్యా సాధారణ పేస్‌మేకర్ చికిత్స సరికాదని గుర్తించి డ్యూయల్ చాంబర్ పేస్‌మేకర్ అమర్చినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆ రోగి ఆరోగ్యంగా ఉన్నారని, ఎలాంటి సమస్య రాలేదని వెల్లడించాయి.

సీట్ల పంపకాలపై మల్లగుల్లాలు

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలతో ప్రస్తుతం అన్ని పార్టీలు సీట్ల పంపకాలపై దృష్టి సారించాయి. అధికార ఎన్డీయే, విపక్ష ఇండియా కూటమి పక్షాలు తమ భాగస్వామ్య పార్టీలతో పొత్తులను తేల్చుకునే చర్చలను ముమ్మరం చేశాయి. ఎన్డీయే కూటమిలో బీజేపీ, జేడీయూ మధ్య ఇప్పటికే సమాన సంఖ్యలో సీట్ల పంపకాలపై ఓ అవగాహన కుదిరింది. మరో మిత్రపక్షం, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ(ఎల్‌జేపీ)తో బీజేపీ పెద్దలు చర్చలు ప్రారంభించారు. ఇక కాంగ్రెస్ సైతం మిత్రపక్షాలకు సీట్ల కేటాయింపు అంశంతో పాటు, పార్టీ తొలి దశ అభ్యర్థులను ప్రకటించేందుకు సమాయత్తమైంది.

నేడు కాంగ్రెస్ సీఈసీ భేటీ..

- ఎన్డీయే కూటమిలోనూ జోరుగా చర్చలు
- బీజేపీ, జేడీయూలకు సమానంగా సీట్లు
- చిరాగ్ పాశ్వాన్‌కు 25 సీట్లు, హెచ్ఏఎంకు 7 సీట్ల ఆఫర్

70 సీట్లు కావాలంటున్న కాంగ్రెస్

అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థులను నిర్ణయించడానికి కాంగ్రెస్ సీఈసీ బుధవారం ఢిల్లీలో సమావేశం కానుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో దక్షిణ అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ వర్చువల్‌గా హాజరు కానుండగా, మిగతా సభ్యులైన సోనియా గాంధీ, అధిర్ రంజన్ చౌదరి, కేసీ వేణుగోపాల్, అమీ యాజ్నిక్, ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితరులు ప్రత్యక్షంగా ఈ భేటీలో పాల్గొననున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కనీసంగా 70–90 సీట్లు కోరుతుండగా, ఆర్‌జేడీ మాత్రం 50–55 సీట్లు సరిపోతాయని అంటోంది. సీపీఐ, సీపీఐ–ఎంఎల్ పార్టీలు కనీసంగా 20–25 స్థానాలు కోరుతుండగా, 15 వరకు ఇచ్చేందుకు కాంగ్రెస్, ఆర్‌జేడీ మొగ్గు చూపుతున్నాయి. ఇక వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ 20, రాష్ట్రీయ్ లోక్ జనశక్తి పార్టీ మరో 5 సీట్లు కోరుతున్నాయి. కూటమిలోని పక్షాలకు కేటాయించే సీట్లతోపాటు ఏకాభిప్రాయం కుదిరిన చోట్ల సొంత అభ్యర్థులను గుర్తించేలా సీఈసీ భేటీలో కీలక నిర్ణయాలు చేయనున్నారు. కాంగ్రెస్ బలంగా ఉన్న 20–25 స్థానాలకు అభ్యర్థులను బుధవారం భేటీలో ఖరారు చేయొచ్చని ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి.

చిరాగ్ సహా మిగతా పార్టీలతో బీజేపీ చర్చలు..

ఇక ఎన్డీయే కూటమిలోని బీజేపీ, జేడీయూల మధ్య సీట్ల పంపకాలపై ఇప్పటికే అవగాహన కుదిరింది. చెరో 100–102 చోట్ల పోటీ చేయాలనే నిర్ణయానికి వచ్చాయి. 243 స్థానాల్లో 204–205 సీట్లలో ఈ రెండు పార్టీలే పోటీ చేయనుండగా, మిగతా సీట్ల పంపకాలపై చర్చలు మొదలయ్యాయి. బిహార్ ఎన్నికల ఇంఛార్జి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర ఇంఛార్జి వినోద్ తావ్డేలు బుధవారం లోక్‌జనశక్తి పార్టీ నేత, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్‌తో భేటీ అయ్యారు. ఆ పార్టీకి 25 సీట్లు ఇచ్చేందుకు బీజేపీ ఆఫర్ ఇస్తున్నా, చిరాగ్ మాత్రం 40 స్థానాలు కోరుతున్నారు. తాము కోరినన్ని సీట్లు ఇవ్వకుంటే ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీతో పొత్తు ఉంటుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయనతో చర్చలు ప్రాముఖ్యం సంతరించుకున్నాయి. మిగతా పార్టీల్లోని హిందుస్తానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం)కు 7, రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ (ఆర్ఎల్ఎం)కి 6 సీట్లు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నా ఆ రెండు పార్టీలు డబుల్ డిజిట్ సీట్లు కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో సీట్ల పంపకాలపై మరో మూడు, నాలుగు రోజుల పాటు వరుసగా చర్చలు కొనసాగనున్నాయి. మిత్రపక్షాలకు సీట్లు తగ్గితే రాజ్యసభ, శాసనమండలి సీట్ల ఆఫర్లతో వాటిని భర్తీ చేయవచ్చని పార్టీ వర్గాలు సూచిస్తున్నాయి.

సాక్షి హైదరాబాద్

బుధవారం ׀ 8 ׀ అక్టోబర్ ׀ 2025



నో క్లూస్.. అందుకే క్లోజ్!

నో క్లూస్.. అందుకే క్లోజ్.. ఇదీ చాలా కేసుల పరిస్థితి. నేరం జరిగిందనే విషయం బాధితుల తోపాటు పోలీసులకూ తెలిసినా.. దాన్ని నిరూపించడానికి ఆధారాలు లభించడంలేదు. - 10లో



...అందివచ్చిన అవకాశం

ఓ కార్పొరేట్ కంపెనీ అత్యాధునిక లైబ్రరీని నగరవాసుల కోసం అందుబాటులోకి తెచ్చింది. ఏమాత్రం లాభాపేక్ష లేకుండా సిటీలో ఓ లైబ్రరీ.. మంగళవారం ప్రారంభమైంది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/21.0

వాతావరణం

నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటిపూట పొడి వాతావరణం నెలకొంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

జిల్లా ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు: ఆర్‌వీ కర్ణన్



లక్డీకాపూల్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో జిల్లా ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున జిల్లా పరిధిలో ప్రయాణం చేసే పౌరులు పరిమిత మొత్తంలో నగదు లేదా విలువైన వస్తువులు మాత్రమే తీసుకెళ్లాలని ఆయన సూచించారు. నగరంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు (ఎఫ్‌ఎస్‌టీ), స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు (ఎస్‌ఎస్‌టీ) నిరంతరం తనిఖీలు చేపడుతూ.., అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకుంటాయన్నారు. సరైన ఆధారాలు చూపకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. నగదు జప్తుకు సంబంధించి జిల్లా ఫిర్యాదుల కమిటీకి తగిన ఆధారాలు పౌరులు చూపితే ఎన్నికల నిబంధనల మేరకు పరిశీలించి జప్తు చేసిన నగదును తిరిగి అందజేస్తామన్నారు. జిల్లా ఫిర్యాదుల కమిటీ సభ్యులు, వారి మొబైల్ నంబర్లు ఇలా ఉన్నాయి.. కేపీ మంగతాయారు, అదనపు కమిషనర్ (ఎస్టేట్స్), జీహెచ్‌ఎంసీ, 91776 08271, (కమిటీ చైర్ పర్సన్), ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి, చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్, ఎన్నికల వ్యయం పర్యవేక్షణ నోడల్ ఆఫీసర్ 91212 40116, (కమిటీ కన్వీనర్), వసుంధర, డిప్యూటీ డైరెక్టర్, డీటీఏ, 98490 44893, (సభ్యురాలు). జిల్లా ఫిర్యాదుల కమిటీ కార్యాలయం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం (3వ అంతస్తు, ట్యాంక్ బండ్)లోని అదనపు కమిషనర్ (ఎస్టేట్స్) చాంబర్‌లో ఉంటుందని, ఫిర్యాదుదారులు, పౌరులు ఈ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆర్‌వీ కర్ణన్ సూచించారు.

ఎన్నికల కొత్త సంస్కరణలు అమల్లోకి..

సీఈఓ సుదర్శన్‌రెడ్డి సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో.. ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి మంగళవారం వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎం, తదితర పార్టీల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ ప్రవేశపెట్టిన ఎన్నికల కొత్త సంస్కరణల్ని తొలిసారిగా బిహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు దేశ వ్యాప్తంగా జరుగుతున్న 8 అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల్లో అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల సౌకర్యం, పారదర్శకత, ఎన్నికల నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడం లక్ష్యంగా ప్రవేశపెట్టిన సంస్కరణల్లో ముఖ్యాంశాలు.. ఇలా ఉన్నాయన్నారు. 'ఒక్కో పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,200 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా ఏర్పాట్లు. ఓటర్లు పోటీ చేసే అభ్యర్థులను సులభంగా గుర్తించేందుకు ఈవీఎంలలో కలర్‌ఫొటోలు. మహిళా ఓటర్ల పోలింగ్ పెంచేందుకు మహిళా సిబ్బందిని అదనంగా నియమించడం.వృద్ధులు, దివ్యాంగుల సదుపాయార్థం వీల్‌చైర్లు, ర్యాంపులు, పిక్-అప్/డ్రాప్ సదుపాయాలు. రియల్‌టైమ్ ఓటింగ్ టర్నౌట్ మానిటరింగ్ కోసం డిజిటల్ డ్యాష్‌బోర్డులు, మొబైల్ యాప్‌లు. సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో కృత్రిమ మేధస్సు ఆధారిత పర్యవేక్షణ, జీపీఎస్ ట్రాకింగ్.మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) ఉల్లంఘనలపై కఠిన చర్యలు.టెక్నాలజీ ఆధారిత పర్యవేక్షణ. రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించి ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు సహకరించాలి' అని ఆయన సూచించారు. సమావేశంలో అదనపు సీఈవో లోకేష్ కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, ఉప సీఈవోలు హరి సింగ్, సత్యవాణి , తదితర అధికారులు పాల్గొన్నారు.



ఖైరతాబాద్ జంక్షన్‌లో..



మెహిదీపట్నంలో వాహనదారుల ఇబ్బందులు

మధ్యాహ్నం ఉక్కపోత.. సాయంత్రం కుండపోత

మహా నగరాన్ని ఆకస్మిక వర్షాలు వెంటాడుతూనే ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం వరకు ఎండతో ఉక్కపోత ఉండగా.. సాయంత్రం వేళ వాతావరణం ఒక్కసారిగా మారిపోయి భారీ వర్షం కురిసింది. పలుచోట్ల రహదారులు జలమయమయ్యాయి. వాహనదారులు ముందుకు కదలలేక నరకయాతనకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. పలు మార్గాల్లో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ అయింది. బహదూర్‌పురా జూపార్క్ వద్ద 5.7 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. -సాక్షి, సిటీబ్యూరో



బంజారాహిల్స్‌లో..

కోట్లెత్తిన కొండ

రాయదుర్గం భూముల వేలం.. 'రియల్' సంచలనం

- బంగారం కంటే ఖరీదైన భూములు
- సామాన్యుడి సొంతింటి కల మరింత దూరం
- అపార్ట్‌మెంట్ల ధరలు పెరిగే అవకాశం



నాలెడ్జ్ సిటీలో రికార్డ్ ధర పలికిన వేలం భూములివే..

సాక్షి, సిటీబ్యూరో: ఎకరం రూ.177 కోట్లు.. దుర్గం చెరువు పక్కనే ఉన్న కొండపై ఉన్న భూమి ధర ఇదీ. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలోని భూముల వేలం దేశ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో సంచలనం సృష్టించింది. గత ప్రభుత్వం హయాంలో కోకాపేటలోని నియోపొలిస్ వేలంలో ఎకరా రూ.100.75 కోట్లు పలికిన ధరే అందర్నీ షాక్‌కు గురి చేయగా.. సోమవారం టీజీఐఐసీ నిర్వహించిన రాయదుర్గం భూముల వేలం సరికొత్త రికార్డులను సృష్టించింది. పశ్చిమ హైదరాబాద్‌లోని బహుళ అంతస్తుల భవనాలే కాదు.. అక్కడి భూముల ధరలూ ఆకాశాన్నంటుతున్నాయని రియల్టీ రంగ నిపుణులు చెబుతున్నారు.

- రాష్ట్ర రాజధానిలో భూమి బంగారం కంటే ఖరీదైపోయింది. కొండలే కోట్లకు కోట్లు ధర పలుకుతున్నాయి. తాజాగా రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పనాసంస్థ (టీజీఐఐసీ) నాలెడ్జ్ సిటీలోని సర్వే నంబరు 83/1 ప్లాట్ నంబరు-19లో 11 ఎకరాలు, ఇదే సర్వే నంబరులో ప్లాట్ నంబరు-15ఏ/2లో 7.67 ఎకరాలు మొత్తం 18.67 ఎకరాలను వేలం వేసిన సంగతి తెలిసిందే. దీని ద్వారా ప్రభుత్వానికి రూ.3,135 కోట్ల ఆదాయం సమకూరింది. స్థానిక బిల్డర్లతో పాటు జాతీయ నిర్మాణ సంస్థలు పోటీపడి మరీ ధర రికార్డు స్థాయిని దాటేలా చేశారు. ఈ పరిణామాలు మార్కెట్లో సంచలనంగా మారాయి. హైదరాబాద్ మార్కెట్ కు ఇంకా భవిష్యత్తు ఉందని, డిమాండ్ తగ్గలేదని మార్కెట్ పడిపోలేదు అనడానికి ఈ వేలమే నిదర్శనమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సొంతింటి కల దూరమేనా..?

భూముల వేలంలో వేలంవెర్రిగా ధర పలకడం స్థానిక రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం చూపుతుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఈ ధరల ప్రభావం చుట్టుపక్కల భూములు, అపార్ట్‌మెంట్లపై ఉంటుంది. దీంతో హైదరాబాద్‌కు ఉన్న అఫర్డబులిటీ దూరం అయ్యే ప్రమాదం ఉంటుంది. హైదరాబాద్ అనగానే సరసమైన ఇళ్లకు కేంద్రమని స్థిరాస్తి సంఘాలు ఎంతోకాలంగా చెబుతూ వస్తున్నాయి. వేలంలో రికార్డ్ ధరలు పలుకుతుండటంతో భూముల రేట్లు పెరుగుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతంలోని అపార్ట్‌మెంట్ల ధరలు పెరగక తప్పని పరిస్థితి. సామాన్యుడికి ఇంటి కల దూరమవుతోందని ఆందోళన వ్యక్తమవుతున్న తరుణంలో.. ఎకరం భూమి రూ.177 కోట్లు పలకడంతో సంపన్నులు కూడా కొనలేని పరిస్థితి ఏర్పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎందుకింత ధర?

రాయదుర్గం నాలెడ్జ్ సిటీ లేఅవుట్‌ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసింది. ఐటీ కారిడార్‌లో ఉండటంతో గృహ నిర్మాణం, కార్యాలయాలకు అనువుగా ఉంది. భవనం ఎత్తుపై ఆంక్షలు లేకుండా అపరిమిత ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్‌ఎస్ఐ)కు అవకాశం ఉండటంతో బిల్డర్లు ధరకు వెనకాడలేదు. వీటి దృష్ట్యా వేలంలో కొన్ని సంస్థలు పోటీపడ్డాయి. 470 ఎకరాల్లో విస్తరించి ఉన్న నాలెడ్జ్ సిటీలో వందకు పైగా ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలున్నాయి. బహుళ జాతి సంస్థల కార్యాలయాలు, ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలు, వినోద కేంద్రాలు, బహుళ అంతస్తుల భవనాలు, అంతర్జాతీయ మౌలిక సదుపాయాలతో రాయదుర్గం అభివృద్ధి చెందిన ప్రాంతం కావడంతో ఇక్కడి భూములకు డిమాండ్ అధికంగా ఉంది. ఇక్కడి నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు, మెట్రో, విమానాశ్రయాలతో నగరం నలువైపులా సులువైన కనెక్టివిటీ ఉంది. రాయదుర్గం మెట్రో స్టేషన్‌కు 5 నిమిషాలు, ఔటర్ జంక్షన్‌కు 6 నిమిషాలు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్/విప్రో జంక్షన్‌కు, హెచ్‌ఐసీసీ/హైటెక్స్‌కు 15 నిమిషాలు, ఎయిర్‌పోర్ట్‌కు 40 నిమిషాలు ప్రయాణ వ్యవధి ఉంటుంది. దీంతో ఇక్కడి భూములకు డిమాండ్ అధికంగా ఉంది.

రికార్డు ధర పలికిన వేలం ఇలా

సంవత్సరం	ప్రాంతం	ధర(ఎకరం)	కొనుగోలు చేసిన సంస్థ
2017	రాయదుర్గం	42.59 కోట్లు	గౌరా వెంచర్స్
2021	గోల్డెన్ మైల్ లేఅవుట్	60.20 కోట్లు	రాజపుష్ప
2023	నియోపొలిస్, కోకాపేట	100.75 కోట్లు	రాజపుష్ప
2025	కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి	70 కోట్లు	గోద్రెజ్ ప్రాపర్టీస్
2025	నాలెడ్జ్ సిటీ, రాయదుర్గం	177 కోట్లు	ఎంఎస్‌ఎన్
2025	నాలెడ్జ్ సిటీ, రాయదుర్గం	141.5 కోట్లు	ప్రెస్టీజ్



మహా అడుగులు

హెచ్‌ఎండీఏ పునర్వ్యవస్థీకరణకు రంగం సిద్ధం

- ట్రిపుల్ ఆర్ వరకు జోనల్ వ్యవస్థ
- సాధ్యాసాధ్యాలపై అధ్యయనానికి కన్సల్టెన్సీ
- సాంకేతిక, ఆర్థిక బిడ్‌లపై దరఖాస్తులకు ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) పునర్వ్యవస్థీకరణకు రంగం సిద్ధమైంది. హెచ్‌ఎండీఏ పరిధి ట్రిపుల్ ఆర్ వరకు పెరిగిన దృష్ట్యా అందుకనుగుణంగా కార్యకలాపాల నిర్వహణ కోసం జోనల్ వ్యవస్థను విస్తరించనున్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగర అవసరాలను దృష్టిలో ఉంచుకొని హెచ్‌ఎండీఏ సేవలను మరింత ఆధునీకరించే లక్ష్యంతో సంస్థాగతమైన పునర్‌వ్యవస్థీకరణకు చర్యలు చేపట్టారు. ఈమేరకు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి సమగ్రమైన నివేదికను అందజేసేందుకు కన్సల్టెన్సీ నియామకం కోసం ఆసక్తి గల సంస్థల నుంచి బిడ్‌లను ఆహ్వానించారు. హెచ్‌ఎండీఏ పరిధిని 7,257 చ.కి.మీ. నుంచి 10,526 చ.కి.మీ. వరకు విస్తరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 11 జిల్లాలు, 104 మండలాలు, 1,359 గ్రామాలు హెచ్‌ఎండీఏలో విలీనమయ్యాయి. ఈ మేరకు ప్రణాళికాబద్ధమైన మహానగరం నిర్మాణం, అభివృద్ధి దృష్ట్యా కార్యకలాపాలను వికేంద్రీకరించనున్నారు. ప్రస్తుతం ఘట్కేసర్, శంషాబాద్, శంకర్‌పల్లి-1, శంకర్‌పల్లి-2, మేడ్చల్-1, మేడ్చల్-2 జోన్‌ల పరిధిలో హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగం సేవలను అందజేస్తోంది. కొత్తగా పెరిగిన పరిధిని దృష్టిలో ఉంచుకొని మరో నాలుగు జోన్‌లను ఏర్పాటు చేయడంతో పాటు వాటి పరిధిలోకి వచ్చే ప్రాంతాలను కూడా పునర్‌వ్యవస్థీకరించనున్నారు. ఇందుకనుగుణంగా అధ్యయనం చేసి నివేదికను అందజేసేందుకు కన్సల్టెన్సీని ఎంపిక చేయనున్నారు.

లక్ష్యాలు ఇలా..

- అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో హెచ్‌ఎండీఏను సంస్థాగతంగా పునర్‌వ్యవస్థీకరించనున్నారు.
- జోనల్ వ్యవస్థలను విస్తరించడంతో పాటు జోనల్‌స్థాయి కమిషనర్‌లను కూడా నియమించనున్నారు. తద్వారా అన్ని రకాల నిర్మాణరంగ అనుమతులు, లే అవుట్‌లు జోనల్ స్థాయిలోనే అందజేస్తారు. దీంతో మెట్రోపాలిటన్ కమిషనర్ వ్యూహాత్మక ప్రణాళిక, విధాన రూపకల్పనపై ప్రధానంగా దృష్టి సారించేందుకు అవకాశం లభిస్తుంది.
- హెచ్‌ఎండీఏలోని వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసేందుకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలనేది ప్రతిపాదన.

మహానగర అభివృద్ధే ధ్యేయం..

పునర్‌వ్యవస్థీకరణ, జోనల్ స్థాయిలో సేవల వికేంద్రీకరణ ద్వారా హైదరాబాద్ మహా నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించేందుకు అవకాశం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఎలివేటెడ్ కారిడార్లు, రేడియల్ గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు,ప్రజారవాణా సదుపాయాల అభివృద్ధివంటి ప్రధానమైన కార్యకలాపాలపై కమిషనర్ దృష్టి కేంద్రీకరించనున్నారు. మరోవైపు సమర్థ ల్యాండ్‌పూలింగ్ పథకాన్ని అమలు చేయడంతో పాటు, ఏకీకృత బిల్డింగ్, డెవలప్‌మెంట్ కోడ్‌ను రూపొందించడం, మాస్టర్‌ప్లాన్-2050 రూపకల్పన, డిజిటల్ ట్విన్ టెక్నాలజీ వంటి లక్ష్యాల దిశగా కార్యాచరణ చేపట్టనున్నారు.

కన్సల్టెంట్‌ల ఎంపిక ఇలా..

టెక్నికల్, ఫైనాన్షియల్ బిడ్‌ల కోసం రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్‌ఎఫ్‌పీ)ని ఆహ్వానించారు. కన్సల్టెంట్ ఎంపిక క్వాలిటీ అండ్ కాస్ట్ బేస్డ్ సెలక్షన్ (క్యూసీబీఎస్) పద్ధతిలో 80:20 నిష్పత్తిలో జరుగుతుందని అధికారులు తెలిపారు. ఆర్‌ఎఫ్‌పీలో పేర్కొన్న అర్హత ప్రమాణాల ఆధారంగా ఎంపిక చేయనున్నారు. అర్హత సాధించిన బిడ్డర్ల ఫైనాన్షియల్ బిడ్‌లను మాత్రమే తెరిచి తుది ఎంపిక చేపడతారు.

'సోషల్' వార్.. పొలిటికల్ పోరు!

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారానికి పార్టీల తొందర
- నామినేషన్లు ప్రారంభం కాకున్నా, అభ్యర్థులెవరో తెలియకున్నా..
- క్షేత్రస్థాయి కంటే సోషల్ మీడియాలో ముమ్మరం
- రాజకీయ వ్యూహంలో రీల్స్, పెయిడ్ క్యాంపెయిన్‌లు
- దూసుకుపోతున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో కొంత కాలంగా సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న రాజకీయ యుద్ధం ఇప్పుడు మరింత తీవ్రం కానుంది. ఇప్పటికే కొన్ని యూట్యూబ్ ఛానెళ్లను పెయిడ్ ఛానెళ్లగా మార్చిన పార్టీలు.. ముఖ్యంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో వైరి పార్టీపై విమర్శలు, ప్రతివిమర్శల్ని మరింత ముమ్మరం చేయనున్నాయి. ఓవైపు తమ పార్టీలో జరుగుతున్న కార్యక్రమాల్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసేలా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్న రాజకీయ పార్టీలు.. ప్రత్యర్థి పార్టీ లోపాల్ని అంతకంటే వేగంగా ఎండగడుతున్నాయి. వాయువేగంతో అవి వాట్సాప్ గ్రూపుల్లోనూ షేర్ అవుతుండటంతో ఏ కామెంట్ ఎప్పుడు వైరల్‌గా మారుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. బీఆర్‌ఎస్ తమ పార్టీ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ భార్య సునీతను ప్రకటించింది. కాంగ్రెస్‌లో అభ్యర్థి ఎవరో ఇంకా తెలియదు. నామినేషన్ల దాఖలుకు కూడా ఇంకా సమయముంది. ఇంతెందుకు ఎన్నికల షెడ్యూలు వెలువడకముందే.. ఇప్పటికే కొంతకాలంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒకదానిపై మరొకటి సోషల్‌మీడియా వేదికగా తీవ్ర యుద్ధమే చేస్తున్నాయి. తమ పార్టీల పేరిట, పార్టీ సైన్యాల పేరిట ప్రత్యర్థులపై ఇవి విసురుతున్న విమర్శనాస్త్రాలు ప్రజల అరచేతిలోని మొబైల్‌కు తీరిక లేకుండా చేస్తున్నాయి.

ఎవరి సత్తా వారిదే..

అధికార పార్టీ కాంగ్రెస్ తాము చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తదితరాల అప్‌డేట్స్‌ను చేరవేయడంతో పాటు బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో చేసిన విధ్వంసాలు, నిర్వాకాలు అంటూ రూపొందించిన దృశ్యాల్ని ప్రజల్లోకి వెళ్లేలా చేస్తోంది. ఇక సోషల్ మీడియాలో ఎప్పటినుంచో బలంగా ఉన్న బీఆర్‌ఎస్ కాంగ్రెస్‌ను తూర్పారబడుతోంది. 'అప్పుడెట్లుండె పాలన.. ఎప్పుడేమైంది? అంటూ ప్రజల్లో కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకతను పెంచుతోంది. అంతేకాదు.. ప్రజాభిప్రాయాల పేరిట అటు కాంగ్రెస్, ఇటు బీఆర్‌ఎస్ రెండూ వేటికవిగా తమ అనుకూల ఛానెళ్ల ద్వారా తమ పార్టీకే ప్రజలు మద్దతు ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నాయి. సొంతంగా వాట్సాప్ ఛానెళ్లనూ నిర్వహిస్తున్నాయి. ఇన్‌ఫ్లూయెన్సర్లు, పెయిడ్ క్యాంపెయిన్లు, కంటెంట్ క్రియేషన్, రాజకీయ వ్యూహాల్లో ప్రధాన భాగమయ్యాయి.

రీల్స్‌తో రిప్లయ్‌లు..

వీడియోలతో ప్రచారం, రీల్స్‌తో రిప్లయ్‌లు, ట్రెండ్‌గా మారాయి. ఇక ఆ పార్టీల సోషల్‌మీడియా టీమ్స్, వారియర్స్ నిర్విరామంగా పని చేస్తున్నాయి. ఇదంతా రూ.కోట్ల మేర ప్రచారమని సంబంధిత రంగం గురించి తెలిసిన వారు చెబుతున్నారు. ఈనేపథ్యంలో సగటు ఓటర్లు సైతం సోషల్‌మీడియాకు ప్రభావితమవుతున్నారు. ఏ పార్టీ ప్రచారం విస్తృతంగా ఉంటే దాని వలలో పడే పరిస్థితి ఏర్పడింది. పార్టీలకు సైతం గ్రౌండ్ లెవెల్ ఫీడ్‌బ్యాక్ కంటే సోషల్ మీడియా కామెంట్ సెక్షన్, ఫీడ్‌బ్యాక్, లైక్స్, కీలకంగా మారాయి. ఈ పరిణామాలతో జూబ్లీహిల్స్ రాజకీయాలు హ్యాష్ ట్యాగ్స్‌తో జరుగుతున్నాయి. ఓటర్లు స్క్రోల్స్, థంబ్ నెయిల్స్‌తో నిర్ణయం తీసుకునే పరిస్థితి ఏర్పడింది.

హీటెక్కిన జూబ్లీహిల్స్

ఉప ఎన్నికల నేపథ్యంలో గరం.. గరం

- ప్రధాన పార్టీల మధ్య మాటల యుద్ధం
- అంతర్గత కుమ్ములాటలతో సతమతం
- తుది దశకు చేరుకున్న అభ్యర్థుల ఎంపిక



సాక్షి, సిటీబ్యూరో: ఉప ఎన్నికల నేపథ్యంలో జూబ్లీహిల్స్ హీటెక్కింది. ఈ నియోజకవర్గంలో రాజకీయ ఉత్కంఠ నెలకొంది. ప్రధాన రాజకీయ పక్షాల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరుకుంటోంది. మరోవైపు సొంత పార్టీలో కొనసాగుతున్న అంతర్గత కుమ్ములాటలు కేడర్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఒకరి బలహీనతలను మరొకరు బయటపెట్టేందుకు యత్నిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే ప్రధాన పక్షాలు రంగంలోకి దిగి ఒకరి వైఫల్యాలను మరొకరు ఎండగడుతూ ఓటర్లను ఆకర్షించేందుకు పడరాని పాట్లు పాడుతున్నాయి. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నువ్వా.. నేనా? అన్న విధంగా పోరు కోసం సిద్ధమయ్యాయి. ఇప్పటికే బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వం ఖరారు కాగా, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల ఎంపిక కోసం తీవ్ర కసరత్తు చేస్తున్నాయి.

కాంగ్రెస్ చేతిలో బీసీ కార్డు..

అధికార కాంగ్రెస్ ఉప ఎన్నికలో బీసీ కార్డు ప్రయోగించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే బీసీ అభ్యర్థినే బరిలోకి దింపుతామని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. మరోవైపు అధిష్టానానికి పంపిన షార్ట్ లిస్ట్‌లో ముగ్గురు బీసీలు, ఒకరు ఓసీ ఉన్నారు. బీసీ అభ్యర్థిత్వం ప్రాధాన్య క్రమంలో ఓసీ అభ్యర్థి బరి నుంచి తప్పించినట్లయింది. ము గ్గురు బీసీల్లో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాత్రం తాను టికెట్ రేసులో లేనంటూనే.. అధి ష్టానం నిర్ణయమే శిరోధార్యమని ప్రకటించారు.

బీఆర్‌ఎస్ ప్రచార దూకుడు..

అభ్యర్థి ఎంపికలో మిగతా పార్టీల కంటే బీఆర్‌ఎస్ ముందంజలో ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే ప్రచారానికి దిగింది. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత అభ్యర్థిత్వం ఖరారు చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ ప్రచార బాధ్యతలను తన భుజాల మీద వేసుకొని రంగంలోకి దిగారు. అధికార కాంగ్రెస్‌పై వ్యతిరేకత, మాగంటి గోపీనాథ్ సేవలు, మహిళా సానుభూతి పవనాలు గెట్టెక్కిస్తాయని బీఆర్‌ఎస్ ఆశలు పెట్టుకుంది. సిట్టింగ్ స్థానం కావడంతో చేజారకుండా ఉపఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మంగా తీసుకుంది.

బలోపేతానికి బీజేపీ కసరత్తు..

భారతీయ జనతాపార్టీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను సీరియస్‌గా తీసుకుంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోసం పార్టీని ఇప్పటి నుంచే బలోపేతం చేసేందుకు తీవ్ర కసరత్తు చేస్తోంది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోనే జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ ఉండడంతో ఆ పార్టీకి ఉప ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. గత ఎన్నికల్లో మూడో స్థానానికి పరిమితమైనప్పటికీ.. రాష్ట్రంలో పెరిగిన బలంతో ఈసారి కాంగ్రెస్సే తమకు పోటీ అని భావిస్తోంది. ఇప్పటికే కమలనాథులు రంగంలోకి దిగి సుడిగాలిలా పర్యటిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసిన లంకల దీపక్ రెడ్డితో పాటు జూటూరు కీర్తిరెడ్డి, వీరపనేని పద్మ, ఆర్.రామకృష్ణ తదితరుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అభ్యర్థిత్వం ఖరారు కోసం ఆ పార్టీ అభిప్రాయ సేకరణ చేస్తోంది.

కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌పై కేసు నమోదు

వెంగళరావునగర్: కాంగ్రెస్ పార్టీకి చెందిన జూబ్లీహిల్స్ నాయకుడు నవీన్‌యాదవ్‌పై మధురానగర్ పీఎస్‌లో కేసునమోదైంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో నవీన్‌యాదవ్ ఫేక్ ఎపిక్ (ఓటరు) కార్డులను పంపిణీ చేశారని ఓ పత్రికలో కథనం ప్రచురితమైంది. దాని ఆధారంగా జూబ్లీహిల్స్ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రజినీకాంత్‌రెడ్డి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధానాలను ఉల్లంఘిస్తూ పౌరులకు చట్ట విరుద్ధంగా ఎపిక్ కార్డుల పంపిణీ జరిగిందని, ఇదే నిజమైతే అవి నేరం కిందకు వస్తాయని, ఈ విషయంపై సమగ్రంగా దర్యాప్తు జరిపి, ఇందుకు కారణమైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏఆర్‌ఓ ఫిర్యాదుపై స్పందించిన ఇన్‌స్పెక్టర్.. కాంగ్రెస్ నాయకుడు నవీన్‌యాదవ్‌పై బీఎన్ఎస్ 170, 171, 174 తో పాటుగా ప్రజాప్రాతినిధ్యం చట్టం కింద కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లిఫ్ట్ గుంతలో పడి వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన శ్రీను

కుత్బుల్లాపూర్: హాస్టల్ భవనం లిఫ్ట్ గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పూలపల్లికి చెందిన దేవరపు శ్రీను(38) గత రెండేళ్లుగా మైసమ్మగూడలో కే.ఎస్.బాయ్స్ హాస్టల్‌ను నిర్వహిస్తున్నాడు. కాగా ఇటీవల హాస్టల్ నిర్వహణకు కొత్త బిల్డింగ్ తీసుకున్న శ్రీను ఈ నెల 6వ తేదీ సాయంత్రం కొంతమంది స్టూడెంట్స్‌కు గదులు చూపిస్తున్నాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అతను బిల్డింగ్ మొదటి అంతస్తు నుండి ప్రమాదవశాత్తు లిఫ్ట్ గుంతలో పడ్డాడు. శ్రీనును వెంటనే స్థానికంగా ఉన్న ఎస్‌వీ హాస్పిటల్‌కు తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ రాత్రి 9 గంటలకు మృతి చెందాడు. మృతుడి భార్య అంజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ చూస్తూ డ్రైవింగ్ చేస్తే...

ఇక కఠిన చర్యలు తప్పవు

సాక్షి, సిటీబ్యూరో: సెల్‌ఫోన్ డ్రైవింగ్ కారణంగా 2023లో 23 రోడ్డు ప్రమాదాలు జరగ్గా... ముగ్గురు అసువులు బాశారు. మరో 26 మంది క్షతగాత్రులయ్యారు. ఒకప్పుడు కేవలం సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపే డ్రైవర్లు మాత్రమే రోడ్లపై కనిపించే వాళ్లు. అయితే ప్రస్తుతం మారిన పరిస్థితుల నేపథ్యంలో సెల్‌ఫోన్ చూస్తూ డ్రైవింగ్ చేసే వారి సంఖ్యా పెరిగింది. ఈ విషయాన్ని గమనించిన నగర కొత్వాల్ సజ్జనర్ మంగళవారం కీలక ఆదేశాలు జారీ చేశారు. డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్‌లో వీడియోలు చూసే, ఇయర్ ఫోన్లు వినియోగించే డ్రైవర్లపై చర్యలు తీసుకోవాల్సిందిగా ట్రాఫిక్ పోలీసులకు స్పష్టం చేశారు.

తప్పనిసరిగా మారిపోయిన సెల్‌ఫోన్...

మోటారు వాహనాల చట్టం ప్రకారం వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం తీవ్రమైన ఉల్లంఘన. ఒకప్పుడు ఈ ఉల్లంఘనలను గుర్తించడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం ట్రాఫిక్ పోలీసులకు తేలిగ్గా సాధ్యమయ్యేది. అయితే ఇటీవల కాలంలో యాప్ ఆధారంగా నడిచే బైక్ ట్యాక్సీలు, క్యాబ్‌లు, గిగ్ వర్కర్లు వచ్చిన తరవాత పరిస్థితులు మారిపోయాయి. వీరి కార్యకలాపాలకు సంబంధించి బుకింగ్ దగ్గర నుంచి డెలివరీ వరకు, పికప్ దగ్గర నుంచి డ్రాపింగ్ వరకు అంతా యాప్ ఆధారంగానే సాగుతుంది. దీంతో ఈ రంగంలో ఉన్న ప్రతి డ్రైవర్ సెల్‌ఫోన్‌ను చూడటం, మాట్లాడటం అనివార్యంగా మారిపోయింది. దూరప్రాంతాల సర్వీసుల్లో వెళ్లే ఆర్టీసీ డ్రైవర్లు సైతం తమ ప్రయాణికులతో సంప్రదింపులు జరపడానికి సెల్‌ఫోన్ వినియోగించాల్సి వస్తోంది. ఇలాంటి అనేక కారణాల నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు సైతం చాలా సందర్భాల్లో సెల్‌ఫోన్ డ్రైవింగ్‌ను చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.

'ఇయర్'తో ఇంకో సమస్య వస్తోంది...

నగర వ్యాప్తంగా ఇయర్ ఫోన్ డ్రైవింగ్ సైతం సాధారణ అంశంగా మారిపోయింది. ప్రధానంగా యువతే ఈ రకంగా వాహనాలు నడుపుతున్నారు. ఇయర్ ఫోన్లు, బ్లూటూత్, బడ్స్, పోర్ట్స్ చెవిలో పెట్టుకుని ముందుకుసాగుతుంటారు. బైక్ ట్యాక్సీలు, క్యాబ్‌లు, గిగ్ వర్కర్లు కూడా ఇది తప్పనిసరిగా మారిపోయింది. సెల్‌ఫోన్ డ్రైవింగ్ కన్నా ఇలాంటి ఇయర్ ఫోన్ డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరమని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.



గతంలో చార్జ్‌షీట్లు సైతం దాఖలు చేసినా...

ఒకప్పుడు సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఇయర్ ఫోన్ డ్రైవింగ్ చేస్తూ చిక్కిన వారికి ట్రాఫిక్ పోలీసుల కేవలం జరిమానా మాత్రమే విధించే వారు. సాధారణంగా ట్రాఫిక్ పోలీసులు ఉల్లంఘనల్ని మూడు కేటగిరీలుగా విభజిస్తారు. వాహనం నడిపే వ్యక్తికి ప్రమాదకరంగా మారేవి, ఎదుటి వ్యక్తికి ప్రమాదకరంగా పరిగణించేవి, వాహనం నడిపే వారితో పాటు ఎదుటి వారికీ ముప్పు తీసుకువచ్చేవి. సెల్/ఇయర్ ఫోన్ డ్రైవింగ్‌కు ట్రాఫిక్ విభాగం అధికారులు ఈ మూడో కేటగిరీలోకి చేర్చారు. ఈ ఉల్లంఘనులకు కేవలం జరిమానా విధించడం కాకుండా కోర్టుల్లో అభియోగపత్రాలు దాఖలు చేయాలని 2018లో నిర్ణయం తీసుకున్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ కంటే ప్రమాదకరమైంది కావడంతో తొలిదశలో ఇయర్ ఫోన్ డ్రైవింగ్‌పై దృష్టి పెట్టారు. కోర్టులో చార్జ్‌షీట్లు దాఖలు చేయడానికి అనువుగా దీనికంటూ ఎంవీ యాక్ట్‌లో ప్రత్యేక సెక్షన్ లేదు. దీంతో ప్రమాదకరంగా వాహనం నడపటం (సెక్షన్ 184) కింద అభియోగపత్రాలు దాఖలు చేశారు. కాలక్రమంలో ఆ విధానం అటకెక్కడంతో మళ్లీ జరిమానాలకే పరిమితం అయ్యారు.

సిటీలో సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు ఇలా..	
ఏడాది	నమోదైన కేసులు
2014	13,008
2015	27,333
2023	58,056
2024	78,108

'బ్లూటూత్'ను ఎలా గుర్తిస్తారో?

అప్పట్లో ట్రాఫిక్ పోలీసులు 'ఇయర్ ఫోన్' డ్రైవింగ్ చేస్తున్న వారిని పట్టుకున్నారు. వీరి నుంచి వాహనాలు స్వాధీనం చేసుకున్న అధికారులు ట్రాఫిక్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో (టీటీఐ) కౌన్సిలింగ్ అనంతరం చార్జ్‌షీట్ దాఖలు చేస్తూ కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలను పరిగణలోకి తీసుకున్న కోర్టు ఆరుగురిని రెండు రోజుల చొప్పున జైలు శిక్ష కూడా విధించింది. ద్విచక్ర వాహన చోదకుడు ఇయర్‌ఫోన్/సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తుంటే గుర్తించడం తేలికే. వీరితో పాటు కార్లలో వెళ్తున్న వారు బ్లూటూత్, బడ్స్ వాడుతున్న వారిని పట్టుకోవడం ఎలా అన్నదే ప్రధాన సమస్య. మరోపక్క బైక్ ట్యాక్సీలు, క్యాబ్‌లు, ఆటోలు, గిగ్ వర్కర్లకు ఈ సెల్‌ఫోన్ అనివార్యమైన సాధనంగా మారిపోయింది. ఇలాంటి వాళ్లు ఆ ఫోన్‌ను తమ వృత్తికో సమే వాడుతున్నారా? వీడియోలు చూస్తున్నారా? అనేది గుర్తించడం కష్టసాధ్యం. ఇటీవల కాలంలో కార్లలో బ్లూటూత్ వినియోగిస్తున్న నేపథ్యంలో వారిని ఎలా పట్టుకుంటారు? ఇలాంటి వాహనాల్లో తిరుగుతూ పెద్ద ఎత్తున మ్యూజిక్ వినే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అనేది కీలకంగా మారింది.

'వర్టెక్స్' కేసులో ఏసీబీ దర్యాప్తు కోరాం

- హైకోర్టులో నడుస్తున్న కేసులో ఇంప్లీడ్ అవుతాం
- సోషల్ మీడియాలో జరుగుతున్నది దుష్ప్రచారం
- ఓ ప్రకటన విడుదల చేసిన హైడ్రా అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: తుక్కుగూడ మున్సిపాలిటీ మంఖాల్ విలేజ్‌లోని వర్టెక్స్ రియల్ ఎస్టేట్ సంస్థకు సంబంధించిన వివాదంపై హైడ్రా స్పందించింది. దీనిపై తాము ఇప్పటికే పహాడీషరీఫ్ ఠాణాలో కేసు నమోదు చేయించామని, దర్యాప్తు చేయాల్సిందిగా అవినీతి నిరోధక శాఖను (ఏసీబీ) కూడా కోరామని స్పష్టం చేసింది. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దీనికి సంబంధించి సోషల్‌మీడియాలో తమపై జరుగుతున్నది దుష్ప్రచారమని పేర్కొంది. వర్టెక్స్ సంస్థకు–చైతన్య రెడ్డికి మధ్య ఉన్న వివాదంలో తలదూర్చిన కొందరు హైడ్రా పేరు చెప్పి చైతన్య రెడ్డి నుంచి రూ.50 లక్షలు తీసుకున్నారనే ఆరోపణలపై నమోదైన కేసు విచారణను పహాడీషరీఫ్ పోలీసులు ముమ్మరం చేశారని పేర్కొంది. ఈ కేసులో రెండో నిందితుడిగా ఉన్న సుంకరి నరేష్‌తో పాటు ప్రవీణ్, చందు శ్రీనివాస్ పహాడీషరీఫ్ పోలీసుల విచారణకు సహకరించకుండా రకరకాల ఎత్తుగడలతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించింది. గతంలో వారు వాడిన ఫోన్లను పోలీసులకు అప్పగిస్తే వాస్తవాలు బయటపడతాయని, ఫోన్లు పోయాయని ఒకరు, పహాడీషరీఫ్ పోలీసులు విచారణకు రమ్మంటే రాకుండా మరొకరు కాలయాపన చేస్తున్నారని పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల్లో అవసరమైతే విచారణను చేపట్టాలని ఏసీబీ కూడా కోరామని పేర్కొంది. ఇందుకు ఏసీబీ కూడా సమ్మతి వ్యక్తం చేసిందని హైడ్రా పేర్కొంది. చదువుకు సంబంధించి ఫేక్ సర్టిఫికేట్లతో లాయర్‌గా చెలామణి అవుతున్న సుంకరి నరేష్‌ను బార్ కౌన్సిల్ సస్పెండ్ చేసిందని, దీనిపై ఆయన స్టే తెచ్చుకున్నప్పటికీ సుంకరి నరేష్ సర్టిఫికేట్లు నకిలీవని నిర్ధారణ అయినట్లు హైడ్రా పేర్కొంది. రూ.50 లక్షలు సుంకరి నరేష్‌కు ఇచ్చినట్టు చైతన్య రెడ్డి స్పష్టంగా చెప్పిన సాక్ష్యం తమ వద్ద ఉందని పేర్కొంది. వివిధ కేసులు విచారణలో భాగంగా తనకు చైతన్య రెడ్డి రెండు చెక్కులు ఇచ్చారని, అందులో ఒకటి రూ.10 లక్షలది కాగా రెండోది రూ.20 లక్షలది అంటూ సుంకరి నరేష్ చెబుతున్నారని, పహాడీషరీఫ్ పోలీసుస్టేషన్‌లో సెప్టెంబరు 4న కేసు నమోదు కాగా..ఆ చెక్కుల వ్యవహారం అదే నెల 8న బయట పెట్టారని వెల్లడించింది. తాను జూన్‌లోనే రూ.50 లక్షలు ఇచ్చినట్టు చైతన్య రెడ్డి తెలిపారని పేర్కొంది. ఆ చెక్కులపై రాసిన రాత ఎవరిదనేది తేల్చే పనిలో పోలీసులు నిమఘ్నమయ్యారని హైడ్రా పేర్కొంది. మొత్తమ్మీద ఈ వ్యవహారంలో ఏసీబీ రంగంలోకి దిగితే అసలు వాస్తవాలు బయటపడతాయని హైడ్రా భావిస్తోంది. ఏసీబీతో దర్యాప్తు చేయించే విషయమై హైకోర్టు కేసులో తాము కూడా ఇంప్లీడ్ అవుతామని హైడ్రా స్పష్టం చేసింది.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఈ-వీల్‌చైర్



శంషాబాద్: శారీరక ఇబ్బందులతో నడవలేని ప్రయాణికుల కోసం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ-(ఎలక్ట్రానిక్) వీల్‌చైర్‌ను మంగళవారం నుంచి ఎయిర్‌పోర్టు నిర్వాహకులు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రెస్టో ఎయిర్‌సర్వీసెస్ ఆధ్వర్యంలో ఈ-వీల్‌చైర్‌లు ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. డిపార్చర్ ఫోర్‌కోర్ట్ నుంచి ఎస్‌హెచ్‌ఏ వద్ద నున్న డీఎఫ్‌ఎండీ పాయింట్ వరకు వీటి సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. తనిఖీల అనంతరం అక్కడి నుంచి బోర్డింగ్ పాయింట్ వరకు ప్రయాణికులకు వీటి సేవలు అందుబాటులో ఉంటాయని ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు.

యాక్ట్..బిగ్ బాస్కెట్!



ఈ పేర్లతో ఇరువురిని మోసం చేసిన నేరగాళ్లు

- ఇద్దరు బాధితుల నుంచి రూ.3.06 లక్షలు స్వాహా
- సైబర్ క్రైమ్ ఠాణాలో వేర్వేరుగా కేసులు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్‌నెట్ సర్వీస్ ప్రొవైడర్ యాక్ట్ ఫైబర్..నిత్యావసరాల డెలివరీ సంస్థ బిగ్ బాస్కెట్ పేర్లు చెప్పి సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన ఇద్దరికి టోకరా వేశారు. మొత్తం రూ.3.06 లక్షలు కోల్పోయిన బాధితులు సోమ, మంగళవారాల్లో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వేర్వేరు కేసులు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. బహదూర్‌పురకు చెందిన యువకుడు (30) ఈ నెల ఒకటిన వైఫై సేవల కోసం గూగుల్‌లో సెర్చ్ చేశాడు. అందులో యాక్ట్ ఫైబర్ కస్టమర్ కేర్ పేరుతో కనిపించిన నెంబర్‌కు ఫోన్ చేశాడు. దీన్ని అందుకున్న వ్యక్తి మరో నెంబర్ ఇచ్చి దానికి కాల్ చేయమని చెప్పారు. యువకుడు ఫోన్ చేయడానికి ముందే ఆ నెంబర్ నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. యాక్ట్ ఫైబర్ ప్రతినిధిగా మాట్లాడిన అవతలి వ్యక్తి వైఫై రిజిస్ట్రేషన్ కోసం గూగుల్ పే ద్వారా రూ.2 చెల్లించాలని కోరాడు. ఆపై రిజిస్ట్రేషన్‌ను ఖరారు చేయడానికి 90500, 8500 కోడ్స్ టైప్ చేయాలని సూచించాడు. నిజమే అని నమ్మిన బాధితుడు అలానే చేయగా..గూగుల్ పే ద్వారా అతడి ఖాతా నుంచి రూ.90,500, రూ.8,500 సైబర్ నేరగాడి ఖాతాలోకి వెళ్లిపోయాయి. దీనిపై ఫోన్ ద్వారా బాధితుడు అవతలి వ్యక్తిని ప్రశ్నించాడు. అది పొరపాటున జరిగి ఉంటుందని, 24 గంటల్లో రీఫండ్ కావడానికి పేస్‌యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించాడు. బాధితుడు అలా చేయగానే..దాని ద్వారా సైబర్ నేరగాడు మరో రూ.10 వేలు స్వాహా చేశాడు. వెంటనే అప్రమత్తమైన బాధితుడు తన బ్యాంకు ఖాతా ఫ్రీజ్ చేయించి, సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించాడు. ఇదిలా ఉండగా... యూసుఫ్‌గూడకు చెందిన మరో వ్యక్తికి (36) గత నెల 30న ఓ వెబ్‌సైట్‌లో అతి తక్కువ ధరలకు నిత్యావసరాల సరఫరా పేరుతో ఉన్న ప్రకటన చూశాడు. దాని ద్వారా తనకు అవసరమైన కొన్ని సరుకులు ఆర్డర్ చేశాడు. ఈ నెల 2న బాధితుడికి ఓ ఫోన్‌కాల్ వచ్చింది. నిత్యావసరాల సరఫరా సంస్థ బిగ్ బాస్కెట్ కస్టమర్ కేర్ ప్రతినిధిగా అవతలి వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. ఆర్డర్ చేసిన వస్తువులు పంపడానికి నగదు చెల్లించాలని సూచించాడు. దీని కోసం ఏపీకే ఫైల్‌ను వాట్సాప్ ద్వారా పంపి క్లిక్ చేయమని కోరారు. బాధితుడు అలా చేయడంతో ఆ ఫైల్ అతడి ఫోనులో నిక్షిప్తమై, దాని యాక్సస్ మొత్తం సైబర్ నేరగాడి చేతికి వెళ్లిపోయింది. ఆపై బాధితుడు నిత్యావసరాల నిమిత్తం చెల్లించాల్సిన రూ.360 ఆన్‌లైన్‌లో పే చేశాడు. ఫోన్ యాక్సస్ మొత్తం సైబర్ నేరగాడి చేతిలో ఉండటంతో ఈ ఓటీపీలు, పిన్ నెంబర్లు అతడు సంగ్రహించగలిగాడు. ఆ వివరాలను వినియోగించుకున్న సైబర్ నేరగాడు బాధితుడి ఖాతా నుంచి రూ.1.97 లక్షలు కాజేశాడు. ఈ రెండు ఉదంతాలపై కేసులు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు బ్యాంకు ఖాతాల వివరాలతో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి దర్యాప్తు చేస్తున్నారు.

ఓయో రూంలో యువకుడి ఆత్మహత్య


నరేందర్(ఫైల్)

కుషాయిగూడ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జై జవాన్ కాలనీకి చెందిన మన్నె నరేందర్ (30) తండ్రి చనిపోవడంతో తల్లితో కలిసి ఉంటున్నాడు. ఇంకా పెళ్లి కాలేదు. ఏఎస్‌రావునగర్‌లోని సిఎంఆర్‌లో సేల్స్‌మెన్‌గా పనిచేసిన నరేందర్ ఈ మధ్యే పనికి వెళ్లడం మానేశాడు. ప్రాథమిక సమాచారం మేరకు స్టాక్ మార్కెట్‌లో డబ్బులు పెట్టి నష్టపోయినట్లు తెలిసింది. ఈ క్రమంలో పెరిగిన ఆర్థిక ఇబ్బందులతో సోమవారం ఈసీఐఎల్‌లోని ఓయో రూంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. తల్లి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు


సంతోష్

మూసాపేట: భార్యను హత్య చేసిన కేసులో న్యాయస్థానం మంగళవారం భర్తకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చింది. కేసు వివరాలు ఇలా ఉన్నాయి...కర్ణాటక రాష్ట్రం, బీదర్ జిల్లా మదర్గాన్ గ్రామానికి చెందిన కుల్చే సంతోష్ (46) భార్య సురేఖతో పాటు కూకట్‌పల్లి, మూసాపేట, కైత్లాపూర్‌లో నివాసం ఉంటూ కూలి పని చేసేవాడు. సంతోష్ నిత్యం మద్యం సేవించి భార్యను మానసికంగా, శారీకంగా వేధించేవాడు. 2022 మే 16వ తేదిన సంతోష్ భార్యను గొంతు కోసి ఆమె మెడ నుంచి బంగారం పుస్తె, గుండ్లు తీసుకుని వెళ్లాడు. ఆమె చికిత్స పొందుతూ 19వ తేదిన గాంధీ ఆసుపత్రిలో చనిపోయింది. 16వ తేదీన కేసు నమోదు చేసుకున్న కూకట్‌పల్లి పోలీసులు సంతోష్‌ను అరెస్టు చేసి కస్టడీకి తరలించారు. భార్య గొంతు కోసి చంపినందుకు దోషిగా నిర్ధారిస్తూ కూకట్‌పల్లిలోని మేడ్చల్ జిల్లా సెషన్స్ జడ్జి, ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు.

ముంబైకి తరలిస్తుండగా భారీగా గంజాయి పట్టివేత


లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో పట్టుబడ్డ 47 కిలోల గంజాయి ప్యాకెట్లు

చందానగర్: వైజాగ్ నుంచి ముంబైకి వయా లింగంపల్లి మీదుగా గంజాయి తరలిస్తున్న ముఠాను మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు మంగళవారం లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు..ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన బుల్కి, వెంకట్, దివ్యశ్రీలు కలిసి 47 కిలోల గంజాయి తీసుకొని సోమవారం రాత్రి గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ముంబైకి వెళ్లడానికి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అనుకూలంగా ఉండదని భావించి ఎంఎంటీఎస్ రైలులో మంగళవారం ఉదయం లింగంపల్లికి చేరుకున్నారు. విశ్వసనీయ సమాచారం ద్వారా తెలుసుకున్న ఎస్‌ఓటీ పోలీసులు ఉదయం 9 గంటలకు లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకొని విచారించారు. ఈ మేరకు అనుమానితులు గంజాయిని ముంబైకి తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకొని చందానగర్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్న ఐటీ అధికారులు

శంషాబాద్: ఆదాయపు పన్ను కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని ఆర్‌జీఐఏలో మంగళవారం ఐటీ, భద్రతాధికారులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ ఐటీ అధికారుల సమాచారం మేరకు గౌహతి నుంచి 6ఈ–187 విమానంలో వచ్చిన వెంకట్‌రావు అనే వ్యక్తి సీఐఎస్ఎఫ్ అధికారులు అదుపులోకి తీసుకుని ఐటీ అధికారులకు అప్పగించారు. ఇతడు గుంటూరులో జరుగుతున్న ఐటీ దాడుల కేసులో నిందితుడిగా ఉన్నట్లు వెల్లడించారు. తదుపరి విచారణ కోసం ఐటీ అధికారులు అతడిని గుంటూరుకు తరలించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

సిటీ కోర్టులు: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి ప్రయత్నించడం అమానుషమైన ఘటన అని, అందుకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు నిరసన తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టు, సిటీ సివిల్ కోర్టు, సికింద్రాబాద్ కోర్టు, మల్కాజ్‌గిరి కోర్టు, కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో న్యాయవాదులు పూర్తిగా తమ విధులను బహిష్కరించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. గవాయ్‌పై దాడికి యత్నించిన నిందితుడిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

542 కేసులు నమోదు



సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసీసీ) అమల్లోకి రావడంతో నియమావళిని ఉల్లంఘించిన వారిపై సంబంధిత అధికారులు కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ భవనాలపై 300 పొలిటికల్ పోస్టర్లు, 242 బ్యానర్లకు సంబంధించి మొత్తం 542 కేసులు నమోదుచేసినట్లు తెలిపారు. డిఫేస్‌మెంట్ రిమూవల్ చర్యల్లో భాగంగా వాటిని తొలగించినట్లు పేర్కొన్నారు. ఎంసీసీ నిక్కచ్చిగా అమలు చేసే చర్యల్లో భాగంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

గ్రీన్ చానల్ ద్వారా అవయవాల రవాణా

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గ్రీన్ చానల్ ద్వారా అవయవాలను రవాణా చేశారు. విశాఖపట్నం నుంచి ఇండిగో విమానంలో తీసుకొచ్చిన ఊపిరితిత్తులను ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేకంగా గ్రీన్ చానల్ ద్వారా నగరంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఇందుకోసం విమానాశ్రయం నుంచి నగరంలోని కిమ్స్ ఆస్పత్రి వరకు ట్రాఫిక్ క్లియరెన్స్‌ను ఏర్పాటు చేశారు.



కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో దారుణం

ఓ వ్యక్తి తన్నడంతో రైలు నుంచి కిందకు పడిపోయిన అన్నదమ్ములు

- ఒకరి దుర్మరణం.. మరొకరికి తీవ్ర గాయాలు
- బాధితులు మధ్యప్రదేశ్ వాసులు..


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సాయీశ్వర్‌గౌడ్

సికింద్రాబాద్: ఉపాధి కోసం నగరానికి వచ్చిన ఇద్దరు అన్నదమ్ములు..సొంత ఊరికి వెళ్లేందుకు రైలెక్కిన గంటలోపే వారి జీవితంలో విషాదం చోటు చేసుకుంది. వారిలో ఒకరు మృతిచెందగా...మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సికింద్రాబాద్ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సాయీశ్వర్‌గౌడ్ వెల్లడించిన వివరాల మేరకు...మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్ సమీపంలోని బైరాగఢ్‌హుజూర్‌కు చెందిన హర్ష్ చంద్‌వానీ (25), అజయ్ చంద్‌వానీ (30)లు సోదరులు. ఉపాధి కోసం కొంత కాలం క్రితం నగరానికి వచ్చిన వీరు కూలి పనులు చేసుకుంటున్నారు. సొంత ఊరు భూపాల్‌కు వెళ్లేందుకు సోమవారం అర్ధరాత్రి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీ ఎక్కి బయలుదేరారు. సీటు దొరక్కపోవడంతో ఇరువురు సోదరులు బోగీ డోర్ వద్ద మెట్లపై కాళ్లుపెట్టి ఒకరిపక్కన ఒకరు కూర్చున్నారు. అరగంట తరువాత రైలు చర్లపల్లి రైల్వేస్టేషన్ చేరుకుంటున్న సమయంలో అదే బోగీ వద్దకు చేరుకున్న ఒక వ్యక్తి అకారణంగా డోర్ వద్ద కూర్చున్న ఇద్దర్ని కాలితో తన్నడంతో బోగీనుంచి కిందకు పడిపోయారు. ఈ ప్రమాదంలో హర్ష్ చంద్వానీ అక్కడికక్కడే మృతి చెందాడు. అజయ్‌చంద్వానీ తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ ఘటనను గుర్తించిన అదే బోగీలోని ప్రయాణికులు ప్రమాదానికి కారణమైన వ్యక్తిని బంధించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న అజయ్‌చంద్‌వానీని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. హర్ష్ చంద్వానీ మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచారు. ఈ ఘటనలోని నిందితుడు తమ విచారణలో నోరు విప్పడం లేదని, అతడి వద్ద ఎటువంటి గుర్తింపు కార్డు లభించలేదని పోలీసులు తెలిపారు. నిందితుడు మతిస్థిమితంలేని వ్యక్తి అయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మార్వాడి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

హిమాయత్‌నగర్: మార్వాడి విద్యా సంస్థలలో హిందీ మాట్లాడాలని తెలంగాణ ప్రాంతం వారిని ఇబ్బంది పెట్టి వారి మానసిక క్షోభకు కారణమైన ఉత్తరాది విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని మార్వాడి గోబ్యాక్ జేఏసీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి మంగళవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి, సెక్రెటరీ శ్రీరామ్ వెంకటేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉత్తర భారత దేశ విద్యాసంస్థలపై చర్యలు తీసుకొని వాటి అనుమతులు రద్దుచేసి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ డాక్టర్ బొమ్మర స్టాలిన్, బోరెల్లి సురేష్, మాడుగుల శివ పాల్గొన్నారు.

రోడ్డుపై మండపం తొలగించరేం?



ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ కొత్త చెరువు రోడ్డులో నెల క్రితం రోడ్డు పక్కన మండపాన్ని నిర్మించారు. ఇప్పటి వరకు మండపాన్ని తొలగించకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పండగ సమయంలో మండపం ఏర్పాటుకు ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. పండగ అయిపోయినా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

వివాహ పరిచయ వేదిక

హిమాయత్‌నగర్: వీరశైవ లింగాయత్, జంగమ మహేశ్వర వధూవరుల వివాహ పరిచయ వేదికను విశ్వ లింగాయత్ మ్యారేజ్ బ్యూరో ఆధ్వర్యంలో ఆదివారం మలక్‌పేటలోని శుభకరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు మ్యారేజ్ బ్యూరో నిర్వాహకుడు పసారం శ్రీనివాస్ తెలిపారు. వివాహం కావాల్సిన వారు వీరశైవ లింగాయత్, జంగమ మహేశ్వర వధూవరులు ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్: 92463 59842.

అవగాహన శూన్యం.. పోటీకి దూరం..

'స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ్ రేటింగ్'కు స్కూల్స్ దూరం



ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ ప్రభుత్వ పాఠశాల గేటు ముందు పేరుకున్న చెత్త

సరైన విధంగా ప్రచారం నిర్వహించని విద్యాశాఖ అధికారులు

- ఒక్క పాఠశాల కూడా నమోదుపై దృష్టి సారించని వైనం
- తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు
- ఖైరతాబాద్ జోన్‌లోని సర్కార్ బడుల దుస్థితి ఇదీ..

బంజారాహిల్స్: నీటి వసతి, పచ్చదనం, పరిశుభ్రత, పారిశుద్ధ్యం, పర్యావరణహిత పరిసరాలు, మొక్కలు, చెట్లతో హరిత శోభతో విలసిల్లేలా పాఠశాలల ప్రాంగణాలు ఉండేలా కేంద్రం 'స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ్ రేటింగ్' విధానాన్ని ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభించింది. జాతీయ స్థాయిలో ఈ పథకానికి ఎంపికయ్యే ప్రభుత్వ పాఠశాలలకు రూ.లక్ష నగదు ప్రోత్సాహకాన్ని అందించనుంది. మొత్తం ఆరు ప్రధాన కొలమానాలకు సంబంధించి 60 సూచికల ఆధారంగా రేటింగ్‌లో ఒకటి నుంచి ఐదు స్టార్‌లను కేటాయించనుంది. ఇదొక బృహత్తర పథకం.. అయితే విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, రహమత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత, 43 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పరిధిలో ఈ పథకానికి సంబంధించి ఉపాధ్యాయులకు అవగాహన లేకుండా పోయింది.

విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం

ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 90 శాతం మంది టీచర్లకు తమ పాఠశాలల ప్రాంగణాలు, పరిసరాలను విద్యార్థుల భాగస్వామ్యంతో పచ్చదనం–పరిశుభ్రతతో తీర్చిదిద్దుకోవాలనే ఆలోచన ఉండటం లేదు. ఖైరతాబాద్ జోన్ విద్యాశాఖ అధికారులు కూడా ఈ విషయంలో తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తూ ఈ పథకంపై ప్రచారం కల్పించడం లేదు. కనీసం ఇదొక పథకం వచ్చిందన్న విషయాన్ని కూడా ఖైరతాబాద్ జోన్ విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలల్లో ప్రచారం చేయడం లేదు. ఫలితంగా స్కూళ్ల పారిశుద్ధ్య సమస్యతో అపరిశుభ్ర వాతావరణం, దుర్గంధంతో విద్యార్థులకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నాయి. ఖైరతాబాద్ జోన్ పరిధిలోని సర్కార్ బడులకు రేటింగ్స్ రావడం కష్టంగానే ఉంది. కనీసం స్కూల్‌కు వెళ్లే గేటు వద్దనైనా పరిశుభ్రంగా ఉంచాలనే ధ్యాస ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఉండటం లేదంటే విద్యార్థుల పట్ల అంకితభావం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

చొరవ చూపడం లేదనే విమర్శలు

దేశవ్యాప్తంగా ఉత్తమ స్కోర్ సాధించిన స్కూళ్లకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుంది. జాతీయ స్థాయిలో ఎంపికైన స్కూళ్లకు రూ.లక్ష నగదు ప్రోత్సాహకం అందజేస్తారు. అయితే ఖైరతాబాద్ జోన్ పరిధిలో మాత్రం ఇంతవరకు ఒక్క పాఠశాల కూడా నమోదుపై దృష్టి సారించలేదు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం లేదు. వీరిని ప్రోత్సహించాల్సిన అధికార యంత్రాంగం కరువైంది. టీచర్లు, హెచ్‌ఎంలు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో కనీసం త్రీ స్టార్ రేటింగ్ కోసమైనా పోటీ పడాల్సి ఉండగా, ఆ దిశగా కూడా ఎలాంటి చొరవ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

15లోగా అప్‌లోడ్ చేయాలి

'స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ్ రేటింగ్' కోసం అన్ని యాజమాన్యాల్లోని 1–10వ తరగతి వరకు అంటే ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు వర్తిస్తుంది. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంబంధిత పోర్టల్‌లో ప్రతి సూచికకు సంబంధించిన వివరాలను ఫొటోలతో సహా ఈ నెల 15 వరకు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యార్థులు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవడం, క్రమశిక్షణ, నిర్వహణ తదితర 60 అంశాలు నమోదు చేయాలి. నమోదు కాగానే సర్వే విజయవంతంగా అందజేసినట్లు మెసేజ్ వస్తుంది. రేటింగ్ ప్రకారం ఫైవ్ స్టార్ వస్తే ఎక్సలెంట్, ఫోర్ స్టార్ వస్తే వెరీగుడ్, త్రీస్టార్ వస్తే గుడ్, టూస్టార్ వస్తే నీడ్స్ ఇంప్రూవ్‌మెంట్, వన్ స్టార్ వస్తే పూర్ అని రేటింగ్ ఇస్తారు.

సినీ కార్మికుల సంక్షేమానికి కృషి



వేజెస్ అగ్రిమెంట్ కాపీని కరుణాకర్‌రెడ్డికి అందజేస్తున్న శ్రీధర్ తదితరులు

ఫిలింనగర్: తెలంగాణ సినీ కార్మికుల శ్రేయస్సు కోసం తెలంగాణ సినీ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎప్పటికప్పుడు కృషి చేస్తుందని ఫెడరేషన్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ స్టేట్ ఫిలింఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో తెలంగాణ సినీ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ 3 సంవత్సరాల వేజెస్ అగ్రిమెంట్‌ను మంగళవారం కుదుర్చుకున్నారు. ఈ అగ్రిమెంట్‌తో తెలంగాణ సినీ కార్మికులకు మరిన్ని ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. తెలంగాణలోని చిన్న నిర్మాతలకు తాము అండగా ఉంటామని ఇక్కడి కార్మికులకు ఉపాధి అవకాశాల పెంపునకు కృషి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో సినీ ఇండస్ట్రీలో 24 విభాగాల్లో 3 వేల మందికిపై కార్మికులు జీవనోపాధి పొందుతున్నారని ఆయన తెలిపారు. వేజెస్ అగ్రిమెంట్ కాపీని తెలంగాణ స్టేట్ ఫిలించాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ సెక్రటరి శ్రీధర్ ఫెడరేషన్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో మేకప్ యూనియన్ అధ్యక్షుడు రఘు, కాస్ట్యూమ్స్ యూనియన్ అధ్యక్షుడు సత్యనారాయణ, జూనియర్ ఆర్టిస్ట్స్ యూనియన్ అధ్యక్షుడు ఠాగూర్, ఫైటర్స్ యూనియన్ అధ్యక్షుడు రాము, పెయింటింగ్ ఆర్టిస్ట్స్ యూనియన్ అధ్యక్షుడు సాయి, కార్పెంటర్స్ యూనియన అధ్యక్షుడు గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో రూ.1.66 లక్షలు పట్టివేత



వాహన తనిఖీలు చేస్తున్న ఫిలింనగర్ పోలీసులు

ఫిలింనగర్: ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రావడంతో పోలీసులు వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. ఫిలింనగర్ పోలీసులు షేక్‌పేట నారాయణమ్మ కాలేజీ వద్ద మంగళవారం చేపట్టిన వాహన తనిఖీల్లో రాయదుర్గం వైపు నుంచి వస్తున్న కారును ఆపి తనిఖీ చేయగా అందులో రూ.4.66 లక్షలు పట్టుబడ్డాయి. ఇందులో రూ.3 లక్షలకు సంబంధించి ఆస్పత్రి మెడికల్ బిల్లులు చెల్లించేందుకు తీసుకు వెళ్తున్నట్లు కిరణ్‌కుమార్‌రెడ్డి అనే వ్యాపారి సంబంధిత పత్రాలు చూపించాడు. మిగతా రూ.1.66 లక్షలకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ఫిలింనగర్ పోలీసులు సీజ్ చేశారు. వాహన తనిఖీల్లో అదనపు కమిషనర్ ఇక్బాల్, వెస్ట్‌జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ సంతోషం తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యం కోసం సప్తశక్తి సంగం



సప్త శక్తి సంగం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో మహిళల్లో చైతన్యం పెంచేందుకు సప్తశక్తి సంగం పేరుతో మాతృ సమ్మేళనాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు విద్యా భారతి దక్షిణ భారత క్షేత్ర అధ్యక్షుడు డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమ కరపత్రాన్ని మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విద్యా భారతి దక్షిణ క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్, సరస్వతీ విద్యాపీఠం రాష్ట్ర కార్యదర్శి అనఘా లక్ష్మి, తెలంగాణ శిశువాటిక ప్రముఖ్ కొత్తపల్లి ఉమతో కలిసి ఆవిష్కరించారు. ఈనెల 5న మొదలు పెట్టామని నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి అయిన జనవరి 23 వరకు కొనసాగిస్తామన్నారు.

బీసీ రిజర్వేషన్లను కాపాడుకుంటాం

హిమాయత్‌నగర్: స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 42 శాతం బీసీ రిజర్వేషన్లను కాపాడుకుంటామని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అన్నారు. బీసీల 42 శాతం స్థానిక ఎన్నికల రిజర్వేషన్ల పరిరక్షణకు జీవో 9ను కాపాడుకోవడానికి సంబంధించిన పిటిషన్లలో తాను ఇంప్లీడ్ అవుతున్నట్లు తెలిపారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ నేత, న్యాయవాది జక్కుల వంశీకృష్ణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎర్ర సత్యనారాయణ మాట్లాడారు. గవర్నర్ ప్రొసీజర్, మెరిట్‌పై వచ్చిన అంశంపై సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు పూర్తి కావాలని హైకోర్టు తీర్పు ప్రకారం జీవో ఇచ్చామనే ప్రభుత్వ వాదనను పూర్తిగా సమర్థిస్తామన్నారు. ఇదే అంశంలో సెప్టెంబర్‌లో పంపిన బిల్లు తేదీని పరిగణలోకి తీసుకోవాలనే వాదన ద్వారా సాంకేతిక అంశాల సమస్యను అధిగమిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో బీసీ ఐక్య కులాల వేదిక అధ్యక్షుడు పాండు యాదవ్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నరహరి, అరుణ్ కుమార్, పాండు యాదవ్, సురేందర్ యాదవ్, పి.నర్సింహులు ముదిరాజ్, బుగ్గోజి తదితరులు పాల్గొన్నారు.

కేర్ ఆస్పత్రి సీఈవోగా డాక్టర్ పవన్ కుమార్



బంజారాహిల్స్: కేర్ ఆస్పత్రి సీఈవోగా డాక్టర్ పవన్‌కుమార్‌ను నియమించినట్లు సంస్థ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. సంస్థ వ్యూహాత్మక నిర్ణయాలతో పాటు కార్యకలాపాల విస్తరణలో ఆయన నాయకత్వం వహించనున్నట్లు వెల్లడించారు. డాక్టర్ పవన్ కుమార్ అనుభవజ్ఞుడైన వైద్యుడితో పాటు ఆస్పత్రి కార్యకలాపాలు, వ్యాపార అభివృద్ధి, వైద్య నిర్వహణలో ఆయనకు విస్తృత అనుభవం ఉందని వారు ఓ ప్రకటనలో తెలిపారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు

వెంగళరావునగర్: అకారణంగా యువకుడిపై దాడి చేసి అతడి తల్లిని దూషించిన ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం స్థానిక యాదగిరినగర్‌కు చెందిన జి.చైతన్య ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన చైతన్య బాత్‌రూమ్‌లో స్నానం చేస్తుండగా, పక్కింట్లో నివసించే ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్ వీడియో తీశాడు. ఇది గమనించిన చైతన్య బాత్‌రూమ్ నుంచి బయటకు వచ్చి నరేష్‌ను ప్రశ్నించాడు. దాంతో ఆగ్రహించిన నరేష్ అతడిని కొట్టాడు. చైతన్య తల్లి అడ్డుకోగా ఆమెను దూషించాడు. అకారణంగా తనపై దాడి చేసి తల్లిని అవమానించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య

హిమాయత్‌నగర్: జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సందర్భంగా మైనార్టీలు ఏర్పాటు చేసిన సభకు హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ ఆ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ఉద్దేశించి దున్నపోతు అన్న మాటలను వెంటనే వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మంచాల యాదగిరితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీ మంత్రి సహచర మంత్రిని గౌరవించకుండా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కేదాసి మోహన్, మంచాల యాదగిరి, చింత బాబు, మల్లెపోగు శ్రీనివాస్, జంబులెయ్య, జీడి నరసింహ, సంగపాక ఏసు తదితరులు ఉన్నారు.

మూల కణాల దానంపై అవగాహన పెంచాలి



సతీష్‌రెడ్డికి జ్ఞాపిక ఇస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

పంజగుట్ట: మూల కణాల దానంపై మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని, వైజాగ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సతీష్‌రెడ్డి అన్నారు. ఎర్రమంజిల్‌లోని ఎన్‌కేఎం గ్రాండ్ హోటల్‌లో ఆయనను డీకేఎంఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న రోగికి 2021లో తన మూల కణాలను దానం చేశానని, 2025లో రెండోసారి మరో రోగికి దానం చేశానని, ఆ ఇద్దరు రోగులు కోలుకున్నారని తెలిపారు. డీకేఎంఎస్ ఫౌండేషన్ ఇండియా బ్లడ్ కేన్సర్ నిపుణులు డాక్టర్ ఎస్‌కే.గుప్తా, ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పాట్రిక్ పాల్ మాట్లాడుతూ మూల కణాల దానంపై మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు.



23 నుంచి ఉచిత ఉపాధి కోర్సులు

హిమాయత్‌నగర్: నిరుద్యోగ మహిళల కోసం హిందీ ప్రచార సభ హైదరాబాద్, యూత్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఫ్యాషన్ డిజైన్, బ్యూటీషన్, మగ్గం వర్క్‌పై నిర్వహించిన ఉచిత డెమో సదస్సుకు స్పందన లభించిందని హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ యువతకు ప్రస్తుతం స్పోకెన్ హిందీతో పాటు 3 నెలల ఫ్యాషన్ డిజైన్, బ్యూటీషన్, మగ్గం వర్క్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ కోర్సులను ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థినులు, గృహిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాన్నారు.

రోడ్డుపై పేరుకుపోయిన మట్టి తొలగింపు



లోటస్‌పాండ్‌లో మట్టిని తొలగిస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు అంతర్గత రహదారుల్లో పెద్ద ఎత్తున మట్టి పేరుకుపోయి వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. కాలనీ వాసులు, బస్తీవాసుల ఫిర్యాదులకు స్పందిస్తున్న అధికారులు రోడ్లపై పేరుకుపోయిన మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని లోటస్‌పాండ్‌లో రోడ్డుపై పెద్ద ఎత్తున పేరుకుపోయిన మట్టిని జేసీబీ సహాయంతో మంగళవారం తొలగించి వాహనాల్లో తరలించారు.

ఓ వర్గం ఓట్ల కోసమే కాంగ్రెస్ రాజకీయాలు

ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

శ్రీనగర్‌కాలనీ: ఓ వర్గం ఓట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. ఎర్రగడ్డ డివిజన్ బ్రిగేడ్ గేటెడ్ కమ్యూనిటీ, కల్పతరు కమ్యూనిటీల మధ్య ఉన్న రోడ్డు చివర ఉన్న ఖాళీ స్థలంలో ముస్లింల కోసం కబరస్తాన్ ఏర్పాట్లపై కమ్యూనిటీవాసులు, స్థానిక బస్తీవాసులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి మద్దతు తెలుపుతూ ఎంపీ రఘునందన్‌రావు కబరస్తాన్ ఏర్పాటుకు వ్యతిరేకంగా బీజేపీ తోడుగా ఉంటుందని పేర్కొన్నారు. అక్కడి స్థలంలో హైకోర్టు తీర్పు ఉన్నా అధికారులు అత్యుత్సాహంలో ఓ వర్గం ఓట్ల కోసం సోమవారం సాయంత్రం ఎలక్షన్ కమిషన్ ఎలక్షన్ షెడ్యూల్ విడుదల చేస్తుందని తెలిసి ఉదయం జీఓ తీసుకువచ్చి ఇక్కడ 2,500 గజాల్లో కబరస్తాన్ ఏర్పాటుకు ముందడుగు వేసిందంటే కాంగ్రెస్ చేస్తున్న కుటిల రాజకీయాలను ప్రజలు గమనించాలని సూచించారు. అల్కాపురి కాలనీలో ముస్లింలకు కబరస్తాన్ స్థలం కేటాయించగా ఆర్మీ అధికారులు ఆ భూమిని రక్షణశాఖ భూమిగా వారి ఆధీనంలో తీసుకోవడంతో దిక్కుతోచని స్థితిలో ఓ వర్గం ఓట్లకోసం ఇక్కడ కబరస్తాన్ ఏర్పాట్లను కాంగ్రెస్ చేపట్టిందని ఆరోపించారు. జీవోను వెనక్కి తీసుకోవాలని, జీహెచ్‌ఎంసీ అధికారులు ఒక్క అడుగు ముందుకు వేసినా సంఘటితంగా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. స్థానిక రెవెన్యూ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా అక్కడ ఎలాంటి స్థలాన్ని కేటాయించ లేదని వారు పేర్కొన్నారని, ఈ విషయమై న్యాయపరమైన విషయాలను తెలుసుకొని అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, కీర్తిరెడ్డి జూటూరు, పద్మ వీరపనేని, ప్రేమ్‌కుమార్, కమ్యూనిటీ ప్రతినిధులు చేకూరు హనుమంతనాయుడు, విష్ణువర్ధన్, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, శ్యామ్, హనుమంతరావు, నరసింహరావు, సుధాకర్ నార్నె పాల్గొన్నారు.

జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి హేయం



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

ఖైరతాబాద్: దేశంలో దళితులకు అత్యున్నత పదవులు దక్కుతున్నప్పటికీ ఆధిపత్య కులాల నుంచి అవమానాలు మాత్రం తప్పడం లేదని, దీనికి ప్రత్యక్ష సాక్ష్యం జస్టిస్ భూషన్ రామకృష్ణ గవాయ్‌పై జరిగిన దాడిగా ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు ఆరోపించారు. మింట్ కాంపౌండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు జస్టిస్ భూషన్ రామకృష్ణ గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. దేశ న్యాయ వ్యవస్థలో అత్యున్నత స్థానంలో ఉన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై సనాతన ధర్మం ముసుగులో జరిగిన దాడిని వారు తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర విద్యుత్ సంఘాల నాయకులు కె.చంద్రయ్య, ఆనంద్ బాబు, బీచుపల్లి రవీందర్, సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

వెంగళరావునగర్: అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గుడివాడ ప్రాంతానికి చెందిన ఎం.నారాయణస్వామి(47) దాదాపు పదేళ్లుగా మధురానగర్‌కాలనీలో నివాసం ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. సోమవారం రాత్రి నారాయణస్వామి గది నుంచి దుర్వాసన వచ్చింది. దాంతో కొందరు పోలీసులకు సమాచారం అందించారు. మధురానగర్ పోలీసులు గది తలుపులు తెరిచి చూడగా నారాయణస్వామి మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టూర్ ప్యాకేజీ పేరిట రూ.4 లక్షల మోసం

బంజారాహిల్స్: మారిషస్ టూర్ ప్యాకేజీ పేరిట ఆన్‌లైన్‌లో రూ.4 లక్షలకు టోకరా వేసిన ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకుడిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. నితిన్‌రెడ్డి(28) అనే యువకుడు బంజారాహిల్స్ రోడ్డు నంబర్–13ఏలో నివాసం ఉంటాడు. మారిషస్ వెళ్లేందుకు ఆన్‌లైన్‌లో ప్యాకేజీల గురించి సెర్చ్ చేస్తుండగా ట్రావెల్ మేజిక్ అనే సంస్థకు చెందిన టూర్ ప్యాకేజీ గురించి తెలుసుకున్నాడు. దీంతో అందులో ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా యజమాని అంకిత్‌పాండేకు ఫోన్ చేశాడు. అయితే టూర్ ప్యాకేజీ రూ.4 లక్షలు అవుతుందని చెప్పగా రెండు విడతలుగా బాధితుడు నితిన్‌రెడ్డి ఆ మొత్తాన్ని చెల్లించాడు. అయితే ప్రయాణ రోజున ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకుడు అంకిత్‌పాండేకు ఫోన్ చేయగా స్పందించకపోవడంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



హిమాయత్‌నగర్: సుమారు 45 ఏళ్ల వయసుగల ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి వివరాల ప్రకారం కానిస్టేబుల్ బి.మహేష్ గురువారం ఉదయం ఏఆర్ కానిస్టేబుల్ వి.రాము నాయక్‌తో కలిసి నారాయణగూడలోని బీసీ–ఐ ఏరియా పరిధిలోని ఏరియా పెట్రోలింగ్ చేస్తుండగా బాలాజీ అనే వ్యక్తి నుంచి డయల్ 100కు కాల్ వచ్చిందన్నారు. నారాయణగూడ వైఎంసీఏ సర్కిల్ పిల్లర్ నంబర్–బి–1162 వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని సమాచారం అందింది. ఈ ప్రాంతంలో భిక్షాటన చేసేవాడని పలువురు తెలిపారు. క్లూస్ టీమ్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అతడి కుడి చేతిపై రవి అని పచ్చబొట్టు ఉందన్నారు.

పుట్టపర్తి సాయిబాబా జయంతి వేడుకలకు సీఎంకు ఆహ్వానం



బంజారాహిల్స్: భగవాన్ శ్రీసత్య సాయిబాబా శతవర్ష జయంతి వేడుకలకు హాజరు కావాలంటూ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.రత్నాకర్ ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యులు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. నవంబర్ 23వ తేదీన పుట్టపర్తిలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్లోబల్ కౌన్సిల్ సభ్యులు చలం, సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకట్రావు, ట్రస్ట్ రాష్ట్ర కార్యదర్శి శేషసాయి, జాతీయ కార్యవర్గ సభ్యులు గోపీకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో ఆర్కిటెక్ట్‌లు

ఖైరతాబాద్: ఆర్కిటెక్చర్ రంగంపై కృత్రిమ మేధ ప్రభావం అనే అంశంపై ఇక్ఫాయ్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించారు. లక్డీకాపూల్‌లోని హోటల్ అబోడ్‌లో మంగళవారం ఈ సదస్సు నిర్వహించారు. నిష్ణాతులైన ఎంతో మంది ఆర్కిటెక్ట్‌లు తమ అనుభవాలను విద్యార్థులకు వివరించారు. ఆర్కిటెక్ట్‌లు దార్వాడ నుంచి సాహిల్ తస్వీర్, అహ్మదాబాద్ నుంచి సుబీన్ జమీల్, రాంచీ నుంచి సురభీ కుమారీ, ఢిల్లీ నుంచి మానిష్ సిరిపురపు తదితరులు వారి అనుభవాలను తెలియజేశారు. ఇక్ఫాయ్ వ్యవస్థాపకులు ఎన్‌జే యశస్వి జీవిత విశేషాలపై ప్రచురించిన ఫస్ట్ ఫర్ ఎవర్ అనే పుస్తకాన్ని ఇక్ఫాయ్ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ విజయలక్ష్మి ఆవిష్కరించారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్ కృష్ణాలో ఆకృతి ఎలైట్ నిర్వహిస్తున్న లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శివోహం పేరిట కళాకారిణి శిల్పా కాసు వేసిన చిత్రాల ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

ఓట్ల చోరీపై రాష్ట్రపతి స్పందించాలి

ఏఐసీసీ ఇన్‌చార్జ్ సెక్రటరీ విశ్వనాథన్



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథన్

రాంగోపాల్‌పేట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారాన్ని నిలబెట్టుకునేందుకు చేస్తున్న ఓట్ల చోరీపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందించాలని ఏఐసీసీ ఇన్‌చార్జ్ సెక్రటరీ విశ్వనాథన్ కోరారు. ఓట్ల చోరీపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అలుపెరగని ఉద్యమం చేస్తూ దేశ ప్రజలందరినీ జాగృతం చేస్తున్నా ఎన్నికల కమిషన్ మాత్రం స్పందించడం లేదని అన్నారు. ఓట్ల చోరీతో భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బాలంరాయి చౌరస్తాలో మంగళవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ బీజేపీ ఎన్నికల కమిషన్‌తో కలిసి గద్దెనెక్కేందుకు ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ఒక్కరోజు ముందు అక్కడి మహిళల ఖాతాల్లో బీజేపీ డబ్బు జమ చేసిందని ఆరోపించారు. స్వతంత్ర సంస్థగా ఉన్న ఎన్నికల కమిషన్ ఇలాంటి అనైతిక కార్యకలాపాలను సమర్థించడం వాంఛనీయం కాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీసీలు ఐక్యమైతేనే రాజకీయ చైతన్యం

బండారు దత్తాత్రేయ



ప్రజా ఐక్య కూటమి సమావేశంలో అభివాదం చేస్తున్న దత్తాత్రేయ, నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీలు ఐక్యమైతేనే రాజకీయ చైతన్యం వస్తుందని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ప్రజా ఐక్యకూటమి ఆధ్వర్యంలో 'బీసీల రాజకీయ ఎదుగుదలను అడ్డుకుంటుందెవరు.?' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ బీసీలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రజా ఐక్య కూటమి కన్వీనర్ దాసు సురేష్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను అగ్రకులాల వారు అడ్డుకుంటే బీసీలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుంటే ప్రజల్లో తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ బీసీ వ్యతిరేకుల భరతం పట్టడానికి పార్టీలకు అతీతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బీసీ మేధావుల ఫోరం చైర్మన్ చిరంజీవులు మాట్లాడుతూ వారం రోజుల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం ఓబీసీ రిజ్వేషన్లు ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో శాసన మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే శ్రీరాములు, నాయకులు పాలూరి రామకృష్ణ, జక్కుల వంశీ, ఎరుకొండ హైమావతి, బండారు పద్మావతి, సరస్వతి, తాళ్ల భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




కేసు.. నో క్లూస్.. అందుకే క్లోజ్.. ఇదీ చాలా కేసుల పరిస్థితి. నేరం జరిగిందనే విషయం బాధితులతోపాటు పోలీసులకూ స్పష్టంగా తెలుస్తోంది. అయితే నిందితులను పట్టుకోవడానికి, వారిపై న్యాయస్థానంలో నేరం నిరూపించడానికి పక్కా ఆధారాలు మాత్రం లభించలేదు. ఈ కారణంగా కేసును మూసివేసినట్లు పోలీసుల ద్వారా బాధితుడికి సమాచారం వెళ్తుంది. అప్పుడు బాధితుడి పరిస్థితి ఎలా ఉంటుందో ఒకసారి ఆలోచించడం... సరిగ్గా ఇలాంటి ఫీలింగ్‌నే 2023లో నగరానికి చెందిన 34.98 శాతం మంది బాధితులు అనుభవించారు.

సాక్షి, సిటీబ్యూరో

తప్పుడు కేసులు ఉంటున్నాయి...

కేసుల్ని మరికొన్ని కారణాలతోనూ పోలీసులు మూసేస్తున్నట్లు ఎన్సీఆర్బీ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2023లో నగర పోలీసు విభాగానికి వచ్చిన ఫిర్యాదుల్లో 132 తప్పుడు ఫిర్యాదులని తేలింది. వ్యక్తిగత, ఆర్థిక కారణాలు, ఈర్ష్యాద్వేషాలు, అహం కారణంగా ఎదుటి వారిని ఇబ్బంది పెట్టడానికి అకారణంగా ఆరోపణలు చేస్తూ పోలీసుల వద్దకు తీసుకువస్తున్నారని స్పష్టమవుతోంది. ఈ కారణంగా గత ఏడాది 1370 కేసులు క్లోజ్ అయ్యాయి.



నో క్లూస్.. అందుకే క్లోజ్!

అనేక కేసుల్లో క్లిష్టతరమవుతున్న ఆధారాల సేకరణ

- ఫిర్యాదు చేయడంలో జాప్యమూ దానికి కారణమే..
- 2023లో మొత్తం 30,604 కేసుల నమోదు
- వీటిలో 10,706 కేసుల మూసివేత
- స్పష్టం చేస్తున్న ఎన్సీఆర్బీ–2023 గణాంకాలు

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్సీఆర్బీ) 2023కు సంబంధించిన 'క్రైమ్ ఇన్ ఇండియా'గణాంకాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. దీన్నే సాంకేతిక పరిభాషలో 'ట్రూ బట్ ఇన్ సఫీషియంట్ ఎవిడెన్స్/అన్ ట్రేస్డ్/నో క్లూ'అంటూ కేసును మూసేస్తున్నట్లు పేర్కొంటారు.



మరి కొన్ని కారణాలతోనూ...

దర్యాప్తు చేస్తున్న కేసుల్ని మరికొన్ని కారణాలతోనూ పోలీసులు మూసేస్తున్నట్లు ఎన్సీఆర్బీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రతి ఏడాది నగర పోలీసు విభాగానికి వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని తప్పుడు ఫిర్యాదులుగా తేలుతున్నాయి. వ్యక్తిగత, ఆర్థిక కారణాలు, ఈర్ష్యాద్వేషాలు, అహం కారణంగా ఎదుటి వారిని ఇబ్బంది పెట్టడానికి అకారణంగా ఆరోపణలు చేస్తూ పోలీసుల వద్దకు తీసుకువస్తున్నారని స్పష్టమవుతోంది. దర్యాప్తులో అవి తప్పుడు ఫిర్యాదులని తేలడంతో 'ఫాల్స్'అనే కారణంగా కేసులు మూతపడుతున్నాయి. 'ఆ తరహా నేరం కాని'కేసులూ మూతపడుతున్నాయి. కేసు నమోదు సందర్భంలో ఆ నేరం ఫలానా తరహాకు చెందినది భావిస్తున్నారు. చివరకు దర్యాప్తు పూర్తయ్యే సరికి దాని స్వరూప స్వభావాలు మారిపోవడంతోపాటు బాధితుల నుంచి సహకారం లేకపోవడంతో కేసు మూసేయాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.

ఆర్థిక నేరాల్లోనే అత్యధికం...

నగర పోలీసు విభాగం 2023లో దర్యాప్తు చేసిన కేసుల్లో కొన్ని పాత కేసులూ ఉంటాయి. సరాసరిన చూస్తే 2023లో ఐపీసీ, లోకల్ యాక్ట్స్, ఐటీ చట్టాల కింద మొత్తం 30,604 కేసులు నమోదు కాగా.. వీటిలో 10,706 కేసుల్ని పైన చెప్పిన 'నో క్లూ'కారణాలతో మూతపడ్డాయి. ఇలా మూతపడిన కేసుల్లో అత్యధికం ఐపీసీ చట్టాల కింద నమోదైన నేరాలకు సంబంధించినవే ఉన్నాయి. కేసులు ఇలా మూతపడటంలో బాధితుల పాత్ర సైతం ఉంటోందని పోలీసులు చెప్తున్నారు. బాధితులుగా మారిన వెంటనే పోలీసుల్ని ఆశ్రయించి కేసు నమోదు చేయిస్తుంటారని, ఆ తర్వాత కొన్నాళ్ళకు నిందితులు రాజీకి వస్తే అంగీకరిస్తారని అధికారులు పేర్కొంటున్నారు. కేసు దర్యాప్తు, విచారణ వంటివి జాప్యాలుగా భావిస్తున్న బాధితులు తక్షణం నష్టం పూడుతోందనే ఉద్దేశంతో ఇలా చేస్తుంటారని వివరిస్తున్నారు. ఫలితంగా దర్యాప్తునకు అవసరమైన సాక్ష్యాధారాలను పోలీసులకు పూర్తిస్థాయిలో అందించరు. దీంతో ఈ తరహా కేసుల్ని 'ట్రూ బట్ ఇన్ సఫీషియంట్ ఎవిడెన్స్'తదితర కారణాల కింద మూసేయాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

బిగ్ స్టోరీ

సాక్ష్యాధారాలు ఉండాల్సిందే...

ఏదైనా నేరానికి సంబంధించిన కేసును దర్యాప్తు చేసి, నిందితుల్ని అరెస్టు చేయడానికి ప్రాథమిక ఆధారాలు ఉంటే సరిపోతుంది. అయితే దర్యాప్తు పూర్తియిన తర్వాత పోలీసులు కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత సదరు కేసు విచారణను న్యాయస్థానం చేపడుతుంది. దీనికి పక్కా సాక్ష్యాధారాలు ఉండాల్సిందే. అలా లేని పక్షంలో కోర్టు నుంచి పోలీసులకు అక్షింతలు తప్పవు. అవకతవక లకు, వేధింపులకు ఆస్కారం లేకుండా, బెదిరింపులు, ప్రలోభాలకు తావు లేకుండా ఉండటంతోపాటు నిరపరాధులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రతి కేసులోనూ సరైన సాక్ష్యాధారాలు సేకరించడానికి పోలీసులు ప్రయత్నిస్తుంటారు. పక్కా ఆధారాలు లేనప్పుడు పోలీసులు న్యాయనిపుణుల సలహా మేరకు 'ట్రూ బట్ ఇన్‌సఫీషియంట్ ఎవిడెన్స్'లేదా 'అన్ ట్రేస్డ్'లేదా 'నో క్లూ'కారణంగా కేసుల్ని మూసేస్తుంటారు.

పోలీసుల నిర్లక్ష్యం అరుదు..

ఠాణాల్లో నమోదైన కేసులు 'ట్రూ బట్ ఇన్ సఫీషియంట్ ఎవిడెన్స్'కింద మూతపడటానికి అనేక కారణాలు ఉంటున్నాయి. ఈ అంశంలో పోలీసుల నిర్లక్ష్యం అనేది అత్యంత అరుదు. బాధితులు ఫిర్యాదు చేయడంలో ఆలస్యం చేయడం ఓ ప్రధాన కారణం. దీనికితోడు అనుమానితులు, నిందితులపై వివరాలు చెప్పకపోవడం, సరైన ఆధారాలు అందించకపోవడంతో కేసులు మూతపడుతున్నాయి. సైబర్ నేరాల విషయంలో కేటుగాళ్లు వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, వనరుల లేమి కారణంగా ఆధారాలు లభించట్లేదు.

– నగర పోలీసు ఉన్నతాధికారి

నగదు లావాదేవీలతో ఇబ్బంది...

ఏటా నమోదవుతున్న ఆర్థిక నేరాల్లో నగదు లావాదేవీలకు సంబంధించినవి అనేకం ఉంటున్నాయి. రూ.2 లక్షలకు మించి నగదు రూపంలో లావాదేవీలు చేయకూడదని నిబంధనలు ఉన్నాయి. అయినప్పటికీ ఇప్పటికీ రూ.లక్షలు, రూ.కోట్లలో ఈ లావాదేవీలు జరుగుతుంటాయి. పెట్టుబడులు, చిట్టీలు, భాగస్వామ్యం కోసం వెచ్చింపు, రుణాలు ఇప్పిస్తానంటూ కమీషన్లు... ఇలా అనేక చోట్ల నగదు లావాదేవీలే నడుస్తున్నాయి. ఆద్యంతం ఇవన్నీ సజావుగా జరిగిపోతే అవి రికార్డుల్లోకి ఎక్కవు. ఎప్పుడైనా తేడా వచ్చినప్పుడు బాధితులుగా మారిన వాళ్లు పోలీసుల వద్దకు వస్తున్నారు. ఆన్‌లైన్ లేదా చెక్కుల రూపంలో జరిగిన వాటికి పక్కా ఆధారాలు ఉంటాయి. నగదు రూపంలో చేసిన లావాదేవీలను నిరూపించడం చాలా అరుదు. ఈ కారణంగానూ కొన్ని కేసులు 'ట్రూ బట్...'అంటూ మూసేయాల్సి వస్తోందని పోలీసులు చెప్తున్నారు.

ఇవీ గణాంకాలు...

నేరం	మూసేసిన కేసులు
క్రిమినల్ కేసులు	4,610
ఆర్థిక నేరాలు	2,966
సైబర్ నేరాలు	2,733
లోకల్ లా కేసులు	190
మహిళలపై నేరాలు	112
వృద్ధులపై నేరాలు	80
షెడ్యూల్డ్ కులాలవారిపై నేరాలు	11
చిన్నారులపై నేరాలు	04
మొత్తం	10,706

కొమురం భీం స్ఫూర్తితోనే ఆదివాసీలకు హక్కులు

మంత్రి సీతక్క

కవాడిగూడ: జల్, జమీన్, జంగల్ అనే నినాదంతో అడవులపై ఆదివాసీలకు హక్కులు కల్పించాలని ఆదివాసీ యోధుడు కొమురంభీం పోరాటం చేశారని, ఆయన పోరాట స్ఫూర్తితోనే భారత రాజ్యాంగంలో గిరిజనులకు ప్రత్యేక హక్కులు, రక్షణ చట్టాలు కల్పించారని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. కొమురం భీం వర్ధంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవో తీసుకురావడం ఆదివాసీలకు గర్వకారణమని అన్నారు. మంగళవారం కొమురం భీం 85వ వర్ధంతిని ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆయన విగ్రహం వద్ద గిరిజన ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు వివేక్ వినాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీతక్క మాట్లాడుతూ ఆదివాసీల అభివృద్ధితోనే కొమురం భీం ఆశయాలు నెరవేరుతాయని, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఆ దిశగా కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ పర్వేశ్వర్‌రెడ్డి, కొమురం భీం సినీ నిర్మాత శ్రీధర్, ప్రధాన కార్యదర్శి సోయం ప్రభాకర్, కార్యదర్శి ఆత్రం సాయి, కోశాధికారి సోయం గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



కొమురం భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, ఐక్యవేదిక నాయకులు

గుస్సాడి ఉత్సవాలకు రూ.50 వేలు ఇవ్వాలి: కవిత

కొమురం భీం వర్ధంతిని పురస్కరించుకొని ట్యాంక్ బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీల గుస్సాడి ఉత్సవాలకు ప్రతి ఏటా ప్రభుత్వం రూ. 50 వేలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.రూప్‌సింగ్, ప్రధాన కార్యదర్శి నవీన్‌చారితోపాటు జాగృతి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక రైలులో పుణ్యక్షేత్రాల టూర్ ప్యాకేజీలు

పంజగుట్ట: భారతీయ రైల్వేస్ వారి భారత్ గౌరవ ట్రైన్ ప్రత్యేక రైలులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల యాత్రలకు శ్రీకారం చుట్టిందని సౌత్ స్టార్ రైల్ డైరెక్టర్ విఘ్నేష్ తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో టూర్ టైమ్ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ టి.కార్తిక్ కుమార్, గుజరాత్ టూరిస్ట్ ఆఫీసర్ అజిత్ కుమార్‌తో కలిసి టూర్ ప్యాకేజీల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక పర్యాటక రైలులో తమిళనాడు, కేరళలో ఉన్న దేవాలయాల యాత్ర నవంబర్ 16వ తేదీన ప్రారంభమవుతుందన్నారు. ఈ యాత్రలో తిరుకడైయూర్, చిదంబరం, అరుణాచలం, తిరుచ్చి, తంజావూరు, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, తిరువనంతపురం, చొట్ట నిక్కర, గురువాయూర్‌లలో 11 రోజులపాటు యాత్ర సాగుతుందన్నారు. ఒక్కొక్కరికీ సెకండ్ స్లీపర్ రూ.19,950, థర్డ్ ఏసీ రూ.29,750, సెకండ్ ఏసీ రూ.37,750, ఫస్ట్ ఏసీ రూ.42,950 చార్జీలు ఉంటాయని చెప్పారు.

నవంబర్ 26న పంచ ద్వారక యాత్ర

పంచ ద్వారక, మహాదేవ్ జ్యోతిర్లింగాల యాత్ర నవంబర్ 26న ప్రారంభమవుతుందని, ఇందులో పంచ ద్వారక, నిష్కళంక మహాదేవ్, జ్యోతిర్లింగాల దర్శనం ఉంటుందని, ద్వారక, డోకోర్ ద్వారక, నాథ్ ద్వారక, కంక్రోలి ద్వారక, బేట్ ద్వారక, సోమనాథ్, నాగేశ్వర్, నిష్కళంక మహాదేవాలయాలతోపాటు యాదగిరి, స్టాట్యూ ఆఫ్ ఈక్విటీ, స్టాట్యూ ఆఫ్ యూనిటీ ఉంటాయని విఘ్నేష్ తెలిపారు. పది రోజులపాటు సాగే ఈ యాత్రకు థర్డ్ ఏసీ రూ.41,150, సెకండ్ ఏసీ రూ.53,250, ఫస్ట్ ఏసీ రూ. 63,000 చార్జీలు ఉంటాయని తెలిపారు. అపరిమిత దక్షిణభారత భోజనం అందిస్తామని, ప్రతీ మూడు గంటలకు ట్రైన్ శుభ్రం చేస్తారని, ప్రతీ కోచ్‌లో తెలుగు వచ్చినే టూర్ ఎస్కార్ట్ ఉంటారని, ట్రైన్ దిగిన తరువాత ప్రతీ బస్సులో కూడా టూర్ ఎస్కార్ట్ ఉంటారని తెలిపారు. ప్రతీ టూర్‌లో 650 మందికి అవకాశం ఉంటుందని, ఈ ప్యాకేజీలు రైల్వే స్టేషన్‌లలో అందుబాటులో ఉండవని 9355021516 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. టూరిజం ప్లాజా మొదటి అంతస్థులో టూర్ టైమ్స్ కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ

లక్డీకాపూల్: జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఎన్నికల సమయంలో ప్రచార మాధ్యమాల్లో ప్రచురితమయ్యే వార్తలు, ప్రకటనలు, చెల్లింపు వార్తలను పర్యవేక్షించనున్నది. కర్ణన్ చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీకి జీహెచ్‌ఎంసీ పీఆర్‌వో మామిండ్ల దశరథం మెంబర్ సెక్రటరీ బాధ్యతలను నిర్వర్తించనున్నారు. సికింద్రాబాద్ ఆర్డీఓ, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.సాయిరామ్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఇంజనీర్ (ఐటీ వింగ్ -సోషల్ మీడియా) నర్సింగ్‌రావు, హైదరాబాద్ పీఐబీ డిప్యూటీ డైరెక్టర్ మనసా కృష్ణకాంత్ , జర్నలిస్టు బచన్ జీత్ సింగ్ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

పెంచిన బస్‌చార్జీలను వెంటనే తగ్గించాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: పెంచిన బస్‌చార్జీలు వెంటనే తగ్గించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డి.సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్ డిమాండ్ చేశారు. ప్రయాణికులపై చార్జీల భారాన్ని ప్రత్యక్షంగా తెలుసుకొనేందుకు వారు మంగళవారం ఉదయం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ నుంచి అసెంబ్లీ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో ముచ్చటించారు. పెంచిన చార్జీల వల్ల సగటు ప్రయాణికుడిపై నెలకు రూ.500 అదనపు భారం పడుతుందని విస్మయం వ్యక్తం చేశారు. సామాన్యులపై చార్జీల భారాన్ని మోపుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల వ్యతిరేక వైఖరిని చాటుకుందని ఆరోపించారు. ఇప్పటికే వాహనాలపైన జీవితకాల పన్ను పెంచారని, మద్యం ధరలు పెరిగాయని, తాజాగా చార్జీలు సైతం పెంచారని పేర్కొన్నారు. చార్జీల పెంపుతో ఆర్టీసీ మరింత దివాళా తీయనుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పేదల పక్షాన పోరాడుతూనే ఉంటుందని, పెంచిన చార్జీలను తగ్గించే వరకు ఆందోళన కొనసాగిస్తామని పేర్కొన్నారు.



భారత్ గర్వపడేలా ఆవిష్కరణలు ఉండాలి

హెచ్‌సీయూ 25వ స్నాతకోత్సవంలో భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు కృష్ణ ఎల్లా



హెచ్‌సీయూ స్నాతకోత్సవంలో పాల్గొన్న డాక్టర్ కృష్ణ ఎల్లా, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చాన్స్‌లర్, వీసీ తదితరులు



స్నాతకోత్సవంలో బంగారు పతకం అందుకుంటున్న గోపి తేజస్వి

రాయదుర్గం: భారతదేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి అవసరమైన ఆవిష్కరణలు, నైపుణ్యం, ఊహలపై విద్యార్థులు దృష్టి కేంద్రీకరించాలని భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా విద్యార్థులకు సూచించారు. గచ్చిబౌలి శాంతి సరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 25వ స్నాతకోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణ ఎల్లా మాట్లాడుతూ విదేశాల్లో గుర్తింపు పొందిన సంప్రదాయ భారతీయ ఉత్పత్తుల గురించి వివరించారు. భారతదేశం ఒకప్పుడు ఆవిష్కరణలో ప్రపంచ నేతగా ఉందని గుర్తు చేశారు. ఆ తర్వాత ప్రజలు రిస్క్ తీసుకోవడం మానేసినప్పుడు ఆ స్ఫూర్తిని కోల్పోయిందని అన్నారు. విద్యార్థులు చొరవ తీసుకొని సామాజిక సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలని ఆయన సూచించారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో భారత్ బయోటెక్ సందేహాన్ని ఎలా అధిగమించిందో గుర్తు చేసుకున్నారు. హెచ్‌సీయూతో తనకు 40 ఏళ్ల అనుబంధం ఉందని ఆయన గుర్తు చేసుకున్నారు.

స్నాతకోత్సవం దార్శనికతకు ప్రతీక: గవర్నర్

స్నాతకోత్సవం దార్శనికతకు ప్రతీకగా నిలిచిందని హెచ్‌సీయూ చీఫ్ రెక్టార్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభివర్ణించారు. మనసులను పెంపొందించుకోవడం మానవ ఉనికి అంతిమ లక్ష్యం కావాలన్నారు. సాంకేతికతను కరుణతో కలపాలని ఆయన విద్యార్థులకు సూచించారు. భారతదేశం అంతటా విద్యార్థులను హెచ్‌సీయూ ఆకర్షిస్తూనే ఉందని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు అన్నారు. వారిలో చాలా మంది మొదటి తరం అభ్యాసకులు ఉన్నారని చెప్పారు. హెచ్‌సీయూ ప్రస్తుతం 161.9 కోట్ల విలువైన పరిశోధన ప్రాజెక్టులను నిర్వహిస్తోందన్నారు. ప్రసిద్ధ అంతర్జాతీయ జర్నల్స్‌లో 700 కంటే ఎక్కువ పత్రాలను ప్రచురించడమే కాకుండా 50 పేటెంట్లు సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ చాన్స్‌లర్ జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్, పలువురు డీన్లు, ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, విద్యార్థులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

1,717 మంది విద్యార్థులకు డిగ్రీల ప్రదానం

హెచ్‌సీయూ స్నాతకోత్సవంలో మొత్తం 1,717 మంది విద్యార్థులకు వివిధ రకాల డిగ్రీలను ప్రదానం చేశారు. ప్రతిభ చాటిన 182 మంది విద్యార్థులకు వివిధ రకాల బంగారు పతకాలను అందజేశారు. 242 మంది విద్యార్థులు పీహెచ్‌డీ డిగ్రీలను, పతకాలను అందుకున్నారు. ఎంఏ పొలిటికల్‌సైన్స్ నుంచి దృష్టి లోపం ఉన్న విద్యార్థిని గోపి తేజస్వి బంగారు పతకం అందుకోవడం విశేషం.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్। బుధవారం।
8। అక్టోబర్। 2025



పఠనాసక్తి ఉన్న వారి కోసం గ్రంథాలయాల్లో పుస్తకాలు ఉంటాయని తెలుసు. అలాంటి వారికి సిటీలో గ్రంథాలయాలు ఎక్కడా అని భూతద్దం పెట్టి వెతకాల్సిన పనిలేదు. వాటిని వేళ్లమీదే లెక్కబెట్టొచ్చు. వాస్తవానికి నగరంలో గ్రంథాలయాలు అరకొరా ఉన్నా.. ఆ లైబ్రరీలో ఉండే వసతులు నామమాత్రమే అని తెలుసు. అలాంటి పరిస్థితుల్లో ఓ కార్పొరేట్ కంపెనీ అత్యాధునిక లైబ్రరీని నగరవాసుల కోసం అందుబాటులోకి తెచ్చింది. ఏమాత్రం లాభాపేక్ష, వ్యాపార కోణం లేకుండా పూర్తి అధునాతన వసతులతో సిటీలో ఓ లైబ్రరీ.. మంగళవారం ప్రారంభమైంది.

- సాక్షి, సిటీబ్యూరో

అధ్యయనానికి.. అందివచ్చిన అవకాశం..

నగర గ్రంథాలయ చరిత్రలో కొత్త అధ్యాయం

టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ రంగంలో దేశంలోని టాప్ 10లో ఒకటిగానే కాకుండా 7వ స్థానంలో నిలిచిన సంస్థ కోఫోర్జ్. ఈ కార్పొరేట్ సంస్థ తన సామాజిక బాధ్యతలో భాగంగా దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ లైబ్రరీని నగరంలోని కొత్తగూడ జంక్షన్‌లో ప్రణవ్ బిజినెస్ పార్క్, 8వ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసింది. గత సంవత్సరం ఫిబ్రవరి 2024లో నోయిడాలో మొదటి కోఫోర్జ్ పబ్లిక్ లైబ్రరీ తర్వాత రెండోది గురుగ్రామ్‌లో ప్రారంభించామని, ఇవి వేలాది సందర్శకుల రాకపోకలతో సందడిగా మారాయని, ఈ నేపథ్యంలో నగరంలో 3వ అతిపెద్ద లైబ్రరీని ఏర్పాటు చేశామని సంస్థ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు.

విశాలమైన..విశేషాల్లో మిన్న..

ఈ లైబ్రరీ పఠనాభిలాషులు ఎవరైనా సరే రావచ్చు. లోనికి ప్రవేశించిన తర్వాత ఒకసారి డిజిటల్ విధానంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకుంటే ఆ తర్వాత కేవలం సైన్ ఇన్ అయ్యి ఎన్ని సార్లయినా రాకపోకలు సాగించవచ్చు. దాదాపు 15,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 15,000 కంటే ఎక్కువ పుస్తకాలను అందించనున్న ఈ కోఫోర్జ్ పబ్లిక్ లైబ్రరీ వారాంతాలు, సెలవులలో సహా ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ సందర్శకులను స్వాగతిస్తుంది. ఏకకాలంలో 160 మంది కూర్చుని చదువుకునేందుకు వీలుగా విభిన్న రకాల సీటింగ్, లైటింగ్ ఏర్పాట్లు చేశారు. లైబ్రరీ ఆద్యంతం ఆహ్లాదకరమైన ఇంటీరియర్‌తో రిలాక్సింగ్‌గా అనిపిస్తుంది.



- అందుబాటులో డిజిటల్ బుక్స్, సేవలు
- తొలి కార్పొరేట్ లైబ్రరీకి 'కోఫోర్జ్' శ్రీకారం
- అధునాతన వసతులతో పాఠకులకు ఉచిత సేవ
- 15వేలకు పైగా పుస్తకాలు.. ప్రత్యేకంగా కిడ్స్ జోన్..



ఒక అధునాతన కేఫ్‌కు ఏ మాత్రం తీసిపోని రీతిలో సీటింగ్, లైటింగ్ ఏర్పాట్లు ఉన్నప్పటికీ.. ఈ లైబ్రరీలో కాలక్షేపానికి చాటింగ్స్, ల్యాప్ టాప్‌పై ఆఫీస్ వర్క్స్ వంటివి అనుమతించరు. కేవలం పఠనాభిలాషుల కోసం మాత్రమే ఏర్పాటైన ఈ లైబ్రరీలో బుక్ రీడింగ్ సెషన్స్, బుక్ లాంచ్ సహా ఏ రకమైన గేదరింగ్స్‌కు అవకాశం లేదని నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు. పుస్తకాలను చదువుకోవడం మాత్రమే ప్రధానం అయినప్పటికీ.. అక్కడ నుంచి ఇంటికి తీసుకెళ్లాలంటే రిఫండబుల్ డిపాజిట్ కట్టి తీసుకెళ్లవచ్చు.

నో చాటింగ్, వర్కింగ్.. ఓన్లీ రీడింగ్..

కిడ్స్ స్పెషల్ జోన్..

ఈ లైబ్రరీలోనే ఒక కార్నర్‌లో కిడ్స్ జోన్ ఏర్పాటు చేశారు.. అందులో చిన్నారులకు ఉపయుక్తమైన పుస్తకాలు ఉంచారు. అదే విధంగా ఫిక్షన్, నాన్-ఫిక్షన్, పిల్లల సాహిత్యం నుంచి స్వచ్ఛంద సేవ, వ్యాపారం, ఆధ్యాత్మికత, కళ, కృత్రిమ మేధస్సు, సాంకేతికత, ఫొటోగ్రఫీ, కవిత్వం.. సహా అన్ని విభాగాల్లో ప్రసిద్ధ పుస్తకాల సేకరణ ఉంది. ఈ సేకరణలో పెంగ్విన్, హార్పర్‌కాలిన్స్, అమర్ చిత్ర కథ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, ప్రెస్ సాహిత్య అకాడమీ వంటి 350కి పైగా ప్రముఖ ప్రచురణకర్తలకు చెందిన 13,000 పైబడిన రచనలు చోటు చేసుకోనున్నాయి. లైబ్రరీ కేటలాగింగ్ నిర్వహణ పూర్తిగా డిజిటలైజ్ చేశారు.



పఠనమే విజయం..

దేశవ్యాప్తంగా పఠనాసక్తి కలిగిన వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ లైబ్రరీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టాం. చదువు.. చదివించు.. విజ్ఞానం పంచు.. అనే ఆలోచనతో పాఠకులను ఏ మాత్రం ఇబ్బంది పెట్టని పూర్తి స్థాయి అత్యాధునిక సౌకర్యాలతో వీటిని నెలకొల్పుతున్నాం. దేశంలో ఇది మూడోది. త్వరలోనే ఢిల్లీలో మరొకటి ఏర్పాటు చేయనున్నాం. హైదరాబాద్ వంటి అభివృద్ధి చెందుతున్న నగరంలో ఈ తరహా లైబ్రరీల ఏర్పాటు నగరవాసుల పఠనాభిలాషను తీర్చేందుకు ఉపకరిస్తాయని ఆశిస్తున్నాం. నగరంలోని నవతరానికి నిలయంగా రానున్న తరాలకు పుస్తకాలయంగా ఇది మారాలని ఆకాంక్షిస్తున్నాం.

– అనురాధా సెహగల్, చీఫ్ బ్రాండ్ సస్టెయినబుల్ ఆఫీసర్, కోఫోర్జ్





మారియట్‌లో స్వీట్ ట్రీట్..

సాక్షి, సిటీబ్యూరో: స్టార్ హోటల్‌గా ప్రసిద్ధి చెందిన మారియట్ గ్రూప్ దీపావళి పండుగను పురస్కరించుకుని బహుమతుల రంగంలోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా మారియట్ బోన్ వోయ్ పేరుతో రుచికరమైన మిఠాయిలను, వంటకాలను పొందుపరిచి గిఫ్ట్ బాక్సులను రూపొందించినట్లు హోటల్ ప్రతినిధులు తెలిపారు. మారియట్ చెఫ్స్ ప్రత్యేకంగా రూపొందించిన వెరైటీ మిఠాయిలు, వంటకాలు మేళవించి దీపావళి ట్రెజర్స్, వెరైటీ బాక్స్ ఆఫ్ నట్స్.. తదితర పేర్లతో ఈ గిఫ్ట్ బాక్సులు ఆన్‌లైన్‌తోపాటు తమ హోటల్స్‌లోనూ అందుబాటులో ఉంటాయని వివరించారు.



సినిమాలో ప్రొడక్షన్ విభాగంలో క్యాషియర్‌గా మొదలైన ప్రస్థానం.. చివరకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ స్థాయికి చేరుకుంది.. హ్యాపీడేస్ సినిమాతో మొదలై.. క్రమంగా శేఖర్ కమ్ములతో ప్రయాణం సాగించారు. అలా ఆవకాయ బిర్యానీ సినిమాకు పని చేశారు. ఈ క్రమంలో తన హార్డ్ వర్క్ నచ్చి శేఖర్ కమ్ముల మెచ్చుకున్నారు. తర్వాత లీడర్ సినిమాకు టీంలో చేరమని కబురు పంపారు. ఇదే ఆయన జీవితంలో కీలక మైలు రాయని, తెరవెనుక తాను పడిన కష్టమే తనను అనేక మెట్లు ఎక్కించిందని చెబుతున్నారు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఇర్ల నాగేశ్వర్‌రావు.

- బంజారాహిల్స్



క్యాషియర్ టు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్

- హ్యాపీ డేస్ నుంచి కుబేర వరకూ శేఖర్ కమ్ములతో ప్రయాణం
- ఆయన నుంచి చాలా నేర్చుకున్నా: ఇర్ల నాగేశ్వర్‌రావు

పుట్టి పెరిగింది గుంటూరు జిల్లా మాచవరంలోనే. పిడుగురాళ్లలో ఇంటర్మీడియట్, నర్సరావుపేటలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం ఓ కన్సల్టింగ్ కంపెనీ ద్వారా హైదరాబాద్ చేరారు. దగ్గుబాటి రానా నటించిన లీడర్ సినిమాకు శేఖర్ కమ్ముల టీంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా జాయిన్ అయ్యారు. అలా క్లాప్ కొట్టడం, తర్వాత ఆర్టిస్టులను కో–ఆర్డినేషన్ చేయడం. అగ్ర నటులు గొల్లపూడి మారుతి రావు, నటి సుహాసిని, నటుడు హర్షవర్ధన్, హీరోయిన్ ప్రియా, కోట శ్రీనివాసరావు వంటి వారికి దగ్గరయ్యారు.

వివిధ విభాగాల్లో..

తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో షూటింగ్ నిమిత్తం లొకేషన్స్ కోసం క్రమంగా ఫిదా సినిమాకు ప్రొడక్షన్ ఇన్‌ఛార్జిగా పనిచేశారు. తర్వాత లవ్ స్టోరీ సినిమాకూ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేశారు. ఈ క్రమంలో పని నచ్చడంతో శేఖర్ కమ్ముల అమిగోస్ ప్రొడక్షన్స్‌కు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అయ్యారు. కుబేర విజయంలోనూ లొకేషన్స్ పరంగా కీలక పాత్ర పోషించారు. 'నేను జీవితంలో మంచి చెడు పంచుకునే మొదటి వ్యక్తి శేఖర్ గారు. ఆయనతో నా 20 ఏళ్ల ప్రయాణంలో ఎంతో నేర్చుకున్నా' అని చెబుతున్నారు నాగేశ్వర్‌రావు. ప్రస్తుతం అమిగోస్ ప్రొడక్షన్ పూర్తి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

బియాండ్ టైప్-1 ప్రచారం..

దయాబెటిస్‌పై అవగాహన కోసం కృషి

సాక్షి, సిటీబ్యూరో: టైప్–1 మధుమేహంతో బాధపడుతున్న వ్యక్తులకు మరింత అవగాహన కల్పించడంతో పాటు వారికి అవసరమైన మద్దతు అందించేందుకు అంతర్జాతీయ సేవా సంస్థ బియాండ్ టైప్–1 తమ కార్యకలాపాలను దేశవ్యాప్తంగా విస్తరించనుంది. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. రోగుల్లో అవగాహన పెంచడం, సహాయక వ్యవస్థలను నిర్మించడం, ప్రాణాలను రక్షించే వనరులను అందించడం, వంటి సేవల ద్వారా డయాబెటిస్‌తో జీవించే తీరును మార్చడానికి తాము కృషి చేస్తున్నామన్నారు. టైప్–1 డయాబెటిస్ కలిగిన పిల్లలు, టీనేజర్ల సంఖ్య నగరాల్లో అత్యధికంగా ఉన్నా అవగాహన చాలా తక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో డయాబెటిస్ గురించి కాలం చెల్లిన అపోహలను పోగొట్టి, రోగ నిర్ధారణకు మించి జీవించడం అంటే ఏమిటో చూపించడానికే ఈ సంస్థను నెలకొల్పామని బియాండ్ టైప్–1 సీఈఓ డెబోరా డుగన్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.






రైల్వే కబడ్డీ పోటీలు ప్రారంభం

47వ ఆల్ ఇండియా మహిళల చాంపియన్‌షిప్

సాక్షి, హైదరాబాద్: రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్ ఆధ్వర్యంలో.. దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్, 47వ ఆల్ ఇండియా రైల్వే కబడ్డీ మహిళల చాంపియన్‌షిప్ ఘనంగా ప్రారంభమైంది. ఈనెల పదో తేదీ వరకూ ఈ పోటీలు కొనసాగనున్నాయి. పోటీలను దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాశ్ ప్రారంభించారు. దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్, దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ఫైనాన్షియల్ అడ్వైజర్ కోటేశ్వరరావు, ఇతర సీనియర్ రైల్వే అధికారులు పాల్గొన్నారు. ఈ సంవత్సరం, సౌత్ ఈస్టన్ రైల్వే, ఈస్టన్ రైల్వే, వెస్టన్ రైల్వే, సెంట్రల్ రైల్వే, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, నార్త్ ఈస్టన్ రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే, దక్షిణ మధ్య రైల్వేలకు సంబంధించిన తొమ్మిది జట్లు పోటీలో పాల్గొనున్నాయి. దక్షిణ మధ్య రైల్వే – ఈశాన్య రైల్వే మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో దక్షిణ మధ్య రైల్వే 48 పాయింట్లు సాధించి విజేతగా నిలిచింది.



మ్యూజిక్ వీక్..

ఈ వారం

నగరంలో ప్రముఖ సినీ గాయకుల స్వరాల జల్లు కురువనుంది. అక్టోబర్ 11న నగర వేదికగా బాలీవుడ్, టాలీవుడ్ సింగర్ల లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌లు జరుగనున్నాయి. వైబ్ ఉంది బేబీ.., వైబుందిలే.. అంటూ మిరాయ్ సినిమా పాటతో ఈ సారి యువతను ఉర్రూతలూగించిన పాన్ ఇండియా సింగర్ అర్మాన్ మాలిక్.. ఈ నెల 11న నగరంలోని బౌల్డర్ హిల్స్ వేదికగా నిర్వహించనున్న అతిపెద్ద లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌లో తన పాటలతో మ్యూజిక్ లవర్స్‌ను అలరించనున్నారు. కార్డెక్స్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కాన్సర్ట్‌కు తెలుగు, హిందీ, తమిళ్, ఇంగ్లిష్ మ్యూజిక్ లవర్స్ భారీస్థాయిలో హాజరుకానున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో

- నగరంలో ఈ వారమంతా లైవ్ కాన్సర్ట్స్ సందడి
- టాలీవుడ్, బాలీవుడ్ సింగర్ల లైవ్ షోస్
- ఇప్పటికే అర్మాన్ మాలిక్, మంగ్లీల లైవ్ షెడ్యూల్

హైదరాబాద్ ఎప్పుడు వచ్చినా ఓ వైబ్ ఉంటుంది.., ఇక్కడి అభిమానుల ఆదరణ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని ఇటీవల అర్మాన్ మాలిక్ తెలిపారు. నగరంలో ఎప్పుడు లైవ్ కాన్సర్ట్ పెట్టినా అది సూపర్ హిట్ అవుతోంది. ఇక్కడ లైవ్ కాన్సర్ట్ నిర్వహించిన తర్వాత వచ్చే సినిమాలో నా సాంగ్స్ హిట్ అవుతున్నాయని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎన్ని హిట్ సాంగ్స్ పాడినప్పటికీ తన ఆల్‌టైం ఫేవరెట్ తెలుగు సాంగ్ మాత్రం బుట్ట బొమ్మా.. బుట్ట బొమ్మా అని పేర్కొన్నారు.

మంగ్లీ మ్యూజిక్..

అదే రోజు అక్టోబర్ 11న మరో సింగర్ టాలీవుడ్ సింగింగ్ స్టార్ మంగ్లీ కూడా 'మంగ్లీ లైవ్ ఎట్ ఆకాన్' పేరుతో లైవ్ కాన్సర్ట్‌లో స్వర వేడుకలో అలరించనున్నారు. నగరంలోని ఆకాన్ వేదికగా నిర్వహించే ఈ కాన్సర్ట్‌లో రీజినల్, ఫోక్ సాంగ్స్‌తో మంగ్లీ సందడి చేయనున్నారు. అంతేకాకుండా ఈ నెల 9న నగరంలోని క్వేక్ అరీనా వేదికగా నిర్వహించనున్న మరో లైవ్ కాన్సర్ట్‌లో మంగ్లీ కాన్‌టెంపరరీ, రీజినల్, ఫోక్ సాంగ్స్‌తో అలరించనున్నారు. వీరితో పాటు పలువురు ఇతర సింగర్లు ఈ వారమంతా నగరాన్ని మ్యూజిక్‌తో సందడి చేయనున్నారు.



బాబు ష్యూరిటీ పోయింది..
మోసం గ్యారెంటీగా
మారింది

- ఈ సర్కారుపై ప్రజలకు భ్రమలు పూర్తిగా తొలగిపోయాయి: మాజీ సీఎం వైఎస్ జగన్
- ఏది చూసినా దోపిడీయే.. వ్యవస్థలన్నీ నిర్వీర్యం.. విద్య, వైద్యం, వ్యవసాయం అస్తవ్యస్థం
- ఉద్యోగులకు బాబు దగా

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం

కూటమి సర్కారు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపు

ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన 7 కొత్త ప్రభుత్వ కాలేజీలు

వివిధ దశల్లో మిగిలిన 10 మెడికల్ కాలేజీలు

ఏటా రూ.1,000 కోట్లు ఖర్చు పెడితే చాలు అవి సిద్ధం

అయినా ఆ దిశలో ఆలోచించని చంద్రబాబు ప్రభుత్వం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

క్లుప్తంగా...

సీజేఐపై దాడిని ఖండించిన కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై జరిగిన దాడిని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఆ దాడి ప్రజాస్వామ్య మూలాలపై దాడి అంటూ మంగళవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇటువంటి దాడులు ప్రజాస్వామ్య మూలానికే ముప్పు కలిగిస్తుందన్నారు. సుప్రీంకోర్టు అంటే వ్యక్తి కాదు, వ్యవస్థ అని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఇకనైనా నాయకులు తమ తీరు మార్చుకోవాలని హితవు పలికారు.

రూ.10 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ఢిల్లీలో ఇద్దరిని అరెస్ట్ చేసిన ఏపీ పోలీసులు

సాక్షి, అమరావతి: న్యూఢిల్లీలో భారీగా ఎర్రచందనం దుంగలను ఏపీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.10 కోట్ల విలువ చేసే 10 టన్నుల ఏ గ్రేడ్ ఎర్ర చందనం దుంగలను పట్టుకున్నారు. పక్కా సమాచారంతో ఏపీ ఇంటెలిజెన్స్ పోలీసులు ఢిల్లీలోని తుగ్లకాబాద్‌లోని గోదాముపై రెడ్ సాండల్ టాస్క్‌ఫోర్స్, ఢిల్లీ పోలీసులతో కలిసి సోదాలు చేపట్టారు. హైదరాబాద్, ముంబైకి చెందిన ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేయగా మరో నిందితుడు పరారయ్యాడు. అరెస్టయిన ఎండీ ఇర్ఫాన్, అమిత్ పవార్ సంపత్‌ల నుంచి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. హరియాణకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ పరారయ్యాడని, ఎర్రచందనం దుంగలను తిరుపతి నుండి ఢిల్లీకి అక్రమంగా తరలించినట్లు గుర్తించారు.

ఏపీలో నకిలీ మద్యానికి నలుగురు బలి!

నరసరావుపేట టౌన్/తనకల్లు/సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఏపీలో నకిలీ మద్యం మరో నలుగురి ఉసురు తీసింది. మృతుల్లో నరసరావుపేటలోని బరంపేట చాకిరాలమిట్ట ప్రాంతానికి చెందిన పాలెపు కోటేశ్వరరావు (50), శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం ఎర్రబల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు (58), శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలిగిరి మండలం వెలగపాడు గ్రామ సచివాలయం సమీపంలోని బెల్టు షాపులో మద్యం తాగిన గుర్తు తెలియని వ్యక్తి ఒకరు, అలాగే నెల్లూరు రూరల్ పరిధిలోని ఓ మద్యం దుకాణం సమీపంలో చనిపోయిన మరో గుర్తుతెలియని వ్యక్తి ఉన్నారు. నకిలీ మద్యమే వీరి మరణాలకు కారణమని భావిస్తున్నారు. ఇటు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

కుంగిన కాళేశ్వరం అక్విడెక్ట్



నర్సాపూర్(జి): నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో.. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 27 లో భాగంగా దేవుని చెరువు వద్ద నిర్మించిన అక్విడెక్ట్ పిల్లర్ కుంగి బీటలు వారింది. నర్సాపూర్ మండలంలో సోమవారం రాత్రి 72.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఈదురుగాలులతో వర్షం కురవడంతో ఆరబోసిన మొక్కజొన్నలు తడిసిపోయాయి.

మద్యం ఆదాయం బాబు మాఫియాకే

▶ మొదటి పేజీ తరువాయి

భారీగా దోపిడీ చేస్తూ మరోవైపు అమాయకుల ప్రాణాలను బలి తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్సైజ్ అధికారులు ర్యాండమ్‌గా జరిపిన దాడుల్లో నకిలీ మద్యం తయారీ డంపులు భారీగా బహిర్గతమయ్యాయన్నారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితి, కూటమి సర్కారు ప్రజా కంటక పాలనపై చేపట్టాల్సిన కార్యాచరణపై నేతలకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ.. యథేచ్ఛగా, అంతు లేకుండా సాగుతున్న కల్తీ మద్యం విషయాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని పార్టీ నేతలకు వైఎస్ జగన్ నిర్దేశించారు. కల్తీ మద్యానికి వ్యతిరేకంగా పార్టీ పరంగా పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరించి గవర్నర్‌కు అందజేస్తామన్నారు. సమావేశంలో వైఎస్ జగన్ ఏమన్నారంటే.

మద్యం మాఫియా నెట్‌వర్క్

ఇవాళ మద్యం సరఫరా, విక్రయాలన్నీ ఒక మాఫియా వ్యవహారంలా సాగుతోంది. మొత్తం వ్యవస్థను తమ కంట్రోల్లోకి తీసుకున్న తరువాత ఎమ్మార్పీకి మించి మద్యం అమ్ముతున్నారు. వైన్ షాపుల పక్కనే పర్మిట్ రూమ్‌ల్లో పెగ్గుల రూపంలో ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేటుకు లిక్కర్ అమ్మకాలు సాగిస్తున్నారు. వేలంపాటలో గ్రామాల్లో బెల్టుషాపులు పొందిన నిర్వాహకులు ఒక్కో బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు ఎక్కువ రేటుకు మద్యం అమ్ముతున్నారు. ఏ స్థాయిలో అవినీతి జరుగుతోందో కళ్ల ముందే కనిపిస్తోంది. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం మాఫియా జేబుల్లోకి వెళ్తోంది. మరోవైపు డిస్టిలరీల నుంచి మద్యం సేకరణలో అక్రమాలు చేస్తున్నారు. ప్రముఖ బ్రాండెడ్ డిస్టిలరీల నుంచి కాకుండా బాగా డబ్బులిచ్చే (కమీషన్లు) డిస్టిలరీల నుంచి మద్యం సేకరిస్తున్నారు. వీళ్లకు కావాల్సిన డిస్టిలరీలకు ఇండెంట్లు ప్లేస్ చేసి వాళ్లకు సంబంధించిన సరుకు మాత్రమే అందుబాటులోకి తెస్తున్నారు. ఇవన్నీ వీళ్ల సొంత ఆదాయం పెంచుకునే ఎత్తుగడలు.

నకిలీ మద్యంతో బరి తెగింపు..

బాధ కలిగించే విషయం ఏమిటంటే.. వీళ్ల డబ్బు ఆశ ఏ స్థాయికి వెళ్లిపోయిందంటే.. ప్రజలు ఏం తాగినా ఫర్వాలేదు... చనిపోయినా ఫర్వాలేదు. తమ జేబుల్లోకి డబ్బులు ఇంకా ఎక్కువగా రావాలనే తలంపుతో దారుణంగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు పరిపాలనలో రాక్షసయుగం నడుస్తోంది. భయభ్రాంతులకు గురి చేస్తూ పోలీసుల ద్వారా పరిపాలన సాగిస్తున్నారు. నకిలీ మద్యం ఏరులై పారుతోంది. ఆ మాఫియాను కంట్రోల్ చేసే కొందరు కేబినెట్ మంత్రులు, ప్రముఖ రాజకీయ పదవుల్లో ఉన్నవారు, పెద్దబాబు, చినబాబు ఆధ్వర్యంలో నకిలీ మద్యం తయారీ విచ్చలవిడిగా సాగుతోంది. ఏకంగా ఫ్యాక్టరీలు నెలకొల్పి క్వాలిటీ లేని లిక్కర్ తయారు చేసి వారి డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ షాపుల్లోకి, బెల్ట్ దుకాణాల్లోకి నేరుగా పంపిస్తున్నారు.

ప్రతి నాలుగు బాటిళ్లలో ఒకటి నకిలీ..

మరో విషయం ఏమిటంటే.. ఇవాళ ప్రతి నాలుగు బాటిళ్లలో ఒకటి నకిలీ మద్యం బాటిల్. అది తాగి మనుషులు చనిపోతున్నారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జీ జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జనార్ధన్‌రావు, సురేంద్రనాయుడు ఈ నకిలీ మద్యం దందా నడుపుతున్నారు. వీళ్లపై పర్యవేక్షణ బాధ్యతలు మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి అప్పగించారు. ములకలచెరువులో ఏకంగా పరిశ్రమను స్థాపించి పెద్ద సంఖ్యలో నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. దానికి సంబంధించిన ట్యాంక్, క్యాన్లు, బాటిళ్లు, మూతలు, బ్రాండెడ్ కంపెనీల పేరుతో నకిలీ లేబుళ్లు అన్నీ అక్కడ ఉన్నాయి. చివరకు దసరాకు అక్కడ యంత్ర పూజ కూడా చేశారు. అంటే అంత పకడ్బందీగా నకిలీ మద్యం తయారు చేస్తున్నారు.

ఒక్కో ఏరియా పంచుకున్నారు..

అధికార పార్టీ అండతో రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం యూనిట్లు నెలకొల్పి ఒక్కొక్కరు ఒక్కో ఏరియా పంచుకున్నారు. ములకలచెరువులో నకిలీ మద్యం తయారు చేస్తున్న జనార్ధన్‌రావు, సురేంద్రనాయుడు.. నారా లోకేష్, చంద్రబాబుతో కలసి ఫొటోలు కూడా దిగారు. ఇక్కడ తయారైన నకిలీ సరుకు రాయలసీమలో మద్యం షాపులు, బెల్ట్‌షాప్‌లకు పంపిణీ చేసే బాధ్యతను మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సూపర్‌వైజ్ చేస్తున్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాలో ఈ సామ్రాజ్యాన్ని విస్తరింపజేసేందుకు ఇబ్రహీంపట్నంలో ఏకంగా రెండు చోట్ల భారీగా నకిలీ మద్యం ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారు. రాయలసీమ నుంచి రవాణా చేస్తే ఖర్చు ఎక్కువ అవుతుందని ఇబ్రహీంపట్నంలోనే యూనిట్ ఏర్పాటు చేశారు. అక్కడ వాళ్లే బాటిళ్లు, లేబుల్స్, మూతలు తయారు చేసుకుంటూ బ్రాండ్లు కూడా ప్రమోట్ చేస్తున్నారు. ఎక్కడ చూసినా కార్టన్ బాక్సుల్లో స్పిరిట్ నింపిన డ్రమ్స్, ఖాళీ సీసాలు, బాటిళ్లను చూసి ఎక్సైజ్ అధికారులే విస్తుపోయారట. నర్సీపట్నంకు చెందిన నేత ఉత్తరాంధ్ర బాధ్యతలు చూసుకుంటారు. ఈయన స్పీకర్ అయ్యన్నపాత్రుడికి సన్నిహితుడు. ఏలూరుకు చెందిన వివాదాస్పద ఎమ్మెల్యే బాగా దౌర్జన్యం చేస్తాడని ఆయనకు ఉమ్మడి గోదావరి జిల్లా బాధ్యతలు అప్పగించారు. పాలకొల్లులో మరో పరిశ్రమ.. అక్కడ కూడా మిషన్, క్యాన్లు, బాటిళ్లు, లేబుల్స్ అన్నీ ఏర్పాటు చేశారు. అమలాపురంలో కూడా మిషన్లు, కల్తీ మద్యం, బాటిల్స్, లేబుల్స్, మూతలు, స్పిరిట్ అన్నీ అమర్చుకున్నారు. నెల్లూరులో డిస్ట్రిబ్యూషన్ ఛానల్, అనకాపల్లి జిల్లా పరవాడలో పరిశ్రమ ఏర్పాటు చేశారు.

నకిలీ మద్యానికి అమాయకులు బలి..

ఇబ్రహీంపట్నం మండలం చిలుకూరులోని ఓ మద్యం షాప్‌లో లిక్కర్ తాగిన కొద్దిసేపటికే షేక్ చిన్న మస్తాన్ మరణించాడు. జూపూడి వైన్ షాప్‌లో మద్యం తాగి ఇంటికి వెళ్తూ కిలేశ్వరం గ్రామానికి చెందిన నాగరాజు చనిపోయాడు. అనంతపురం జిల్లా గుంతకల్లులోని వైన్ షాపులో మద్యం సేవిస్తూ బెల్దారీ పెద్దన్న అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. నకిలీ మద్యానికి అమాయకులు బలి అవుతున్నారు (ఆ ఫోటోలను పీపీటీలో చూపారు).

దాడుల్లో వేలాదిగా నకిలీ బాటిళ్లు స్వాధీనం..

రాష్ట్ర ముఖ్యమంత్రి డబ్బుల కోసం ఏ స్థాయిలోకి దిగజారి పోతున్నారంటే... సొంత ఆదాయాలు పెంచుకునేందుకు రాష్ట్ర ఖజానాను లూటీ చేయడంతో సరిపెట్టుకోకుండా అమాయకుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ఆయన రాష్ట్రాన్ని ఏ రకంగా లూటీ చేస్తున్నారో ఇవాళ స్పష్టంగా కనిపిస్తోంది. తాజాగా ఇబ్రహీంపట్నంలోని గోడౌన్లలో దాడులు చేసి నకిలీ మద్యం బాటిళ్లు, లేబుల్స్, సిద్ధం చేసిన వివిధ బ్రాండ్ల నకిలీ మద్యం, మిషన్లు, పెద్ద సంఖ్యలో ఖాళీ బాటిల్స్, లేబుల్స్ లేని బాటిల్స్, స్పిరిట్‌ను ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. గోడౌన్లలో నిల్వ ఉంచిన 95 క్యాన్లలో 3,325 లీటర్ల స్పిరిట్‌ను సీజ్ చేశారు. అందులో ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ 725 బాటిల్స్, క్లాసిక్ బ్లూ 44 బాటిల్స్, కేరళ మాల్ట్ 384 బాటిల్స్, మంజీరా బ్లూ 24 బాటిల్స్.. ఇలా మొత్తం 1,300 బాటిళ్లను ఈ దాడుల్లో స్వాధీనం చేసుకున్నారు. లేబుల్స్ లేని 136 కేసులు, 6,578 బాటిల్స్, ఓఏబీ లేబుల్స్ 6,500, ఖాళీ బాటిల్స్ 22 వేలు, ఖాళీ కార్టూన్లు 6, ఒక మిషన్, రెండు పైపులను సీజ్ చేశారు. ఇవన్నీ చూస్తే ఆశ్చర్యం కలిగిస్తున్నాయి.

నకిలీ మద్యంపై ఆందోళన ఇలా..

ప్రజల ప్రాణాలను హరిస్తున్న నకిలీ మద్యంపై పార్టీ పరంగా నిరసనలు తెలియచేయాలి. ప్రతి మూడు బాటిళ్లలో ఒకటి నకిలీ మద్యం విక్రయిస్తున్నారు. కల్తీ మద్యం వద్దు, మా ప్రాణాలను కాపాడాలని, అయ్యా చంద్రబాబు... మా ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని నియోజకవర్గ కేంద్రంలోని మద్యం దుకాణాల వద్ద ప్లకార్డులతో ఆందోళనలు చేయాలి. ఇందులో మహిళా విభాగాన్ని కూడా భాగస్వామిగా చేయాలి. మద్యం సేవించే వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని, పేదల ప్రాణాలతో ఆటలాడతారా అంటూ కల్తీ మద్యంపై నిరసనలు తెలియచేయాలి. నియోజకవర్గ ఇన్‌చార్జీల ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించాలి.

'దేశం కోసం మధ్యవర్తిత్వం'కు విశేష స్పందన

- 575 కేసులను పరిష్కరించిన టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ
- మీడియాకు వివరాలు వెల్లడించిన సభ్య కార్యదర్శి పంచాక్షరి

సాక్షి, హైదరాబాద్: 'దేశం కోసం మధ్యవర్తిత్వం' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో 575 కేసులను పరిష్కరించినట్లు తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి సి.హెచ్. పంచాక్షరి పేర్కొన్నారు. 171 దాంపత్య కేసులు, 39 గృహ హింస, 108 క్యాలెండర్ కేసులతోపాటు క్రిమినల్ అప్పీళ్లు, ఇతర కేసులున్నాయన్నారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సూచనలు, హైకోర్టు సీజే జస్టిస్ ఏకే సింగ్, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ శామ్‌కోషి ఆదేశాల మేరకు జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఈ మేరకు మంగళవారం జరిగిన సమావేంలో ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. మధ్యవర్తిత్వం కోసం 6,923 కేసులను ఎంపిక చేయగా అందులో 575 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. వివాదాల సామరస్య పరిష్కారానికి శిక్షణ పొందిన మధ్యవర్తుల సేవలను ఉపయోగించుకోవాలని కక్షిదారులకు పంచాక్షరి పిలుపునిచ్చారు. 'నల్సా' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు హైకోర్టు మీడియేషన్ అండ్ ఆర్బిట్రేషన్ సెంటర్ గవర్నర్స్ బోర్డు చైర్మన్ జస్టిస్ కె.లక్ష్మణ్, సభ్యులు జస్టిస్ సూరేపల్లి నందా, జస్టిస్ కె.శరత్, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు డీఎల్‌ఎస్‌ఏలకు సూచనలు అందజేశారని చెప్పారు.

సౌందర రెడ్డి అక్రమ అరెస్టు కేసులో ఏపీ ప్రభుత్వం, డీజీపీకి సుప్రీం నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన సోషల్ మీడియా యాక్టివిస్ట్ సౌందర రెడ్డి(సవీందర్‌రెడ్డి) అక్రమ అరెస్ట్ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వంతోపాటు డీజీపీ, రిలయన్స్ జియో సహా 11 మంది ప్రతివాదులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో సీబీఐ ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోవద్దని మంగళవారం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. సౌందరరెడ్డిని అక్రమంగా గంజాయి కేసులో ఇరికించారని ఆరోపణలు రాగా, దీనిపై ఏపీ హైకోర్టు సీబీఐ విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ దర్యాప్తు అధికారి గన్నవరపు శ్రీనివాసరావు వ్యక్తిగత హోదాలో దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది.

జూబ్లీహిల్స్ సీటుకు.. ఢిల్లీకి మూడు పేర్లు

జూమ్‌లో సీఎం, మీనాక్షి సమావేశం

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక కోసం మూడు పేర్లను టీపీసీసీ అధిష్టానానికి పంపింది. ఈ ఎన్నికల్లో అభ్యర్థి ఎంపిక కసరత్తు కోసం మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌లు జూమ్ ద్వారా సమావేశమయ్యారు. ఇప్పటికే ఢిల్లీకి పంపిన నాలుగు పేర్లపై చర్చించారు. అయితే, ఈ సమావేశం అనంతరం అందులో నుంచి మూడు పేర్లు మాత్రమే పంపినట్లు తెలిసింది. జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేరును తొలగించి.. నవీన్ యాదవ్, అంజన్‌కుమార్ యాదవ్, సీఎన్ రెడ్డి పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ)కి పీసీసీ సిఫారసు చేసినట్టు సమాచారం. కాగా, బుధవారం ఢిల్లీలో సీఈసీ జరగనుందని, ఈ సమావేశంలో స్థానిక యువ నేత నవీన్ యాదవ్‌కు టికెట్ వస్తుందనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

ముగ్గురి పేర్లతో సిద్ధమైన బీజేపీ జాబితా?

48 గంటల్లో అభ్యర్థి ప్రకటన

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీచేసే అభ్యర్థి ఎంపికపై బీజేపీలో అభిప్రాయ సేకరణ ముగిసింది. మంగళవారం మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, మాజీ ఎంపీ రాములు, సీనియర్ నేత ఆంజనేయులుతో కూడిన కమిటీ బీజేపీ నగర కార్యాలయంలో అభిప్రాయ సేకరణ జరిపింది. సీనియర్ నేతలు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్ల అభిప్రాయాలను కమిటీ సభ్యులు సేకరించారు. టికెట్ కోసం 12 మంది ఆశావహుల నుంచి ఈ కమిటీకి వినతులు అందినట్టు సమాచారం. మొత్తంగా 44 మంది వివిధ స్థాయిల నాయకుల నుంచి అభిప్రాయాలను తీసుకున్నట్టు తెలుస్తోంది. అభ్యర్థి రేసులో లంకల దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, ఆకుల విజయ ముందు వరసలో నిలిచినట్టు పార్టీవర్గాల సమాచారం. అభిప్రాయాల సేకరణ ముగిసిన నేపథ్యంలో మూడుపేర్లతో ఈ కమిటీ రాష్ట్ర నాయకత్వానికి నివేదిక అందజేయనున్నట్టు తెలిసింది. 48 గంటల్లో బీజేపీ అభ్యర్థిని అధినాయకత్వం ప్రకటించే అవకాశమున్నట్టుగా చెబుతున్నారు.

రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఆగమయ్యారు

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఉపాధి లేక ఆగమయ్యారని.. వారిని ఆదుకుంటామన్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం అడవిపదిరకు చెందిన ఆటోడ్రైవర్ నాంపల్లి సతీశ్ అప్పుల బాధతో రెండు రోజుల క్రితం ఆత్మహత్యకు యత్నించాడు. ఎల్లారెడ్డిపేటలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, మంగళవారం కేటీఆర్ పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా 93 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని, ఈ వివరాలు సైతం ప్రభుత్వానికి అసెంబ్లీ సాక్షిగా అందజేశామని తెలిపారు. చనిపోయిన ఆటోడ్రైవర్ల ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆటోయూనియన్లు కలిసి రావాలని, జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసుకొని ప్రభుత్వంపై పోరాడుతామని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మెడలు వంచైనా మన హక్కులు సాధించుకుందామన్నారు. ఆటోడ్రైవర్లకు నెలకు రూ.వెయ్యి చొప్పున రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో డ్రైవర్‌కు రూ.24వేలు బకాయి పడిందన్నారు. ఆటోడ్రైవర్లు ఆగం కావొద్దని.. బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



ఆటోడ్రైవర్ సతీశ్‌ను పరామర్శిస్తున్న కేటీఆర్

బూత్‌ల వారీగా ప్రచార బాధ్యతలు

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై భేటీలో బీఆర్‌ఎస్ నిర్ణయం
- పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలకు బాధ్యతలు
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన సమావేశం
- మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని, జగదీశ్‌రెడ్డి హాజరు

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ కీలక నేతలు మంగళవారం భేటీ అయ్యారు. నందినగర్ నివాసంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, కొప్పుల ఈశ్వర్‌తోపాటు ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఉప ఎన్నికలో పార్టీ పరంగా అనుసరించాల్సిన ప్రచార వ్యూహంపై ప్రాథమికంగా చర్చించినట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో బుధవారం హైకోర్టు వెలువరించే తీర్పు ఆధారంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార వ్యూహానికి తుది రూపు ఇవ్వాలని నిర్ణయించారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే పక్షంలో హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యనేతలకు ప్రచార, సమన్వయ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. బూత్‌లవారీగా ప్రచార బాధ్యతలు అప్పగించే అవకాశముంది. స్థానిక సంస్థల ఎన్నికలపై కోర్టు ప్రతికూలంగా స్పందిస్తే ఇతర ప్రాంత నేతలకు కూడా జూబ్లీహిల్స్‌లో పార్టీ తరపున బాధ్యతలు అప్పగించే అవకాశముంది. గతంలో జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలకు బాధ్యతలు ఇచ్చిన రీతిలోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ ఇతర జిల్లాలకు చెందిన పార్టీ నేతలను ప్రచార పర్వంలో మోహరించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

నేడు మరోమారు భేటీ

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచార వ్యూహానికి తుదిరూపు ఇచ్చేందుకు బుధవారం బీఆర్‌ఎస్ కీలక నేతలు మరోమారు భేటీ కావాలని నిర్ణయించినట్లు సమాచారం. కేటీఆర్ అధ్యక్షతన జరిగే ఈ భేటీలో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, దాసోజు శ్రవణ్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డితోపాటు ఒకరిద్దరు కీలక నేతలు కూడా పాల్గొంటారు. ఇప్పటికే పార్టీ అభ్యర్థిని ఖరారు చేసినందున ప్రచారంలో భాగంగా రోడ్ షోలు, హాల్ మీటింగ్స్ ఏర్పాటుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ షెడ్యూల్‌పై చర్చిస్తారని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి. నామినేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత పార్టీ అధినేత కేసీఆర్ పాల్గొనే ఉప ఎన్నిక ప్రచార షెడ్యూల్‌ను ఖరారు చేసే అవకాశముంది.

ఆర్టీసీ ప్రైవేటీకరణకు యత్నం

ఆర్టీసీని ప్రైవేటుపరం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఇన్నోవేటివ్ థింకింగ్' పేరిట ఆర్టీసీ బస్సుల్లో భార్యకు ఫ్రీ టికెట్ ఇస్తూ భర్త నుంచి డబుల్ చార్జీలు వసూలు చేస్తున్నారని, అలాగే పిల్లల బస్‌పాస్‌ల రేట్లు పెంచారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. చార్జీల పెంపు ద్వారా మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి జరుగుతున్న నష్టాన్ని ప్రభుత్వం భర్తీ చేసుకుంటోందని విమర్శించారు. చార్జీల పెంపుతో ఒక్కో కుటుంబంపై 20 శాతం మేర అదనపు భారం పడుతోందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేసేందుకు రేవంత్ ప్రభుత్వం మార్గం సుగమం చేసుకుంటూ ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేటు వ్యక్తులకు అప్పచెప్తోందన్నారు. హైదరాబాద్‌లో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క అసెంబ్లీ స్థానం కూడా దక్కనందునే ప్రజలపై కక్ష తీర్చుకునేందుకు చార్జీలు పెంచిందని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో చార్జీల పెంపునకు కాంగ్రెస్ పార్టీ ప్రతిఫలాన్ని అనుభవిస్తుందని కేటీఆర్ దుయ్యబట్టారు.

8 ఏళ్లలో కీలక తీర్పులు

- జస్టిస్ షావిలికి హైకోర్టు సీజే ఏకే సింగ్ ప్రశంస
- పదవీ విరమణ సందర్భంగా ఫుల్ కోర్టు ఘనంగా వీడ్కోలు



ఫస్ట్ కోర్టు హాల్‌లో జరిగిన సమావేశంలో సీజే జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్. చిత్రంలో జస్టిస్ శామ్‌కోషి, జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ మౌసమి భట్టాచార్య, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ తుకారాంజీ, జస్టిస్ రేణుకా యారా, జస్టిస్ రామకృష్ణారెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా 8 ఏళ్ల పనిచేసి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి ఎన్నో కీలక తీర్పులను ఇచ్చారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్ ప్రశంసించారు. పదవీ విరమణ సందర్భంగా జస్టిస్ షావిలికి మంగళవారం ఫుల్ హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. ఫస్ట్ కోర్టు హాల్‌లో జరిగిన సమావేశంలో సీజే ఏకే సింగ్ మాట్లాడుతూ జస్టిస్ షావిలి 30,221 కేసులను పరిష్కరించారని చెప్పారు. హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించి 7 జాతీయ లోక్ అదాలత్‌లను సమర్థంగా నిర్వహించారని కొనియాడారు. 11,096 పెండింగ్, 245 ప్రీ–లిటిగేషన్ కేసులను పరిష్కరించి కక్షిదారులకు రూ.78 కోట్ల పరిహారం లభించేలా కృషి చేశారన్నారు. జ్యుడీషియల్ అకాడమీ అధ్యక్షుడిగానూ సేవలు అందించారన్నారు. జస్టిస్ షావిలి మాట్లాడుతూ వైద్య కుటుంబంలో జన్మించిన తాను న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించి న్యాయమూర్తిగా పదవీ విరమణ చేస్తున్నానన్నారు. తండ్రి నుంచి అందిపుచ్చుకున్న విలువలతో వృత్తిలో కొనసాగినట్లు చెప్పారు. కర్మ సిద్ధాంతాన్ని విశ్వసిస్తానన్నారు. అంతకుముందు అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ జస్టిస్ షావిలి న్యాయ వ్యవస్థకు ఎనలేని సేవలను అందించారన్నారు. కార్యక్రమంలో జస్టిస్ షావిలి కుటుంబ సభ్యులు, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, పీపీ పల్లె నాగేశ్వరరావు, అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జస్టిస్ షావిలిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏఏ అధ్యక్షుడు జగన్, ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, కార్యదర్శులు ఖాజా విజారత్ అలీ, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుమురంభీం పోరాటం అందరికీ స్ఫూర్తి

- రాష్ట్ర మంత్రులు జూపల్లి, లక్ష్మణ్‌కుమార్
- జోడేఘాట్‌లో భీం వర్ధంతి కార్యక్రమం



భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్

కెరమెరి (ఆసిఫాబాద్): ఆదివాసీ అమరవీరుడు కుమురం భీం ఆదివాసీలకే కాకుండా అందరిలోనూ స్ఫూర్తినింపిన పోరాట యోధుడని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్ గ్రామంలో భీం 85వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహం, సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, ఆదివాసీలను సంఘటితం చేసి హక్కుల సాధన కోసం భీం పోరాటం చేశారని, రాష్ట్ర సాధనలోనూ ఆయన స్ఫూర్తి కనిపించిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధికి రూ.740 కోట్లతో రోడ్లు, గిరిజన భవనాల నిర్మాణానికి జీవో విడుదల చేసిందని తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా స్టేజీపై మాట్లాడలేకపోతున్నామని చెప్పారు. అంతకుముందు జెండాలకు ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. భీం మ్యూజియంను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు సుగుణ, భీం మనవడు కొముురం సోనేరావు, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు డివిజన్ కార్యదర్శి రూబెన్ లొంగుబాటు




చెక్కును అందజేస్తున్న సీపీ

హసన్‌పర్తి: మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి, సౌత్‌బస్తర్ డివిజన్ కమిటీ సభ్యుడు, దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీకి చెందిన మంద రూబెన్ అలియాస్ కన్నన్న అలియాస్ మంగన్న అలియాస్ సురేశ్ మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఎదుట లొంగిపోయాడు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ సన్‌ప్రీత్ సింగ్ విలేకరులకు వెల్లడించిన వివరాలివి. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన మంద రూబెన్ కాజీపేటలోని ఆర్‌ఈసీలో హాస్టల్‌మెస్‌గా పనిచేస్తున్న సమయంలో.. రాడికల్స్ యూనియన్ నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు ఆకర్షితుడయ్యాడు. ఈ క్రమంలో మావోయిస్టు పార్టీ మాజీ కార్యదర్శి, ఆర్‌ఈసీ పూర్వ విద్యార్థి సంబాల కేశవరావు పిలుపుతో 1979లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. 1991లో అనారోగ్య కారణంతో చికిత్స కోసం కొత్తగూడానికి వెళ్తుండగా ఛత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్ట్ చేసి జగదల్పూర్ జైలుకు తరలించారు. ఏడాది తర్వాత మరో ముగ్గురు ఖైదీలతో కలిసి రూబెన్ జైలునుంచి పరారయ్యాడు. ఆ తర్వాత తిరిగి బస్తర్ ప్రాంత ఏరియా కమిటీ సభ్యుడిగా కుంట అబూజ్‌మడ్ ప్రాంతంలో ఎనిమిదేళ్లపాటు పనిచేశాడు. రూబెన్‌పై రూ.8 లక్షల రివార్డు ఉన్నట్లు సీపీ సన్‌ప్రీత్‌సింగ్ వెల్లడించారు. ఈ సందర్భంగా అతనికి చెక్కును అందజేశారు. సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీలు ప్రశాంత్‌రెడ్డి, జానీ నర్సింహులు, కాజీపేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళ కమాండర్‌ను హతమార్చిన మావోయిస్టులు

- దసరా రోజు చెల్పాక అటవీ ప్రాంతంలో ఘటన
- క్రమశిక్షణ చర్యల్లో భాగమే అన్న నక్సల్స్...ధ్రువీకరించని పోలీసులు



లక్కి మృతదేహం

ఏటూరునాగారం: ఛత్తీస్‌గఢ్ ఏరియా మావోయిస్టు పార్టీ దళ కమాండర్ మాడవి లక్కి(38)ని క్రమశిక్షణ చర్యల కింద మావోయిస్టులు హతమార్చారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక–వీరాపురం గొత్తికోయగూడెంలో ఈనెల 2న అటవీ ప్రాంతంలో ఓ మృతదేహం కనిపించింది. పోలీసులు గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. మంగళవారం ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలం పాలెం ప్రాంతానికి చెందిన ఓ కొరియర్ పోలీసులకు చిక్కాడు. దీంతో అసలు విషయం బయటపడింది. చెల్పాక వద్ద మరణించిన వ్యక్తి సాధారణమైన వ్యక్తి కాదని, మావోయిస్టు ఏరియా దళ కమాండర్ అని చెప్పడంతో పోలీసులు అవాక్కయ్యారు. ఆరా తీయగా, మావోయిస్టు పార్టీలో లక్కి ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలోని ఏరియా దళ కమాండర్‌గా పనిచేస్తూ అజ్ఞాతంలో ఉన్న ఓ మహిళను తీసుకొని బయటకు వచ్చాడని తెలిసింది. ఇతడికి పాలెంకు చెందిన ఓ వ్యక్తి సహకరించి తన సమీప బంధువు ఇంట్లో ఆశ్రయం కల్పించాడు. విషయం తెలుసుకున్న మావోయిస్టులు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో లక్కి కోసం గాలించారు. వీరాపురం గొత్తికోయగూడెంలో ఉన్నట్టు సమాచారం అందుకున్న నలుగురు మావోయిస్టులు ద్విచక్రవాహనాలపై ఈనెల 2న దసరా పండుగ రోజు అక్కడకు చేరుకున్నారు. లక్కిని ఛత్తీస్‌గఢ్‌కు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అయితే లక్కి వారిని ప్రతిఘటించాడు. దీంతో మావోయిస్టులు లక్కిని చెట్టుకు కట్టేసి ఉరివేసి హతమార్చారు. మావోయిస్టు పార్టీకి ద్రోహం చేశాడని, క్రమశిక్షణ చర్యల కింద హతమార్చుతున్నట్టు స్థానికులకు మావోయిస్టులు చెప్పి వెళ్లిపోయారు. లక్కి మృతదేహానికి సామాజిక ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అయితే ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించడం లేదు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 8-10-2025



బాగా ఒత్తిడిలో ఉన్నప్పుడు వెంటనే అమ్మకు ఫోన్ చేసి ఆమె గొంతు వినండి... చిన్నప్పుడు అమ్మ పాడే జోలపాట వింటూ హాయిగా నిద్దురలోకి జారినంత తేలిగ్గా మీరు ఒత్తిడి నుంచి బయట పడతారని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి.

● న్యూస్‌మేకర్



రాగిణీ దాస్

గూగుల్ నుంచి గూగుల్ వరకు

లక్ష్యాన్ని వీడక ప్రయత్నిస్తూ ఉంటే విజయం ఏదో ఒకనాటికి వరిస్తుందని రాగిణి దాస్ నిరూపించింది. 12 ఏళ్ల క్రితం గూగుల్ ఇంటర్వ్యూకు హాజరైన రాగిణి అందులో సెలెక్ట్ కాలేదు. దాంతో జొమాటో ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంది. జొమాటోలో చేరి ఆ సంస్థ ఉన్నతికి తోడ్పడింది. ఇప్పుడు గూగుల్ రాగిణిని పిలిచి మరీ గూగుల్ ఇండియాకు 'హెడ్ ఆఫ్ స్టార్టప్స్'గా నియమించింది. బాణం ఒకసారి గురి తప్పేది ఈసారి కచ్చితంగా గురికి చేరుకోవడానికే అని నిరూపించిన రాగిణి దాస్ పరిచయం.

'అపజయాలు కలిగిన చోటే గెలుపు పిలుపు వినిపిస్తుంది' అన్నాడో సినీ కవి. అందరి విషయంలో అది సాధ్యం కాకపోవచ్చు. కాని శ్రమ, పట్టుదల ఉంటే వెనుదిరిగిన చోటే మళ్లీ ముందడుగు వేయడం సాధ్యమని నిరూపించారు రాగిణి దాస్. ప్రస్తుతం ఆమె గూగుల్ మెచ్చిన బిజినెస్ స్ట్రాటజిస్ట్. అందుకే ఆ సంస్థ గూగుల్ ఇండియా స్టార్టప్స్ విభాగానికి ఇటీవల ఆమెను హెడ్‌గా నియమించింది. ఆశ్చర్యం ఏమంటే పన్నెండేళ్ల క్రితం అదే గూగుల్ సంస్థలో ఇంటర్వ్యూకు వెళ్లి వెనుదిరిగిన ఆమె ప్రస్తుతం అదే సంస్థలో ఉన్నత ఉద్యోగానికి ఎంపికవడం విశేషం.

చురుకైన విద్యార్థిని

హరియాణా రాష్ట్రం గురుగ్రామ్‌లో జన్మించిన రాగిణి– చెన్నైలోని చెట్టినాడ్ విద్యాశ్రమ్‌లో చదువుకున్నారు. చదువుతోపాటు అక్కడ ఆమె సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొన్నారు. ఆ తర్వాత లాంకాస్టర్ యూనివర్సిటీ (ఇంగ్లాండ్) నుంచి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ పొందారు. అక్కడ చదువుతున్న సమయంలోనే స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్‌తోపాటు ఇతర సంస్థల్లో ఇంటర్న్‌గా పని చేశారు రాగిణి. భారతీయ మార్కెట్‌కు అనుగుణంగా వ్యాపార ప్రణాళికలు రూపొందించడంపై ఆ సమయంలోనే దృష్టి సారించారు.

గూగుల్ కాదు పొమ్మంది

2012లో ట్రైడెంట్ గ్రూప్ ఇండియా సంస్థ ద్వారా తన కెరీర్‌ని ప్రారంభించారు రాగిణి. మొదట స్వదేశంలో మార్కెటింగ్ పర్యవేక్షించిన ఆమె ఆ తర్వాత యూరప్, అమెరికాల మార్కెటింగ్‌నూ నిర్వహించారు. సంస్థకు వెన్నుదన్నుగా నిలిచారు. 2013 ఆమె కెరీర్‌కు అత్యంత కీలకమైన సంవత్సరం. ఆ సమయంలో గూగుల్, జొమాటో సంస్థల్లో ఇంటర్వ్యూలకు వెళ్లారు రాగిణి. గూగుల్‌లో చివరి రౌండ్ దాకా నిలిచి, ఆ తర్వాత వెనుదిరగాల్సి వచ్చింది. అప్పుడు జొమాటో ఆమెను సగౌరవంగా సంస్థలోకి ఆహ్వానించింది. అలా జొమాటోలో సేల్స్ అండ్ మార్కెటింగ్ మేనేజర్‌గా చేరిన రాగిణి అంచెలంచెలుగా ఎదుగుతూ సంస్థలో కీలకస్థానాల్లో పని చేశారు. 2017లో జొమాటో గోల్డ్ ఫౌండింగ్ టీంలో సభ్యురాలిగా మారి, సంస్థ ఉన్నతికి కృషి చేశారు. ఆస్ట్రేలియా, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, ఖతార్ తదితర దేశాల్లో జొమాటో గోల్డ్ ఆరంభానికి ఆమె కీలకంగా వ్యవహరించారు. 'జొమాటో నా కెరీర్‌ని తీర్చిదిద్దింది. నా భవిష్యత్తుకు కావాల్సిన నైపుణ్యాలు, స్నేహితులను అక్కడే పొందాను' అని ఆమె అంటుంది.

మహిళల కోసం...

జొమాటో నుంచి బయటకు వచ్చాక 2020లో ఆనంద్ సిన్హాతో కలిసి ముంబయి కేంద్రంగా ఆమె లీప్.క్లబ్ అనే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్లబ్‌ని స్థాపించారు. మహిళలకు ఉపాధి అవకాశాలు, వృత్తి నైపుణ్యాలు, నెట్‌వర్కింగ్ అంశాలను చేరువ చేసేందుకు ఈ క్లబ్ పని చేసింది. ఈ ఏడాది మేలో దీన్ని నిలిపి వేసేనాటికి ఈ క్లబ్‌లో సుమారు 25 వేల మంది పెయిడ్ సభ్యులు ఉండటం విశేషం. 'ఈ క్లబ్ వల్ల చాలా మంది మహిళలు మేలు పొందడం నాకు సంతృప్తిని ఇచ్చింది' అంటుంది రాగిణి. పలు కారణాలతో లీప్.క్లబ్‌ను ఆపేసిన అనంతరం తన పెంపుడు శునకం జిమ్మీతో ఉల్లాసంగా గడుపుతూ విశ్రాంతి తీసుకుంటూ ఉండగా అదే సమయంలో గూగుల్ ప్రకటన ఆమెను ఆకర్షించింది.

గూగుల్ నుంచి గూగుల్‌కు...

గూగుల్ స్టార్టప్స్ ఇండియా హెడ్ స్థానానికి అభ్యర్థుల కోసం వెతుకుతున్న సమయంలో మరోమారు గూగుల్ గడప తొక్కారు రాగిణి. ఇన్నాళ్ల తన అనుభవం తప్పక ఆ స్థానాన్ని తనకు అందిస్తాయని నమ్మారు. ఆ నమ్మకం నిజమైంది. ఆమెను గూగుల్ ఎంపిక చేసింది. దేశవ్యాప్తంగా అంకుర సంస్థలను ఏర్పాటు చేయాలనుకునే వారిని సమన్వయం చేసి, గూగుల్ ద్వారా వారికి తగిన ప్రోత్సాహం అందించడం, మెంటర్స్‌ను ఇవ్వడం, ఫండింగ్ రిసోర్సస్‌ను తెలియచేయడం ఆమె పని.

'భూమిలాగే జీవితం కూడా గుండ్రంగా ఉంది' అంటూ తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు రాగిణి. ●



కార్గిల్ యుద్ధ విషయాలు, విశేషాలు టీవీలో చూసిన సునీత పహాల్ మన రక్షణరంగంలోని వాయుసేనలో పనిచేయాలని కలలు కన్నది. అయితే గ్రామీణ ప్రాంతానికి చెందిన ఆ అమ్మాయి కల వెక్కిరింపుకు గురైంది. అలాంటి సమయాల్లో ఆకాశం కేసి చూసేది సునీత. 'ఆకాశం అందరిదీ కదా!' ఆ ఎరుకతోనే హరియాణాలోని చిన్న గ్రామం నుంచి ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో వింగ్ కమాండర్ స్థాయికి చేరింది. 'పరిమితులను పట్టించుకోకండి. పట్టుదలగా లక్ష్యంపై దృష్టి పెట్టండి' అంటూ ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తినిస్తోంది సునీత పహాల్...

కలల రెక్కలతో...


సునీత పహాల్

హైదరాబాద్‌లో... నీలిరంగు యూనిఫామ్‌లో తమ కుమార్తె ఆత్మవిశ్వాసంతో కవాతు చేస్తూ గర్వంగా సెల్యూట్ చేయడాన్ని చూసి సునీత తల్లిదండ్రుల కళ్లు చెమర్చాయి. వారికి ఇది కేవలం పాసింగ్–అవుట్ పరేడ్ కాదు. కలను సాకారం చేసుకున్న కన్నకూతురుని అపురూపంగా చూసుకునే అవకాశం.

కార్గిల్ యుద్ధం జరుగుతున్న కాలంలో, మంచుతో నిండిన భూభాగాల్లో పోరాడుతున్న మన సైనికులను టీవీలో చూసింది సునీత. వారి సాహసాల గురించి కథలు కథలుగా విన్నది. అవి తప మనసుపై చెరగని ముద్ర వేశాయి. ఎయిర్ ఫోర్స్‌లో పని చేయాలనే కలకు బీజం వేశాయి.

పెద్ద కలతో... చిన్న గ్రామం నుంచి

హరియాణాలోని దతౌలీ అనే చిన్న గ్రామంలో అమ్మాయిల నోటివెంట 'సైన్యంలో పనిచేయాలనేది నా కల' అనే మాట కనీసం ఊహకు కూడా అందదు. కంప్యూటర్ ఇంజినీరింగ్ పూర్తయిన తరువాత ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్(ఏఎఫ్ క్యాట్) రాసింది. ఈ పరీక్ష కోసం ఎలాంటి శిక్షణా తీసుకోనప్పటికీ తొలి ప్రయత్నంలోనే విజయం సాధించింది.

'సైన్యంలో మహిళలు పనిచేయలేరు. చాలా సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుంది. పెళ్లి చేయడం కూడా కష్టం అవుతుంది. సునీతను ఎట్టి పరిస్థితుల్లోనూ సైన్యంలో చేర్పించవద్దు' అని ఇరుగు, పొరుగు, బంధువులు సునీత తల్లిదండ్రులకు చెప్పేవాళ్లు. సునీత తండ్రికి రెండు ఎకరాల భూమి ఉండేది. బతుకు బండి లాగడం అతడికి కష్టం అయ్యేది. అయినప్పటికీ పిల్లలను బాగా చదివించే విషయంలో రాజీ పడేవాడు కాదు.

'నీకు అయిదుగురు ఆడపిల్లలు. వచ్చిన కాస్తో కూస్తో డబ్బును పిల్లల చదువు పేరుతో వృథా చేయకు. వారి పెళ్లిపై దృష్టి పెట్టు' అనేవారు చాలామంది. వారి ప్రతికూల మాటలు ఆయనను ప్రభావితం చేయలేకపోయాయి.

కఠిన శిక్షణ... కన్నీటి ధార

ఎయిర్ ఫోర్స్ ట్రైనింగ్ అకాడమీలో చేరింది సునీత. అంతమాత్రాన కథా సుఖాంతం కాలేదు. అసలు కష్టాలు అక్కడే మొదలయ్యాయి. శిక్షణ తనకు చాలా కష్టంగా అనిపించింది. 'నేను చేయగలనా' అని బెదిరిపోయింది. ఏడ్చింది. అయినప్పటికీ పట్టుదలతో శిక్షణ పూర్తి చేసింది. ఫస్ట్ పోస్టింగ్ ఈశాన్య రాష్ట్రాలలోని ప్రీమియర్ ఫైటర్ బేస్‌లో. ఎప్పుడూ అనుభవంలో లేని కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లు అనిపించింది. అయినాసరే, ఆపరేషన్స్ మేనేజ్ చేయడం నుంచి సంక్లిష్టమైన టెక్నికల్ అసైన్‌మెంట్స్ హ్యాండిల్ చేయడం వరకు ఎన్నో చేసేది.

'ఇవి చేస్తున్నది నేనేనా!' అని కూడా అనిపించేది. 'నన్ను నేను నిరూపించుకోవడానికి ప్రతిరోజూ కష్టపడ్డాను' అని గతాన్ని గుర్తు చేసుకుంటుంది సునీత.

కష్టం వృథా పోలేదు

ధైర్యం, సమస్య పరిష్కార నైపుణ్యం, అసాధారణమైన పనితీరు, అంకితభావాన్ని గుర్తించి ఇచ్చే వైమానిక దళ అధికారిక ప్రశంసపత్రాన్ని అందుకుంది సునీత. 'అమ్మాయిలు సైన్యంలోకి ఎందుకు!' అంటూ పిల్లల కలలకు అడ్డుపడే తల్లిదండ్రులు ఎంతోమంది ఉన్నారు. అలాంటి వారిని ఉద్దేశించి ఇలా అంటుంది సునీత...

'ఆకాశం అందరిదీ. మీ అమ్మాయిల కలలకు రెక్కలు ఇవ్వండి. వాటిని స్వేచ్ఛగా ఎగరనివ్వండి. నా కలకు నా తల్లిదండ్రులు అడ్డు చెబితే ఎయిర్ ఫోర్స్‌లోకి వచ్చేదాన్ని కాదు. వింగ్ కమాండర్ స్థాయికి చేరుకునేదాన్ని కాదు' ●

ఎన్నో రాత్రులు ఏడ్చాను!

నేను అథ్లెట్‌ను కాదు. ఎప్పుడూ అయిదు కిలో మీటర్‌ల దూరం నడవలేదు. పుషప్‌లు ఎప్పుడూ చేయలేదు. అలాంటి నేను శిక్షణ కాలంలో రోజుకు పది కిలోమీటర్లు పరుగెత్తాల్సి వచ్చేది. గంటల పాటు డ్రిల్లింగ్ ఉండేది. ఎండ తట్టుకోవడం కష్టం అయ్యేది. ఇవి తట్టుకోలేక ఎన్నో రాత్రులు ఏడ్చాను. కాని ప్రతిరోజూ నిద్ర లేవగానే ఆ బాధను మరిచిపోయి. ఎంత కష్టమైనా చేయాల్సిందే అనుకునేదాన్ని. అడవులు, ఎడారులు... ఎక్కడైనా కావచ్చు, పురుషులతో సమానంగా మహిళలు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. మహిళలు ఒకటికి రెండుసార్లు తమని తాము నిరూపించుకోవాల్సి ఉంటుంది.

– సునీత పహాల్

● లీగల్

నెల జీతం వస్తోంది కానీ... విత్ డ్రా చేయలేకపోతున్నాను..!

కొన్ని నెలల క్రితం వరకు నేను ఆన్‌లైన్‌లో గేమింగ్ యాప్ ద్వారా డబ్బులు పెట్టించి ఆడేవాడిని. అలా కొంత డబ్బులు పోగొట్టుకున్నాను మరికొంత సంపాదించాను. నాలుగు నెలల క్రితం సైబర్ కంప్లైంట్ వలన నా బ్యాంక్ ఖాతా సీజ్ చేసాము అని బ్యాంకు వారు చెప్పారు కానీ ఎటువంటి వివరాలు ఇవ్వలేదు. అదే ఖాతాలో నా జీతం కూడా వస్తుంది. నేను పనిచేస్తున్న కంపెనీకి ఈ విషయం చెప్పి ఎకౌంటు మార్చమని అడుగుదామనుకుంటే... ఆ కేసులో ఉన్నందు వల్ల నా ఉద్యోగం పోతుందనే భయంతో చెప్పలేకపోతున్నాను. నెల జీతం వస్తోంది కానీ విత్ డ్రా చేయలేని పరిస్థితి. బ్యాంకు వారిని సంప్రదించినప్పటికీ పరిష్కారం దిశగా సమాధానం ఇవ్వడం లేదు. నా ఉద్యోగానికి ఎటువంటి ముప్పు రాకుండా ఈ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో చెప్పగలరు.

– కృష్ణ చైతన్య, హైదరాబాద్

ఆన్‌లైన్ గేమింగ్ రెగ్యులేషన్ చట్టం, 2025 ఇటీవలే అమలులోకి వచ్చింది. బెట్టింగ్ యాప్స్, ఆన్‌లైన్ గేమ్స్ వంటి వాటిని రెగ్యులేట్ చేయడం, వ్యసనాలకు దారి తీయకుండా చేయటం, ఆన్లైన్ ఫైనాన్షియల్ మోసాలను అరికట్టటం, కుటుంబాలను– యువతను కూడా ఇలాంటి వ్యసనాలకు దూరంగా ఉంచటం, దేశ ఖజానాకు భంగం కలిగించకుండా ఉండడం వంటివి ఈ చట్టం ముఖ్య ఉద్దేశాలు. ఈ చట్టం అమలులోకి రాకముందు చాలా ఉదంతాలు వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. అందులో చాలా యాప్స్ ద్వారా ఆన్‌లైన్ మోసాలు జరిగాయి అని వేల సంఖ్యలో కంప్లైంట్లు ఇచ్చారు. దాదాపు అన్ని రాష్ట్రాలలో వేల సంఖ్యలో బ్యాంకు ఖాతాలు సీజ్ కూడా అయ్యాయి. బహుశా మీరు వాడిన బెట్టింగ్/గేమింగ్ యాప్ ఏదో ఒక నేరంలో ఉండి ఉండవచ్చు. ఇలాంటి పరిస్థితులలో బ్యాంకు వారు కూడా ముందస్తు చర్యగా ఎకౌంటును సీజ్ చేయవచ్చు. అయితే అందుకు గల కారణాలను సదరు ఖాతాదారులకు ఇవ్వడం బ్యాంకు వారి బాధ్యత.

ఇక దీని మూలంగా మీ ఉద్యోగానికి ఏదో జరిగిపోతుంది అనే కంగారు ప్రస్తుతానికి అవసరం లేదు. బ్యాంకు వారికి మీ అకౌంట్ ఫ్రీజ్ చేయడానికి గల కారణాలు అలాగే ఏదైనా పోలీసు వారు కానీ, మరి ఎవరైనా అధికారులుగానీ ఇచ్చిన ఆర్డర్ ఏమైనా ఉన్నాయా అనే వివరాలు తెలియజేయాలి అంటూ లిఖిత పూర్వకంగా ఒక వినతిపత్రం ఇచ్చి అక్నాలెడ్జిమెంట్ తీసుకోండి. కుదరని పక్షంలో రిజిస్టర్డ్ పోస్టు ద్వారా మీ దరఖాస్తును/వినతి పత్రాన్ని పంపవచ్చు. ఏదైనా పోలీసు కేసు వలన మీ ఎకౌంటు ఫ్రీజ్ అయిందని తెలిస్తే, సంబంధిత మెజిస్ట్రేట్ కోర్టు లో సి.ఆర్.పి.సి సెక్షన్ 457 ప్రకారం ఒక దరఖాస్తు చేసుకొని ఎకౌంటును డీ ఫ్రీజ్ చేయించుకోవచ్చు. లేకపోతే నేరుగా హైకోర్టులో ఒక రిట్ పిటిషన్ దాఖలు చేసి కూడా మీ అకౌంటును డీ ఫ్రీజ్ చేయమని కోరవచ్చు. అలాంటి కంప్లైంట్ ఏమీ లేకుండా ఒకవేళ బ్యాంకు వారు ఫ్రీజ్ చేసినట్టు అయితే అది కేవలం కొంతకాలానికి మాత్రమే చెల్లుతుంది. నేరంలో భాగంగా ఉన్న సొమ్మును అలాగే ఎకౌంట్లో ఉంచి మిగతా అకౌంట్ లావాదేవీలను డీ ఫ్రీజ్ చేయాలి అని కోర్టు ఆర్డర్ ఇవ్వవచ్చు. ఇకపోతే ఏదైనా ఎఫ్.ఐ.ఆర్.లో మీరు నిందారోపితుడు అయి ఉంటే తప్ప మీ ఉద్యోగానికి వచ్చిన ముప్పు ఏమీ లేదు. ఎందుకంటే మీరు నేరుగా ఎటువంటి నేరం చేయలేదు కాబట్టి. గేమ్స్ ఆడిన వారిపై ప్రస్తుతానికి శిక్షలు లేవు కనుక మీరు ఈ విషయాన్ని మీ కంపెనీ వారికి చెప్పినా ఏమీ కాదు. అయితే అలా చెప్పే ముందు సైబర్ కంప్లైంట్‌లో మీరు నిందారోపితుడుగా (అక్యూజ్డ్ గా) ఉన్నారేమో చూసుకోండి.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాల కోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

● బ్యూటిప్

బాగా పండిన అరటిపండు తొక్కతీసుకుని టేబుల్ స్పూన్ తేనె వేసి పేస్టులా రుబ్బుకోవాలి. ఈ పేస్టుని ముఖానికి పూతలా వేసుకుని పదిహేను నిమిషాల తరువాత కడిగేయాలి. ఈ ప్యాక్‌ను రెండురోజులకొకసారి వేసుకోవడం వల్ల చర్మానికి తేమ అంది, గ్లోగా కనిపిస్తుంది.

టేబుల్ స్పూన్ తేనె, టేబుల్ స్పూన్ రోజ్‌వాటర్‌ను తీసుకుని చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పూతల వేసి పదినిమిషాల తరువాత కడిగేయాలి. రోజూ ఇలా చేయడం వల్ల చర్మానికి యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్స్ గుణాలు అంది మొటిమలు తగ్గుముఖం పట్టడంతోపాటు, చర్మం మృదువుగానూ నిగారింపు సంతరించుకుంటుంది.



సోషల్ మీడియా

విన్నింగ్ కెప్టెన్ న్యూ కెప్టెన్



విమానంలో క్రికెట్ లెజెండ్ కపిల్‌దేవ్ కనిపించడం విశేషం కాకపోవచ్చు. అయితే ఈసారి మాత్రం విశేషంగా మారింది. ఇండిగో ఆహ్వానం మేరకు విమానంలోకి అడుగుపెట్టిన కపిల్‌దేవ్ కొత్తగా కెప్టెన్‌గా ప్రమోట్ అయిన ప్రియాంక యూనిఫామ్‌కు చారలపట్టి పిన్ చేశారు. ఈ ఫోటోని విమానయాన సంస్థ ఇండిగో 'ఎక్స్'లో తన అఫీషియల్ ఎకౌంట్‌లో షేర్ చేసింది.

'ఇది చిరస్మరణీయంగా గుర్తుండిపోయే సందర్భం. కెప్టెన్ కావడం అనేది చిన్న విషయమేమీ కాదు. ప్రియాంకకు తన విజయాన్ని ఎప్పుడూ గుర్తు చేసుకునే మధుర జ్ఞాపకం'... ఇలాంటి కామెంట్లు ఇండిగో పోస్ట్‌లో కనిపిస్తాయి.

'చూడముచ్చటైన దృశ్యం. గోవా టు దిల్లీ ఫ్లైట్‌లో ఈ అపురూప దృశ్యాన్ని చూసే అవకాశం నాకు వచ్చింది' అని రాశారు అదే ఫ్లైట్‌లో ప్రయాణించిన ఒక యూజర్.

'ఫ్రమ్ ఏ విన్నింగ్ కెప్టెన్ టు ఏ న్యూ కెప్టెన్' అన్నారు ఒకరు.

'కెప్టెన్ ప్రియాంక నేపథ్యం ఏమిటి? ఆ స్థాయికి రావడానికి పడిన కష్టాల గురించి రాసి ఉంటే ఎంతో మందికి స్ఫూర్తిగా ఉండేది' అని రాశారు ఒక యూజర్.


గినాడెవాలోవ్స్కి

అందరూ పనిచేసి రిటైర్ అయ్యే వయసులో తమను తాము కొత్తగా ఆవిష్కరించుకుంటున్నారు ఆరు పదుల వయసు దాటిన ఈ మహిళలు. ఇటీవల జరిగిన పారిస్ ఫ్యాషన్ వీక్‌లో ర్యాంప్ వాక్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది 60 ఏళ్ల జర్మన్ మోడల్ గినా. భారతదేశంలో రాజస్థాన్ వాసి 60 ఏళ్ల ముక్తాసింగ్ మోడలింగ్‌ను కెరియర్‌గా ఎంచుకొని, అందానికి కొత్త నిర్వచనం చూపుతోంది. అరవై ఏళ్ల వయసులో వీరి ఆరోగ్యకరమైన జీవనశైలి 20 ఏళ్ల యువతులకు కూడా స్ఫూర్తిని కలిగిస్తోంది. మలివయసును అందంగా తీర్చిదిద్దుకోవడానికి గినా, ముక్తా లనే ఉదాహరణగా తీసుకోవచ్చు.

* అరవైల్లో మోడలింగ్

సెకండ్ లైఫ్

గినా డ్రెవాలోవ్స్కి జర్మన్ మోడల్. కంటెంట్ క్రియేటర్. 60 ఏళ్ల వయసులో అందం, ఆత్మవిశ్వాసంతో జీవితాన్ని కొత్తగా మలుచుకుంది. ఇటీవల పారిస్ ఫ్యాషన్ వీక్‌లో ఐకానిక్ లె డే ఫైల్ షో సందర్భంగా రన్ వే పై నడిచింది గినా. ఆమె ప్రదర్శన ఫ్యాషన్ ప్రపంచం దృష్టిని ఆకర్షించడమే కాకుండా ప్రతిచోటా మహిళలు తమ బలాన్ని, సామర్థ్యాన్ని ఎంతలా నమ్ముకోవచ్చో లోకానికి చూపింది.

బోల్డ్ విజన్..: గినా డ్రెవాలోవ్స్కి

కంటెంట్ క్రియేటర్, ఫ్యాషన్ ప్రపంచంలోకి 58 ఏళ్ల వయసులో అడుగుపెట్టింది గినా. ఐదు పదులు దాటిన మహిళలకు సాధికారత కల్పించడం, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యం, స్వీయప్రేమను ప్రోత్సహించడమే లక్ష్యంగా కంటెంట్‌ను సృష్టించడం ప్రారంభించింది. 30 ఏళ్ల పాటు ఫ్యాషన్ పరిశ్రమలోని దిగ్గజాలతో కలిసి పనిచేసిన అనుభవం ఆమెది. కమ్యూనికేషన్, మార్కెటింగ్‌లో రాణించింది. డిజిటల్ రంగంలోకి అడుగుపెట్టి తన ఉత్సాహకరమైన జీవనానికి ఊపిరి పోసింది.

గినా సోషల్ మీడియా ద్వారా తన ప్రయాణాన్ని పంచుకుంటూ '58 ఏళ్ల వయసులో నేను సున్నా నుండి నా జీవితాన్ని ప్రారంభించాను. నచ్చిన పని, దూర దృష్టి, నా బలం, నమ్మకం, ఫీల్‌గుడ్ పవర్‌ను నా చుట్టూ ఉన్నవారిలో నింపడానికి ఇదో మార్గంగా ఎంచుకున్నాను. 60 ఏళ్ల వయసులో పారిస్‌లో రన్‌వేపై నడవడం సాధారణమైనది కాదు. అది నా వయసున్న ఎంతోమందికి సందేశం. వయసు మన ఆలోచనలను పరిమితం చేయదు' అని తెలియజేసింది.

ఆమె చేసిన ఈ పని చాలామందిని ఆకట్టుకుంది. వృద్ధాప్య జీవనాన్ని అందంగా మలుచుకోవాలనేవారికి గినా రోల్‌మోడల్‌గా నిలిచింది. వృద్ధాప్యంలోనూ ఆమె చర్మం, శరీరాకృతి, వెలుతురు నింపుకున్న నమ్మకం ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని ఆశ్చర్యపరిచింది. గినా కథ కేవలం ఫ్యాషన్ విజయం మాత్రమే కాదు. ఆమె పట్టుదల, శక్తి, జీవనశైలి, సానుకూల మనస్తత్వానికి నిదర్శనం. మహిళలు అనుకుంటే తమ జీవనాన్ని ఎలా మార్చుకోగలరో, ఆరోగ్యం, మానసిక శ్రేయస్సుకు ఎంత ప్రాధాన్యత ఇవ్వగలరో, అద్భుత విజయాలను ఎలా సొంతం చేసుకోగలరో ఉదాహరణగా చూపిస్తుంది. కలలను కొనసాగించే విషయంలో వయసు కేవలం ఒక అంకె మాత్రమే అని మరోమారు నిరూపించింది.

స్టైలిష్ అమ్మమ్మ: ముక్తాసింగ్

తెల్లని జుట్టుతో మోడలింగ్‌ను కెరీర్‌గా తీసుకుని విజయవంతంగా రాణిస్తోంది 62 ఏళ్ల ముక్తాసింగ్. తల్లి, అమ్మమ్మ నుండి ప్రేరణ పొందాను అని చెప్పే ముక్తా సింగ్ రాజస్థాన్ వాసి. తన సెకండ్ జర్నీ గురించి సోషల్ మీడియా ద్వారా వీక్షకులకు తరచూ చెబుతూనే ఉంటుంది. ఆత్మగౌరవాన్ని అందాన్ని పునర్ నిర్వచించడంలోని ప్రాముఖ్యతను వివరిస్తుంది. వయసు కారణంగా గుర్తింపును పరిమితం చేయలేమని చెబుతుంది.

50 ఏళ్ల వయసులో మోడల్ కావాలని నిర్ణయించుకొని, అందుకు సంబంధించిన ఫొటోలను, వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసినప్పుడు ముక్తాసింగ్ చాలా విమర్శలను ఎదుర్కొంది. ఎగతాళి చేసే కామెంట్స్‌కు బాధపడింది. కానీ, ఎవరి కోసమో తన తీరు మార్చుకోనవసరం లేదని, తనకు ఎంతో ఇష్టమైన పనిని ఎంచుకుంది.

ముక్తా చిన్నతనంలో స్టైలిష్‌గా ఉండే వృద్ధమహిళలను ఎప్పుడూ మెచ్చుకునేది. 'మా అమ్మమ్మ పెద్ద వయసులోనూ బెంగాలీ కాటన్ చీరలలో ఎంతో అందంగా కనిపించేది. మరణశయ్యపై ఉండి కూడా మంచి దుస్తులు ధరించాలని కోరుకునేది. వృద్ధాప్యంలో స్టైలిష్‌గా ఉండటం గురించి ఆలోచనే అవసరం లేదనే మాటలను పట్టించుకోకూడదు. అది ఆత్మగౌరవానికి సంబంధించింది' అని ముక్తా చెబుతుంది.


ముక్తాసింగ్

ఇంగ్లిష్‌లో మాస్టర్స్ పూర్తి చేసిన తర్వాత ముక్తా యుద్ధ విమాన పైలట్‌ను పెళ్లి చేసుకుంది. తర్వాత ఇద్దరు పిల్లలను పెంచడంలో, కంటెంట్ రైటర్‌గానూ బిజీగా మారిపోయింది. 'ఆ సమయంలో చాలా ఒత్తిడికి గురయ్యేదాన్ని. నా పిల్లలు పెద్దవాళ్లయ్యాక వారి పాత చొక్కాలు, జీన్స్ వేసుకొని అద్దంలో చూసుకొని మురిసిపోయేదాన్ని. మెల్లగా వయసు పైబడటం జరిగిపోతూనే ఉంది. తెల్లబడుతున్న జుట్టుకు రంగు వేయాలన్న ఆలోచన కూడా లేదు. చాలా మంది జుట్టుకు రంగు వేసుకోకపోతే జీవితాన్ని వదులుకున్నట్టే అని చెప్పేవారు. కానీ, తెల్ల జుట్టుతోనే మెరుస్తాను చూడండి అని వారికి చెప్పేదాన్ని. ఇప్పుడు దానిని నిజం చేస్తున్నాను. మంచి పేరున్న కంపెనీలకు మోడలింగ్ చేస్తున్నాను. ఆదాయాన్నీ ఆర్జిస్తున్నాను. ఈ వయసులోనూ నా కలలను నెరవేర్చుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది' అని వివరిస్తుంది ముక్తాసింగ్.

ఆడ–మగ ఎవరైనా సరే, స్వీయ ఆవిష్కరణ, సాధికారత కోసం తప్పక ప్రయత్నిస్తూనే ఉండాలి. అప్పుడే మన ప్రయాణం చాలా మందికి స్ఫూర్తినిస్తుందని గినా, ముక్తా తమ జీవనం ద్వారా మనకు విలువైన పాఠాలు బోధిస్తున్నారు. ●

బులియన్

(బంగారం 10 గ్రా.। వెండి కిలో) అక్టోబర్ 7న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,25,110	1,12,550	1,61,000
విజయవాడ	1,24,000	1,11,850	1,57,100
విశాఖపట్నం	1,22,020	1,11,850	1,67,100
రాజమండ్రి	1,24,000	1,15,200	1,57,100
ప్రొద్దుటూరు	1,24,500	1,14,540	1,56,000
చెన్నై	1,22,180	1,12,000	1,67,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.




హుసాముద్దీన్‌కు స్వర్ణ పతకం

భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) కప్ టోర్నమెంట్‌లో సర్వీసెస్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్ స్వర్ణ పతకంతో మెరిశాడు. చెన్నైలో మంగళవారం ముగిసిన ఈ టోర్నీలో నిజామాబాద్ జిల్లాకు చెందిన హుసాముద్దీన్ 60 కేజీల విభాగంలో చాంపియన్‌గా నిలిచాడు. ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో హుసాముద్దీన్ 5-0తో సాగర్ (భారత స్పోర్ట్స్ అథారిటీ)పై ఘనవిజయం సాధించాడు. 31 ఏళ్ల హుసాముద్దీన్ 2023 ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో... 2018 గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్‌లో... 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో... 2022 ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు సాధించాడు. బీఎఫ్ఐ కప్‌లో సర్వీసెస్ బాక్సర్లు తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. మొత్తం ఏడు వెయిట్ కేటగిరీల్లో సర్వీసెస్ బాక్సర్లు పసిడి పతకాలను సొంతం చేసుకున్నారు. హుసాముద్దీన్‌తోపాటు విశ్వనాథ్ (50 కేజీలు), ఆశిష్ (55 కేజీలు), వంశజ్ (65 కేజీలు), సచిన్ (75 కేజీలు), అంకుశ్ (80 కేజీలు), నవీన్ బూరా (85 కేజీలు) సర్వీసెస్ జట్టుకు బంగారు పతకాలు అందించారు. సర్వీసెస్‌కే చెందిన ఆశిష్ పురుషుల విభాగంలో 'బెస్ట్ బాక్సర్' అవార్డు గెల్చుకోగా... మహిళల విభాగంలో ఖుషీ జాదవ్ (మహారాష్ట్ర; 54 కేజీలు) 'బెస్ట్ బాక్సర్' పురస్కారాన్ని దక్కించుకుంది.

అమన్‌పై ఏడాది నిషేధం

- భారత స్టార్ రెజ్లర్‌పై జాతీయ సమాఖ్య క్రమశిక్షణ చర్య
- అధిక బరువుతో వరల్డ్ చాంపియన్‌షిప్‌లో అనర్హతకు గురైన అమన్



న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్, పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత అమన్ సెహ్రావత్‌పై ఏడాది నిషేధం పడింది. నిర్ణీత బరువు కంటే అధికంగా ఉన్న కారణంగా ఇటీవల ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌నకు దూరమైన అమన్‌పై భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) చర్యలు తీసుకుంది. గత నెలలో క్రొయేషియా వేదికగా జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ 57 కేజీల విభాగంలో బరిలోకి దిగాల్సిన అమన్... 1700 గ్రాములు అధిక బరువు కారణంగా పోటీలకు దూరమయ్యాడు. దీంతో పతకం సాధిస్తాడనే ఆశలు ఉన్న అమన్ పోటీకి అనర్హుడిగా తేలడంతో డబ్ల్యూఎఫ్ఐ క్రమశిక్షణ కమిటీ చర్యలు తీసుకుంది. అమన్ వివరణతో అసంతృప్తి వ్యక్తం చేసిన కమిటీ... ఏడాది కాలం పాటు అతడు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనకుండా నిషేధం విధించింది. ఈ నిషేధం గత నెల సెప్టెంబర్ 23 నుంచి అమల్లోకి వచ్చినట్లు డబ్ల్యూఎఫ్ఐ వెల్లడించింది. అతడి శిక్షణ సిబ్బందిని హెచ్చరించి వదిలేసింది. పోటీలకు రెండు వారాల ముందే క్రొయేషియాకు వెళ్లిన అమన్... పోటీలు ప్రారంభమయ్యే సమయానికి నిర్ణీత బరువును కొనసాగించలేకపోవడం తప్పుడు సంకేతమని డబ్ల్యూఎఫ్ఐ పేర్కొంది. 'ఒలింపిక్ పతకం సాధించిన రెజ్లర్ నుంచి అత్యుత్తమ క్రమశిక్షణ ఆశిస్తాం. అలాంటిది నిర్ణీత బరువును కొనసాగించలేకపోవడం సరైంది కాదు. అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్టకు సంబంధించిన అంశంలో తాత్సారానికి తావు లేదు. ఇది దేశ ప్రజల ఆశలను వమ్ము చేయడమే' అని డబ్ల్యూఎఫ్ఐ వెల్లడించింది. గతేడాది పారిస్ ఒలింపిక్స్ సందర్భంగా వినేశ్ ఫొగాట్, ఈ ఏడాది ప్రపంచ అండర్-20 చాంపియన్‌షిప్ సందర్భంగా నేహా సాంగ్వాన్ కూడా ఇలాగే అధిక బరువుతో పోటీలకు దూరమయ్యారు.

గట్టెక్కిన ఇంగ్లండ్

బంగ్లాదేశ్‌పై నాలుగు వికెట్ల తేడాతో గెలుపు

- హీథర్ నైట్ కీలక ఇన్నింగ్స్
- చార్లీ డీన్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- మహిళల వన్డే ప్రపంచకప్



సోఫీ

హీథర్ నైట్

గువాహటి: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల వన్డే ప్రపంచ కప్‌లో ఇంగ్లండ్ జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. తొలి పోరులో దక్షిణాఫ్రికాపై సునాయాసంగా నెగ్గిన ఇంగ్లండ్... రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై గెలిచేందుకు కష్టపడాల్సి వచ్చింది. స్వల్ప లక్ష్యఛేదనలో మొదట్లో తడబడ్డా ఆ తర్వాత తేరుకొని విజయ తీరాలకు చేరింది. మంగళవారం జరిగిన ఈ పోరులో నాట్ సీవర్ బ్రంట్ నాయకత్వంలోని ఇంగ్లండ్ నాలుగు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ జట్టు 49.4 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌటైంది. శోభన మోస్తారీ (108 బంతుల్లో 60; 8 ఫోర్లు) అర్ధ శతకంతో మెరిపించింది. ఆఖర్లో రాబియా ఖాన్ (27 బంతుల్లో 43 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ షాట్లతో ఆకట్టుకుంది. షర్మీన్ అక్తర్ (30; 6 ఫోర్లు) ఫర్వాలేదనిపించింది. కెప్టెన్ నిగార్ సుల్తానా (0) డకౌట్ కాగా... రూబ్యా (4), షోర్నా అక్తర్ (10), రీతు మోని (5), ఫహీమ ఖాతూన్ (7), నహిదా అక్తర్ (1) విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్ 3 వికెట్లు పడగొట్టగా... లిన్సే స్మిత్, చార్లీ డీన్, అలీస్ కాప్సీ తలా రెండు వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ 46.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హీథర్ నైట్ (111 బంతుల్లో 79 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించింది. కెప్టెన్ సీవర్ బ్రంట్ (41 బంతుల్లో 32; 5 ఫోర్లు), అలీస్ కాప్సీ (20; 3 ఫోర్లు), చార్లీ డీన్ (27 నాటౌట్; 2 ఫోర్లు) తలాకొన్ని పరుగులు చేశారు. బంగ్లాదేశ్ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆకట్టుకోవడంతో... ఇంగ్లండ్ ఇన్నింగ్స్ సాఫీగా సాగలేదు. లక్ష్యం చిన్నదే అయినా... బంగ్లా క్రమశిక్షణాయుత బౌలింగ్‌తో దాన్ని కఠినతరంగా మార్చింది. అమీ జోన్స్ (1), బ్యూమౌంట్ (13), సోఫీ డంక్లీ (0), ఎమ్మా లాంబ్ (1) విఫలమయ్యారు. దీంతో ఒకదశలో ఇంగ్లండ్ 78 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే బంగ్లాదేశ్‌కు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా హీథర్ నైట్ ఇన్నింగ్స్‌కు ఇరుసుగా నిలిచింది. వన్‌డౌన్‌లో దిగిన నైట్... చివరి వరకు అజేయంగా నిలిచింది. అబేధ్యమైన ఏడో వికెట్‌కు డీన్‌తో కలిసి 79 పరుగులు జోడించింది. బంగ్లాదేశ్ బౌలర్లలో ఫహీమా ఖాతూన్ 10 ఓవర్ల కోటాలో 16 పరుగులే ఇచ్చి 3 వికెట్లు పడగొట్టింది. మారుఫా అక్తర్ 2 వికెట్లు తీసింది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి ఇంగ్లండ్ 4 పాయింట్లతో అగ్ర స్థానానికి చేరింది.

నేడు కొలంబో వేదికగా జరిగే మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో ఆస్ట్రేలియా తలపడనుంది.



రక్షిత శ్రీ

భారత్‌కు రెండో గెలుపు

గువాహటి: ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య భారత జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. శ్రీలంక జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'హెచ్' లీగ్ మ్యాచ్‌లో భారత్ 2-0 (45-27, 45-21) తేడాతో గెలుపొందింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టుతో నేడు జరిగే మ్యాచ్‌లో భారత్ నెగ్గితే గ్రూప్ 'టాపర్'గా నిలిచి క్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధిస్తుంది. ఈ టోర్నీలో కొత్త రిలే స్కోరింగ్ పద్ధతిలో మ్యాచ్‌లను నిర్వహిస్తున్నారు. తొలి సెట్ మ్యాచ్‌లో భారత్ తరఫున హమర్ లాల్‌థాజువాలా, మిథిలేశ్-భవ్య చాబ్రా జోడీ, మాన్సి-రేషిక జంట, రక్షిత శ్రీ, లాల్‌రామ్‌సాంగా-తారిణి ద్వయం ప్రత్యర్థులపై గెలుపొందారు. రెండో సెట్ మ్యాచ్‌లో రౌనక్ చౌహాన్, అరిగెల భార్గవ్ రామ్-గొబ్బూరు విశ్వతేజ్ జోడీ, వెన్నెల కలగోట్ల-ఏంజెల్ పునేరా జంట, ఉన్నతి హుడా, లాల్‌రామ్‌సాంగా-ఆన్యా బిష్త్ ద్వయం ప్రత్యర్థులపై నెగ్గారు.

లింథోయ్ కొత్త చరిత్ర



లిమా (పెరూ): ప్రపంచ జూనియర్ జూడో చాంపియన్‌షిప్‌లో పతకం సాధించిన తొలి భారతీయ జూడో ప్లేయర్‌గా లింథోయ్ చనాంబం చరిత్ర సృష్టించింది. పెరూలో జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌లో మణిపూర్‌కు చెందిన 19 ఏళ్ల లింథోయ్ మహిళల 63 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. కాంస్య పతక బౌట్‌లో లింథోయ్ నెదర్లాండ్స్ క్రీడాకారిణి జోని జిలెన్‌పై విజయం సాధించింది. 2022లో బోస్నియా అండ్ హెర్జెగోవినాలో జరిగిన ప్రపంచ జూడో క్యాడెట్ చాంపియన్‌షిప్‌లో లింథోయ్ స్వర్ణ పతకం సాధించింది. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారతీయ ప్లేయర్‌గా ఆమె గుర్తింపు పొందింది. మూడేళ్ల క్రితం తాను నెగ్గిన స్వర్ణం గాలివాటమేమీ కాదని తాజాగా ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో ఆమె నిరూపించుకుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఆనంద్ X కాస్పరోవ్

మూడు దశాబ్దాల తర్వాత ఇద్దరు చెస్ దిగ్గజాలు 'ఢీ'

సెయింట్ లూయిస్ (అమెరికా): చదరంగ దిగ్గజాలు గ్యారీ కాస్పరోవ్ (రష్యా), విశ్వనాథన్ ఆనంద్ (భారత్) మరోసారి ముఖాముఖి పోరుకు సిద్ధమయ్యారు. 'క్లచ్ చెస్: ద లెజెండ్స్ టోర్నమెంట్' పేరుతో ఈ ఇద్దరి మధ్య ర్యాపిడ్, బ్లిట్జ్ ఫార్మాట్‌లో మూడు రోజులపాటు టోర్నీని నిర్వహించనున్నారు. 'చెస్ 960' మ్యాచ్‌లో భాగంగా ఆనంద్, కాస్పరోవ్ 12 గేమ్‌లు ఆడతారు. ప్రతి రోజు వీరిద్దరి మధ్య నాలుగు గేమ్‌లు (రెండు ర్యాపిడ్, రెండు బ్లిట్జ్) జరుగుతాయి. మొదటి రోజున గేమ్ గెలిస్తే ఒక్కో పాయింట్ దక్కుతుంది. రెండో రోజున గేమ్ గెలిస్తే రెండు పాయింట్ల చొప్పున... మూడో రోజున గేమ్ గెలిస్తే మూడు పాయింట్ల చొప్పున లభిస్తాయి. విజేతకు 70 వేల డాలర్లు (రూ. 62 లక్షలు), రన్నరప్ ప్లేయర్‌కు 50 వేల డాలర్లు (రూ. 44 లక్షలు) అందజేస్తారు. అధికారికంగా ఆనంద్, కాస్పరోవ్ చివరిసారి 1995లో క్లాసికల్ వరల్డ్ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం పోటీపడ్డారు. కాస్పరోవ్ 10.5-7.5తో ఆనంద్‌పై గెలిచి ప్రపంచ టైటిల్ దక్కించుకున్నాడు. 2004లో చెస్‌కు వీడ్కోలు పలికిన కాస్పరోవ్ ఎగ్జిబిషన్, బ్లిట్జ్ ఈవెంట్లలో... ఆనంద్ కొన్ని ఎంచుకున్న టోర్నీల్లో మాత్రమే బరిలోకి దిగుతున్నారు.



సాక్షి సినిమా

యూరప్‌లో ఫ్యామిలీ డ్రామా



సూర్య

సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. సూర్య కెరీర్‌లోని ఈ 46వ సినిమాలో మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తుండగా, రవీనా టాండన్, రాధికా శరత్‌కుమార్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఇటీవల యూరప్‌లో మొదలు పెట్టారట. సూర్యతో పాటుగా ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని టాలీవుడ్ టాక్. ఫ్యామిలీ డ్రామా, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రానికి 'విశ్వనాథన్ అండ్ సన్స్' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే వేసవిలో రిలీజ్ కానుంది. ఈ సినిమాకి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్.

సర్‌ప్రైజ్ ఏంటి?



బాహుబలి పోస్టర్

వెండితెరపై మరోసారి సందడి చేసేందుకు బాహుబలి వస్తున్న సంగతి తెలిసిందే. ప్రభాస్ హీరోగా రాజమౌళి దర్శకత్వం వహించిన చిత్రం 'బాహుబలి'. అనుష్కా శెట్టి, తమన్నా, రానా, రమ్యకృష్ణ, సత్యరాజ్, నాజర్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. ఆర్కా మీడియా వర్క్స్ బ్యానర్‌పై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మించిన ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదలైన సంగతి తెలిసిందే. తొలిభాగం 'బాహుబలి: ది బిగినింగ్' 2015 జూలై 10న విడుదల కాగా, రెండోభాగం 'బాహుబలి: ది కన్‌క్లూజన్' 2017 ఏప్రిల్ 28న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 'బాహుబలి: ది బిగినింగ్' విడుదలై పదేళ్లు అయిన సందర్భంగా ఈ రెండు సినిమాలను కలిపి 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఒకే భాగంగా ఈ నెల 31న విడుదల చేస్తున్నారు మేకర్స్. ఇప్పటికే విడుదల చేసిన టీజర్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. 'బాహుబలి: ది ఎపిక్' ప్రకటించినప్పటి నుంచి ఈ సినిమా నిడివి ఎన్ని గంటలు ఉంటుంది? అనే చర్చ, ఆసక్తి అందరిలో నెలకొంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో నిర్మాతల్లో ఒకరైన శోభు యార్లగడ్డ మాట్లాడుతూ– ''బాహుబలి' కోసం ముందుగా హీరో హృతిక్ రోషన్‌ను అనుకున్నామనే వార్తల్లో నిజం లేదు. 'బాహుబలి: ది ఎపిక్' నిడివి సుమారు 3 గంటల 40 నిమిషాలు ఉండొచ్చు. 'బాహుబలి 1' ముగిశాక ఇంటర్వెల్ ఉంటుంది. తర్వాత 'బాహుబలి 2' మొదలవుతుంది. క్లైమాక్స్‌లో 'బాహుబలి 3' ప్రకటన ఉంటుందనే వార్తలు అవాస్తవం. ఈ సినిమా కోసం ఇంకా చాలా పని చేయాల్సి ఉంది. అయితే 'బాహుబలి: ది ఎపిక్' క్లైమాక్స్‌లో మాత్రం చిన్న సర్‌ప్రైజ్ ఉంటుంది'' అని తెలిపారు. మరి ఆ సర్‌ప్రైజ్ ఏంటి? అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.

శింబు @ అరసన్



హీరో శింబు, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమాకు 'అరసన్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. కలైపులి ఎస్. థాను నిర్మించనున్న ఈ మూవీ టైటిల్‌ను మంగళవారం ప్రకటించారు. 'అరసన్' కథ నార్త్ చెన్నై నేపథ్యంతో సాగే గ్యాంగ్‌స్టర్ డ్రామా అని టాక్. ఈ నెలలోనే రెగ్యులర్ చిత్రీకరణను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారట మేకర్స్. శింబు కెరీర్‌లోని ఈ 49వ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం సమంత, సాయిపల్లవి, రుక్మిణీ వసంత్‌లను సంప్రదించాలనే ఆలోచనలో ఉందట చిత్రయూనిట్. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తారని కోలీవుడ్ టాక్. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

టైమ్ బ్యాడ్ అయితే కె ర్యాంప్ రా...

కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన తాజా చిత్రం 'కె-ర్యాంప్'. జైన్స్ నాని రచన, దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో యుక్తి తరేజా హీరోయిన్. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్లపై రాజేష్ దండ, శివ బొమ్మకు నిర్మించిన ఈ చిత్రం దీపావళి పండగ సందర్భంగా ఈ నెల 18న విడుదలకానుంది. చేతన్ భరద్వాజ్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'టిక్కల్ టిక్కల్...' అంటూ సాగే మూడో పాటని విడుదల చేశారు మేకర్స్. 'కలిసి వచ్చే కాలం ముందు నువ్వు సూపర్ రా..., టైమ్ కాస్త బ్యాడ్ అయితే కె ర్యాంప్ రా..., ఫ్లవర్ లాంటి లవర్ ఉంటే లైఫ్ సూపర్ రా..., ఫ్లవర్ కాస్త ఫైర్ ఐతే కె ర్యాంప్ రా..., ఒక్క పెగ్గే కిక్కునిస్తే నువ్వు సూపర్ రా... ఫుల్ కొట్టినా పిచ్చి పడితే కె ర్యాంప్ రా..., టిక్కల్ టిక్కల్...' అంటూ ఈ పాట సాగుతుంది. సురేంద్ర కృష్ణ సాహిత్యం అందించిన ఈ పాటని సాయి చరణ్ భాస్కరుని పాడారు. వీకే నరేష్, సాయి కుమార్, 'వెన్నెల' కిషోర్ ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: సతీష్ రెడ్డి మాసం, సంగీతం: చేతన్ భరద్వాజ్, సహ నిర్మాత: బాలాజీ గుట్ట.



కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా

ప్రతిరోజూ నేర్చుకోవడం నాకు ఇష్టం - నీరజ కోన

"స్కూల్ డేస్ నుంచే నాకు రైటింగ్ అంటే ఇష్టం. కథలు చెప్పడం ఇంకా ఇష్టం. అలా కొన్ని కథలు రాసుకున్నాను. నా స్నేహితులు రానా, నాని వంటి వారు బాగా సపోర్ట్ చేశారు. ఒక దశలో సినిమా కథ రాయగలననే నమ్మకం కలిగింది. అలా రాసుకున్న కథే ఈ 'తెలుసు కదా'" అని అన్నారు నీరజ కోన. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన చిత్రం 'తెలుసు కదా'. శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానుంది. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ చిత్రంతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ఈ సందర్భంగా మంగళవారం విలేకరులతో ఆమె పంచుకున్న విశేషాలు...



- 'తెలుసు కదా' మంచి ప్రేమ కథా చిత్రం. ప్రేమకథతో పాటు ఒక కాంప్లెక్స్ సిటీ కూడా ఉంది. నేను మహిళా దర్శకురాలిని కనుక ఈ సినిమా కథను మహిళా దృష్టి కోణంలో చెప్పలేదు. నిజాయితీగా చెప్పే ప్రయత్నం చేశాం. ఫస్ట్ సిట్టింగ్‌లోనే నా కథను సిద్ధు జొన్నలగడ్డ ఓకే చేయడం, దర్శకురాలిగా నాకు అవకాశం రావడం నా లైఫ్‌లో మెమొరబుల్ మూమెంట్.
- సిద్ధుపై టిల్లు క్యారెక్టర్ షాడో ఉండొచ్చు. కానీ, తను మంచి పెర్ఫార్మర్. ఈ సినిమాలో స్క్రీన్‌పై తను పోషించిన వరుణ్ పాత్రని మాత్రమే ఆడియన్స్ చూస్తారు. కథలో కాంప్లెక్స్‌గా ఉండే రాగ పాత్ర కోసం శ్రీనిధిని తీసుకున్నాం. మెచ్యూర్డ్ క్యారెక్టర్ అంజలి పాత్రకి రాశి సరిపోయారు. టీజీ విశ్వప్రసాద్‌గారు లేకపోతే ఈ సినిమాయే లేదు. ఈ సినిమా ప్రయాణంలో కృతీ ప్రసాద్‌తో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. ఈ సినిమాకి తమన్ మ్యూజిక్ బ్యాక్ బోన్.
- నేను ఏ సినిమాకీ కూడా అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేయలేదు. కానీ, కాస్ట్యూమ్ డిజైనర్‌గా 12 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. నా కెరీర్ స్టార్టింగ్‌లోనే ఎన్టీఆర్, రామ్‌చరణ్, రవితేజ, విజయ్, సూర్య వంటి టాప్ హీరోలు చేసిన సినిమాలకు పని చేశాను. అదే నా లెర్నింగ్ స్కూల్, ఎక్స్‌పీరియన్స్. ప్రతిరోజూ నేర్చుకోవడం నాకు ఇష్టం. ఇప్పటికీ నేను ప్రతిదీ నా తొలి సినిమా అన్నట్లుగా భయం, టెన్షన్‌తో పనిచేస్తుంటాను. దర్శకురాలిగా నా తర్వాతి చిత్రం కూడా లవ్‌స్టోరీనే. త్వరలోనే వివరాలు చెబుతాను.

అంతకుమించి నవ్వులు పంచుతుంది - ప్రియదర్శి

''ప్రేక్షకులు హాయిగా నవ్వుకుని సంతోషంగా బయటకు వెళ్లాలనే ఉద్దేశంతో 'మిత్ర మండలి' సినిమా చేశాం. 'జాతిరత్నాలు' సినిమాతో 'మిత్రమండలి'కి పోలిక లేదు. కానీ, 'జాతిరత్నాలు'కు మించి మా సినిమా నవ్వులు పంచుతుంది. ఓ సామాజిక అంశాన్ని కాస్త వ్యంగ్యంగా చూపించే ప్రయత్నం చేశాం'' అని ప్రియదర్శి అన్నారు. విజయేందర్. ఎస్ దర్శకత్వంలో ప్రియదర్శి, నిహారిక ఎన్ఎమ్ జంటగా, విష్ణు, రాగ్ మయూర్, ప్రసాద్ బెహ్రా ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'మిత్రమండలి'. బన్నీ వాసు సమర్పణలో కల్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ప్రియదర్శి మాట్లాడుతూ–''నలుగురు స్నేహితులు సరదాగా మాట్లాడుకుంటే ఎంత ఆనందంగా ఉంటుందో, అలా ఈ 'మిత్రమండలి' ఉంటుంది'' అని తెలిపారు. ''మిత్రమండలి' అందర్నీ నవ్విస్తుంది'' అన్నారు బన్నీ వాసు. ''తొలి సినిమాలోనే ప్రాధాన్యం ఉన్న పాత్ర రావడం సంతోషంగా ఉంది'' అని నిహారిక ఎన్ఎమ్ చెప్పారు. ఈ వేడుకలో దర్శక-నిర్మాత ఆదిత్యాహాసన్, 'లిటిల్ హార్ట్స్' చిత్ర యూనిట్ పాల్గొన్నారు.



విజయేందర్, బన్నీ వాసు, ప్రియదర్శి, నిహారిక, రాగ్ మయూర్

హ్యాపీడేస్ రోజులు గుర్తొచ్చాయి - వరుణ్ సందేశ్

''నా కెరీర్‌లో అక్టోబర్‌ని మరచిపోలేను. నేను నటించిన తొలి చిత్రం 'హ్యాపీ డేస్'(2007) అక్టోబరులోనే విడుదలై నా కెరీర్‌ని మలుపు తిప్పింది. ఇప్పుడు 'కానిస్టేబుల్' చిత్రం కూడా ఇదే నెలలో విడుదలవుతుండటంతో 'హ్యాపీ డేస్' రోజులు గుర్తొచ్చాయి'' అని హీరో వరుణ్ సందేశ్ చెప్పారు. ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా నటించిన చిత్రం 'కానిస్టేబుల్'. జాగృతి మూవీ మేకర్స్‌పై బలగం జగదీష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ– ''సమాజంలో జరుగుతున్న అంశాల ప్రేరణతో వినోదం, సందేశంతో రూపొందిన చిత్రం 'కానిస్టేబుల్''' అని చెప్పారు. ''ఒక అమ్మాయికి అవమానం జరిగితే దాని పరిణామాలు ఎలా ఉంటాయి? అనే అంశాన్ని మా సినిమాలో చూపించాం'' అన్నారు బలగం జగదీశ్. ''ట్రైలర్, పాటలకు వచ్చిన స్పందన సినిమా పట్ల మా నమ్మకాన్ని పెంచింది'' అని ఆర్యన్ సుభాన్ పేర్కొన్నారు. ఈ వేడుకలో హీరోలు అర్జున్, కార్తీక్ రాజు, విశ్వ కార్తికేయ, కెమెరామెన్ హజరత్, సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్, సహ నిర్మాతలు నిఖిత జగదీష్, కుపేంద్ర పవర్ పాల్గొన్నారు.



జగదీశ్, వరుణ్ సందేశ్, ఆర్యన్ సుభాన్

స్టెప్పులు అదుర్స్



నోరా ఫతేహి

ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్నా జంటగా నటించిన తాజా చిత్రం 'థామా'. ఆదిత్యా సర్పోత్దార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నవాజుద్దీన్ సిద్ధిఖీ, పరేశ్ రావల్, సత్యరాజ్ కీలక పాత్రలు పోషించారు. మాడాక్ ఫిల్మ్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ నోరా ఫతేహి 'దిల్బార్ కి ఆంఖోన్ కా...' అనే స్పెషల్ సాంగ్ చేశారు. ఆ పాటని మంగళవారం విడుదల చేశారు మేకర్స్. సచిన్ జిగర్ సంగీతం అందించిన ఈ పాటని రశ్మీత్ కౌర్, జిగర్ సరైయా పాడారు. ఈ సాంగ్‌ని తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు నోరా. ప్రస్తుతం ఈ వీడియో సాంగ్ ఆన్‌లైన్‌లో ట్రెండింగ్‌గా మారింది. ప్రత్యేకించి నోరా ఫతేహి స్టెప్పులు అదుర్స్ అంటూ కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు నెటిజన్స్. ''చాలా రోజుల నుంచి నా అభిమానులు స్పెషల్ సాంగ్స్‌లో నన్ను మిస్ అయ్యారు. కానీ, 'థామా'లోని 'దిల్బార్ కి ఆంఖోన్ కా...' లాంటి ప్రత్యేక పాటతో మళ్లీ ఆ వైబ్‌ని తీసుకురాబోతున్నాను. ఇందులో మంచి హుక్ స్టెప్ ఉంది'' అంటూ నోరా ఫతేహి పేర్కొన్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
8-10-2025

స్టాక్ మార్కెట్లు (తెలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
137	31
81,927	25,108

విదేశీ సూచీలు

నాస్‌డాక్	22,753	▽	188
డోజోన్స్	46,506	▽	180
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,481	△	2
డాక్స్	24,761	△	11
హాంగ్‌సెంగ్	3,883	△	20
నికాయ్	47,950	△	6

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.35	89.37
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.27	121.25
€	యూరో	ఎస్‌బీఐ	102.60	105.40
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.28	59.97
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.69	59.84
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.35	70.07
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.79	24.28
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.29	24.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.59	13.42

బంగారం@4000



- తదుపరి టార్గెట్ 4,900 డాలర్లు!
- 2026 చివరికి చేరుకోవచ్చు
- గోల్డ్‌మన్ శాక్స్ అంచనాలు

న్యూఢిల్లీ: కనకం రోజుకో కొత్త రికార్డులతో ఆకాశమే హద్దుగా పరుగులు తీస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో తొలిసారి 4,000 డాలర్ల (ఔన్స్‌కు) కీలక మైలురాయిని దాటింది. కామెక్స్ ఫ్యూచర్స్‌లో 4,014 డాలర్ల స్థాయిని నమోదు నమోదు చేసింది. దీంతో అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ శాక్స్ 2026 చివరికి 4,900 డాలర్లకు చేరుకోవచ్చని ప్రకటించింది. 4,300 డాలర్ల గత అంచనాలను భారీగా పెంచింది. పసిడి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు)లోకి అదే పనిగా వస్తున్న పెట్టుబడులు, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్ల నేపథ్యంలో ఈ అంచనాకు వచ్చింది. ప్రైవేటు రంగం వైవిధ్యం కోసం గోల్డ్ ఈటీఎఫ్‌లను ఆశ్రయిస్తుండడాన్ని సైతం పరిగణనలోకి తీసుకుంది. సెంట్రల్ బ్యాంక్‌లు 2025లో నెలకు 80 టన్నులు, 2026లో నెలకు 70 టన్నుల మేర బంగారం కొనుగోలు చేయొచ్చని అంచనా వేసింది. ముఖ్యంగా వర్ధమాన దేశాల సెంట్రల్ బ్యాంకులు ఈ దిశగా కీలక పాత్ర పోషిస్తున్నట్టు పేర్కొంది. ఇక యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల కోతపై అంచనాలు సైతం బంగారంలో బుల్లిష్ సెంటిమెంట్‌కు కారణంగా తెలిపింది. 2026 మధ్య నాటికి ఫెడ్ 100 బేసిస్ పాయింట్ల మేర రేట్లను తగ్గించొచ్చని.. ఇది బంగారం తదితర ఆస్తులకు డిమాండ్‌ను పెంచుతుందని పేర్కొంది. ఈ ఏడాది గోల్డ్ ఈటీఎఫ్లోకి పెట్టుబడులు 17 శాతం పెరగడాన్ని మెహతా ఈక్విటీస్ కమోడిటీ విభాగం వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కళంత్రి సైతం గుర్తు చేశారు. అమెరికాలో ఆర్థిక అనిశ్చితులు, ఫ్రాన్స్ తదితర దేశాల్లో రాజకీయ అలజడులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సైతం సురక్షిత సాధనంగా బంగారానికి డిమాండ్‌ను పెంచుతున్నట్టు చెప్పారు.

దేశీయంగా రూ.1.24 లక్షలు

ఢిల్లీ మార్కెట్లో పుత్తడి ధర (99.9 శాతం స్వచ్ఛత) మంగళవారం సరికొత్త ఆల్‌టైమ్ గరిష్టం రూ.1,24,000ను నమోదు చేసింది. 10 గ్రాములకు రూ.700 లాభపడింది. వెండి కిలోకి రూ.3,400 లాభపడి రూ.1,54,000కు చేరుకుంది.

కెనరా హెచ్ఎస్‌బీసీ @ రూ. 100-106

- ఈ నెల 10-14 మధ్య ఐపీవో
- రూ. 2,516 కోట్ల సమీకరణకు రెడీ

న్యూఢిల్లీ: బీమా రంగ కంపెనీ కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 100-106 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 10న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారు 23.75 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా కంపెనీ రూ. 2,516 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. 14న ముగియనున్న ఇష్యూలో భాగంగా యాంకర్ ఇన్వెస్టర్లకు 9న షేర్లను ఆఫర్ చేయనుంది. లిస్టింగ్‌లో కంపెనీ విలువ రూ. 10,000 కోట్లుగా నమోదయ్యే వీలుంది. ఈ భాగస్వామ్య సంస్థలో పీఎస్‌యూ కెనరా బ్యాంక్‌కు 51%, హెచ్ఎస్‌బీసీ గ్రూప్ కంపెనీ హెచ్ఎస్‌బీసీ ఇన్సూరెన్స్ (ఏషియా పసిఫిక్) హోల్డింగ్స్‌కు 26% చొప్పున వాటా ఉంది. ఐపీవోలో కెనరా బ్యాంక్ 13.77 కోట్ల షేర్లు(14.5 శాతం వాటా), హెచ్ఎస్‌బీసీ ఇన్సూరెన్స్ 47.5 లక్షల షేర్లు(0.5 శాతం వాటా) తోపాటు.. ఇన్వెస్టర్ సంస్థ పంజాబ్ నేషనల్‌బ్యాంక్ (పీఎన్‌బీ) 9.5 కోట్ల షేర్లు(10 శాతం వాటా) విక్రయించనున్నాయి. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 140 షేర్లకు (ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఈ బాటలో ఈ నెల 9న కెనరా రొబెకో అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ ఐపీవో సైతం ప్రారంభం కానుంది. ఇది 13న ముగియనుంది.

నాలుగో రోజూ లాభాలే

- రాణించిన హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ షేర్లు
- సెన్సెక్స్ 137 పాయింట్లు ప్లస్
- 25,100 స్థాయిపైకి నిఫ్టీ

ముంబై: అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకుల షేర్లు 1% రాణించడంతో స్టాక్ మార్కెట్ నాలుగో రోజూ లాభపడింది. సంస్థాగత ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కలిసొచ్చాయి. ఫలితంగా మంగళవారం సెన్సెక్స్ 137 పాయింట్లు పెరిగి 81,927 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 31 పాయింట్లు బలపడి 25,108 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు, కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలపై ఆశలతో ప్రథమార్థమంతా స్థిరంగా ముందుకు కదలాయి. ఒక దశలో సెన్సెక్స్ 519 పాయింట్లు బలపడి 82,310 వద్ద, నిఫ్టీ 143 పాయింట్లు ఎగసి 25,221 వద్ద గరిష్టాలు నమోదు చేశాయి. అయితే ద్వితీయార్థంలో ఎఫ్ఎంసీజీ, కమోడిటీస్, ఐటీ, మెటల్ షేర్లలో లాభాల స్వీకరణతో సూచీల లాభాలు తగ్గాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ మూడు పైసలు బలహీనపడి 88.77 వద్ద స్థిరపడింది. ఆసియాలో జపాన్, సింగపూర్, తైవాన్, ఇండోనేషియా, కొరియా మార్కెట్లు లాభపడ్డాయి. సెలవు కారణంగా చైనా, హాంగ్ కాంగ్ మార్కెట్లు పనిచేయలేదు. యూరప్ మార్కెట్లు అరశాతం పెరిగాయి. అమెరికా సూచీలు స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి.



- బీఎస్ఈలో రంగాల వారీ ఇండెక్సుల్లో టెలికం 2.13%, రియల్టీ 1.09%, ఇంధన 0.50%, కన్జూమర్ డ్యూరబుల్స్ 0.28%, ఫైనాన్సియల్ సర్వీసెస్ 0.24%, ఐటీ 0.23 శాతం లాభపడ్డాయి.
- లాజిస్టిక్స్ సర్వీసు ప్రొవైడర్ గ్లోటిస్ లిస్టింగ్ నిరాశపరిచింది. ఇష్యూ ధర(రూ.129)తో పోలిస్తే బీఎస్ఈలో 32% డిస్కౌంటుతో రూ.88 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 37% క్షీణించి రూ.81 కనిష్టాన్ని తాకింది. చివరికి 35% పతనంతో రూ.84 వద్ద నిలిచింది.
- ఇష్యూ ధర (రూ.191) వద్దే ఫ్లాటుగా లిస్టయిన ఫ్యాబ్‌టెక్ టెక్నాలజీస్ షేరూ మెప్పించలేకపోయింది. ఇంట్రాడేలో 5% పతనమై రూ.181 వద్ద కనిష్టాన్ని తాకింది. మార్కెట్ ముగిసే సరికి 4.5% నష్టంతో రూ.182 వద్ద స్థిరపడింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
టాటా ట్రస్ట్స్‌లో ఆధిపత్య పోరు కేంద్రం చెంతకు పంచాయితీ! | జీడీపీ అంచనాలు అప్

ఏఐ దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలి

- రిస్క్ మేనేజ్‌మెంట్‌ని పటిష్టం చేసుకోవాలి
- ఫిన్‌టెక్ సంస్థలకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచన

ముంబై: ప్రజలను మోసగించేందుకు నేరగాళ్లు కృత్రిమ మేధను (ఏఐ) ఉపయోగించి క్లోనింగ్, ఫేక్ వీడియోల్లాంటివి సృష్టిస్తున్నారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట వేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని, రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థలను పటిష్టం చేసుకోవాలని ఫిన్‌టెక్ సంస్థలకు సూచించారు. 6వ గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025లో పాల్గొన్న సందర్భంగా ఆమె ఈ విషయాలు చెప్పారు. వివిధ రకాల ఏఐ ఉత్పత్తులు, సర్వీసులను రూపొందించే విషయంలో గ్లోబల్ హబ్‌గా ఎదిగే సత్తా భారత్‌కి ఉందని మంత్రి చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పలు రకాల అవసరాలకు ఉపయోగపడే ఏఐ ఉత్పత్తులను సృష్టించగలదని, ఏఐ ఐడియాలను అభివృద్ధి చేసేందుకు, ప్రయోగాత్మకంగా పరీక్షించేందుకు ప్రయోగశాలగా కూడా ఉండగలదని ఆమె పేర్కొన్నారు.

ఏఐ చీకటి కోణం..: ఏఐతో ఆర్థిక రంగం, గవర్నెన్స్‌లో సానుకూల మార్పులు వచ్చినప్పటికీ, ఈ టెక్నాలజీలో చీకటి కోణం కూడా ఉందని ఆమె చెప్పారు. 'ఏఐతో అసాధారణ అవకాశాలు లభిస్తాయి. అదే సమయంలో అది దుర్వినియోగం కాకుండా కూడా మనం కట్టడి చేయాలి. కొత్త ఆవిష్కరణలకు దన్నుగా నిల్చే సాధనాలే మోసాలు చేసేందుకు ఆయుధాలుగా కూడా మారే అవకాశాలు ఉన్నాయి. ప్రజలను తప్పుదారి పట్టించేలా, వాస్తవాలను కప్పిపుచ్చేలా తయారు చేసిన నా డీప్‌ఫేక్ వీడియోలు ఎన్నో ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతుండటాన్ని నేను స్వయంగా చూశాను. ఇలాంటి వాటిని తక్షణం ఎదుర్కొనేందుకు మన వ్యవస్థలను తక్షణం బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది' అని చెప్పారు.

ఆర్థిక సాధికారతకు ఫిన్‌టెక్ దన్ను..

ఫిన్‌టెక్ అనేది ఏదో పట్టణ ప్రాంతాలకు పరిమితమైన సౌకర్యం కాదని, దేశవ్యాప్తంగా ఆర్థిక సాధికారతకు ఉపయోగపడే సాంకేతికతని మంత్రి చెప్పారు. యూపీఐ, డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలతో రోజువారీ జరిపే చెల్లింపుల తీరుతెన్నులను ఇది మార్చేసిందని పేర్కొన్నారు. ప్రపంచంలో దాదాపు సగభాగం రియల్ టైమ్ డిజిటల్ లావాదేవీలు భారత్‌లో జరుగుతున్నాయని తెలిపారు. 'మనం ఆర్థికంగా ఎలాంటి భవిష్యత్తును కోరుకుంటున్నాం, దాన్ని ఎలా సాధించదల్చుకుంటున్నాం అనేది ఆలోచించుకునేందుకు ఇది సరైన తరుణం. ఆదాయ వృద్ధి, కొత్త ఆవిష్కరణలు, లాభదాయకత, రిస్క్ సామర్థ్యాలు మొదలైన ప్రాథమికాంశాలపై ఫిన్‌టెక్‌లు తప్పకుండా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది' అని వివరించారు.



బయోమెట్రిక్‌తో యూపీఐ చెల్లింపులు..



ఏకీకృత చెల్లింపు విధానం (యూపీఐ)కి సంబంధించిన పలు సొల్యూషన్స్‌ని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఆవిష్కరించింది. ప్రస్తుతం డివైజ్‌లో యూపీఐ లావాదేవీ ధ్రువీకరణ కోసం ఉపయోగిస్తున్న పిన్ నంబరు స్థానంలో, బయోమెట్రిక్ విధానాన్ని (వేలి ముద్ర, ఫేస్ అన్‌లాక్) వాడేందుకు ఉపయోగపడే టెక్నాలజీని ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ఎం నాగరాజు ప్రవేశపెట్టారు. ఏటీఎంలలో నగదు విత్‌డ్రాయల్‌తో పాటు యూపీఐ పిన్‌ను సెట్ చేసేందుకు లేదా రీసెట్ చేసేందుకు కూడా దీన్ని ఉపయోగించవచ్చు. కొత్త యూజర్లు, సీనియర్ సిటిజన్లను కూడా యూపీఐ చెల్లింపుల పరిధిలోకి చేర్చేందుకు ఇది తోడ్పడుతుందని ఎన్‌పీసీఐ వివరించింది. అలాగే యూపీఐ క్యాష్ పాయింట్లలో యూపీఐని ఉపయోగించి నగదును విత్‌డ్రా చేసుకునే సదుపాయాన్ని కూడా ప్రవేశపెట్టినట్లు పేర్కొంది.

యూపీఐ లైట్ ద్వారా వేరబుల్ స్మార్ట్‌గ్లాసెస్‌తో కూడా చెల్లింపులు జరిపే సొల్యూషన్‌ని రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ టి. రవి శంకర్ ఆవిష్కరించారు. ఫోన్‌తో పని లేకుండా, పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం లేకుండా క్యూఆర్‌ని స్మార్ట్ కళ్లద్దాలతో స్కాన్ చేసి, వాయిస్ కమాండ్‌తో పేమెంట్ చేసేందుకు ఇది ఉపయోగపడుతుంది. చిన్న మొత్తాల్లో చెల్లింపులు అవసరమయ్యే రోజువారీ కొనుగోళ్లకు ఇది ఉపయోగకరం. ఇక జాయింట్ అకౌంట్ హోల్డర్లు కూడా చెల్లింపుల కోసం యూపీఐని ఉపయోగించే సదుపాయాన్ని ఆవిష్కరించింది. అటు ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్‌తో జట్టు కట్టినట్లు పేపాల్ ప్రకటించింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య



ఆర్ఆర్‌యూలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు

రాష్ట్రీయ రక్షా యూనివర్సిటీ(ఆర్ఆర్‌యూ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ప్రొఫెసర్-02, టెక్నికల్ అసిస్టెంట్-01, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్-01. » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ, ఎంబీఏ, ఎంఈ/ఎంటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 10.10.2025.
» **వెబ్‌సైట్:** https://rru.ac.in

ఎయిమ్స్ జమ్మూలో 80 ఫ్యాకల్టీ పోస్టులు

జమ్మూలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) రెగ్యులర్ ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 80.
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-24, అడిషనల్ ప్రొఫెసర్-15, అసోసియేట్ ప్రొఫెసర్-18, అసిస్టెంట్ ప్రొఫెసర్-23.
» **విభాగాలు:** అనెస్థీషియాలజీ, అనాటమీ, బయెకెమిస్ట్రీ, ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, టాక్సికాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, జనరల్ మెడిసిన్, నెఫ్రాలజీ, న్యూరాలజీ తదితరాలు.
» **అర్హత:**పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఎస్,ఎండీ,డీఎం, ఎంహెచ్, పీహెచ్‌డీ (అనాటమీ/బయోకెమిస్ట్రీ కార్డియాలజీ,బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ,అనెస్థీషియాలజీ, డెర్మటాలజీ)లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 50 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రొఫెసర్‌కు రూ.1,68,900 నుంచి రూ.2,20,400, అడిషనల్ ప్రొఫెసర్‌కు రూ.1,48,200 నుంచి రూ.2,11,400, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,38,300 నుంచి రూ. 2,09,200, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 1,01,500.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 03.10.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.10.2025.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.10.2025.
» **వెబ్‌సైట్:** www.aiimsjammu.edu.in

ఐఐఎం ముంబైలో జూనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ముంబై జూనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/ఎంటెక్(ఇండస్ట్రియల్/సిస్టమ్ ఇంజనీరింగ్, మెకానికల్, ప్రొడక్షన్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, మ్యాథమేటిక్స్, స్టాటిస్టిక్స్, ఆపరేషన్స్ రీసెర్చ్)లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:**నెలకు రూ.30,000 నుంచి రూ.50,000
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.10.2025.
» **వెబ్‌సైట్:** https://iimmumbai.ac.in

బీడీఎల్ సంగారెడ్డిలో 86 అప్రెంటిస్‌లు

సంగారెడ్డిలోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్).. గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 86.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు-60, టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్‌లు-26.
» **విభాగాలు:** ఈసీఈ, ఈఈఈ, కెమికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఈఐఈ.
» **అర్హత:**గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు బీఈ/బీటెక్, డిప్లొమా అప్రెంటిస్‌కు డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **స్టైపెండ్:**గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 30.09.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.10.2025.
» **నాట్స్ పోర్టల్ ఎన్‌రోల్ అవ్వడానికి చివరితేది:** 10.10.2025.
» **వెబ్‌సైట్:** https://bdlindia.in

డీఎస్ఎస్ఎస్‌బీ, ఢిల్లీలో 5,346 టీజీటీ పోస్టులు

ఢిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు(డీఎస్ఎస్ఎస్‌బీ).. వివిధ విభాగాల్లో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 5,346.
» **సబ్జెక్టులు:** ఇంగ్లిష్, మ్యాథ్‌మేటిక్స్, సోషల్ సైన్స్, నేచురల్ సైన్స్, హిందీ, సంస్కృతం, ఉర్దూ,పంజాబీ,డ్రాయింగ్, స్పెషల్ ఎడ్యుకేషన్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 50 శాతం మార్కులతో బీఏ, బీఎస్సీ, బీఈడీ, బీఈఐ, ఈడీ, ఈడీ(డ్రాయింగ్/పెయింటింగ్/ఫైన్ ఆర్ట్స్)లో ఉత్తీర్ణతతో పాటు సీటెట్‌లో అర్హత సాధించి ఉండాలి.
» **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.44,900 నుంచి 1,42,400.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 09.10.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.11.2025.
» **వెబ్‌సైట్:** https://dsssb.delhi.gov.in

రైట్స్ లిమిటెడ్, గుర్గావ్‌లో 11 ఇంజనీర్ పోస్టులు

గుర్గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్) వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11.
» **పోస్టుల వివరాలు:** సెక్షన్ ఇంజనీర్(ఎస్,టీ)-01, సెక్షన్ ఇంజనీర్-ఎలక్ట్రికల్(ఎస్‌సీఏడీఏ)-01, ప్లానింగ్,ప్రొక్యూర్‌మెంట్ ఇంజనీర్-02, సెక్షన్ ఇంజనీర్/సివిల్-01, డ్రాయింగ్ అండ్ డిజైన్ ఇంజనీర్/ఎస్,టీ-01, డ్రాయింగ్ అండ్ డిజైన్ ఇంజనీర్/ఎలక్ట్రికల్-01, సెక్షన్ ఇంజనీర్-ఎలక్ట్రికల్-01, క్యూఎస్ అండ్ బిల్లింగ్ ఇంజనీర్-01, డిజైన్ ఇంజనీర్/సివిల్-01, అసిస్టెంట్ ఇన్విరాన్‌మెంటల్ ఎక్స్‌పర్ట్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 09.10.2025 నాటికి 55 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 12.09.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.10.2025.
» **ఇంటర్వ్యూ తేది:** 08.10.2025 నుంచి 10.10.2025 వరకు » **ఇంటర్వ్యూ వేదిక:** షికార్, ప్లాట్-1, లీజర్ వ్యాలీ, రైట్స్ భవన్, సెక్టార్-29, గురుగ్రామ్, 122001, హర్యానా.
» **వెబ్‌సైట్:** https://rites.com

ఐఐఎం ముంబైలో సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) ముంబైలో సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంటెక్(కంప్యూటర్ సైన్స్,మ్యాథ్‌మేటిక్స్, స్టాటిస్టిక్స్, ఆపరేషన్స్ రీసెర్చ్, సైంటిఫిక్ కంప్యూటింగ్ లేదా ఇండస్ట్రియల్,సిస్టమ్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.10.2025.
» **వెబ్‌సైట్:** https://iimmumbai.ac.in

అడ్మిషన్

జర్నలిజం కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ గుర్తింపు పొందిన జర్నలిజం కోర్సులకు ప్రవేశాలు నిర్వహిస్తోంది.

కోర్సులు-అర్హతలు

» **పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం(పిజీడిజె):** ఈ కోర్సు కాల వ్యవధి 12 నెలలు. ప్రవేశానికి కనీస విద్యార్హత డిగ్రీ.
» **డిప్లొమా ఇన్ జర్నలిజం(డిజె):** ఈ కోర్సు కాల వ్యవధి 6 నెలలు. ప్రవేశానికి కనీస విద్యార్హత డిగ్రీ.
» **డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం(డిటివిజె):** ఈ కోర్సు కాల వ్యవధి 6 నెలలు. ప్రవేశానికి కనీస విద్యార్హత డిగ్రీ.
» **సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం(సిజె):** ఈ కోర్సు కాల వ్యవధి 3 నెలలు. ప్రవేశానికి కనీస విద్యార్హత ఎస్ఎస్‌సీ.
» ఈ కోర్సుల్ని రెగ్యులర్‌గాను, కరస్పాండెన్స్(దూర విద్య)లోనూ చేయవచ్చు. ఆన్‌లైన్ తరగతుల సౌకర్యం ఉంది. ఇంటి దగ్గర నుంచి పాఠ్యాంశాలు లైవ్‌లో వినవచ్చు. తెలుగు లేదా ఇంగ్లిష్ బోధనా మాధ్యమంగా ఎంచుకోవచ్చు.

ముఖ్య సమాచారం:

» ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్లు జరుగుతున్నాయి.
» **దరఖాస్తు ఫారాలు పొందటానికి చివరి తేది:** 14.10.2025
» **అడ్మిషన్లు పొందటానికి చివరి తేది:**18.10.2025
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.apcj.in

స్పెషలిస్ట్ ఆఫీసర్‌గా సెటిలవుతారా!



» పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు జాబ్ నోటిఫికేషన్
» 190 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ

బ్యాంకు ఉద్యోగమే లక్ష్యంగా సిద్ధమవుతున్నారా.. అయితే,మీకు పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు స్వాగతం పలుకుతోంది!! మొత్తం 190 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో క్రెడిట్ మేనేజర్, అగ్రికల్చర్ మేనేజర్ పోస్టులు ఉన్నాయి. మూడంచెల ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. ఆకర్షణీయమైన వేతనంతో పాటు ఉన్నత హోదాను పొందవచ్చు. ఈ నేపథ్యంలో.. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకులో ఉద్యోగాలు, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..

- **మొత్తం పోస్టులు:** 190
  పోస్టుల వివరాలు: క్రెడిట్ మేనేజర్-130 పోస్టుల, అగ్రికల్చర్ మేనేజర్-60 పోస్టులు. (ఎస్సీ కోటా కింద-28, ఎస్టీ-13, ఓబీసీ-51, ఈడబ్ల్యూఎస్-19, అన్‌రిజర్వ్‌డ్-79 పోస్టులు ఉన్నాయి.)

వయసు

అభ్యర్థుల వయసు 23 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్యలో ఉండాలి.

అర్హతలు

- క్రెడిట్ మేనేజర్ పోస్టుకు.. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సీఏ, సీఎంఏ, సీఎఫ్ఏ, ఎంబీఏ(ఫైనాన్స్) వంటివృత్తిపరమైన కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించాలి. జనరల్ అభ్యర్థులు 60 శాతం, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులు 55 శాతం మార్కులతో పాసై ఉండాలి. షెడ్యూల్ కమర్షియల్ బ్యాంకులో మూడేళ్లు బ్రాంచ్ మేనేజర్‌గా పని చేసిన అనుభవం ఉండాలి.
- అగ్రికల్చర్ మేనేజర్‌కు.. ప్రభుత్వ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి వ్యవసాయం/ఉద్యానవనం/పాడి పరిశ్రమ/ పశుసంవర్ధకం /అటవీ/ వెటర్నరీ సైన్స్/అగ్రికల్చర్ ఇంజనీరింగ్/ పిసికల్చర్‌లో బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన కోర్సు చేసి ఉండాలి.జనరల్ అభ్యర్థులు 60 శాతం మార్కులతో, మిగతావారు 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులో సంబంధిత విభాగంలో కనీసం మూడేళ్లు పని చేసిన అనుభవం ఉండాలి.

వేతనం

ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.64,820 నుంచి రూ.93,960 వేతన శ్రేణి అందుతుంది. దీంతో పాటు హెచ్ఆర్ఏ, డీఏ, సీసీఏ, ఇతర అలవెన్సులు లభిస్తాయి.

మూడంచెల ఎంపిక ప్రక్రియ

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను మూడంచెల్లో ఎంపిక చేస్తారు. ముందుగా ఆల్‌లైన్ రాత పరీక్ష, ఆ తర్వాత స్క్రీనింగ్ ద్వారా ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇందులో ముందు వరుసలో నిలిచిన వారు ఫైనల్ లిస్టులో చోటు దక్కించుకుంటారు.

రాత పరీక్ష వంద మార్కులకు జరుగుతుంది. ఇందులో-ఇంగ్లిష్ లాంగ్వేజ్ 20 ప్రశ్నలు-20 మార్కులకు,జనరల్ అవేర్‌నెస్ 20ప్రశ్నలు-20మార్కులకు, ప్రొఫెషనల్ నాలెడ్జ్ 60 ప్రశ్నలు-60 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 105 నిమిషాలు.

బాధ్యతలు ఇలా

స్పెషలిస్టు ఆఫీసర్ హోదాలో పలు కీలక బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇందులో వినియోగదారులతో సత్సంబంధాలు, క్రెడిట్స్ ఆపరేషన్స్, వ్యాపార అభివృద్ధి, బ్రాంచ్ మేనేజ్‌మెంట్ ఆపరేషన్స్ ఉంటాయి. అగ్రికల్చర్ మేనేజర్ ప్రధానంగా వ్యవసాయ ఫైనాన్స్, ప్రభుత్వం రైతులకు అందించే ఆర్థిక పథకాలు వారికి చేరడంలో కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది.

ప్రొబేషన్, సర్వీస్ బాండ్

ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగంలో చేరిన తేదీ నుంచి రెండేళ్ల పాటు పని చేస్తామని ఒప్పంద పత్రం (బాండ్) సమర్పించాల్సి ఉంటుంది. ఇందులో మూడు నెలల జీతానికి సమానమైన మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఏడాది కాలం పాటు ప్రొబేషనరీ పీరియడ్ తర్వాత రెగ్యులర్ ఉద్యోగిగా గుర్తింపు లభిస్తుంది.

కెరీర్

ఎంపికైన అభ్యర్థులు ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌ఫర్/ కంట్రోలింగ్ ఆఫీసర్ కేడర్‌లో సేవలు అందించాల్సి ఉంటుంది. వీరికి నియమిత కాలంలో ప్రమోషన్లు లభిస్తాయి. స్పెషలిస్టు ఆఫీసర్ హోదాలో ప్రమోషన్ విధానంతో అనతి కాలంలోనే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చు.

సిబిల్ స్కోరుకు ప్రాధాన్యం

దరఖాస్తు చేసే అభ్యర్థుల క్రెడిట్ హిస్టరీకి ప్రాధాన్యం ఉంటుంది. సిబిల్ స్కోరు 650 లేదా అంతకన్నా ఎక్కువగా ఉండాలి. సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో సిబిల్ స్కోరుకు సంబంధించిన డాక్యుమెంట్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేది:** 10.10.2025
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, విజయనగరం, తిరుపతి, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్.
- **వెబ్‌సైట్:** https://punjabandsindbank.co.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం - తెలంగాణ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-చైల్డ్ డెవలప్‌మెంట్ & పెడగాజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం - ఫిజిక్స్ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం - క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

త్వరలో సమ్మక్క-సారలమ్మ వర్సిటీ

కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన

- కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్
- యూనివర్సిటీ లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న ధర్మేంద్ర, కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: త్వరలో తెలంగాణ సమ్మక్క-సారలమ్మ యూనివర్సిటీని సందర్శిస్తానని, కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేస్తానని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. ఆయన మంగళవారం ఢిల్లీలోని తన నివాసంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి సమక్క-సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వైఎల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్ విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో.. సమ్మక్క-సారలమ్మ కేంద్ర విశ్వ విద్యాలయాన్ని సాధించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు.



లోగోలో ప్రధాన ఆకర్షణలు..

- సమ్మక్క-సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ లోగో మధ్య సమ్మక్క-సారలక్క గద్దెలు
- సమ్మక్క దేవత కుంకుమకు చిహ్నంగా మధ్యలో ఎర్రటి సూర్యుడు
- ప్రశాంతమైన ఆధ్యాత్మిక కోణాన్ని జోడించే పీఠాలపై ఆసీనులైన ఇద్దరు వన దేవతలు
- గిరిజన ఆహార్యం, సౌందర్యానికి సూచికగా నెమలి ఈకలు
- సాంస్కృతిక గౌరవం, ధైర్యం సంప్రదాయాన్ని సూచించే రెండు జంతువుల కొమ్ములతో కూడిన కిరీటం

ఓల్గా, మధుప్రియ, లాలినిధికి 'సుద్దాల' పురస్కారాలు

13న హైదరాబాద్‌లో ప్రదానం



ఓల్గా

మోత్కూరు: సినీ గేయ రచయిత, సుద్దాల అశోక్ తేజ తల్లిదండ్రులు, స్వాతంత్ర్య సమరయోధులు సుద్దాల హన్మంతు – జానకమ్మ జాతీయ సాహితీ, జానపద, నృత్య, పురస్కారాల ప్రదానోత్సవం ఈ నెల 13న హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య కళానిలయంలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని అశోక్ తేజ తమ్ముడు సుద్దాల ప్రభాకర్ తేజ తెలిపారు. మంగళవారం ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో ప్రజా భారతి సాహితీ సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు బోల్ల హన్మంతు, మాజీ అధ్యక్షుడు డి.అరవిందరాయుడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో రచయిత్రి ఓల్గా, గాయని మధుప్రియ, నర్తకి లాలినిధికి ఈ పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు.

ఏఐతో.. గుత్తాధిపత్యం



బడా సంస్థల చేతుల్లోనే భవిష్యత్తు..

- అల్గారిథమ్‌ల ద్వారా కుమ్మక్కు
- ధరల వివక్షతో మార్కెట్‌కు ముప్పు..
- భారత్‌లో విస్తరిస్తున్న ఏఐ సామ్రాజ్యం
- అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరించిన కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా నివేదిక

సాక్షి, న్యూఢిల్లీ: కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఏఐ) సాంకేతికత వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తోంది. అదేసమయంలో పెను ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) హెచ్చరించింది. ఏఐ, దాని ప్రభావంపై మార్కెట్ అధ్యయనం నిర్వహించిన సీసీఐ, గత నెలలో ఇందుకు సంబంధించి నివేదికను విడుదల చేసింది. ఏఐ మార్కెట్‌లో కొన్ని బడా టెక్నాలజీ సంస్థల ఆధిపత్యం పెరుగుతోందని, ఇది భవిష్యత్తులో గుత్తాధిపత్యానికి దారితీసి, ఆరోగ్యకరమైన పోటీని దెబ్బ తీస్తుందని ఈ నివేదిక తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అల్గారిథమ్‌ల ద్వారా రహస్య కుమ్మక్కు, ధరల వివక్ష, స్టార్టప్‌లకు అడ్డంకులు వంటి అనేక సవాళ్లను ఈ నివేదిక వెలుగులోకి తెచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ మార్కెట్ 2020లో 93.24 బిలియన్ డాలర్ల నుంచి 2024 నాటికి 186.43 బిలియన్ డాలర్లకు చేరుకుంది. భారతదేశంలో ఏఐ మార్కెట్ పరిమాణం 2020లో 3.20 బిలియన్ డాలర్లుండగా 2024 నాటికి 6.05 బిలియన్ డాలర్లకు పెరిగింది. 2031 నాటికి ఇది 31.94 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఈ గణాంకాలు ఏఐ ప్రాముఖ్యతను స్పష్టం చేస్తున్నాయి.

బడా కంపెనీలదే పెత్తనం

సీసీఐ నివేదిక ప్రకారం, ఏఐ పర్యావరణ వ్యవస్థను (ఏఐ ఎకో సిస్టం) కొన్ని పొరలుగా (ఏఐ స్టాక్) విభజించారు. ఇందులో డేటా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (క్లౌడ్ కంప్యూటింగ్, చిప్స్), డెవలప్‌మెంట్ (అల్గారిథమ్స్, ఫౌండేషన్ మోడల్స్) వంటి కీలకమైన ప్రాథమిక (అప్‌స్ట్రీమ్) పొరలు ఉన్నాయి. ఈ కీలకమైన రంగాల్లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), గూగుల్, మైక్రోసాఫ్ట్ అజూర్, ఎన్విడియా వంటి ప్రపంచ దిగ్గజ సంస్థలదే పూర్తి ఆధిపత్యం. మనదేశంలోని దాదాపు 67% స్టార్టప్‌లు కేవలం ఏఐ అప్లికేషన్లను అభివృద్ధి చేసే (డౌన్‌స్ట్రీమ్) స్థాయిలోనే పనిచేస్తున్నాయి. ఇవి తమ కార్యకలాపాల కోసం పూర్తిగా ఈ బడా సంస్థల క్లౌడ్ సేవలు, టెక్నాలజీలపైనే ఆధారపడి ఉన్నాయి. ఇది మార్కెట్‌లో తీవ్ర అసమానతలకు దారితీస్తోందని నివేదిక పేర్కొంది.

మార్కెట్‌ను శాసించే అల్గారిథమ్స్

ఏఐ రాకతో మార్కెట్‌లో పోటీతత్వం స్వరూపమే మారిపోతోంది. ముఖ్యంగా, ధరలను నిర్ణయించే అల్గారిథమ్‌ల వాడకం పెరగడం పెను సవాలుగా మారింది. సీసీఐ నివేదిక ప్రకారం, అల్గారిథమ్‌ల ద్వారా కంపెనీలు రహస్యంగా కుమ్మక్కయ్యే (అల్గారిథమ్ కొల్యూషన్) ప్రమాదం పొంచి ఉంది. మనుషుల ప్రమేయం లేకుండానే, అల్గారిథమ్‌లు ఒకదానికొకటి సంకేతాలు పంపుకుంటూ ధరలను కృత్రిమంగా పెంచే అవకాశం ఉంది. ఈ నివేదిక కోసం సర్వే చేసిన స్టార్టప్‌లలో 37% మంది అల్గారిథమిక్ కుమ్మక్కుపై ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాలో 'టాప్‌కిన్స్'కేసు, యూకేలో 'ట్రాడ్/జీబీ ఐ'కేసు వంటివి ఇందుకు నిదర్శనాలని నివేదిక ఉదహరించింది. అంతేకాకుండా, వినియోగదారుడి కొనుగోలు శక్తి, ప్రవర్తనను బట్టి ఒక్కొక్కరికీ ఒక్కో ధరను చూపే 'ధరల వివక్ష'కూడా పెరిగిపోతోందని, దీనిపై 32% స్టార్టప్‌లు ఆందోళన చెందాయని సర్వేలో తేలింది.

ప్రవేశానికి అడ్డంకులు.. స్టార్టప్‌లకు సవాళ్లు

ఏఐ రంగంలోకి కొత్తగా ప్రవేశించాలనుకునే స్టార్టప్‌లకు అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయని సీసీఐ అధ్యయనంలో వెల్లడైంది. స్టార్టప్‌లు ఎదుర్కొంటున్న ప్రధాన అడ్డంకుల్లో 68% మంది డేటా లభ్యత అతిపెద్ద అడ్డంకిగా పేర్కొన్నారు. అత్యుత్తమ ఏఐ మోడల్స్ అభివృద్ధికి భారీ మొత్తంలో నాణ్యమైన డేటా అవసరం, కానీ అది బడా సంస్థల వద్దే పోగుపడి ఉంది. 61% మంది క్లౌడ్ సేవలు అత్యంత ఖరీదైనవిగా మారాయని తెలపడం ఇందుకు ఉదాహరణ. 61% మంది నైపుణ్యం కలిగిన ఉద్యోగులు దొరకడం కష్టంగా ఉందని చెప్పారు. 66% మంది నిపుణులు సులభంగా అందుబాటులో లేరని అభిప్రాయపడ్డారు. 59% మంది కంప్యూటింగ్ సౌకర్యాల ఖర్చు అడ్డంకిగా భావించారు. 56% మంది స్టార్టప్‌లు నిధులు సమీకరించడం పెద్ద సవాలుగా ఉందని తెలిపారు. సర్వే ప్రకారం, 83% స్టార్టప్‌లు సొంత నిధులతోనే నడుస్తున్నాయి. తదుపరి దశ నిధులు పొందడం చాలా కష్టంగా ఉందని 50% మంది పేర్కొన్నారు. ఈ అడ్డంకుల వల్ల ఆవిష్కరణలు తగ్గి, మార్కెట్‌లో పోటీతత్వం నీరుగారిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొని, ఏఐ రంగంలో ఆరోగ్యకరమైన పోటీ వాతావరణాన్ని సృష్టించేందుకు సీసీఐ తన నివేదికలో పలు కీలక సూచనలతో ఒక కార్యాచరణ ప్రణాళికను ప్రతిపాదించింది. అందులోని అంశాలివీ...

స్వీయ-తనిఖీ : ఏఐ వ్యవస్థలను వినియోగించే సంస్థలు, తమ అల్గారిథమ్‌లు పోటీ చట్టాలకు విరుద్ధంగా పనిచేయకుండా చూసేందుకు స్వీయ-తనిఖీ విధానాన్ని పాటించాలి. ఇందుకు ఒక మార్గదర్శక పత్రాన్ని సీసీఐ జతచేసింది.

పారదర్శకత: ఏఐ ఆధారిత నిర్ణయాల విషయంలో కంపెనీలు పారదర్శకతను పాటించాలి. ఏఐని ఏ ఉద్దేశంతో వాడుతున్నారో వినియోగదారులకు స్పష్టంగా తెలియజేయాలి.

అవగాహన కార్యక్రమాలు: ఏఐ, పోటీ చట్టాలపై వాటాదారులందరికీ అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహిస్తుంది.

అడ్డంకుల తొలగింపు: స్టార్టప్‌లకు అవసరమైన కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలు, నాణ్యమైన డేటా అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించింది.

నియంత్రణ సంస్థల మధ్య సమన్వయం: ఏఐకి సంబంధించిన అంశాలు బహుళ నియంత్రణ సంస్థల పరిధిలోకి వస్తున్నందున, వాటి మధ్య సమన్వయం కోసం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవాలని సీసీఐ భావిస్తోంది.

అంతర్జాతీయ సహకారం: ప్రపంచవ్యాప్తంగా ఉన్న కాంపిటీషన్ ఏజెన్సీలతో కలిసి పనిచేయడం ద్వారా అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులను అందిపుచ్చుకోవాలని నిర్ణయించింది.

మొత్తమ్మీద ఏఐ సాంకేతికతను ప్రోత్సహిస్తూనే, మార్కెట్‌లో గుత్తాధిపత్య ధోరణులను అరికట్టి, చిన్న సంస్థలు, స్టార్టప్‌లు కూడా రాణించేందుకు సమాన అవకాశాలు కల్పించేలా పటిష్టమైన నియంత్రణ యంత్రాంగాన్ని రూపొందించాల్సిన అవసరముందని సీసీఐ స్పష్టం చేసింది.

వంతెన.. వేదన!

వంతెన నిర్మించి రోడ్డును వదిలేశారు

- మంజీర నదిపై రూ.12 కోట్లతో నిర్మాణం
- మెదక్ జిల్లాలో కేవలం 4 కిలోమీటర్ల రహదారి నిర్మాణం చేపట్టకపోవడంతో నిరుపయోగంగా బ్రిడ్జి
- రోడ్డు పూర్తయితే కామారెడ్డి, మెదక్ జిల్లాల మధ్య 40 కి.మీ. మేర తగ్గనున్న దూరం



మంజీర నదిపై నిర్మించిన వంతెన దాటితే పొలాలు.. (ఇన్‌సెట్లో) మంజీర నదిపై నిర్మించిన వంతెన

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: కామారెడ్డి, మెదక్ జిల్లాల మధ్య దూరాభారాన్ని తగ్గించేందుకు మంజీర నదిపై భారీ వంతెన, రెండు వరుసల రహదారి నిర్మాణం కోసం రూ.33 కోట్లు మంజూరు చేశారు. ఎన్నో ఆటుపోట్ల మధ్యన వంతెన పూర్తయ్యింది. కామారెడ్డి జిల్లా పరిధిలో రోడ్డు నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయి. అయితే వంతెన అవతల మెదక్ జిల్లా పరిధిలో రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే రెండు జిల్లాల మధ్య 40 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుంది. వ్యాపార సంబంధాలు పెరుగుతాయి. మెదక్ జిల్లాలోని ఏడుపాయల దుర్గమ్మ దర్శనానికి కామారెడ్డి జిల్లా నుంచి ప్రతి నిత్యం ఎంతో మంది వెళుతుంటారు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే వీరికి రాకపోకలు సులువవుతాయి. కానీ ప్రభుత్వం, అధికారులు పట్టించుకోక పోవడంతో వంతెనతో ఉపయోగం లేకుండా పోయింది.

2015లోనే నిధులు

మంజీర మీద వంతెన లేక ఎన్నో దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో 2015లో వంతెన నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరయ్యాయి. అలాగే కామారెడ్డి జిల్లాలోని తాండూర్ గేట్ నుంచి తాండూరు, వెంకంపల్లి మీదుగా వంతెన వరకు రెండు వరుసల రహదారి నిర్మాణానికి రూ.21 కోట్లు మంజూరు చేశారు. కాగా రోడ్డు నిర్మాణం కోసం విలువైన భూములు కోల్పోతున్నామని రైతులు కోర్టుకు వెళ్లడంతో కొంత కాలం పనులు జరగలేదు. పరిహారం ఇచ్చిన తరువాత పనులు చేపట్టారు. అటవీ వివాదంతో కొద్దిమేర పనులు ఆగిపోయినా మిగతా పనులు, మంజీర మీద భారీ వంతెన పనులు పూర్తయ్యాయి. కానీ వంతెన అవతల మాత్రం రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదు.

మెదక్ జిల్లాలో రోడ్డు నిర్మిస్తేనే..

మంజీర వంతెన నుంచి మెదక్ జిల్లా మఖ్దాంపూర్ మీదుగా పాపన్నపేట మండల కేంద్రం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. మంజీర నది నుంచి మగ్దుంపూర్ వరకు కనీసం సాధారణ (ఫార్మేషన్) రోడ్డు కూడా లేదు. పొలాల మధ్యనుంచి బండ్లబాట ఉంది. రోడ్డు నిర్మాణం చేపట్టాలంటే ముందుగా రైతుల నుంచి భూసేకరణ జరపాలి. భూసేకరణ జరిపిన తరువాత రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాల్సి ఉంటుంది. రోడ్డు నిర్మాణం కోసం మెదక్ జిల్లా రోడ్లు, భవనాల శాఖ అధికారులు అప్పట్లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఈ ప్రతిపాదనలు ఆమోదం పొంది, నిధులు మంజూరై పనులు పూర్తయితేగానీ వంతెన ఉపయోగ పడే అవకాశం లేదు. మెదక్ జిల్లా పరిధిలో కేవలం నాలుగు కిలోమీటర్లు మాత్రమే రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దానికి నిధులు మంజూరు చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తగ్గే దూరం 40 కిలోమీటర్లు...

కామారెడ్డి జిల్లా వాసులు, ముఖ్యంగా ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట తదితర మండలాల ప్రజలు మెదక్ జిల్లాలోని పాపన్నపేట మండలానికి వెళ్లాలంటే మెదక్ మీదుగా దాదాపు 50 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అదే తాండూర్ గేట్ నుంచి తాండూర్, వెంకంపల్లి మీదుగా మంజీరపై నిర్మించిన వంతెన ద్వారా మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని మఖ్దాంపూర్ నుంచి పాపన్నపేటకు వెళ్లడానికి కేవలం 10 కిలోమీటర్లే ఉంటుంది. అంటే దాదాపు 40 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుందన్న మాట. కానీ భూసేకరణ, నిధులు తదితర కారణాలతో మెదక్ జిల్లాలో రోడ్డు నిర్మాణానికి నోచుకోవడం లేదు.

వైఎస్ జగన్ పర్యటనకు అనుమతి లేదు

అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా

సాక్షి, అనకాపల్లి/విశాఖ సిటీ: ఈ నెల 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల పరిశీలనకు రానున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్ షోకు అనుమతి లేదని అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి మాకవరపాలెం మెడికల్ కళాశాల వరకూ హెలికాప్టర్‌లో వచ్చేలా అనుమతి కోరితే పరిశీలిస్తామన్నారు. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి 63 కి.మీ. మేర హైవేపై రోడ్డు షో జరిగితే ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వైఎస్ జగన్ మెడికల్ కళాశాల నిర్మాణ పనుల పరిశీలన కోసం రోడ్డు మార్గాన వస్తున్నట్టు ఈ నెల 4న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అనుమతి కోరినట్టు తెలిపారు. ఇంటెలిజెన్స్ నివేదిక ఆధారంగా విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి మాకవరపాలెం మెడికల్ కళాశాలకు వెళ్లే మార్గంలో హైవేను ఆనుకుని ఉన్న కొన్ని రద్దీ కూడళ్ల దగ్గర భారీ జనసమీకరణ చేస్తున్నట్టు తెలిసిందన్నారు. రోడ్ షోకు జనం ఎక్కువగా వచ్చే అవకాశాలుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నట్టు గుర్తించామన్నారు. ఇటీవల తమిళనాడులోని కరూర్ ఘటనను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదనే అనుమతి ఇవ్వడం లేదన్నారు. అనుమతి లేకుండా జనసమీకరణ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైఎస్ జగన్ పర్యటనకు అనుమతులు లేవంటూ మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకూ మీడియాకు స్పష్టం చేసిన పోలీసులు.. ఈ విషయమై తీవ్ర విమర్శలు రావడంతో పలు షరతులతో కూడిన అనుమతి ఇస్తున్నామని మంగళవారం అర్ధరాత్రి విశాఖ పోలీస్ కమిషనర్ ప్రకటించారు.

మళ్లీ తెరుచుకున్న సాగర్ గేట్లు



నాగార్జునసాగర్: సాగర్ జలాశయానికి ఎగువ నుంచి వరద పెరగడంతో.. మళ్లీ రేడియల్ క్రస్ట్‌గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి 2,29,950 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. 22 క్రస్ట్ గేట్ల ద్వారా 1,77,518 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 33,170 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణా నదిలోకి విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు). ప్రస్తుతం నీటి మట్టం 589.70 అడుగులు (311.1486 టీఎంసీలు) ఉంది.

చొక్కా విప్పి.. చితిపై కప్పి

- మాజీ కౌన్సిలర్‌కు ఎమ్మెల్యే బత్తుల నివాళి



మిర్యాలగూడ అర్బన్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నేత, 14వ వార్డు మాజీ కౌన్సిలర్ గంధం రామకృష్ణ సోమవారం గుండెపోటుతో మృతి చెందగా మంగళవారం అంత్యక్రియలు ముగిశాయి. అంత్యక్రియలకు హాజరైన మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.. తాను ధరించిన చొక్కాను రామకృష్ణ చితిపై ఉంచారు. రామకృష్ణ బతికున్నప్పుడు.. తాను ధరించిన చొక్కాను చూసి 'అన్నా.. నీ చొక్కా చాలా బాగుంది. నాకు ఇవ్వన్నా..'అని అంటుండేవాడని, తాను తప్పకుండా ఇస్తా.. అని చెప్పి.. ఇవ్వడం మరచిపోయేవాడినని ఎమ్మెల్యే కన్నీటిపర్యంతమయ్యారు. అనంతరం తన చొక్కాను తీసి చితిపై ఉంచి.. రామకృష్ణ ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు.

జగన్ పర్యటనను అడ్డుకునేందుకు కొత్త ఎత్తులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: వైఎస్ జగన్ అనకాపల్లి జిల్లా నర్సీపట్నం పర్యటనను అడ్డుకునేందుకు ఏపీ ప్రభుత్వం శతవిధాలా యత్నిస్తోంది. కొత్త ఎత్తులు వేస్తోంది. వైఎస్ జగన్ వెళ్లిన ఎక్కడికి వెళ్లినా జనాదరణ వెల్లువెత్తుతుండడంతో సర్కారులో వణుకుపుడుతోంది. ప్రజావ్యతిరేకత పెరిగిపోవడంతో జంకుతోంది. ఫలితంగా ఎలాగైనా వైఎస్ జగన్ నర్సీపట్నం పర్యటనను అడ్డుకోవాలని ఆంక్షలు విధిస్తోంది. పోలీసులను అడ్డుపెట్టుకుని దొంగాట ఆడుతోంది. ఈ నేపథ్యంలోనే జగన్ పర్యటనకు ఏకంగా 65 వేల మంది వస్తారని అంచనా వేస్తున్నామని, విశాఖపట్నం విమానాశ్రయం నుంచి మెడికల్ కాలేజీ నిర్మాణమవుతున్న మాకవరపాలెం మండలంలోని భీమబోయినపాలెం వరకు రోడ్డు మార్గాన వెళితే భద్రత కల్పించలేమంటూ అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా, విశాఖ సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీతో ప్రత్యేకంగా విలేకరుల సమావేశాలు పెట్టి మరీ అప్పటికప్పుడు ప్రకటించడం గమనార్హం. 63 కిలోమీటర్ల మేర రోడ్డు మార్గంలో అవసరమైన పోలీసు బలగాలను ఇప్పటికిప్పుడు కేటాయించలేమంటూ సెలవివ్వడం చర్చనీయాంశమైంది. విశాఖలో ఉమెన్స్ వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోందంటూ సాకుగా చూపడంపైనా విమర్శలు వినిపిస్తున్నాయి. అంతిమంగా ఈ పర్యటన జరగకుండా చూసేందుకు ప్రభుత్వం కొత్త ఎత్తులు వేస్తోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఒకవైపు స్వయంగా పోలీసులే... 65 వేల మంది తరలివచ్చేందుకు అవకాశం ఉందని, అంత మందికి అక్కడి ప్రాంతం సరిపోదంటూ మాజీ మంత్రి అమర్‌నాథ్‌కు పంపిన సమాధానంలో పేర్కొనడం ఈ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని పరోక్షంగా అంగీకరించినట్టు స్పష్టమవుతోంది.

హెలికాప్టర్‌పై అయితే అనుమతిస్తారట..!

వాస్తవానికి వివిధ సమస్యలపై ప్రజల వద్దకు వెళ్లేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ యత్నించిన ప్రతీసారి ఏదో ఒక రూపంలో అడ్డంకులు కల్పించడం పోలీసులకు పరిపాటిగా మారింది. అనంతపురం జిల్లా రాప్తాడు పర్యటన సందర్భంగా జరిగిన ఘటనను పేర్కొంటూ హెలికాప్టర్ ల్యాండింగ్‌కు పలు సందర్భాల్లో అనుమతి నిరాకరించిన పోలీసులు.. ఇప్పుడందుకు విరుద్ధంగా హెలికాప్టర్‌లో వస్తే అనుమతిస్తామంటూ కొత్త పల్లవి అందుకోవడం గమనార్హం. అయితే వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో హెలికాప్టర్‌లో ప్రయాణం సాధ్యం కాదని తెలిసినా అందుకు అంగీకరిస్తామని చెప్పడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదో విధంగా జగన్‌ను అడ్డుకోవాలన్న కుట్రలో భాగంగానే ఈ పల్లవి ఎత్తుకున్నట్టు కనిపిస్తోంది.

పప్పు వ్యాపారులపై ఐటీ సోదాలు

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పప్పు వ్యాపారులపై ఐటీ అధికారులు మంగళవారం దాడులు చేశారు. రూ. 300 కోట్ల పప్పు వ్యాపారం కేసుకు సంబంధించి హైదరాబాద్‌లోని ఆదాయపు పన్ను దర్యాప్తు విభాగం మంగళవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంతటా సోదాలు నిర్వహించింది. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, కర్నూలు, హైదరాబాద్‌లోని 25 ప్రాంగణాల్లో ఈ సోదాలు జరిగాయి. వీటిలో నలుగురు ప్రధాన పప్పు వ్యాపారులు ఉన్నారు. (ఆంధ్రప్రదేశ్‌లోని గత ప్రభుత్వ హయాంలో ఈ ట్రేడింగ్ కంపెనీలు పెద్దఎత్తున నగదు లావాదేవీల్లో పాల్గొన్నాయని, 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉపసంహరణలు కూడా జరిగాయని అధికారులు తెలిపారు) ఈ సంస్థలు పౌర సరఫరాల శాఖ నుంచి టెండర్లు పొందినట్లు అధికార వర్గాలు తెలిపాయి. చెల్లింపులు అందుకున్నప్పటికీ ఈ వ్యాపారులు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కింద పప్పు సరఫరా చేయడంలో విఫలమయ్యారో లేదో తెలుసుకోవడానికి తనిఖీ జరుగుతోందని అధికారులు పేర్కొన్నారు. దాడి జరిగిన వ్యాపార సంస్థల్లో విశాఖపట్నంలోని హిందూస్తాన్ ట్రేడర్స్, కర్నూలులోని వీ కేర్ గ్రూప్ ఉన్నాయి. ఆదాయపు పన్ను శాఖకు చెందిన బృందాలు ఏకకాలంలో జరిపిన ఈ సోదాల్లో పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

జడ్చర్లలో ఐటీ నోటీసుల కలకలం

ఓ వ్యాపారికి రూ.13 కోట్లు చెల్లించాలని నోటీసు

జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణానికి చెందిన పలువురు వ్యాపారులకు ఐటీ నోటీసులు జారీ చేయడం కలకలం రేపింది. దీంతో పట్టణంలో జోరుగా జీరో వ్యాపారాలు నిర్వహించే వారు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఓ ఆటో ఫైనాన్స్ నిర్వహించే వ్యాపారికి 2020–21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏకంగా రూ.13,38,83,660 చెల్లించాలంటూ ఐటీ అధికారులు నోటీసు జారీ చేయడంతో కంగుతిన్నాడు. మరో ముగ్గురు వ్యాపారులకు కూడా రూ.2,35,14,120, రూ.1,52,36,710, రూ.1,49,19,450 చెల్లించాలని నోటీసులు వచ్చాయి. ఇలా 18 మందికి రూ.కోట్లలో పన్ను చెల్లించాలంటూ ఐటీ నోటీసులు జారీ అయ్యాయని ప్రచారం సాగుతోంది.

32 అడుగుల ఎత్తు.. 45 కి.మీ. నిడివి

- హైదరాబాద్–శ్రీశైలం మార్గంలో ఎలివేటెడ్ కారిడార్‌కు ఎట్టకేలకు కేంద్రం ఓకే
- మన్ననూరు నుంచి పాతాళగంగ వరకు నాలుగు వరుసలుగా రోడ్డు విస్తరణ
- రూ. 8 వేల కోట్ల అంచనా వ్యయం.. సగం ఖర్చు భరించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- తీరనున్న ట్రాఫిక్ సమస్య.. రాత్రివేళల్లో వాహనాల రాకపోకలపై ఆంక్షలకూ ఇక తెర



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలానికి వెళ్లే మార్గంలో సుమారు 32 అడుగుల ఎత్తు, 45 కి.మీ. నిడివితో నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఆమోదం తెలిపింది. దాదాపు ఏడాదిన్నర నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిపాదనను అంగీకరిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించింది. మన్ననూరు నుంచి తెలంగాణ పరిధి ఉన్న పాతాళగంగ వరకు 62.40 కి.మీ. మేర రోడ్డును విస్తరించాలని నిర్ణయించగా అందులో వన్యప్రాణులు సంచరించే 45.42 కి.మీ. మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మించి మిగతా భాగాన్ని దానికి అప్రోచ్ రోడ్డుగా నిర్మించనుంది. ఈ ప్రాజెక్టుకు రూ. 7,690 కోట్లు ఖర్చవుతుందని గతంలో అంచనా వేయగా అందులో సగం వ్యయం భరిస్తామని అప్పట్లోనే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తెలియజేసింది. ప్రస్తుతం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సవరించిన అంచనాలను తయారు చేయాల్సి ఉంది. ప్రస్తుత అంచనాల ప్రకారం నిర్మాణ వ్యయం రూ. 8 వేల కోట్లకు చేరుతుందని భావిస్తున్నారు. అందులో రూ. 4 వేల కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది.

విస్తరణ జరగక పెరిగిన ట్రాఫిక్..

శ్రీశైలం క్షేత్రానికి వెళ్లే రోడ్డును గతంలో మన్ననూరు వరకు విస్తరించగా అక్కడి నుంచి దట్టమైన అడవి ఉండటం.. అదే మార్గంలో అమ్రాబాద్ పులుల అభయారణ్యం కూడా ఉండటంతో రోడ్డు విస్తరణకు కేంద్రం అనుమతించలేదు. దీంతో మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు సాధారణ రోడ్డే కొనసాగుతోంది. దీనికితోడు వన్యప్రాణుల కదలికల దృష్ట్యా నిత్యం రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలు కొనసాగుతుండటం వల్ల ఉదయం వేళల్లో ట్రాఫిక్ పెరిగిపోతోంది. దీంతో రోడ్డు విస్తరణ తప్పనిసరైంది. అయితే భూఉపరితలంలో విస్తరణ సాధ్యం కానందున వన్యప్రాణులకు అంతరాయం కలగని రీతిలో ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదన ఏడాదిన్నర క్రితం తెరపైకి వచ్చింది. కానీ దాని బదులు కేబుల్ కార్ నిర్మిస్తే రూ. 2,270 కోట్లు ఖర్చవుతుందన్న ఉద్దేశంతో ఆ మేరకు ప్రతిపాదన సమర్పించాలని కేంద్రం రాష్ట్రాన్ని ఆదేశించింది. అలాగే సారంగ మార్గం ప్రతిపాదన కూడా తెరపైకి వచ్చింది. ఎట్టకేలకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

కారిడార్‌కు ఇరువైపులా ఇనుప కంచెలు, నాయిస్ బ్యారియర్లు..

వన్యప్రాణులకు ఆటంకం కలగని విధంగా ఎలివేటెడ్ కారిడార్‌ను చేస్తున్నారు. వాహనాల చప్పుడు ఎక్కువ వినిపించకుండా ఉండేందుకు, జంతువులు రోడ్డుపైకి రాకుండా ఉండేందుకు 32 అడుగుల ఎత్తులో వంతెన నిర్మించనున్నారు. వాహనాలు కింద పడకుండా.. వాహనదారులు కింద ఉండే అటవీ ప్రాంతంలోకి చెత్త విసరకుండా రోడ్డుకు ఇరువైపులా ఎత్తయిన ఇనుప కంచెలు ఏర్పాటు చేయనున్నారు. అదే సమయంలో వాహనాల శబ్దంతో జంతువులు ఇబ్బంది పడకుండా రోడ్డుకు ఇరువైపులా నాయిస్ బ్యారియర్లను కూడా ఏర్పాటు చేయనున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

క్లుప్తంగా...

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ఉత్తమ సేవలకు రాజ్య పురస్కార్ అవార్డులు

సాక్షి, అమరావతి : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ వ్యవస్థాపక దినోత్సవం/జెండా దినోత్సవాన్ని (నవంబర్ 7) పురస్కరించుకుని సంస్థలో ఉత్తమ సేవలు అందించే వారి వివరాలు పంపాల్సిందిగా స్కౌట్స్ అండ్ గైడ్స్‌కార్యదర్శి నరసింహారావు జిల్లా విభాగాలను ఆదేశించారు. ఎంపికైన వారికి రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా విద్యార్థులకు రాజ్య పురస్కార్ అవార్డులు ప్రదానం చేయనున్నట్టు పేర్కొన్నారు. అర్హత గల రాజ్య పురస్కార్ పిల్లలతో (2024–25) పాటు, 75 సంవత్సరాల వయసులోనూ సేవలను అందిస్తున్న స్కౌట్ మాస్టర్స్/గైడ్ కెప్టెన్లను (ఉపాధ్యాయులు) సత్కరించనున్నట్టు తెలిపారు. స్కౌట్ విభాగం నుంచి ఇద్దరు, గైడ్ విభాగం నుంచి ఇద్దరు విద్యార్థులను పురస్కారాలకు ఎంపిక చేసి, జిల్లా స్థాయి స్కౌట్ సంఘాల జాబితాను రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి పంపాలన్నారు. ఈ వివరాలను తదుపరి పరిశీలన కోసం రాజ్‌భవన్‌కు పంపుతారు. ఎంపికైన వారికి వచ్చే నెల 7న జరిగే రాష్ట్ర స్థాయి వ్యవస్థాపక దినోత్సవం రోజు గవర్నర్ చేతుల మీదుగా పురస్కారాలు అందజేస్తారు.

ఎస్సీల ప్రగతిని జీర్ణించుకోలేకే సీజేఐ గవాయ్‌పై దాడి

ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ బాబు

సాక్షి, అమరావతి : ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు అత్యున్నత స్థానాలకు చేరుకోవడం జీర్ణించుకోలేకే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నం చేశారని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై రాకేష్ కిషోర్ అనే న్యాయవాది బూటుతో దాడికి యత్నించడం ఉన్మాద చర్యగా అభివర్ణించారు. ఈ దాడిని భారత న్యాయ వ్యవస్థపై దాడిగా చూడాలన్నారు. ఎస్సీలు ఉన్నత స్థానాలలో ఉండడాన్ని ఓర్వలేక విద్వేషపూరిత భావంతో ఈ చర్యకు పూనుకున్నారని, ఈ క్రమంలో నిందితుడు సనాతన ధర్మాన్ని కాపాడుతున్నానంటూ వ్యాఖ్యలు చేయడం మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నంలో భాగమేనన్నారు. సనాతన ధర్మంలో ఇలాంటి ఉన్మాద చర్యలకు స్థానం ఉండదని, సాటివారి పట్ల క్షమాగుణం, సహనం, ఓర్పు ఉండాలని సనాతన ధర్మం సూచిస్తుందని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

నకిలీ మందులను నిరోధించాలి

కేంద్రానికి ప్రజారోగ్య వేదిక లేఖ

సాక్షి, అమరావతి: దేశంలో నాసిరకం, నకిలీ మందులను నిరోధించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య వేదిక కోరింది. ఈ విషయమై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రులతోపాటు భారత ఔషధ నియంత్రణ జనరల్(డీసీజీఐ), కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీవో)కు రాసిన లేఖలను ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ రమణయ్య, ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు మంగళవారం మీడియాకు విడుదల చేశారు. రోగుల ప్రాణాలను కాపాడదానికి దేశ ఔషధ నియంత్రణ చట్టాన్ని బలోపేతం చేయాలనే తక్షణ అవసరాన్ని పిల్లల మరణాలు నొక్కి చెబుతున్నాయన్నారు.

మైనారిటీలకు రూ.41.37 కోట్లు లబ్ధి: మంత్రి ఫరూక్

సాక్షి, అమరావతి: 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ద్వారా మైనారిటీ వర్గాలకు చెందిన డ్రైవర్లకు రూ.41.37 కోట్లు లబ్ధి చేకూరినట్లు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మంగళవారం తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా 27,580 మంది మైనార్టీ లబ్ధిదారులకు రూ.15,000 చొప్పున వారి అకౌంట్లకు నేరుగా నగదును జమ చేసినట్లు చెప్పారు.


బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి

ప్రభుత్వానికి గొర్రెలు, మేకల పెంపకందార్ల వినతి

సాక్షి, అమరావతి: బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించి ప్రతి పెంపకందారునికి 50శాతం సబ్సిడీపై రూ.5లక్షల రుణం ఇవ్వాలని గొర్రెలు, మేకల పెంపకందార్లు ప్రభుత్వాన్ని కోరారు. వారు మంగళవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడిని కలిశారు. ఆంధ్రప్రదేశ్ గొర్రెల, మేకల అభివృద్ధి సహకార ఫెడరేషన్ లిమిటెడ్ రాష్ట్ర డైరెక్టర్లు, పెంపకందార్ల అసోసియేషన్ నాయకులు పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ అందించి ఆంధ్రప్రదేశ్ గొర్రెల, మేకల అభివృద్ధి సహకార ఫెడరేషన్ రుణాలు ఇప్పించాలని కోరారు. రుణాల కోసం ఎన్‌సీడీసీ ప్రతిపాదించిన రూ.250 కోట్లలో రెండో విడత విడుదల చేసిన రూ.88 కోట్లను ప్రభుత్వం తక్షణం ఖర్చు చేయాలన్నారు. మూడోవిడత రూ.120 కోట్ల నిధులు విడుదల చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి తగిన సహకారం అందిస్తామని మంత్రి చెప్పారు.



ఎగువ అహోబిలం కొండపై నుంచి జాలువారుతున్న జలపాతాలు



కిందకు దూకుతున్న జలపాతం



క్షేత్రం ఎదుట జల పరవళ్లు, మెట్ల మార్గంలో వరద ప్రవాహం

అహో జలం

అహోబిల క్షేత్రంలో జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నల్లమల అడవి పచ్చదనాన్ని పరుచుకోవడంతో పాటు ఎత్తైన కొండ చరియల్లోంచి నీటి ధారలు జాలువారుతూ భక్తులను ఆకట్టుకుంటున్నాయి. నంద్యాల జిల్లాలోని ఎగువ అహోబిలం జ్వాలా నృసింహస్వామి సన్నిధి, ఉక్కు స్తంభం రహదారి వెంట జలపాతాలు ఉధృతంగా కిందకు దూకుతూ ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. నవనారసింహ స్వాముల దర్శనార్థం వచ్చే భక్తులు, పర్యాటకులు జల సోయగాలను చూస్తూ మురిసిపోతున్నారు.

– ఆళ్లగడ్డ

జీఎస్టీ భారాన్ని కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. ఈనెల 22 నుంచి కొత్త స్లాబులను అమల్లోకి తెచ్చింది. ముఖ్యంగా నిత్యావసరాలు, వాహనాలు, ఎలక్ట్రికల్ వస్తువులు, గృహోపకరణాలతోపాటు, ప్రజారోగ్యం దృష్ట్యా పలు మందులపైనా జీఎస్టీని కుదించింది. అయితే మెడికల్ షాపుల్లో జీఎస్టీ తగ్గింపు బోర్డులు కనిపించని పరిస్థితి నెలకొంది. పాత ధరలతోనే కొనుగోలు చేసి జేబులకు చిల్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. దీనిపై ఏ ఒక్కరూ నోరుమెదపకపోగా.. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కూడా అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఏ మాత్రం తగ్గలేదు!



- మందులు, మాత్రల విక్రయాల్లో కనిపించని జీఎస్టీ తగ్గింపు
- పాత ధరలతోనే అమ్మకాలు
- మెడికల్ షాపుల్లో కనిపించని తగ్గింపు బోర్డులు
- తనిఖీ చేయని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు

కాణిపాకం: చిత్తూరు జిల్లాలో దాదాపు 1,500 మెడికల్ స్టోర్లు, 200పైగా హోల్ సేల్ షాపులున్నాయి. వీటి ద్వారా రోజువారీ రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వ్యాపారం జరుగుతోంది. ఫలితంగా ట్యాక్స్ ఎగ్గొట్టాలని చాలామంది మెడిసిన్ కొనుగోలుపై బిల్లులు ఇవ్వడం లేదు. బిల్లు అడిగితే ఇస్తామని చెప్పి జాప్యం చేస్తున్నారు. కొనుగోలు ధర ఒకటి, బిల్లులో నమోదు చేసే ధర మరొకటిగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక మందుల ప్యాకెట్లపై గడువు తేదీలు కూడా సరిగా కనిపించక పోవడం ఆందోళన కలిగిస్తోంది.

బేరాల్లేవ్!

చాలా ప్రైవేట్ ఆస్పత్రుల్లో సొంతంగా మెడికల్ షాపులు నడుపుతూ రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఆస్పత్రిలో చేరిన రోగులు అక్కడే మందులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. వైద్యులు సైతం తమ షాపుల్లో లభించే మందులనే రాయడం గమనార్హం. ఈ షాపుల్లో మందులపై ఎలాంటి తగ్గింపులు లేకుండా ఎంఆర్‌పీకే విక్రయిస్తున్నారు.

పాత మందులంటూ బూచీ

జీఎస్టీ తగ్గింపు కారణంగా క్యాన్సర్, గుండె జబ్బులు, దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన అత్యవసర మందుల ధరలు తగ్గుతాయనే ప్రచారం ఆర్భాటంగానే మిగిలిపోయింది. మందుల షాపుల యాజమానులు పాత స్టాక్ పేరు చెప్పి ఆ ధరలకే విక్రయిస్తున్నారు. పాత స్టాక్ పూర్తయిన తర్వాతే కొత్త ధరలు అమలవుతాయని బుకాయిస్తున్నారు. పాత స్టాక్ నిల్వలపై కొత్త ధరలు వర్తింపజేయడానికి నిబంధనలు ఉన్నా వాటిని అమలు చేయడం లేదు. ఈ విషయాన్ని సంబంధిత డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు లైట్ తీసుకున్నట్టు తెలుస్తోంది.

నిబంధనలు పాటించరే

మందులపై జీఎస్టీ తగ్గింపు ధర ఈనెల 22 నుంచి అమలులోకి వచ్చింది. సవరించిన ధరలతో మెడికల్ షాపుల్లో బోర్డులు పెట్టాలి. ఎక్కడా ఈ బోర్డులు కనపించడం లేదు. దుకాణదారులు నిబంధనలు పాటించడం లేదు. అధికారుల వత్తాసు ఉందని జీఎస్టీకి తూట్లు పొడుస్తున్నారు. ప్రజలను మందులు, మాత్రలతో మాయ చేస్తున్నారు. జీఎస్టీ తగ్గింపు ధరలు అమలుపై నిఘా కొరవడింది. ఔషధ నియంత్రణ శాఖ పర్యవేక్షణలో ఎక్కడా తనిఖీలు గానీ, సోదాలు గానీ చేసినట్లు కనిపించడం లేదు. ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీఎస్టీ తగ్గింపు అమలయ్యేలా చూడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

తగ్గింపు ధరలు అమలు కావాలి



ఇప్పుడున్న రోజుల్లో తిండి కంటే ముందు ముఖ్యమైనవి మందులు, మాత్రలు. ప్రస్తుత పరిస్థితుల్లో గుండె జబ్బులు, క్యాన్సర్, షుగర్, బీపీ వంటి వ్యాధులు అధికంగా ఉన్నాయి. మందులు, మాత్రలకు పేద కుటుంబాల వారు కూడా నెలవారీగా వేలల్లో ఖర్చు చేస్తున్నారు. జీఎస్టీ ఊరటతో కాస్త తగ్గుతుందని అనుకుంటే..ఇంకా మందుల దుకాణాల్లో పాత ధరలే అమలవుతున్నాయి. అధికారులు స్పందించి జీఎస్టీ తగ్గింపు వర్తించేలా చూడాలి.

– రాజారత్నంరెడ్డి, ప్రజాహిత సేవా సంస్థ అధ్యక్షుడు, చిత్తూరు

విక్టోరియా స్టేట్ వైఎస్సార్‌సీపీ కో- కన్వీనర్‌గా రామాంజనేయులు

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, జిల్లెలమూడి రామాంజనేయులును ఆస్ట్రేలియాలోని విక్టోరియా స్టేట్ పార్టీ కో- కన్వీనర్‌గా నియమించారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

గ్రామీణ ప్రాంతాల్లో 21 పెద్ద గోబర్ గ్యాస్ ప్లాంట్లు

సాక్షి, అమరావతి: స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో భాగంగా రూ.10.50 కోట్లతో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 21 పెద్ద గోబర్ గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటుకు పరిపాలన పరమైన అనుమతులిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత కార్యక్రమం గాల్వనైజింగ్ ఆర్గానిక్ బయో-ఆగ్రో రిసోర్సెస్ ధన్(గోబర్ధన్)లో చేపట్టే ఈ ప్లాంట్ల ఏర్పాటుకయ్యే ఖర్చులో 60% కేంద్రం, మిగిలిన 40% రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయని ఆదేశాల్లో పేర్కొన్నారు.

రాష్ట్రంలో 25 క్యారవాన్ పార్కులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో క్యారవాన్ టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం విధివిధానాలను ప్రకటించింది. 2024–29 నూతన పర్యాటక విధానంలో క్యారవాన్ పర్యాటకాన్ని చేరుస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మంగళవారం అనుబంధ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో 25 క్యారవాన్ పార్కుల ఏర్పాటు, 150 క్యారవాన్స్ నడపడమే లక్ష్యంగా కొత్త విధానాన్ని రూపొందించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వ్యర్థాల నిర్వహణ పక్కాగా చేపట్టాలి

మున్సిపల్ కమిషనర్లతో మంత్రి నారాయణ

సాక్షి, అమరావతి: పట్టణాల్లో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా కమిషనర్లు చొరవ తీసుకోవాలని మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లతో విజయవాడలో జరిగిన మూడురోజుల వర్క్‌షాప్‌లో మంగళవారం మంత్రి పాల్గొని 2029 లోగా పూర్తి చేయాల్సిన అభివృద్ధి ప్రాజెక్టులపై అధికారులకు సూచనలు చేశారు. మున్సిపాలిటీల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాల నిర్వహణ పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న రెండు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లకు అదనంగా మరో 6 ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇవన్నీ పూర్తయితే రాష్ట్రంలోని మున్సిపాల్టీలు డంపింగ్ యార్డ్ రహితంగా మారతాయన్నారు.

నోటిఫైడ్ పంటలకు ఈ-కేవైసీ మినహాయింపు

- 100 శాతం ల్యాండ్ పార్శిల్స్ నమోదు తప్పనిసరి
- 25లోగా ఈ-పంట నమోదు చేయాలి
- వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్

సాక్షి, అమరావతి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి అమలు చేస్తున్న డిజిటల్ క్రాప్ సర్వేలో నోటిఫైడ్ పంటలకు సైతం ఈ-కైవేసీ నుంచి పూర్తిగా మినహాయింపు ఇస్తున్నట్టు వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ తెలిపారు. ఈ-పంట నమోదుపై మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పథకాలకు, జాతీయస్థూల విలువ లెక్కింపునకు డిజిటల్ పంటల సర్వే డేటా సమాచారం ఆధారమన్నారు. అందువల్ల నిర్దేశించిన గడువులోగా 100శాతం ల్యాండ్ పార్శిల్స్‌లో నాణ్యమైన, కచ్చితమైన సమాచారం నమోదు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి డిల్లీరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 2.91 కోట్ల ల్యాండ్ పార్సిల్ (భూ కమతాలు) ఉండగా, ఇప్పటి వరకు 1.07 కోట్ల కమతాల్లో వివరాలను నమోదు చేశారన్నారు. ఇక నుంచి రోజుకు సగటున 12.28లక్షల కమతాల చొప్పున ఈనెల 25లోగా 100శాతం ల్యాండ్ పార్శిల్స్‌ను నమోదు చేయాలన్నారు. అదనపు సిబ్బంది ఏ మేర అవసరమో బేరీజు వేసుకుని కలెక్టర్ల ద్వారా సచివాలయ సిబ్బందిని నియమించుకోవాలన్నారు. ప్రతి ల్యాండ్ పార్శిల్ నమోదు చేసినందుకు పార్శిల్‌కు రూ.పది చొప్పున ప్రోత్సాహకం అందిస్తున్నామని తెలిపారు.

అనంతపురం మహిళా, శిశు సంక్షేమ సాధికారిక అధికారి సస్పెండ్

సాక్షి, అమరావతి : అనంతపురం జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిక అధికారి ఎం.నాగమణిని విధుల నుంచి తప్పిస్తూ ఏపీ మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో స్థానిక శిశు గృహంలో ఆశ్రయం పొందుతున్న రెండు నెలల చిన్నారి నిరూప్ ఇటీవల మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించడంలోనూ జాప్యం చేసినందుకు సదరు జిల్లా అధికారిని సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఏపీ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడిగా కామర్తి రాజు

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడిగా కామర్తి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో జరుగుతున్న ఏపీ చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభలు మంగళవారం ముగిశాయి. 19 మందితో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కట్టా శివదుర్గారావు, ఎం.సత్యనారాయణ, కార్యదర్శిగా పిల్లల మర్రి బాలకృష్ణ, సహాయ కార్యదర్శులుగా డోకిపర్తి రామారావు, వాసా గంగాధర రావు, నందన్ చంద్రకళ, సభ్యులుగా భరణి కాళ్లప్ప, కనికేలా లక్ష్మన్న, అనుముల వీర బ్రహ్మం, సాధు నరసింహారావు, చల్లా సీతారామాంజనేయులు, కొండేటి కుమారి, గోరు రాజు, బూడిద జోగేశ్వరరావు, చల్లా వీరభద్రుడు, గద్దెహేమ సుందర రావు, దీపాల సత్యనారాయణలు ఎన్నికయ్యారు. మరొక సభ్యుడిని ఎన్నుకోవాల్సి ఉంది.

ధాన్యం బకాయిలపేరిట రూ.1,000 కోట్ల రుణానికి అనుమతి

ఇప్పటికే రూ.7,609 కోట్ల రుణం కోసం మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వ అనుమతి

సాక్షి, అమరావతి: ఖరీఫ్ 2024–25 సీజన్‌లో ధాన్యం కొనుగోలు బకాయిలు చెల్లించేందుకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి అదనంగా రూ.1,000 కోట్ల రుణం తీసుకునేందుకు ఏపీ మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వం అనుమతినిచ్చింది. వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మొత్తాన్ని ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌కు ఇంటర్ కార్పొరేట్ రుణం రూపంలో బదిలీ చేసి ధాన్యం కొనుగోలు బకాయిల కోసం ఖర్చు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే ఏపీ మార్క్‌ఫెడ్‌కు రూ.7,609 కోట్ల రుణానికి ప్రభుత్వం హామీ ఇవ్వగా.. తాజాగా రూ.1,000 కోట్లు రుణం పొందేందుకు అనుమతినిచ్చినట్టు పేర్కొన్నారు.

మోహన్ బాబు వర్సిటీ గుర్తింపును రద్దు చేయండి

ప్రభుత్వానికి ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సిఫారసు

సాక్షి, అమరావతి : విద్యార్థుల నుంచి నిర్దేశించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేసిన మోహన్ బాబు వర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థుల నుంచి బలవంతంగా అదనపు ఫీజులు వసూలు చేయడంతో పాటు ప్రశ్నించిన వారిని పరీక్షల్లో ఫెయిల్ చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడటంపై సీఎం కార్యాలయానికి ఫిర్యాదులు అందాయి. సీఎంఓ కార్యాలయం ఆదేశాలతో ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ముగ్గురు నిపుణులతో ప్రత్యేక కమిటీని నియమించింది. కమిటీ వర్సిటీలో పర్యటించి, పలువురు విద్యార్థులతో మాట్లాడటంతో పాటు వర్సిటీ కార్యాలయ రికార్డులను పరిశీలించింది. ఈ పరిశీలనలో అధికంగా ఫీజులు వసూలు చేసినట్టు గుర్తించింది. మూడేళ్లలో విద్యార్థుల నుంచి రూ.26 కోట్లు అదనంగా వసూలు చేసినట్టు నివేదికలో పొందుపర్చింది. ఆ మొత్తాన్ని 15 రోజుల్లోగా తిరిగి చెల్లించాలని వర్సిటీని ఆదేశిస్తూ రూ.15 లక్షల జరిమానా విధించింది. ఆపై వర్సిటీ గుర్తింపు రద్దు చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ మేరకు గత నెల 17న ఆదేశాలు జారీ చేయగా, మోహన్‌బాబు వర్సిటీ గత నెల 26న కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నట్లు సమాచారం. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

వచ్చేనెల 12న ఆర్‌యూ కాన్వొకేషన్

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ (ఆర్‌యూ) 4వ కాన్వొకేషన్ నవంబర్ 12న వర్సిటీలో నిర్వహిస్తున్నట్టు వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకటబసరావు తెలిపారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ కాన్వొకేషన్‌కు గవర్నర్, వర్సిటీ చాన్స్‌లర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరవుతారన్నారు. 2021–22, 2022–23, 2023–24, 2024–25 విద్యా సంవత్సరాల్లో వర్సిటీ పరిధిలో యూజీ, పీజీ, బీఈడీ, బీపీఈడీ, ఎల్ఎల్‌బీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు పూర్తి చేసుకొని ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు వారి విద్యార్హత పట్టాలను పొందవచ్చన్నారు. ఇప్పటికే రెండుసార్లు కాన్వొకేషన్‌కు నోటిఫికేషన్ విడుదల చేయడంతో విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. యూజీ విద్యార్థులు 9404 మంది, పీజీ, ఇతర ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులు 420మంది, పీహెచ్‌డీ 148 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. 70 మంది విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ ప్రదానం చేస్తున్నామని తెలిపారు.

ఆంధ్రాలో సినిమాలు తీయవద్దు

నిర్మాతలకు 'మా- ఏపీ'వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా వినతి

తెనాలి: ఆంధ్రాలో సినిమాలు చిత్రీకరించవద్దని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ (మా–ఏపీ) వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా నిర్మాతలకు విజ్ఞప్తి చేశారు. గుంటూరు జిల్లా తెనాలిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆంధ్రాలో తీసే సినిమాకు రూ.10 లక్షలు సబ్సిడీ చెల్లిస్తామని జీవో చేసినా ఒక్క సినిమాకు కూడా సబ్సిడీ ఇవ్వలేదని గుర్తుచేశారు. అతితక్కువ నిర్మాణ వ్యయంతో రూపొందిస్తున్న 'భోజ్ పురి' సినిమాలకు సైతం సబ్సిడి వెంటనే చెల్లిస్తున్నారని చెప్పారు. పదేళ్లుగా సినిమాలకు సబ్సిడి చెల్లించని రాష్ట్రాలున్నాయా? అని ప్రశ్నించారు. ఆంధ్రాలో సినీపరిశ్రమ అభివృద్ధి గురించి ఒంటరిపోరాటం మినహా ఆశించిన స్పందన ప్రభుత్వం నుంచి రావటం లేదన్నారు. పరిశ్రమ గురించి పట్టించుకునే పరిస్థితిలో ప్రభుత్వం ఉంటే ఒక రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి విధివిధానాలను ప్రకటించేదన్నారు.



సాగుబడి

హస్త కార్తె: అక్టోబర్ 13 వరకు

Food and Agriculture Organization of the United Nations | International Treaty on Plant Genetic Resources for Food and Agriculture





- 20 ఏళ్ల క్రితం అమల్లోకి వచ్చిన అంతర్జాతీయ విత్తన ఒడండిక
- భారత్ సహా 154 దేశాలు ఈ ఒడంబడికలో సభ్యులు
- ఈ ఒడంబడిక పరిధిలోకి 64 రకాల దేశీ విత్తనాలు/ మొక్కలు/ వంగడాలు
- వచ్చే నవంబర్‌లో విత్తన ఒడంబడికకు సవరణలకు అవకాశం
- రైతుల హక్కులకు భంగం కలిగించే సవరణ యత్నాలపై ప్రపంచ రైతుల కూటమి ఆందోళన

రైతు విత్తన హక్కులకు తూట్లు!



విత్తనం.. ప్రకృతి మనుగడకు, ఆహార భద్రతకు, వ్యవసాయానికి, రైతుల సంప్రదాయ పారంపర్య హక్కులకు విత్తనం మూలాధారం. ప్రపంచవ్యాప్తంగా ఇన్ని దేశాల్లో ఎన్నోన్నో ప్రత్యేక విత్తనాలు, విలక్షణ వంగడాలు ఉన్నాయి. సార్వభౌమత్వం గల ఒక దేశంలో అనాదిగా ఉన్న విత్తనాలు, మొక్కలు, వంగడాలు, వాటి జన్యువనరులు ఆ దేశం సొత్తు. ఇంకా చెప్పాలంటే గత పదివేల సంవత్సరాల నుంచి వీటిని నిరంతరాయంగా సాగు చేస్తూ, తమవైన పద్ధతుల్లో పరిరక్షించుకుంటూ, తమ పొలాల్లో వాడుకోవటంతో పాటు, తమ దేశ వాసులతో పంచుకుంటూ జీవనయానం కొనసాగిస్తున్న వ్యవసాయ సమాజాల లేదా రైతుల అపురూపమైన వారసత్వ సొత్తు విత్తనం! ఒక దేశం వ్యవసాయక వారసత్వ సంపదైన విత్తనాన్ని లేదా జన్యు వనరులను ఇతర దేశాలకు ఇచ్చి పుచ్చుకోవటానికి ఎటువంటి నియమ నిబంధనలు పాటించాలో నిర్దేశించేందుకు ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) అంతర్జాతీయ ఒడంబడికను కుదిర్చింది. దాని పేరే యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ ట్రీటీ ఆన్ ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్ ఫర్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ (ఐటీపీజీఆర్ఎఫ్ఏ). దీన్ని అంతర్జాతీయ విత్తన ఒడంబడిక లేదా మొక్కల ఒడంబడిక (సీడ్ ట్రీటీ లేదా ప్లాంట్ ట్రీటీ) అని కూడా పిలుస్తారు. 154 దేశాలు దీనిపై సంతకాలు చేశాయి. ఇది 2004లో అమల్లోకి వచ్చింది. ఇది సభ్యదేశాలన్నీ విధిగా పాటించి తీరవలసిన ఒడంబడిక (లీగల్లీ బైండింగ్ ట్రీటీ) కావటంతో దీని ప్రభావం వారసత్వ మేధో హక్కులపై గణనీయంగా ఉంటుంది. 64 రకాల విత్తనాలు/ మొక్కలు/ వంగడాలు దీని పరిధిలోకి వస్తాయి. ఈ పంటలకు సంబంధించిన 70 లక్షలకు పైగా విత్తనాల నమూనాలు అంతర్జాతీయ స్థాయి విత్తన నిధుల్లో అందుబాటులోకి వచ్చాయి. వీటిని ఉపయోగించుకొని సరికొత్త వంగడాల తయారీపై 28,000కు పైగా విత్తన సంస్థలు పరిశోధనలు చేస్తున్నాయి. ఇతర దేశపు విత్తనాలను పరిశోధనలకు వాడుకుంటే ఆ దేశానికి కంపెనీ కొంత మొత్తాన్ని చెల్లించాలన్నది ఒక నియమం. అయితే, 20 ఏళ్ల తర్వాత ఈ ఒడంబడికకు సవరణలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ సవరణలు రైతుల హక్కులకు భంగం కలిగిస్తూ కంపెనీలకు లాభం చేకూర్చేలా ఉన్నాయని విమర్శలు రావటంతో వివాదం రాజుకుంది. ఆ విషయాలను కొంచెం వివరంగా తెలుసుకుందాం...

అంతర్జాతీయ విత్తన ఒడంబడిక (ఐటీపీజీఆర్ఎఫ్ఏ)కు సవరణ ప్రయత్నాల నేపథ్యంలో ఇటీవల వివాదం నెలకొంది. ప్రధానంగా అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య విత్తన జన్యు వనరుల పంపిణీకి సంబంధించిన మేధో సంపత్తి హక్కులు, ప్రయోజన భాగస్వామ్యం (బెనిఫిట్ షేరింగ్), సింపుల్‌గా చెప్పాలంటే రాయల్టీ, చెల్లింపు విషయంలో కొనసాగుతున్న అసమానతల కారణంగా వివాదం నెలకొంది. ఈ వ్యవస్థ చిన్న తరహా రైతులు, జీవవైవిధ్యం అధికంగా ఉన్న భారత్ తదితర దేశాల ప్రయోజనాల కంటే బహుళజాతి విత్తన సంస్థలకు ఎక్కువ అనుకూలంగా ఉందని.. అంతేకాకుండా ప్రతిపాదిత సవరణలు ఈ సమస్యలను మరింతగా పెంచుతాయని విమర్శకులు వాదిస్తున్నారు.

నవంబర్‌లో లిమాలో కీలక సమావేశం

నవంబర్ 24 నుంచి 29 వరకు పెరూలోని లిమాలో జరగనున్న విత్తన ఒడంబడిక 11వ పాలకమండలి సమావేశంలో సవరణలపై చర్చ జరగనుంది. వర్కింగ్ గ్రూప్ తయారుచేసిన చర్చల ముసాయిదా ప్యాకేజీపై చర్చిస్తారు.

వివాదానికి దారితీసిన కీలక అంశాలు:

1. ప్రపంచంలోని పంటల జీవవైవిధ్యం (అంటే.. వైవిధ్యమైన వంగడాలు, పంటల జాతుల సంఖ్య) ఎక్కువ భాగం అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే కేంద్రీకృతమై ఉంది. ఈ దేశాలు తమ జన్యు పదార్థాన్ని అభివృద్ధి చెందిన దేశాలకు అనాదిగా అందిస్తున్నాయి. అయితే, అందుకు తగిన స్థాయిలో ఆర్థిక ప్రయోజనాలు తిరిగి పొందలేకపోతున్నాయి.

2. జన్యు వనరుల వాణిజ్యీకరణతో కలిగే ప్రయోజనాలను బెనిఫిట్–షేరింగ్ ఫండ్ ద్వారా సేకరించి విత్తన హక్కులున్న దేశాలకు పునఃపంపిణీ చేయడానికి బహుళ పక్ష వ్యవస్థ (ఎంఎల్ఎస్) ను ఏర్పాటు చేశారు. అయితే, ఈ వ్యవస్థ చాలా తక్కువ డబ్బును మాత్రమే రాబట్టగలుగుతోంది. ప్రయోజనాలు తరచుగా ద్రవ్యేతరమైనవి లేదా కేవలం ప్రతీకాత్మకమైనవిగా అరకొరగా మాత్రమేనని విమర్శకులు వాదిస్తున్నారు.

3. విత్తన ఒడంబడిక ఎజెండాలోనే తేడా ఉందన్న అభిప్రాయం ఉంది. రైతులు, స్వదేశీ వ్యవసాయ సమాజాల హక్కుల పరిరక్షణపై కంటే.. తమ వాణిజ్య ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చే కార్పొరేట్ సంస్థలకే విత్తన ఒడంబడిక ఉపయోగపడుతోందని చాలామంది భావిస్తున్నారు.

ప్రపంచ రైతుల కూటమి హెచ్చరిక

ఐక్యరాజ్యసమితి విత్తన ఒప్పందంలో ప్రతిపాదించిన సంస్కరణలు రైతుల హక్కులకు భంగం కలిగించే విధంగా ఉన్నాయని రైతు సంఘాలు, పౌర సమాజ సంస్థలతో కూడిన 'ప్రపంచ రైతుల కూటమి' హెచ్చరిస్తోంది. ప్రతిపాదనలు రైతుల డిమాండ్లను పక్కన పెట్టి విత్తన కంపెనీలకు బహుళ పక్ష వ్యవస్థను మరింత ఆకర్షణీయంగా మార్చడంపై దృష్టి పెడుతున్నాయని కూటమి ఆరోపిస్తోంది. రైతుల హక్కులను దెబ్బతీసే విత్తన ఒప్పంద సంస్కరణలను ప్రపంచ రైతు కూటమి వ్యతిరేకిస్తోంది. బహుళ పక్ష వ్యవస్థ పరిధి లోకి ప్రస్తుతం ఉన్న 64 పంటలతో పాటు ఇతర మొక్కల జన్యు వనరులను చేర్చాలన్న ప్రతిపాదన ఉంది. ఇది జాతీయ విత్తన హక్కుల దోపిడీకి దారితీస్తుందని కూటమి ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మార్పులు రైతుల హక్కులను, విత్తనాలపై ఆయా దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తాయని హెచ్చరించింది. ఒప్పందం పరిధిని విస్తరించే లక్ష్యంతో ఉన్న సంస్కరణలు బహుళజాతి విత్తన సంస్థలకు అనుకూలంగా కనిపిస్తున్నాయి. ఇవి తగిన రక్షణలు లేకుండా సాంప్రదాయ విత్తన రకాలను దోపిడీ చేయడానికి వీలు కల్పిస్తాయని కూటమి తెలిపింది.

మన దేశంలోని రైతు సంఘాల జాతీయ కూటమి అయిన భారత్ బీజ్ స్వరాజ్ మంచ్, ప్రపంచవ్యాప్తంగా 280 కంటే ఎక్కువ సంస్థలు, 100 మంది వ్యక్తులతో కలిసి ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ డైరెక్టర్ జనరల్ క్యూ డోంగ్యు, విత్తన ఒడంబడిక కార్యదర్శి కెంట్ న్నాడోజీకి గత నెల 12న లేఖ రాశారు. చర్చల దశలో ఉన్న ప్రస్తుత చర్యల ముసాయిదా ప్యాకేజీ రైతుల హక్కులను, విత్తనాలపై జాతీయ సార్వభౌమత్వానికి గొడ్డలిపెట్టు వంటిదని, అదే సమయంలో ఒప్పంద వ్యవస్థను బహుళజాతి విత్తన సంస్థలకు మరింత ఆకర్షణీయంగా మారుస్తుందని ఆ లేఖ హెచ్చరించింది.

కొత్త ప్రతిపాదనలు ప్రపంచ కార్పొరేషన్లు తగిన రక్షణ చర్యలు లేకుండా భారతదేశ సాంప్రదాయ విత్తనాలను, వాటి జన్యు డేటాను దొరకబుచ్చుకోవటానికి వీలు కల్పించవచ్చని రైతులు ఆందోళనలు వ్యక్తం చేయడం ఇదే మొదటిసారి కాదు. గత మే 21న ఈ సంస్కరణల ప్రమాదాలను పౌర సమాజం ఎత్తి చూపింది. జూలై 7న రైతు సంఘాలు, దేశీ విత్తన సంరక్షకులు, పర్యావరణ న్యాయవాదులు ఉమ్మడి లేఖలో ఇదే హెచ్చరిక చేశారు. జూలై 10న శాస్త్రవేత్తల బృందం కేంద్ర వ్యవసాయ మంత్రికి లేఖ రాసింది. ఒప్పందం భారతదేశ విత్తన సార్వభౌమత్వానికి గండి కొట్టేలా ఉందని హెచ్చరించింది.

ఈ విజ్ఞప్తిపై ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, యూరప్, ఓషియానియా నుంచి రైతు సంఘాలు, పౌర సమాజ సంస్థలు సంతకం చేశాయి. సంతకాలలో ఆఫ్రికన్ సెంటర్ ఫర్ బయోడైవర్సిటీ (దక్షిణాఫ్రికా), అసోసియాసియన్ నేషనల్ డి ప్రొడక్టోర్స్ ఎకోలోజికోస్ డెల్ పెరూ (పెరూ), అన్నదాన సాయిల్ - సీడ్ సేవర్స్ నెట్‌వర్క్ (ఇండియా), థర్డ్ వరల్డ్ నెట్‌వర్క్ (మలేషియా) వంటి ప్రసిద్ధ సమూహాలు సంతకాలు చేశాయి.

రైతులకు దక్కని ప్రయోజనాలు

బహుపాక్షిక వ్యవస్థలో పారదర్శకత లేకపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా 28,000 కంటే ఎక్కువ కార్పొరేట్ విత్తన సంస్థలు ఈ ఒప్పందం ప్రకారం 70 లక్షలకు పైగా విత్తన నమూనాలను ఉపయోగించుకున్నాయి. విత్తన కంపెనీలు ఈ వనరులతో అభివృద్ధి చేసిన కొత్త విత్తన రకాలపై మేధో సంపత్తి హక్కులను పొందాయి. అయితే, ఆ వనరులను అందించిన దేశాలకు లేదా రైతులకు ఎటువంటి ప్రయోజనాలు తిరిగి అందలేదని లేఖ ఎత్తి చూపింది.

రక్షణ చర్యలు లేకుండా బహుపాక్షిక వ్యవస్థను విస్తరిస్తున్నారని కూడా వారు విమర్శించారు. ప్రస్తుత 64 పంటలకు తోడు మిగతా అన్ని మొక్కల జన్యు వనరులను చేర్చడానికి ఈ వ్యవస్థను విస్తరించాలన్నది ప్రతిపాదన. ఇప్పటికే ఉన్న ప్రయోజన భాగస్వామ్య విధానాలు బలహీనంగా ఉన్నందున ఈ ప్రతిపాదన మరింత దోపిడీకి ఆస్కారం కలిగిస్తుందని అంటున్నారు.

రైతుల హక్కులకు రక్షణేదీ?

రైతుల హక్కులను గుర్తించాలని లేఖ పిలుపునిచ్చింది. విత్తనాలను పండించిన పంట నుంచి తీసి దాచుకోవటం, ఉపయోగించడం, ఇతరులకు ఇచ్చి పుచ్చుకుంటూ మార్పిడి చేయడం, విక్రయించడం వంటి రైతుల హక్కులను రక్షించడంలో నవంబర్‌లో జరిగే సమావేశానికి ముందు విడుదలైన ముసాయిదా విఫలమైందని ఎఫ్ఏవో డైరెక్టర్ జనరల్‌కు రాసిన లేఖపై సంతకాలు చేసిన వారు ఆరోపించారు. బయోపైరసీ లేదా సాంప్రదాయ విత్తన రకాల పేటెంట్ మోసాలను అరికట్టే రక్షణలు ఇందులో లేవు. తమ విత్తనాలను స్వాధీనం చేసుకుని కార్పొరేట్ నియంత్రిత వంగడాలుగా మార్చే కంపెనీలు, వాటిని తిరిగి తమకే విక్రయిస్తారని రైతులు భయపడుతున్నారు.

ఎక్కువ పారదర్శకత, జవాబుదారీతనం కావాలని రైతు సంఘాలు అడుగుతున్నాయి. అంతర్జాతీయ విత్తన ఒడంబడిక ఎవరు ఏ విత్తనాలను తీసుకుంటున్నారు? వాటిని ఎలా ఉపయోగిస్తున్నారు? అనే విషయాలను గుట్టుగా ఉంచకుండా, బహిరంగంగా వెల్లడించాలని కూడా డిమాండ్ చేస్తున్నాయి. విత్తన ఒడంబడికలో సంస్కరణలు చేసే ముందు ప్రపంచవ్యాప్తంగా రైతులతో సంప్రదింపులు జరపాలని పిలుపునిచ్చాయి. జాతీయ సార్వభౌమత్వాన్ని లేదా కంపెనీలు కొత్త వంగడాల తయారీ ద్వారా పొందే ప్రయోజనాలలో అందుకు ఉపయోగపడిన పాత విత్తనాల జన్యువనరులపై హక్కుదారులైన రైతులకు సముచిత భాగం పంచే వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఒక కొత్త ప్రక్రియను ప్రారంభించాలని రైతు సంఘాలు ప్రతిపాదించాయి. రైతుల జన్యు హక్కులకు బలమైన రక్షణలు కల్పించాలని, డిజిటల్ బయోపైరసీని నిరోధించడానికి చర్యలు తీసుకోవాలని కూడా వారు కోరుతున్నారు.

– నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్

చిట్టి చేప చీరమీను రుచే వేరు!

చీరమీను.. అరుదైన ఒక రకం చిట్టిచేప. గోదావరి నది బంగాళాఖాతంలో కలిసే ప్రాంతాల్లో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని యానం ప్రాంతంలో దొరుకే ఒక ప్రత్యేకమైన, అత్యంత విలువైన చేప. ఈ చిన్న చేప చక్కని రుచి, పోషకాలతో కూడినది. సీజన్‌లో దొరుకుతుంది. ప్రత్యేక వేట పద్ధతులకు ప్రసిద్ధి చెందింది. చీరమీను స్థానికులకు మాత్రమే కాక, సీ ఫుడ్ ప్రియులకు కూడా ప్రత్యేక ఆకర్షణగా మారింది.

స్థానిక పేర్లు: చీరమీను, సీరమీను. శాస్త్రీయ నామం: auridatumbil, Sauridagracilis, Sauridatumbil ambo scamis. కుటుంబం: Synodontidae. దీన్ని కొందరు Awaousfluviatilis అని కూడా సూచిస్తారు.

చీరతో పట్టే చేప

చీరమీను ప్రధానంగా గోదావరి నది – సముద్రం కలిసే బురద నీటిలో దొరుకుతుంది. ఈ ప్రాంతంలో ఆక్సిజన్ సమృద్ధిగా ఉండటం వల్ల ఈ చేపలు గుడ్లు పెడతాయి. వర్షాకాలం సీజన్‌లో తూర్పు గాలులు వీస్తే, ఈ చేపలు నది ఒడ్డుకు చేరతాయి. వాటి రాకను పక్షులు గమనించి వాటిని తినడానికి నీటిపై ఎగురుతాయి. పక్షుల హడావుడి చూసి మత్స్యకారులు 'చీరమీను వస్తోంది' అని గుర్తిస్తారు. చీరమీను వేట ఒక సాంప్రదాయ ప్రక్రియ. మత్స్యకారులు చీరలకు ఒకవైపున షీట్లు కుట్టి వాటిని నీటిలో అమరిస్తారు. చేపలు వాటిలో చిక్కుకుంటాయి. చిన్న వలలు ఉపయోగించకుండా ఈ చేపలను చీరలతోనే సురక్షితంగా పట్టుకుంటారు. చీరలను ఉపయోగించి పడవలో వెళ్లి పట్టుకుంటారు కాబట్టి 'చీరమీను' అని పేరుపెట్టారు. ఈ చేప 1.7 సెంటీమీటర్ల వరకు పెరుగుతుంది.

చీరమీను సాధారణంగా ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో లభిస్తుంది. వర్షాకాలంలో ఎక్కువగా దొరుకుతుంది. దీపావళి, నాగుల చవితి వంటి పండుగల సమయానికి చీరమీను మార్కెట్లలో అత్యధిక డిమాండ్‌లో ఉంటుంది. ఈ సీజన్‌లోనే స్థానికులు, ఆహార ప్రేమికులు దీన్ని ఆస్వాదిస్తారు. మాంసకృత్తులు, కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్, నియాసిన్, సెలీనియం, ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు చీరమీను చేపల్లో పుష్కలంగా ఉంటాయి.

కిలో రూ. 1,500!

చీరమీను అరుదుగా దొరుకుతుంది. వేట శ్రమతో కూడినది. కాబట్టి, మార్కెట్‌లో అధిక ధర పలుకుతుంది. దీన్ని గ్లాసు, తవ్వ, సేరు, కుంచం, బిందె, బకెట్లలో కొలిచి విక్రయిస్తారు. ఒక గ్లాసు చీరమీను చేపల ధర సుమారు రూ. 50–100. ఒక కుండి లేదా పెద్ద పాత్ర చేపల ధర రూ.10,000 వరకు ఉంది. కిలో ధర: రూ.500 – 1,500 (డిమాండ్‌ను బట్టి) పలుకుతుంది. ఇందువల్ల ఇది ఒక విలాసవంతమైన వంటకంగా మారింది. చీరమీను మాత్రమే కాక, దీని పిల్లలు కూడా ఫ్రాన్స్ వంటి అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి అవుతాయి.

మసాలా దట్టించి వండిన చీరమీను చక్కటి రుచి ఉంటుంది. కొంతమంది చీరమీను మినప్పిండి, చింత చిగురు, మామిడి కాయ, గోంగూర వంటి ఇతర పదార్థాలతో కలిపి వంటలు తయారు చేస్తారు. స్థానికులు పండుగల సమయంలో బంధు మిత్రులకు దీన్ని బహుమతిగా ఇచ్చి ఆనందిస్తారు.



గోదావరి మడ అడవుల ప్రాంతంలో అధికంగా వేటాడటం, కాలుష్యం, వాతావరణ మార్పుల వల్ల చీరమీను మనుగడ ప్రమాదంలో పడింది. కాలుష్య నియంత్రణ, మత్స్యసంఘాల అవగాహన ద్వారా సురక్షిత వేట పద్ధతులను పాటిస్తే చేపల జాతిని పరిరక్షించుకోవచ్చు. తద్వారా జీవవైవిధ్యాన్ని, గోదావరి ప్రాంతపు సాంస్కృతిక, ఆర్థిక వారసత్వాన్ని నిలుపుకోవచ్చు. భవిష్యత్ తరాలకు దీన్ని రుచి చూపవచ్చు. చీరమీను కేవలం ఒక చేప మాత్రమే కాదు. ఇది ఆంధ్రప్రదేశ్‌లో సాంప్రదాయం, జీవనోపాధి, వంటకాల సంపద పర్యావరణ సూచికగా ప్రసిద్ధి చెందింది. ప్రతి వర్షాకాలం సీజన్‌లో గోదావరి ప్రాంతానికి వచ్చే పర్యాటకులు దీని రుచిని ఆస్వాదించడానికి ఇష్టపడతారు.

– పొన్నపల్లి రామమోహన్ రావు
(9885144557), డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ (రిటైర్డ్), కాకినాడ

మహీంద్రా 2025 థార్, బొలెరో వచ్చేశాయ్!



- బొలెరో, బొలెరో నియో మోడళ్లకు ఫేస్‌లిఫ్ట్
- ప్రారంభ ధరలు రూ.7.99 లక్షలు, రూ. 8.49 లక్షలు

ముంబై: దేశీ వాహన దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా బొలెరో, బొలెరో నియో మోడళ్లకు ఫేస్‌లిఫ్ట్ (2025 ఎడిషన్) అప్‌డేట్స్ తీసుకొచ్చింది. ఇందులో బొలెరో ప్రారంభ ధర రూ. 7.99 లక్షలు కాగా..., బొలెరో నియో ప్రారంభ ధర రూ.8.49 లక్షలుగా ఉంది. ఈ రెండు ఎస్‌యూవీలలో మెకానికల్‌గా మార్పులేమీ చేయలేదు. అయితే రైడింగ్, హ్యాండ్లింగ్ బ్యాలెన్స్‌ను మెరుగుపరిచేందుకు సస్పెన్షన్‌ను మెరుగుపరిచారు.

సరికొత్తగా థార్

దేశీయ మార్కెట్లోకి 'థార్ 3 డోర్' 2025 మోడల్‌ను అధికారికంగా విడుదల చేసింది. పెట్రోల్, డీజిల్ ఇంజిన్‌తో తయారైన ఈ కారు ప్రారంభ ధర రూ.9.99 లక్షలు. టాప్ ఎండ్ వేరియంట్ ధర రూ.16.99 లక్షలుగా ఉంది. ఇందులో ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లేని సపోర్ట్ చేసే హెచ్‌డీ ఎంటర్‌టైన్‌మెంట్ స్క్రీన్, టైప్-సీ యూఎస్‌బీ పోర్టు, టైర్ డైరెక్షన్ మానిటరింగ్ సిస్టమ్‌లున్నాయి. కొత్తగా ట్యాంగో రెడ్, బ్యాటిల్‌షిప్ గ్రే కలర్లు అందుబాటులోకి తెచ్చారు. మాన్యువల్, ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌లు రెండూ అందుబాటులో ఉన్నాయి.

బొలెరో ఫేస్‌లిఫ్ట్

బొలెరో బీ4, బొలెరో బీ6, బొలెరో బీ6(ఓ), బొలెరో బీ8 మొత్తం నాలుగు వేరియంట్లు ఉన్నాయి. టాప్ ఎండ్ బీ8 వేరియంట్ ధర రూ.9.69 లక్షలుగా ఉంది. క్రోమ్ ఇన్సర్ట్‌లతో కూడిన కొత్త 5-స్లాట్ గ్రిల్‌ను అందించారు. బీ6 ట్రిమ్ నుంచి ఫాగ్ ల్యాంప్స్ లభిస్తాయి. బీ8 ట్రిమ్‌లో కొత్త 16-అంగుళాల అల్లాయ్ వీల్స్‌ను జోడించారు. స్టీల్త్ బ్లాక్ అనే కొత్త కలర్ ఆప్షన్‌ను పరిచయం చేశారు. ఇంటీరియర్‌లో టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ యూనిట్, కొత్త స్టీరింగ్-మౌంటెడ్ కంట్రోల్‌లు, లెదరెట్ అప్‌హోల్‌స్ట్రీ వంటి ఫీచర్లు ఉన్నాయి.

న్యూ బొలెరో నియో..

ఇది కూడా నాలుగు వేరియంట్లలో అందుబాటులో ఉంటుంది. ఆకట్టుకునే హారిజోంటల్ యాక్సెంట్స్‌తో ఆకర్షణీయమైన కొత్త గ్రిల్, డార్క్ మెటాలిక్ గ్రే ఆర్16 అల్లాయ్ వీల్స్, హెడ్‌లైట్‌లో డీఆర్‌ఎల్‌లు ఉన్నాయి. ఇంటీరియర్ పరంగా ఇన్ఫోటైన్‌మెంట్, కొత్త అప్‌హోల్‌స్ట్రీ, బ్లూటూత్ కనెక్టెడ్ మ్యూజిక్ ప్లేయర్, కీలెస్ ఎంట్రీ, 9-అంగుళాల క్లస్టర్, ఏబీఎస్, రియర్ వ్యూ కెమెరా, యూఎస్‌బీ-సీ పోర్ట్‌లు వంటి ఫీచర్లు ఉన్నాయి. కొత్తగా జీన్స్ బ్లూ, కాంక్రీట్ గ్రే, డ్యూయల్-టోన్ కలర్లు పరిచయం చేశారు. ఇందులో టాప్ ఎండ్ ఎన్11 వేరియంట్ ప్రత్యేకంగా లూనార్ గ్రే కలర్, మిగితా వేరియంట్స్ అన్నీ బ్రౌన్ కలర్ థీమ్ ఇంటీరియర్ లభిస్తుంది.



బిజినెస్ రీల్

నగారోలో వెయ్యి కొలువులు

వచ్చే 12-18 నెలల్లో నియామకాలు



న్యూఢిల్లీ: గ్లోబల్ డిజిటల్ ఇంజినీరింగ్ కంపెనీ నగారో వచ్చే 12-18 నెలల్లో 1,000 మంది పైగా నిపుణులను నియమించుకునే యోచనలో ఉంది. హైదరాబాద్, బెంగళూరు, పుణె సహా కీలక హబ్‌లలో ఈ నియామకాలు చేపట్టనున్నట్లు సంస్థ తెలిపింది. కంపెనీకి ప్రస్తుతం భారత్‌లో 13,000 మంది ఉద్యోగులు ఉన్నట్లు నగారో సీఈవో మానస్ హుమాన్ వివరించారు. స్టార్టప్‌లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో (జీసీసీ) హైరింగ్ పెరగడంతో మార్కెట్లో నిపుణుల కొరత నెలకొందని, అయితే అంతర్జాతీయ అనిశ్చితులపై ఆందోళన వల్ల ఉద్యోగాలు మారే విషయంలో ఆచి తూచి వ్యవహరిస్తున్నట్లు మానస్ తెలిపారు. అంతర్జాతీయంగా వాణిజ్య, టారిఫ్‌లపరమైన అనిశ్చి తులు ప్రభావం చూపుతున్నాయని వివరించారు.

జీఆర్‌టీ జ్యువెలర్స్ 'తంగ దీపావళి' ఆఫర్లు



హైదరాబాద్: జీఆర్‌టీ జువెలర్స్ 'తంగ దీపావళి' పేరుతో ఆఫర్లు ప్రకటించింది. ఇందులో భాగంగా కస్టమర్లు కొనుగోలు చేసిన బంగారం బరువుకు సమానంగా వెండిని ఉచితంగా పొందుతారని తెలిపింది. బంగారు ఆభరణాల కొనుగోలుపై ప్రతి గ్రాముకు రూ.100 తగ్గింపు ఇస్తున్నట్లు పేర్కొంది. వజ్రాల కొనుగోలుపై ప్రతి క్యారట్‌కు 25 గ్రాములు, అన్‌కట్ డైమండ్స్ కొనుగోలుపై ప్రతి క్యారెట్ 2 గ్రాములు, ప్లాటినం ఆభరణాల బరువుకు అంతే సమానమైన వెండిని ఉచితంగా పొందవచ్చని వివరించింది. వీటితో పాటు వెండి వస్తువుల తరుగుపై 25% తగ్గింపు, వెండి ఆభరణాల ఎంఆర్‌పీపై 10% తగ్గింపును పొందవచ్చని వెల్లడించింది. ఏపీ, తెలంగాణ, కర్ణాటకల్లో స్వర్ణ దీపావళి, తమిళనాడులో తంగ దీపావళి పేరుతో ఈ ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించింది. దీపావళి ఆఫర్లు.. కస్టమర్లకు ఆభరణాలను మాత్రమే కాకుండా చిరస్మరణీయమైన షాపింగ్ అనుభవాన్ని అందిస్తాయని జీఆర్‌టీ జువెలర్స్ ఎండీ జీఆర్ ఆనంద్ అనంత పద్మనాభన్ అన్నారు.

టాటా ట్రస్ట్స్‌లో ఆధిపత్య పోరు

కేంద్రం చెంతకు పంచాయితీ!

- కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్‌తో నోయెల్ టాటా భేటీ
- ఆయన వెంటే టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్
- ట్రస్టీల మధ్య విభేధాల నేపథ్యంలో కీలక పరిణామం



న్యూఢిల్లీ: బోర్డు నియామకాలు, గవర్నెన్స్ అంశాలపై ట్రస్టీల మధ్య విభేదాలతో టాటా ట్రస్ట్స్‌లో అంతర్గతంగా ఆధిపత్య పోరు నెలకొన్న తరుణంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ మంగళవారం సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. హోంమంత్రి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో టాటా ట్రస్ట్స్ వైస్ చైర్మన్ వేణు శ్రీనివాసన్, ట్రస్టీ డేరియస్ ఖంబట్టా కూడా ఉన్నారు. ట్రస్టీల మధ్య ఆధిపత్య పోరు కారణంగా ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో టాటా గ్రూప్‌నకు చాలా ప్రాధాన్యమున్న నేపథ్యంలో దాని పూర్తి నియంత్రణను ఏ ఒక్కరి చేతికో ఇవ్వడం శ్రేయస్కరమేనా కాదా అనేది ప్రస్తుతం ప్రభుత్వం ముందున్న సవాలుగా మారిందని వివరించాయి. టాటా ట్రస్ట్స్ ట్రస్టీల మధ్య విభేదాలు టాటా సన్స్‌పైనా ప్రభావం చూపుతాయని పేర్కొన్నాయి.

రెండు వర్గాలుగా ట్రస్టీలు..

156 ఏళ్ల దిగ్గజ గ్రూప్ టాటా సన్స్ గొడుగు కింద 30 లిస్టెడ్ కంపెనీలతో పాటు 400 కంపెనీలు ఉన్నాయి. దీనిపై గణనీయంగా ప్రభావం చూపే.. టాటా ట్రస్ట్స్‌కి టాటా సన్స్‌లో 66 శాతం వాటాలు ఉన్నాయి. ప్రస్తుతం టాటా సన్స్ బోర్డులో నియామకాలు, గవర్నెన్స్ అంశాల మీద వివాదం నెలకొంది. టాటా సన్స్ బోర్డులో నామినీ డైరెక్టరుగా మాజీ డిఫెన్స్ కార్యదర్శి విజయ్ సింగ్ పునర్నియామకం కోసం సెప్టెంబర్ 11న జరిగిన ఆరుగురు ట్రస్టీల సమావేశంలో దీనికి బీజం పడింది. విజయ్ పేరును ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా, వేణు శ్రీనివాసన్ ప్రతిపాదించగా, నలుగురు ట్రస్టీలు (మెహ్లీ మిస్త్రీ, ప్రమిత్ ఝవేరీ, జహంగీర్ హెచ్‌సీ జహంగీర్, డేరియస్ ఖంబట్టా) వ్యతిరేకించారు. తదుపరి మెహ్లీ మిస్త్రీని నామినేట్ చేయాలంటూ ఆయన తరఫున ఉన్న నలుగురు ట్రస్టీలు ప్రతిపాదించగా, టాటా గ్రూప్ విలువలను ప్రస్తావిస్తూ దాన్ని నోయెల్ టాటా, వేణు శ్రీనివాసన్ వ్యతిరేకించారు. దీనితో విభేదాలు తారస్థాయికి చేరినట్లు సమాచారం. కీలకమైన నిర్ణయాల్లో తనను పక్కన పెడుతున్నారంటూ మెహ్లీ మిస్త్రీ భావిస్తుండగా, ఆయన సారథ్యంలోని ట్రస్టీలంతా కలిసి.. ట్రస్ట్స్‌లో నోయెల్ టాటా ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని గ్రూప్‌లో కొందరు భావిస్తున్నారు. టాటా సన్స్‌లో 18.37 శాతం వాటాలున్న షాపూర్‌జీ పల్లోంజీ కుటుంబానికి మెహ్లీ మిస్త్రీకి బంధుత్వం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆధిపత్యం కోసం పోరు నడుమ ట్రస్టీలు రెండు వర్గాలుగా చీలిపోయినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అక్టోబర్ 10న టాటా ట్రస్ట్స్ బోర్డు మరోసారి సమావేశం కానుండగా, అజెండా వెల్లడి కాలేదు. ఈ వ్యవహారంపై టాటా ట్రస్ట్ టాటా సన్స్, వేణు శ్రీనివాసన్ వ్యాఖ్యానించడానికి నిరాకరించారు. టాటా గ్రూప్‌లో అత్యున్నత స్థాయిలో కొన్నాళ్ల క్రితం కూడా ఇలాంటి పరిస్థితే తలెత్తింది. అప్పటి గౌరవ చైర్మన్ రతన్ టాటా, టాటా గ్రూప్ చైర్మన్ సైరస్ మిస్త్రీ మధ్య విభేదాలు తలెత్తాయి. ఇవి చివరికి మిస్త్రీ ఉద్వాసనకు దారి తీశాయి. ప్రస్తుతం రతన్ టాటా, మిస్త్రీ.. ఇద్దరూ మరణించారు.

నేడే నవీ ముంబై విమానాశ్రయం ప్రారంభం



న్యూఢిల్లీ: దాదాపు రూ. 19,650 కోట్లతో నిర్మించిన నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం తొలి దశను ప్రధాని నరేంద్ర మోదీ నేడు (బుధవారం) ప్రారంభించనున్నారు. ముంబైకి కనెక్టివిటీని పెంచేందుకు, ప్రస్తుత విమానాశ్రయంపై భారాన్ని తగ్గించేందుకు ఇది ఉపయోగపడుతుందని గ్లోబల్ ఎయిర్‌లైన్స్ గ్రూప్ ఐఏటీఏ తెలిపింది. దీనితో భారత ఎకానమీకి కూడా గణనీయంగా లబ్ధి చేకూరుతుందని వివరించింది. భారత ఏవియేషన్ ప్రస్థానంలో నవీ ముంబై ఎయిర్‌పోర్ట్ ప్రారంభం కీలక మైలురాయిగా నిలుస్తుందని ఐఏటీఏ రీజనల్ వైస్ ప్రెసిడెంట్ (ఏషియా-పసిఫిక్) షెల్డన్ హీ తెలిపారు. తొలి దశలో ఏటా 2 కోట్ల మంది ప్యాసింజర్ల హ్యాండ్లింగ్ సామర్థ్యంతో, ఎయిర్‌పోర్టులో ఒక టర్మినల్, ఒక రన్‌వే ఉంటాయి. దేశీయంగా మొట్టమొదటిసారిగా వాటర్ ట్యాక్సీతో కనెక్ట్ అయిన విమానాశ్రయం ఇదే అవుతుందని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ఆవిష్కరణలను అణగదొక్కేలా నిబంధనలు ఉండకూడదు..

- దీపావళికి ముందే మరిన్ని సంస్కరణలు
- నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం



న్యూఢిల్లీ: నిబంధనలు, నియంత్రణలనేవి కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేలా ఉండాలే తప్ప అణగదొక్కేలా ఉండకూడదని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. వాటిని అణగదొక్కే పరిస్థితి ఉంటే ఇంకో దగ్గరెక్కడో ఆవిష్కరణలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. నియంత్రణలనేవి సంస్థ ప్రాతిపదికగా కాకుండా కార్యకలాపాల ప్రాతిపదికన ఉండాలని సుబ్రహ్మణ్యం గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో పాల్గొన్న సందర్భంగా చెప్పారు. 'ఒకవేళ నేను బ్యాంకింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తుంటే, నన్ను బ్యాంకరుగా పరిగణించి, దానికి తగ్గ నిబంధనలు వర్తింపచేయాలి. అదే ఏదైనా ఫండ్‌ను డిస్ట్రిబ్యూట్ చేస్తుంటే, బ్యాంకరుగా కాకుండా ఫండ్ డిస్ట్రిబ్యూటరు నిబంధనలను వర్తింపచేయాలి' అని ఆయన పేర్కొన్నారు. ఈ తరహా విధానంపై ఆర్థిక శాఖ, నియంత్రణ సంస్థలు లోతుగా చర్చిస్తున్నట్లు వివరించారు. మరో వైపు, జీఎస్‌టీ 2.0 తర్వాత, దీపావళికన్నా ముందే మరో విడత సంస్కరణలను ప్రకటించే అవకాశం ఉందని సుబ్రహ్మణ్యం చెప్పారు. నీతి ఆయోగ్ సభ్యుడు రాజీవ్ గౌబా సారథ్యంలోని కమిటీ ఇప్పటికే వీటికి సంబంధించిన నివేదికల తొలి సెట్‌ను సమర్పించినట్లు పేర్కొన్నారు.

పొరుగుదేశాలతో పటిష్ఠ సంబంధాలు ఉండాలి..

చైనాతో పాటు ఇతర పొరుగు దేశాలతో భారత్‌కి పటిష్ఠమైన వాణిజ్య సంబంధాలు ఉండాలని సుబ్రహ్మణ్యం అభిప్రాయపడ్డారు. మొత్తం యూరోపియన్ యూనియన్ వాణిజ్యంలో 50 శాతం భాగం.. అంతర్గతంగా ఆయా దేశాల మధ్యే జరుగుతుందని ఆయన చెప్పారు. భారత్ విషయానికొస్తే బంగ్లాదేశ్ 6వ అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగాను, టాప్ 10లో నేపాల్ ఉండేదని తెలిపారు. చైనా పెట్టుబడులపై ఆంక్షలు ఎత్తివేస్తారా అనే ప్రశ్నకు నేరుగా సమాధానం ఇవ్వకపోయినప్పటికీ, భారత్‌కి ఆ దేశం కీలక సరఫరాదారని సుబ్రహ్మణ్యం చెప్పారు. 18 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని విస్మరించజాలమని పేర్కొన్నారు. అలాంటి దేశానికి మరింతగా విక్రయించలేకపోతే అర్థరహితమైన విషయం అవుతుందని అభిప్రాయపడ్డారు.

బజాజ్ అలయెంజ్ పేరు మార్పు

ఇక బజాజ్ జనరల్, బజాజ్ లైఫ్


ముంబై: డైవర్సిఫైడ్ ఫైనాన్షియల్ సర్వీసుల దిగ్గజం బజాజ్ ఫిన్‌సర్వ్ తాజాగా బీమా రంగ భాగస్వామ్య సంస్థలను రీబ్రాండింగ్ చేసింది. దీంతో ఇకపై బజాజ్ అలయెంజ్ జనరల్ ఇన్సూరెన్స్, బజాజ్ అలయెంజ్ లైఫ్ ఇన్సూరెన్స్.. బజాజ్ జనరల్, బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్‌గా సేవలు అందించనున్నాయి. ఈ ఏడాది మొదట్లో రెండు సంస్థలలోనూ భాగస్వామ్య కంపెనీ అలయెంజ్ ఎస్ఈకి గల 26 శాతం వాటాలను కొనుగోలు చేసేందుకు బజాజ్ గ్రూప్ ఒప్పందం(ఎస్‌పీఏ) కుదుర్చుకుంది. ఒప్పందాన్ని అమలు చేయడంతో వీటిలో బజాజ్ గ్రూప్ వాటా ప్రస్తుతం 74 శాతం నుంచి 100 శాతానికి చేరనుంది. ఎస్‌పీఏకు అన్ని రకాల అనుమతులు లభించడంతో రెండు సంస్థలూ బజాజ్ గ్రూప్‌నకు పూర్తి అనుబంధ సంస్థలుగా అవతరించనున్నాయి. భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా బజాజ్ గ్రూప్ తొలుత వీటిలో కనీసం 6.1 శాతం వాటా కొనుగోలుని పూర్తి చేయవలసి ఉంటుంది. దీంతో అలయెంజ్ ప్రమోటర్ గుర్తింపును కోల్పోవడం ద్వారా ఇన్వెస్టర్‌గా మారనుంది.



భారత్‌తో భాగస్వామ్యంపై

ఖతార్ కంపెనీల్లో ఆసక్తి

- పెట్టుబడులు, ప్రాజెక్టులపై సుముఖత
- వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



దోహా: భారత కంపెనీలతో భాగస్వామ్యానికి ఖతార్ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నట్లు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. కేవలం పెట్టుబడులకే పరిమితం కాకుండా, ఇతర దేశాల్లో ప్రాజెక్టులను భారత కంపెనీల భాగస్వామ్యంతో చేపట్టేందుకు ఉత్సాహంగా ఉన్నట్లు చెప్పారు. ఒక్క రోజు పర్యటన కోసం వ్యాపార ప్రతినిధి బృందంతో మంత్రి గోయల్ ఖతార్‌కు వచ్చిన సందర్భంగా మాట్లాడారు. ఖతార్‌కు చెందిన ఆల్ బలఘ్ ఎల్అండ్‌టీ భాగస్వామిగా ఉందన్న ఉదాహరణను ప్రస్తావించారు. ఈ ఇరు సంస్థలు కలసి ఖతార్‌లో ప్రాజెక్టులను పూర్తి చేశాయని, ఇతర దేశాల్లోనూ సంయుక్తంగా ప్రాజెక్టులు చేపట్టనున్నట్టు చెప్పారు. ఖతార్ ప్రభుత్వం మూడో పక్ష దేశాల్లో ప్రాజెక్టులపై దృష్టి పెట్టిందని, ఇదే విషయాన్ని తనకు చెప్పినట్టు పేర్కొన్నారు. ఖతారీ డెవలప్‌మెంట్‌బ్యాంక్ నిధులు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. కనుక భారత కంపెనీలు ఈ అవకాశాలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఖతార్‌తో భారత ద్వైపాక్షిక వాణిజ్యం 2024-25లో 14.15 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం.

అమెరికాతో ఒప్పందంపై చర్చలు

ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై (బీటీఏ) అమెరికా-భారత్ మధ్య చర్చలు కొనసాగుతున్నాయని మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. నవంబర్ చివరికి చర్చలు ముగించాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని అవకాశాలున్నట్టు చెప్పారు. తదుపరి విడత చర్చలు భౌతికంగా జరిగేందుకు ఉన్న అవకాశాలను తోసిపుచ్చలేదు. ప్రస్తుతం అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ (మూసివేత)ను ఎదుర్కొంటున్నందున, తదుపరి దశ చర్చలు ఎలా, ఎక్కడ నిర్వహించేదీ చూడాల్సి ఉందన్నారు. నిధుల మంజూరునకు కాంగ్రెస్ ఆమోదం పొందలేకపోవడంతో అక్టోబర్ 1 నుంచి అమెరికా ప్రభుత్వ కార్యకలాపాలు నిలిచిపోవడం తెలిసిందే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-10-2025

విశాఖ	525-00
చిత్తూరు	528-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.80

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
JIOFIN	310.6	1.42
BHARTIARTL	1,928.80	1.35
HCLTECH	1,435.50	1.26
BAJAJ-AUTO	8,900.00	1.23
EICHERMOT	6,957.50	1.13

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	698.1	-2.04
AXISBANK	1,188.00	-2.04
TRENT	4,685.00	-1.93
TATACONSUM	1,123.90	-1.59
HINDALCO	767	-1.25

స్టాక్ మార్కెట్ డేటా


	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	8,115
ఎన్‌ఎస్‌ఈ	98,573
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,67,006
ఎఫ్ఐఐ	+ 1,441
డీఐఐ	+ 453

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కి	క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	61.75	$ 61.69
బ్రెంట్	65.42	$ 65.47

అంబుడ్స్‌మన్ స్కీమ్ విస్తరణ

- మరిన్ని బ్యాంకులకు వర్తింపు
- నవంబర్ 1 నుంచి అమల్లోకి
- రిజర్వ్ బ్యాంక్ నోటిఫికేషన్



ముంబై: రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) పరిధిలోకి రాష్ట్ర సహకార బ్యాంకులు, కేంద్ర సహకార బ్యాంకులు చేరనున్నాయి. ఇందుకు 2021 ఏకీకృత అంబుడ్స్‌మన్ పథకం(ఐవోఎస్)లోకి వీటిని చేరుస్తూ ఆర్‌బీఐ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో నవంబర్ 1నుంచి రూ. 50 కోట్ల డిపాజిట్ పరిమాణంగల అన్ని వాణిజ్య బ్యాంకులతోపాటు.. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, రాష్ట్ర సహకార బ్యాంకులు, కేంద్ర సహకార బ్యాంకులు, షెడ్యూల్డ్ ప్రైమరీ(అర్బన్) సహకార బ్యాంకులు, నాన్‌షెడ్యూల్డ్ ప్రైమరీ(అర్బన్) సహకార బ్యాంకులకు ఏకీకృత అంబుడ్స్‌మన్ స్కీమ్ వర్తించనుంది. అంతేకాకుండా కనీసం రూ. 100 కోట్లు అంతకుమించిన ఆస్తులు కలిగిన అన్ని నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ(ఎన్‌బీఎఫ్‌సీ)లనూ పథకం కవర్ చేయనుంది. అయితే హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలను ఈ పథకం నుంచి మినహాయింపునివ్వగా.. క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలను చేర్చింది. ఈ ఆర్‌బీఐ ఐవోఎస్‌ను 2021 నవంబర్‌లో ప్రవేశపెట్టింది.

క్రెడిట్ రిస్క్‌లో సవరణ

బ్యాంకుల క్రెడిట్ రిస్క్ నిబంధనలను సవరించేందుకు ఆర్‌బీఐ తాజాగా ప్రతిపాదించింది. సంభవించిన నష్టాల ఆధారంగా ప్రొవిజనింగ్ చేపట్టేందుకు ప్రస్తుతం బ్యాంకులను ఆర్‌బీఐ నిబంధనలు అనుమతిస్తున్నాయి. వీటిస్థానే అంచనా రుణ నష్టాల ఆధారిత ప్రొవిజనింగ్‌కు వీలు కల్పించే విధంగా ఆర్‌బీఐ నిబంధనల సవరణకు ప్రతిపాదించింది. తద్వార క్రెడిట్ రిస్క్ నిర్వహణా విధానాలను మరింత పటిష్టం చేయనుంది. అంతేకాకుండా వివిధ ఫైనాన్షియల్ సంస్థలను పోల్చి చూడటంలో మరిన్ని అవకాశాలకు తెరతీయనుంది. 2025 ఆర్‌బీఐ మార్గదర్శకాలు పేరుతో అంతర్జాతీయంగా అనుమతించిన నిబంధనలు, అకౌంటింగ్ ప్రమాణాలకు అనుగుణంగా తాజా ముసాయిదాను రూపొందించింది. షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, దేశవ్యాప్త ఫైనాన్షియల్ సంస్థలు- అసెట్ క్లాసిఫికేషన్, ప్రొవిజనింగ్ అండ్ ఇన్‌కమ్ రికగ్నిషన్ పేరుతో ముసాయిదాను విడుదల చేసింది.

జీడీపీ అంచనాలు అప్

- 6.5 శాతానికి పెంచిన ప్రపంచ బ్యాంకు
- వినియోగ వృద్ధి దన్నుగా నిలుస్తుందని వ్యాఖ్య
- టారిఫ్‌ల ప్రభావం వచ్చే ఏడాది ఉంటుందని వెల్లడి



న్యూఢిల్లీ: వినియోగ వృద్ధి దన్నుతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కూడా అత్యంత వేగంగా ఎదుగుతున్న భారీ ఎకానమీగా భారత్ కొనసాగుతుందని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరానికిగాను స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి అంచనాలను 6.5 శాతానికి పెంచింది. గతంలో ఇది 6.3 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. మరోవైపు, భారత ఎగుమతులపై అమెరికా విధించిన 50 శాతం సుంకాల ప్రభావాలు రాబోయే ఏడాది కనిపిస్తాయని ప్రపంచ బ్యాంకు తెలిపింది. ఈ నేపథ్యంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాలను 6.5 శాతం నుంచి 6.3 శాతానికి తగ్గించింది.

ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి.. వ్యవసాయోత్పత్తి, గ్రామీణ ప్రాంతాల్లో వేతనాల పెంపు ఊహించిన దానికన్నా మెరుగ్గా ఉన్నట్లు వరల్డ్ బ్యాంకు పేర్కొంది. ఇక వస్తు, సేవల పన్నుల (జీఎస్‌టీ) శ్లాబులను తగ్గించడం కూడా ఆర్థిక కార్యకలాపాలకు దన్నుగా నిలుస్తాయని తెలిపింది. మూడొంతుల ఎగుమతులపై అమెరికా 50 శాతం టారిఫ్‌లు విధించిన ప్రభావం వచ్చే ఆర్థిక సంవత్సరం కనిపించే అవకాశం ఉంది కాబట్టి, 2026-27 అంచనాలను తగ్గించినట్లు తెలిపింది. ఇక 2025లో 6.6 శాతంగా ఉండే దక్షిణాసియా వృద్ధి రేటు 2026లో గణనీయంగా తగ్గి 5.8 శాతానికి నెమ్మదించవచ్చని వివరించింది. అయితే, నెమ్మదించినప్పటికీ మిగతా వర్ధమాన, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలతో పోలిస్తే వృద్ధి పటిష్ఠంగానే ఉంటుందని తెలిపింది. సెంట్రల్ బ్యాంకులు నిర్దేశించుకున్న లక్ష్యాలకు లోబడే ద్రవ్యోల్బణం ఉండొచ్చని ప్రపంచ బ్యాంకు పేర్కొంది.

కోల్‌కతా థండర్‌బోల్ట్స్ బోణీ

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్‌లో కోల్‌కతా థండర్‌బోల్ట్స్ జట్టు తొలి విజయం అందుకుంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా థండర్‌బోల్ట్స్ 12-15, 15-12, 15-6, 19-17తో కొచ్చి బ్లూ స్పైకర్స్ జట్టును ఓడించింది. కోల్‌కతా కెప్టెన్ అశ్వల్ రాయ్ కళ్లు చెదిరే స్మాష్‌లకు కొచ్చి డిఫెన్స్ తేలిపోయింది. మొత్తం పది జట్లు పోటీ పడుతున్న ఈ లీగ్‌లో ఇప్పటి వరకు ఏడు జట్లు గెలుపు బోణీ కొట్టగా... గోవా గార్డియన్స్, ఢిల్లీ తూఫాన్స్, డిఫెండింగ్ చాంపియన్ కాలికట్ హీరోస్ ఇంకా విజయాన్ని అందుకోలేకపోయాయి.

సాక్షి ప్లస్
బుధవారం। 8-10-2025

మెరిసిన హెనిల్, ఖిలాన్ పటేల్

- ఆస్ట్రేలియా అండర్-19 జట్టు 135 ఆలౌట్
- భారత అండర్-19 జట్టుతో రెండో టెస్టు


ఖిలాన్ పటేల్


హెనిల్ పటేల్

మకాయ్: ఆస్ట్రేలియా పర్యటనలో అదరగొడుతున్న భారత అండర్-19 జట్టు... రెండో యూత్ టెస్టులోనూ అదే జోరు కనబరుస్తోంది. ఈ టూర్‌లో భాగంగా వన్డే సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసిన ఆయుశ్ మాత్రే సారథ్యంలోని యువ భారత జట్టు... రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను కూడా క్లీన్‌స్వీప్ చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే తొలి మ్యాచ్ నెగ్గిన భారత అండర్-19 జట్టు... మంగళవారం ప్రారంభమైన రెండో యూత్ టెస్టులోనూ ఆకట్టుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా అండర్-19 జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 43.3 ఓవర్లలో 135 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ అలెక్స్ లీ యంగ్ (108 బంతుల్లో 66; 9 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే అర్ధశతకంతో మెరుగైన స్కోరు చేయగా... కెప్టెన్ విల్ మాలాజుక్ (10), యశ్ దేశ్‌ముఖ్ (22) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. భారత బౌలర్ల ధాటికి తక్కిన వాళ్లంతా విఫలమయ్యారు. గుజరాత్‌కు చెందిన హెనిల్ పటేల్ 21 పరుగులిచ్చి 3 వికెట్లు, ఖిలాన్ పటేల్ 23 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా... ఉధవ్ మోహన్ 23 పరుగులిచ్చి 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత అండర్-19 జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 40 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసింది. గత మ్యాచ్‌లో రికార్డు సెంచరీతో విజృంభించిన వైభవ్ సూర్యవంశీ (14 బంతుల్లో 20; 2 ఫోర్లు, 1 సిక్స్) ఈ సారి కూడా ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించినా... ఎక్కువసేపు నిలవలేకపోయాడు. గత మ్యాచ్ సెంచరీ హీరో వేదాంత్ త్రివేది (25; 4 ఫోర్లు) కూడా నిరాశ పరచగా... బౌలింగ్‌లో మెరిసిన ఖిలాన్ పటేల్ (26; 4 ఫోర్లు), హెనిల్ పటేల్ (22 బ్యాటింగ్; 3 ఫోర్లు) విలువైన పరుగులు చేశారు. ఆస్ట్రేలియా బౌలర్లలో బార్డన్ 3 వికెట్లు తీశాడు. చేతిలో 3 వికెట్లు ఉన్న యువ భారత జట్టు... 9 పరుగుల ఆధిక్యంలో ఉంది. హెనిల్ పటేల్‌తో పాటు దీపేశ్ దేవేంద్రన్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

ముగిసిన భారత్ పోరు

రెండో రౌండ్‌లో ఓడిన వీర్, సెంథిల్, రమిత్



న్యూయార్క్: ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్ఏ) ఓపెన్ స్క్వాష్ క్లాసిక్ టోర్నీలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. ఈ టోర్నీ బరిలో ఉన్న జాతీయ చాంపియన్ వెలవన్ సెంథిల్ కుమార్‌తోపాటు వీర్ చోత్రాని, రమిత్ టాండన్ రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 45వ ర్యాంకర్ సెంథిల్ కుమార్ 7-11, 6-11, 4-11తో నాలుగో సీడ్ లియోనెల్ కార్డెనాస్ (మెక్సికో) చేతిలో... ప్రపంచ 54వ ర్యాంకర్ వీర్ చోత్రాని 1-11, 8-11, 5-11తో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ విక్టర్ క్రూయిన్ (ఫ్రాన్స్) చేతిలో... ప్రపంచ 37వ ర్యాంకర్, ఎనిమిదో సీడ్ రమిత్ టాండన్ 11-6, 9-11, 8-11, 11-8, 7-11తో అడ్రియన్ వాలెర్ (ఇంగ్లండ్) చేతిలో ఓటమి పాలయ్యారు.



భారత్, పాక్ మధ్య మ్యాచ్‌లు పదే పదే వద్దు

- ఆర్థిక అవసరాల కోసం వినియోగించుకోవద్దు
- ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైక్ అథర్టన్ వ్యాఖ్య

లండన్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టోర్నమెంట్‌లలో ఆర్థిక అవసరాల కోసం భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్‌లు పెట్టే సంస్కృతిని ఇప్పటికైనా వీడాలని ఇంగ్లండ్ మాజీకెప్టెన్ మైఖేల్ అథర్టన్ అన్నాడు. ఇటీవల జరిగిన ఆసియా కప్ టి20 టోర్నమెంట్‌లో భారత్, పాకిస్తాన్ మధ్య మూడు మ్యాచ్‌లు జరగగా... మూడింట్లోనూ టీమిండియానే విజయం సాధించింది. అయితే ఫైనల్లో పాకిస్తాన్‌పై విజయానంతరం ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడిగా ఉన్న పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చీఫ్ మొహసిన్ నక్వీ చేతుల మీదుగా విన్నర్స్ ట్రోఫీ అందుకునేందుకు టీమిండియా నిరాకరించింది. ఈ టోర్నమెంట్ ఆరంభం నుంచే ఇరు జట్ల కెప్టెన్‌లు, ఆటగాళ్ల మధ్య 'షేక్ హ్యాండ్' కూడా జరగలేదు. తొలి మ్యాచ్ అనంతరం భారత జట్టు చేయి కలపలేదనే అంశాన్ని పాకిస్తాన్ పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. సీమాంతర ఉగ్రవాదాన్ని ఉసిగొల్పుతూ అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న వారికి అండగా నిలుస్తున్నంత కాలం... తమ తీరు మారదని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తదుపరి రెండు మ్యాచ్‌ల్లో తేల్చిచెప్పింది. ఈ పూర్తి విషయాన్ని దగ్గర నుంచి పరిశీలిస్తున్న పాకిస్తాన్ బోర్డు అధ్యక్షుడు... విన్నర్స్ ట్రోఫీ తానే అందించాలని మంకుపట్టు పట్టాడు. దీంతో టీమిండియా ట్రోఫీ అందుకోకుండానే... స్వదేశానికి తిరిగి వచ్చింది. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ అథర్టన్... భారత్, పాకిస్తాన్ క్రికెట్ సంబంధాలు... వాటిని ఐసీసీ వినియోగించుకుంటున్న తీరును ఓ పత్రికకు రాసిన కాలమ్‌లో వివరించాడు.

వారానికో మ్యాచా?

ఇలాంటి చేదు అనుభవాలకంటే... ఇరు దేశాల మధ్య క్రికెట్‌ను పూర్తిగా నిలిపివేయడం మంచిదని సూచించాడు. 'మూడు వారాల పాటు సాగిన ఆసియా కప్‌లో... ప్రతి ఆదివారం భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ జరిగేలా షెడ్యూల్ రూపొందించారు. కేవలం ఇదొక్కటే కాదు... ఆ రెండు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు నిలిచిపోయినప్పటి నుంచి గమనిస్తే... అన్నీ ఐసీసీ టోర్నమెంట్‌లలో లీగ్ దశలోనే ఇరు జట్ల మధ్య మ్యాచ్ జరిగేలా షెడ్యూల్ చేస్తున్నారు.

2013 నుంచి చూసుకుంటే 3 వన్డే ప్రపంచకప్‌లు, 5 టి20 ప్రపంచకప్‌లు, 3 చాంపియన్స్ ట్రోఫీలు జరగగా... వాటన్నింటిలో గ్రూప్ దశలోనే ఇరు జట్లు తలపడ్డాయి. రౌండ్ రాబిన్ పద్ధతైనా... లేక గ్రూప్‌ల విధానమైనా... ఆరంభ దశలోనే ఈ రెండు టీమ్‌ల మధ్య మ్యాచ్ పరిపాటిగా మారింది' అని అథర్టన్ రాసుకొచ్చాడు. 2008 ముంబై దాడుల సమయం నుంచే భారత్, పాకిస్తాన్ మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు నిలిచిపోగా... ఇటీవల పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడితో ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత సంక్లిష్టమయ్యాయి. ఈ ఘటనలో 26 మంది అమాయకులు మృతిచెందగా... దీనికి బదులుగా భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' పేరిట శత్రు దేశంలోని ఉగ్ర స్థావరాలపై దాడి చేసి తుదముట్టించింది.

ఆర్థిక అంశాలే ముఖ్యమా!

ప్రపంచ క్రికెట్‌లో భారత్, పాకిస్తాన్ మధ్య జరిగే మ్యాచ్‌కు ఉన్న ప్రాధాన్యత ఎక్కువ అని అథర్టన్ అభిప్రాయపడ్డాడు. 'భారత్, పాకిస్తాన్ మ్యాచ్ ఎన్నో ఆర్థిక అంశాలతో కూడింది. ఐసీసీ టోర్నమెంట్ ప్రసార హక్కులకు విపరీతమైన డిమాండ్ ఉండటానికి ఈ మ్యాచ్ ప్రధాన కారణం. ద్వైపాక్షిక సిరీస్‌లకు రోజురోజుకూ ఆదరణ తగ్గుతున్న నేపథ్యంలో... ఐసీసీ ఈవెంట్‌ల ప్రాముఖ్యత పెరిగింది. దీంట్లో తరచూ భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. దీన్ని ముగించాల్సిన సమయం ఆసన్నమైంది. ఒకప్పుడు దౌత్యానికి ఆట దోహదం చేస్తే... ఇప్పుడదే ఉద్రిక్తతలు, ప్రచారానికి ప్రతినిధిగా మారింది. కేవలం ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు ఆ రెండు జట్ల మధ్య పదే పదే మ్యాచ్‌లు నిర్వహించడం ఇప్పటికైనా మానుకుంటేనే మంచిది' అని అథర్టన్ పేర్కొన్నాడు. విస్తృత ఆర్థిక వనరులు ఉన్నప్పటికీ ఇలాంటి పనులు చేయడం సరికాదని ఇంగ్లండ్ మాజీ సారథి సూచించాడు. కావాలనే రెండు జట్ల మధ్య మ్యాచ్‌లు ఉండే విధంగా చూసుకోవడానికి బదులు... 'డ్రా' పారదర్శకంగా ఉండాలని అభిప్రాయపడ్డాడు. పాకిస్తాన్ ఆతిథ్యమిచ్చిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ అంశాన్ని సైతం అథర్టన్ లేవనెత్తాడు. పాకిస్తాన్‌లో ఆడేందుకు టీమిండియా నిరాకరించడంతో... భారత ఆడే మ్యాచ్‌లను తటస్థ వేదికపై నిర్వహించగా... ఆతిథ్య హోదా ఉన్న పాకిస్తాన్ జట్టు టీమిండియాతో మ్యాచ్‌లు ఆడేందుకు పదేపదే దుబాయ్‌కు వెళ్లాల్సి వచ్చిందని పేర్కొన్నాడు. సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగకపోతుండటంతో దాన్ని సొమ్ము చేసుకోవాలని ఐసీసీ టోర్నీల్లో పదే పదే ఇలాంటి ఏర్పాట్లు చేయడం తగదని అథర్టన్ సూచించాడు.

'టాప్' ర్యాంక్‌లోనే స్మృతి మంధాన



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన నంబర్‌వన్ ర్యాంక్‌లో ఎలాంటి మార్పు లేదు. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో స్మృతి 791 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇంగ్లండ్ కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ 731 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా... బెత్ మూనీ (ఆస్ట్రేలియా) 713 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. న్యూజిలాండ్‌తో సోమవారం జరిగిన వన్డే ప్రపంచకప్ మ్యాచ్‌లో సెంచరీతో దక్షిణాఫ్రికాను గెలిపించిన తజ్మీన్ బ్రిట్స్ రెండు స్థానాలు పురోగతి సాధించింది. తజ్మీన్ బ్రిట్స్ నాలుగో స్థానానికి ఎగబాకగా... ఆస్ట్రేలియా బ్యాటర్ యాష్లే గార్డ్‌నర్ ఏడు స్థానాలు మెరుగుపర్చుకొని ఐదో స్థానానికి చేరుకుంది. వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ స్పిన్నర్ సోఫీ ఎకిల్‌స్టోన్ 792 పాయింట్లతో నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... భారత బౌలర్ దీప్తి శర్మ ఒక స్థానం పడిపోయి ఆరో ర్యాంక్‌లో నిలిచింది.

తనీషా-ధ్రువ్ జోడీ శుభారంభం



వాంటా (ఫిన్‌లాండ్): ఆర్కిటిక్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో తొలి రోజు భారత ప్లేయర్లు ఆకట్టుకున్నారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల ద్వయం శుభారంభం చేసి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. తొలి రౌండ్‌లో తనీషా-ధ్రువ్ ద్వయం 21-9, 21-7తో లుకాస్ రెనోయిర్-కామిల్లె పొగ్నాంటె (ఫ్రాన్స్) జోడీపై విజయం సాధించింది. మహిళల సింగిల్స్‌లో భారత యువతార అన్‌మోల్ ఖరబ్ సంచలనం నమోదు చేసింది. తొలి రౌండ్‌లో అన్‌మోల్ 23-21, 11-21, 21-18తో ప్రపంచ 21వ ర్యాంకర్ లిన్ సియాంగ్ టి (చైనీస్ తైపీ)పై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. భారత్‌కే చెందిన తాన్యా హేమంత్ తొలి రౌండ్‌లో 22-20, 21-18తో హువాంగ్ చింగ్ పింగ్ (చైనీస్ తైపీ)పై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మాజీ చాంపియన్ ఇంతనోన్ రచనోక్ (థాయ్‌లాండ్)తో పోరుకు సిద్ధమైంది.

అజయ్ బాబుకు నిరాశ



ఫోర్డె (నార్వే): ప్రపంచ సీనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. మహిళల 48 కేజీల విభాగంలో మీరాబాయి చాను రజత పతకం సాధించిన తర్వాత... ఇతర భారత లిఫ్టర్లు ఆకట్టుకోవడంలో విఫలమయ్యారు. మంగళవారం జరిగిన పురుషుల 79 కేజీల విభాగంలో కామన్వెల్త్ చాంపియన్ అజయ్ బాబు ఏకంగా 16వ స్థానంలో నిలిచాడు. 20 ఏళ్ల అజయ్ బాబు మొత్తం 323 కేజీలు బరువెత్తాడు. స్నాచ్‌లో 146 కేజీలు... క్లీన్ అండ్ జెర్క్‌లో 177 కేజీలు ఎత్తిన అజయ్ కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో కనబరిచిన ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయాడు. అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో అజయ్ మొత్తం 335 కేజీలు (స్నాచ్‌లో 152 కేజీలు+క్లీన్ అండ్ జెర్క్‌లో 183 కేజీలు) బరువెత్తి స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఆదివారం జరిగిన రెండు ఈవెంట్లలోనూ భారత లిఫ్టర్లు అజిత్ నారాయణ, నిరుపమా దేవి తడబడ్డారు. అజిత్ (71 కేజీలు)... నిరుపమా దేవి (63 కేజీలు) తమ వెయిట్ కేటగిరీల్లో తొమ్మిదో స్థానంలో నిలిచారు.

దబంగ్ ఢిల్లీ జైత్రయాత్ర



చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో దబంగ్ ఢిల్లీ విజయాల పరంపర కొనసాగుతోంది. ప్రత్యర్థితో సంబంధం లేకుండా చెలరేగిపోతున్న అశు మలిక్ సారథ్యంలోని దబంగ్ ఢిల్లీ లీగ్‌లో 11వ విజయం అందుకుంది. మంగళవారం జరిగిన పోరులో దబంగ్ ఢిల్లీ 'టైబ్రేక్'లో 9-3తో హరియాణా స్టీలర్స్‌ను ఓడించింది. నిర్ణీత సమయంలో రెండు జట్ల స్కోర్లు 33-33తో సమం కాగా... విజేతను నిర్ణయించేందుకు '5 రెయిడ్స్' నిర్వహించారు. ఇందులో ఢిల్లీ 9 పాయింట్లతో సత్తాచాటగా... స్టీలర్స్ 3 పాయింట్లకే పరిమితమైంది. స్టీలర్స్‌కు ఇది వరుసగా నాలుగో పరాజయం. నిర్ణీత సమయంలో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ తరఫున అజింక్య పవార్ 8 పాయింట్లు సాధించగా... నీరజ్, సౌరభ్ చెరో 6 పాయింట్లతో రాణించారు. స్టీలర్స్ తరఫున శివమ్ పతారే 10 పాయింట్లతో పోరాడినా ఫలితం లేకపోయింది. తాజా సీజన్‌లో 12 మ్యాచ్‌లాడిన ఢిల్లీ 11 విజయాలు, 1 పరాజయంతో 22 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక 'టాప్' ప్లేస్‌లో కొనసాగుతోంది. స్టీలర్స్ 12 మ్యాచ్‌ల్లో 6 విజయాలు, 6 పరాజయాలతో 12 పాయింట్లు సాధించి పట్టిక ఆరో స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 56-37 పాయింట్ల తేడాతో పట్నా పైరెట్స్‌పై విజయం సాధించింది. తలైవాస్ తరఫున అర్జున్ దేశ్వాల్ 26 పాయింట్లతో విజృంభించగా... పట్నా పైరెట్స్ తరఫున అయాన్ 16, అంకిత్ 14 పాయింట్లు సాధించారు. వీరిద్దరు మినహా తక్కినవాళ్లు ఆకట్టుకోలేకపోవడంతో పైరెట్స్ ఓటమి తప్పలేదు. లీగ్‌లో భాగంగా బుధవారం హరియాణా స్టీలర్స్‌తో తెలుగు టైటాన్స్, యు ముంబాతో పుణేరి పల్టన్ తలపడనున్నాయి.


స్టార్క్


లబుషేన్

స్టార్క్ పునరాగమనం

- ఏడాది విరామం తర్వాత వన్డేల్లో బరిలోకి
- లబుషేన్‌పై వేటు
- భారత్‌తో సిరీస్‌లకు ఆస్ట్రేలియా జట్ల ప్రకటన

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్... టీమిండియాతో జరిగే వన్డే సిరీస్ బరిలో దిగనున్నాడు. ఇటీవల అంతర్జాతీయ టి20లకు రిటైర్మెంట్ ప్రకటించిన స్టార్క్... దాదాపు ఏడాది తర్వాత వన్డే మ్యాచ్ ఆడనున్నాడు. గతేడాది నవంబర్‌లో పాకిస్తాన్‌తో చివరిసారి వన్డే ఆడిన స్టార్క్... తిరిగి ఇప్పుడు టీమిండియాతో సిరీస్‌లో పాల్గొననున్నాడు. యాషెస్ సిరీస్‌కు ముందు వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా స్టార్క్ పలు అప్రధాన్య మ్యాచ్‌లకు దూరంగా ఉన్నాడు. ఈ నెల 19 నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రారంభంకానుండగా... దీంతో పాటు టి20 సిరీస్‌లోని మొదటి రెండు మ్యాచ్‌ల కోసం మంగళవారం క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) జట్లను ప్రకటించింది. గత పది ఇన్నింగ్స్‌లలో ఒక్క అర్ధ సెంచరీ కూడా చేయని లబుషేన్‌పై వేటు పడగా... అతని స్థానంలో రెన్‌షాకు తొలిసారి చోటు దక్కింది. 29 ఏళ్ల రెన్‌షా 14 టెస్టుల్లో ఆస్ట్రేలియాకు ప్రాతినిధ్యం వహించాడు. అన్నీ కలిసొస్తే భారత్‌పై రెన్‌షా వన్డేల్లో అరంగేట్రం చేసే అవకాశముంది. మరోవైపు రెగ్యులర్ సారథి ప్యాట్ కమిన్స్ గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో అతడి స్థానంలో మిచెల్ మార్ష్ సారథిగా కొనసాగనున్నాడు. ఈ నెల 19న జరగనున్న తొలి వన్డేకు పెర్త్ ఆతిథ్యమిస్తుండగా... ఆ తర్వాత 23న అడిలైడ్‌లో, 25న సిడ్నీలో రెండో, మూడో మ్యాచ్‌లు జరగనున్నాయి. అనంతరం అక్టోబర్ 29 నుంచి నవంబర్ 8 మధ్య టి20 సిరీస్ జరుగుతుంది.

ఆస్ట్రేలియా వన్డే జట్టు: మిచెల్ మార్ష్ (కెప్టెన్), బార్ట్‌లెట్, కేరీ, కొనొల్లీ, డ్వార్‌షుయ్, ఎలీస్, గ్రీన్, జోష్ హాజల్‌వుడ్, హెడ్, ఇన్‌గ్లిస్, ఓవెన్, రెన్‌షా, మాథ్యూ షార్ట్, మిచెల్ స్టార్క్, ఆడమ్ జంపా.

టి20 జట్టు (తొలి రెండు మ్యాచ్‌లకు): మిచెల్ మార్ష్ (కెప్టెన్), అబాట్, బార్ట్‌లెట్, టిమ్ డేవిడ్, డ్వార్‌షుయ్, ఎలీస్, హాజల్‌వుడ్, హెడ్, ఇన్‌గ్లిస్, కూనెమన్, ఓవెన్, షార్ట్, స్టొయినిస్, జంపా.


ఇజ్రాయెల్‌పై హమాస్ దాడికి రెండేళ్లవుతున్న సందర్భంగా మంగళవారం బెర్లిన్‌లో బ్రాండెన్‌బర్గ్ గేట్ వద్ద వెయ్యి కుర్చీల్లో అప్పటి మృతుల ఫొటోలు


అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం శాక్రమెంటోలో హైవే-50పై సోమవారం అంబులెన్స్ హెలికాప్టర్ కుప్పకూలి ముక్కలయ్యింది


వెనెజులాలో విదేశీ జోక్యాన్ని నిరసిస్తూ రాజధాని కారకాస్‌లోని ఐరాస కార్యాలయం వద్ద చేపట్టిన ర్యాలీలో భారీ జెండాతో నిరసనకారులు

బామ్మ బతికినది!

కోల్‌కతా: ఇది కలలో కూడా ఊహించని ఎస్కేప్! ఉప్పొంగుతున్న దామోదర్ నదిలో కొట్టుకుపోయిన 65 ఏళ్ల బామ్మ, ఏకంగా 45 కిలోమీటర్లు దిగువన అద్భుతంగా సురక్షితంగా బయటపడింది. స్థానికులు దీనిని అద్భుతంగా అభివర్ణిస్తున్నారు.

స్నానానికి దిగి..

పూర్బ బర్ధమాన్ జిల్లాలోని రాయ్నా ఏరియా, జాక్తా గ్రామంలో.. భారీ వర్షాలు, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ డ్యామ్‌ల నుంచి నీటి విడుదలతో నది ఉగ్రరూపం దాల్చింది. 'మతూరి టుడు' అనే బామ్మగారికి.. ఆదివారం మధ్యాహ్నం స్నానం చేయాలనిపించిందిట. అనుకున్నదే తడవు ఒంటరిగా నదిలోకి దిగింది. అంతే.. దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ డ్యామ్ నుంచి వచ్చిన వరద ప్రవాహం ఆమెను ఒక్క ఉదుటన లాగేసింది.

అబ్బే పెద్దగా ఏం కాలేదు..

సమాచారం తెలిసిన పోలీసులు, గ్రామస్తులు కలిసి ఆమె కోసం గాలింపు మొదలుపెట్టారు. చివరికి, ఆమె కొట్టుకుపోయిన చోటు నుంచి సుమారు 45-50 కిలోమీటర్ల దూరంలో.. అంటే బామ్మగారు దాదాపు సగం జిల్లాను దాటేశాక కాపాడారు. వెంటనే ఆమెను జమాల్‌పూర్ రూరల్ ఆసుపత్రికి తరలించారు. 'బామ్మ చాలాసేపు నీళ్లలో ఉండటం వల్ల కాస్త అస్వస్థతకు గురైంది..' అని వైద్యులు చెప్పారు. నదిలో ఇన్ని కిలోమీటర్ల ప్రయాణం తర్వాత కూడా.. ఆమె 'కాస్త' అస్వస్థతకు మాత్రమే గురవడం అంటే మామూలు విషయం కాదు..! తర్వాత మెరుగైన చికిత్స కోసం బర్ద్వాన్ మెడికల్ కాలేజీకి ఆమెను తరలించారు. 'నేను ఆదివారం స్నానానికి వెళ్లి నదిలో కొట్టుకుపోయాను. గ్రామస్తులు నన్ను కాపాడే వరకు.. చేతికి దొరికిన దేన్నో పట్టుకొని ఎలాగోలా వేలాడాను..' అని టుడు బామ్మ చెప్పింది. ఆ 45 కిలోమీటర్ల ప్రయాణంలో ఎన్ని కష్టాలు పడిందో ఆమెకే ఎరుక!. జమాల్‌పూర్ బ్లాక్ తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మేహెమూద్ ఖాన్ మాట్లాడుతూ, 'ఈ వృద్ధురాలు బతికి బయటపడిందంటే.. అది కేవలం అదృష్టం వల్లే. ఆమెను పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు'.. అని తెలిపారు.

సూపర్ ఉమెన్!

నదిలో 45 కిలోమీటర్ల దూరం కొట్టుకుపోయాక కూడా 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' అని నిరూపించిందీ బామ్మ. ఈ వయసులో కూడా ఇంత ఎనర్జీ ఉందంటే, ఆమె నిజంగా సూపర్ ఉమెన్ అనుకోవలసిందే!

నా భార్య నాగిని!

యూపీలో భర్త హడల్.. కలెక్టర్‌కు ఫిర్యాదు!

సీతాపూర్ (యూపీ): అక్టోబర్ 4వ తేదీ.. అది జిల్లా కలెక్టర్ కార్యాలయం. 'ప్రజా సమస్యల పరిష్కార దినం' కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ అభిషేక్ ఆనంద్ కక్షిదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్నారు. అప్పుడే ఓ తమాషా జరిగింది.. మహమూదాబాద్ తహసీల్‌లోని లోధాసా గ్రామానికి చెందిన మీరాజ్ కూడా కలెక్టర్‌ను కలిశాడు. ఆయన చెప్పింది విన్న కలెక్టర్ తేరుకోవడానికి చాలా సమయం పట్టింది.

'రాత్రయితే చాలు.. నా భార్య 'నాగిని'లా మారిపోతోంది. స్.. స్. అంటూ బుసలు కొడుతోంది.. నాట్యం చేస్తోంది.. భయపెడుతోంది.. నాకు నిద్ర కరువయ్యింది.. ఆమెతో కలిసి పడుకోలేకపోతున్నా!'.. ఇదీ మీరాజ్ చెప్పిన సారాంశం. అది విని.. కలెక్టర్ సహా అక్కడున్న అధికారులందరికీ నోట మాట రాలేదు. 'మా ఆవిడ నసీమున్కికి మతిస్థిమితం లేదు. రాత్రి కాగానే ఆవిడ నాగినిలా మారిపోతోంది. ఆవిడ నాట్యం, బుసలు, స్... స్... అంటూ చేసే అల్లరితో నా గుండె జారిపోతోంది!'.. అని మీరాజ్ బావురుమన్నాడు. పోలీసుల దగ్గరకు వెళ్తే 'ఇది మీ భార్యాభర్తల వ్యవహారం.. మీరే తేల్చుకోండి'.. అనడంతో కలెక్టర్ కార్యాలయానికి వచ్చానని వాపోయాడు.

అతను చెప్పింది విన్న కలెక్టర్ మొదట అవాక్కయినా.. తర్వాత తేరుకుని.. 'ఏం జరిగిందో విచారణ జరపండి.. తగిన చర్య తీసుకోండి'.. అని పోలీసులకు ఆదేశాలిచ్చారట. 'ఫిర్యాదు అందింది, దర్యాప్తు జరుగుతోంది'.. అని పోలీసులు వెల్లడించారు. ఇప్పుడు ఆ 'నాగిని'ని పట్టుకోవాలా?, లేక ఆమెకి కౌన్సెలింగ్ ఇవ్వాలా? అని పోలీసులు తల బాదుకుంటున్నారు.

కశ్మీర్‌లో మంచు తుఫాను బీభత్సం

25 మంది గిరిజనులకు కాపాడిన సైన్యం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌ను మంచుతుఫాను కమ్మేసింది. దీంతో చాలాచోట్ల ప్రజలు మంచులో చిక్కుకుపోయి సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. గిరిజనుల సంప్రదాయ వలసల సమయం కావటంతో పరిస్థితి తీవ్రంగా మారింది. కిష్టవార్‌లోని పద్దర్, మార్వా, దచన్, వార్వన్ నుంచి భదేర్వా, కథువా, జమ్మూ, సాంబా జిల్లాల వరకు గిరిజనులు కుటుంబాలతో సహా ఈ సమయంలో వలస వెళ్తుంటారు. ఈ సమయంలో భారీ మంచుతుఫాను సంభవించటంతో సముద్రమట్టానికి దాదాపు 10 వేల అడుగుల ఎత్తులో కొండలపై చాలామంది మంచులో చిక్కుకుపోయారు. దీంతో భారత సైన్యం మంగళవారం 25 మంది గిరిజనులకు కాపాడి సురక్షిత ప్రాంతానికి తరలించింది. వీరంతా బకర్వాల్ తెగకు చెందినవారని అధికారులు తెలిపారు.

రెండో రోజుకు గాజా శాంతి చర్చలు

పురోగతి సాధించామన్న మధ్యవర్తులు

కైరో: ఈజిప్టులో ఇజ్రాయెల్, హమాస్ మధ్య జరుగుతున్న శాంతి చర్చలు మంగళవారం రెండోరోజుకు చేరుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదిత శాంతి ప్రణాళికపై ఎర్ర సముద్ర తీర నగరంషర్మ్-ఎల్-షేక్‌లో రెండు పక్షాల మధ్య సోమవారం పరోక్ష చర్చలు మొదలవడం తెల్సిందే. ఒప్పందం మొదటి దశలో అమలు చేయాల్సిన అంశాలపై పురోగతి సాధించామని చర్చల్లో పాలుపంచుకున్న ఈజిప్టు అధికారి ఒకరు తెలిపారు. బందీల విడుదల, కాల్పుల విరమణ వంటివాటిపై ఇరువర్గాల మధ్య దాదాపుగా అంగీకారం కుదిరిందని చెప్పారు. ఖతార్, ఈజిప్టులకు చెందిన మధ్యవర్తులు ముందుగా హమాస్ బృందంతో, ఆ తర్వాత ఇజ్రాయెల్ ప్రతినిధులతోనూ చర్చలు జరుపుతున్నారు. గాజా మాత్రమే కాదు, పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు ఇదో అద్భుతమైన అవకాశమని సోమవారం ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ఎప్పట్నుంచో చేస్తున్న కీలక డిమాండ్లలో హమాస్ లొంగిపోవడం, ఆయుధాలను వదిలేయడం అనే అంశాలు ప్రధానంగా ఉండటం గమనార్హం. వీటికి అంగీకరించేదీ లేనిదీ హమాస్ ఇప్పటి వరకు తేల్చలేదు. అయితే, హమాస్ నిరాయుధీకరణ, గాజా భవిష్యత్తు వంటి అంశాల్లో స్పష్టత సాధించడం అంత తేలికైన వ్యవహారం కాదని పరిశీలకులు చెబుతున్నారు. హమాస్ ఆయుధాలను అప్పగించడం, ఆ వెంటనే గాజా నుంచి ఇజ్రాయెల్ సైన్యం ఉపసంహరణ, అంతర్జాతీయ భద్రతా బలగాల మోహరింపు, ఆ తర్వాత గాజా పాలన బాధ్యతలను అంతర్జాతీయ బృందానికి అప్పగించడం వంటివి ట్రంప్ ప్రణాళికలో ఉన్నాయి. దీని ప్రకారం భవిష్యత్తు గాజా పాలన బాధ్యతలను ట్రంప్, యూకే మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ చూసుకుంటారు.

ఆ దాడి ఫలితం..రెండేళ్ల యుద్ధం

గాజాలో ప్రాబల్యం కలిగిన హమాస్ ఆధ్వర్యంలో ఇస్లామిక్ మిలిటెంట్లు 2023 అక్టోబర్ 7వ తేదీన సరిహద్దులు దాటి ఇజ్రాయెల్‌పై మెరుపుదాడికి పాల్పడ్డారు. సుమారు 1,200 మందిని చంపేయడంతోపాటు 251 మందిని బందీలుగా పట్టుకెళ్లారు. ప్రతిగా బందీల విడుదల, హమాస్ సర్వనాశనం అనే లక్ష్యాలతో గాజాపై ఇజ్రాయెల్ ఆర్మీ భీకర దాడులకు తెరతీసింది. హమాస్ అగ్ర నేతల్లో పలువురు చనిపోయారు. ఆ సంస్థ బలహీన పడినప్పటికీ ఓటమి చెందలేదన్నది పరిశీలకుల మాట. ఇజ్రాయెల్ ఆర్మీ దాడుల్లో ఇప్పటి వరకు 67 వేల మందికిపైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోగా, మరో 1.70 లక్షల మంది క్షతగాత్రులయ్యారు. గాజా ప్రాంతంలోని నివాస భవనాలన్నీ శిథిలాల దిబ్బలుగా మారిపోయాయి. ఇజ్రాయెల్ దాడులను పాలస్తీనియన్లకు కనీసం ఆహారం సైతం అందకుండా దిగ్బంధించడం, ఆకలి చావులకు గురి చేయడాన్ని ఐరాస సహా పలు అంతర్జాతీయ సంస్థలు జనహననం, యుద్ధనేరంగా పేర్కొంటున్నాయి. హమాస్‌తోపాటు లెబనాన్‌లోని హెజ్‌బొల్లా, ఇరాక్, సిరియా, యెమెన్‌లోని మిలిటెంట్లపైనా ఇజ్రాయెల్ దాడులు పాల్పడింది. ఈ గ్రూపులను ప్రేరేపిస్తుందంటూ ఆరోపణలున్న ఇరాన్‌పై ఇజ్రాయెల్‌తోపాటు అమెరికా గగనతల దాడులకు దిగడం తెల్సిందే.

ఎంపీ ఖగేన్ ముర్ముకు సీఎం మమత పరామర్శ

సిలిగురి/అలీపూర్‌దువార్: బెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లాలో సోమవారం జరిగిన మూక దాడిలో గాయపడి చికిత్సపొందుతున్న బీజేపీ ఎంపీ ఖగేన్ ముర్మును సీఎం మమతా బెనర్జీ మంగళవారం సిలిగురి ఆస్పత్రిలో పరామర్శించారు. ఆయన కుటుంబసభ్యులతో మాట్లాడారు. వైద్యుల సలహాలను పాటించాలని ఆయనకు సలహా ఇచ్చారు. ప్రభుత్వం అన్ని విధాలా సాయంగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎంపీకి వైద్యం చేస్తున్న వైద్యులతో మాట్లాడిన అనంతరం వెళ్లిపోయారు. ఖగేన్ ముర్ముతోపాటు ఎమ్మెల్యే శంకర్ ఘోష్‌పై జరిగిన దాడిపై రాజకీయ దుమారం చెలరేగిన వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. అయితే, అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే శంకర్‌ను పరామర్శించిందీ లేనిదీ తెలియ రాలేదు. కాగా, ఎంపీపై దాడి జరిగిన 24 గంటల తర్వాత కూడా దాడికి బాధ్యులైన కనీసం ఒక్కర్ని కూడా పోలీసులు అరెస్ట్ చేయలేదని బీజేపీ ఆరోపిస్తోంది. ఎంపీని పరామర్శించిన సీఎం మమత ఆ దాడి ఎలా జరిగిందని కనీసం వాకబు కూడా చేయలేదని పేర్కొంది.

మరో ఎమ్మెల్యేపై దాడి

పశ్చిమబెంగాల్‌లోని అలీపూర్‌దువార్‌లో వరద బాధితులకు సాయం అందజేస్తున్న బీజేపీ ఎమ్మెల్యే మనోజ్ కుమార్ ఒరావన్‌పై అధికార టీఎంసీ కార్యకర్తలుగా భావిస్తున్న కొందరు దాడికి దిగారు. కుమార్‌గ్రామ్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనలో ఎమ్మెల్యే గాయపడ్డారు. దాడి ఘటనకు సంబంధించిన ఒక వీడియోను రాష్ట్ర బీజేపీ ఎక్స్‌లో షేర్ చేసింది. అందులో దాడిలో దెబ్బతిన్న బీజేపీ నేతల వాహనాలు కూడా కన్పిస్తున్నాయి. 'సాయం అందిస్తుండగా కొందరు మమ్మల్ని చుట్టుముట్టి కొట్టారు. టీఎంసీ పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి పట్టిన దుస్థితికి ఉదాహరణ ఇది'అని ఎమ్మెల్యే మనోజ్ ఆరోపించారు. ఈ ఆరోపణలను టీఎంసీ ఖండించింది


చికిత్స పొందుతున్న ఎంపీ ఖగేన్‌ను పరామర్శించి, ఆయన కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న సీఎం మమతా బెనర్జీ

సొంత పౌరులనే చంపుతున్న పాక్

- మారణహోమం, మహిళలపై లైంగికదాడులు అక్కడ సాధారణం
- అయినా ప్రపంచం పాకిస్తాన్ తప్పుడు ప్రచారాన్నే నమ్ముతోంది
- ఐరాసలో శాశ్వత రాయబారి పర్వతనేని హరీశ్ మండిపాటు

యునైటెడ్ నేషన్స్: పాకిస్తాన్ సొంత పౌరులపైనే బాంబులు వేసి చంపుతోందని, ఆ దేశంలో మారణహోమాలు, మహిళలపై సామూహిక లైంగికదాడులు నిత్యకృత్యమని భారత్ ఆరోపించింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సోమవారం 'మహిళలు, శాంతి, భద్రత'అనే అంశంపై నిర్వహించిన చర్చలో ఐరాసలో భారత శాశ్వత రాయబారి పర్వతనేని హరీశ్ మాట్లాడారు. ఈ చర్చలో పాకిస్తాన్ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తటంతో ఆయన దాయాది దేశానికి గట్టి కౌంటర్ ఇచ్చారు. ఈ చర్చ నుంచి కశ్మీరీ మహిళలను తొలగించాలని గట్టిగా పట్టుబట్టారు. 'సొంత ప్రజలపైనే బాంబులు వేస్తున్న ఒక దేశం, ఒక క్రమపద్ధతిలో మారణహోమానికి పాల్పడుతూ, లక్షలమంది మహిళలపై లైంగికదాడులు చేయించిన దేశం ప్రపంచాన్ని తప్పుదోవ పట్టిస్తోంది. దురదృష్టవశాత్తూ ఏటా పాకిస్తాన్ దుష్ట చర్యలకు మేం బాధితులం అవుతున్నాం. ముఖ్యంగా జమ్మూకశ్మీర్‌లో.. అయినా ప్రపంచం పాకిస్తాన్ దృష్టకోణం నుంచే చూస్తోంది'అని ఆగ్రహం వ్యక్తంచేశారు. 1971 మార్చి 25న తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్)లో ఆపరేషన్ సెర్చ్‌లైట్ పేరుతో పాకిస్తాన్ మారణహోమానికి పాల్పడిందని, 4 లక్షల మంది మహిళలపై పాక్ సైన్యం అత్యాచారాలకు పాల్పడిందని గుర్తుచేశారు. మహిళల భద్రత విషయంలో భారత్‌ను ఎవరూ వేలెత్తి చూపలేరని స్పష్టం చేశారు. మహిళల భద్రత, శాంతి సాధన విషయంలో ప్రపంచంతో కలిసి పనిచేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు. ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ మిషన్లలో భారత్ తరఫున పాల్గొన్న మహిళా అధికారులనే ఈ అంశంలో తమ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. 1960వ దశకంతో కల్లోల కాంగోలో ఐరాస పీస్ కీపింగ్ మిషన్‌లో భారత్ మహిళా మెడికల్ అధికారుల దళాన్ని పంపిందని గుర్తుచేశారు.

దేశీయంగా రూ.1.20 లక్షల కోట్ల సైనిక పరికరాల కొనుగోలు

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ: జాతీయ భద్రతా సవాళ్లను ఎదు ర్కోవడానికి స్వయం సమృద్ధిని సాధించడంపై భారతదేశం దృష్టి సారించినందున, 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే సమ యానికి దేశీయ వనరుల నుండి రూ.1,20,000 కోట్ల విలువైన సైనిక పరికరాలు, ఆయుధాలను కొనుగోలు చేసి నట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఆయన మంగళవారం ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, '2021-22లో, దేశీయ వనరుల నుండి మన మూలధన కొనుగోళ్లు సుమారు రూ. 74,000 కోట్లుగా ఉండేవి.. అయితే 2024-25 ముగిసే సమయానికి, దేశీయ వనరుల నుండి మూలధన కొనుగోళ్లు సుమారు రూ.1,20,000 కోట్లకు పెరిగాయి..' అని వివరించారు. ఈ మార్పు కేవలం గణాంకాలకు సంబంధించినది కాదని, ఇది మానసిక స్థితిలో మార్పు కూడా అని వ్యాఖ్యానించారు. 'మారుతున్న ఆధునిక యుద్ధ స్వభావం గురించి భారత ప్రభుత్వానికి పూర్తిగా తెలుసు. నేటి యుద్ధం పూర్తిగా సాంకేతికత ఆధారితంగా మారింది. దీనిని ఆపరేషన్ సింధూర్‌లో కూడా గమనించాం,'.. అని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. దీనిలో, డ్రోన్‌లు, యాంటీ-డ్రోన్ వార్‌ఫేర్, ఎయిర్-డిఫెన్స్ సిస్టమ్స్ వంటి నాన్-కాంటాక్ట్ వార్‌ఫేర్ ప్రాధాన్యం గణనీయంగా పెరిగినట్లు గమనించామని చెప్పారు.

22 ఏళ్లకు జైలు జీవితం నుంచి విముక్తి

హత్య కేసు దోషికి స్వేచ్ఛ ప్రసాదించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఓ వ్యక్తికి అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సుమారు 22 ఏళ్లకు విముక్తి కల్పించింది. అతడిని తక్షణమే విడుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. బాంబే హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ నిందితుడు వేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. రెండు దశాబ్దాలపాటు జైలు శిక్షను అనుభవించిన పిటిషనర్..ముందుగానే విడుదల చేయాలంటూ ప్రభుత్వాన్ని ఆశ్రయించారని తెలిపింది. అతడికి శిక్ష విధించిన అదనపు సెషన్స్ కోర్టు జడ్జి నుంచి నివేదికను పరిశీలించిన ప్రభుత్వం 24 ఏళ్ల తర్వాత విడుదల చేయాలని ఆదేశించిందని ధర్మాసనం పేర్కొంది. అయితే, పిటిషనర్ 22 ఏళ్లు జైలు శిక్ష అనుభవించినందున ముందుగానే విడుదల చేయాలని కోరుతున్నారని తెలిపింది. శిక్ష తగ్గింపునకు సంబంధించి ప్రభుత్వం రూపొందించిన 2010నాటి మార్గదర్శకాల మేరకు అతడి వినతిని పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించినట్లు ధర్మాసనం వివరించింది. పిటిషనర్ 18 ఏళ్ల వయస్సులో మరొకరితో కలిసి తన చెల్లెలి భర్తను చంపేశాడు. ప్రేమ పేరుతో వివాహం చేసుకుని, ఆమె జీవితాన్ని నాశనం చేశాడనే కోపమే ఇందుకు కారణం. కుటుంబ గౌరవాన్ని కాపాడేందుకు ముందస్తు ప్రణాళిక ప్రకారం పాల్పడినందున ఈ నేరం క్లాస్3(బీ)కిందికి వస్తుందని పిటిషనర్ పేర్కొన్నాడు. 'కుటుంబ ప్రతిష్టను నిలబెట్టడానికి సంబంధించిన నేరంగా ఇది స్పష్టమవుతోంది. కుటుంబంపై కళంకాన్ని తొలగించడానికి చేసిన ప్రయత్నమే అయినా క్షమించదగిన నేరం మాత్రం కాదు. అయితే, దాదాపు 22 సంవత్సరాల జైలు జీవితం అనుభవించిన అతడు శిక్ష నుంచి ఉపశమనం పొందేందుకు అర్హుడే'అని ధర్మాసనం పేర్కొంది. '22 ఏళ్లు పూర్తయ్యేందుకు మరో మూడు నెలల సమయం మిగిలుంది. అయితే, ఈ మూడు నెలలు అతడు జైలులోనే ఉండటం వల్ల కొత్తగా జరిగేదేమీ లేదని భావిస్తున్నాం. బాధితుడి కుటుంబానికి ఓదార్పునివ్వదు, నిందితుడికి అదనంగా పశ్చాత్తాపం కలిగించదు. అందువల్ల అప్పీలుదారును వెంటనే విడుదల చేయాలని ఆదేశిస్తున్నాం. ముఖ్యంగా నేరం జరిగిన తేదీ నాటికి అప్పీలుదారుకు 18 సంవత్సరాలు మాత్రమేనన్న వాస్తవాన్ని కూడా గమనంలోకి తీసుకోవాలి' ధర్మాసనం పేర్కొంది

ఆరు నెలల్లో రోడ్డు భద్రత నిబంధనలు

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: ప్రజా రవాణా ప్రాంతాలు, జాతీయ రహదారులపై పాదచారులు, మోటారు రహిత వాహనాల కదలికల నియంత్రణకు ఆరు నెలల్లోగా రోడ్డు భద్రత నిబంధనలను రూపొందించాలని సుప్రీంకోర్టు మంగళవారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. జస్టిస్ జె.బి.పర్దివాలా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం.. 1988 మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్లు 138 (1ఏ), 210డి ప్రకారం ఈ నిబంధనలను రూపొందించాలని ఆదేశించింది. దేశంలో పెద్ద సంఖ్యలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై కోయంబత్తూరుకు చెందిన సర్జన్ ఎస్.రాజశేఖరన్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం ఈ ఆదేశాలు జారీ చేసింది.

న్యాయాధికారుల ఉద్యోగాల్లో స్తబ్దతపై

పిటిషన్ల విచారణకు రాజ్యాంగ ధర్మాసనం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న కోర్టుల్లోని దిగువ స్థాయి న్యాయాధికారులు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న స్తబ్దతకు సంబంధించిన అంశాలపై విచారణకు సుప్రీంకోర్టు మంగళవారం ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. న్యాయాధికారుల వేతనాలు, సర్వీసు నిబంధనలు తదితర అంశాలపై ఆల్ ఇండియా జడ్జెస్ అసోసియేషన్ వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. న్యాయ వ్యవస్థలో ప్రాథమిక స్థాయి ఉద్యోగాల్లో చేరిన వారికి పరిమితంగా ఉండే అవకాశాలు, ఇతర సమస్యల పరిష్కారానికి సమగ్ర పరిష్కారాన్ని కనుగొనాల్సిన అవసరముందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ అంశంపై ఇప్పటికే తాము అందజేసిన నోటీసులపై వివిధ హైకోర్టులు, రాష్ట్ర ప్రభుత్వాలు విభిన్న అభిప్రాయాలను తెలిపాయని వెల్లడించింది. జూనియర్ డివిజన్‌లో సివిల్ జడ్జీలుగా చేరిన వారికి జిల్లా న్యాయమూర్తుల స్థాయికి చేరుకోలేరని కొందరు తెలిపారని పేర్కొంది. చాలా రాష్ట్రాల్లో జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్‌గా కెరీర్ ప్రారంభించే వారు రిటైరయ్యే నాటికి కనీసం ప్రిన్సిపల్ జిల్లా జడ్జిల స్థాయికి కూడా చేరలేకపోతున్న పరిస్థితులున్నాయని ధర్మాసనం పేర్కొంది. పాలనాపరమైన సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ అంశంపై విచారణకు రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపింది.

ఆర్‌జీ కర్ ఘటన కేసు నవంబర్‌కు వాయిదా

న్యూఢిల్లీ: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో ట్రెయినీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య కేసుపై విచారణను సుప్రీంకోర్టు నవంబర్‌కు వాయిదా వేసింది. తాము ఇతర కేసులో బిజీగా ఉన్నామని మంగళవారం ఈ కేసుపై విచారణ చేపట్టిన జస్టిస్ సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మల ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో నిందితుడు సంజయ్ రాయ్‌కి కోల్‌కతాలోని న్యాయస్థానం జనవరి 20వ తేదీన యావజ్జీవ కారాగార శిక్ష విధించడం తెల్సిందే. ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రిలో గతేడాది ఆగస్టు 9వ తేదీన చోటుచేసుకున్న దారుణంపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఆందోళనల్లో పాలుపంచుకున్న వైద్యులను పోలీసులు విచారణ పేరుతో పిలిచి వేధిస్తున్నారంటూ డాక్టర్ల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది కరుణా నంది ధర్మాసనానికి తెలిపారు. సాధ్యమైనంత త్వరగా విచారణ చేపట్టాలని కోరగా ధర్మాసనం పైవిధంగా స్పందించింది.

బీజేపీ ఎంపీపై దాడి: నివేదిక కోరిన లోక్‌సభ

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో మాల్దాహా బీజేపీ ఎంపీ ఖాగెన్ ముర్ముపై జరిగిన దాడికి సంబంధించి మూడు రోజుల్లోగా వాస్తవ నివేదిక అందించాలని లోక్‌సభ సచివాలయం మంగళవారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖను కోరింది. ఎంపీ ముర్ము, బీజేపీ ఎమ్మెల్యే శంకర్ ఘోష్ సోమవారం జల్‌పాయ్‌గురిలోని వరదలు, కొండచరియలు విరిగిపడిన దూయర్స్ ప్రాంతాన్ని సందర్శిస్తుండగా, ఒక గుంపు దాడి చేయడంతో వారు గాయపడటం తెలిసిందే. ఈ సంఘటనపై పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం నుండి మూడు రోజుల్లోగా 'వాస్తవ నివేదిక'ను పంపాలని కోరుతూ లోక్‌సభ సచివాలయం.. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు లేఖ రాసినట్లు పార్లమెంట్ అధికారులు తెలిపారు.

32కు పెరిగిన బెంగాల్ వరదల మృతులు

డార్జిలింగ్: ఉత్తర పశ్చిమ బెంగాల్‌ను అతలాకుతలం చేసిన కొండచరియలు, వరదల్లో మృతుల సంఖ్య మంగళవారానికి 32కు పెరిగింది, ఇంకా పలువురు ఆచూకీ తెలియకపోవడంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఉత్తర బెంగాల్ మంత్రి ఉదయన్ గుహ మాట్లాడుతూ, ఇప్పటివరకు 32 మృతదేహాలను వెలికితీశామని, గల్లంతయిన వారిలో ఇంకా ఆరుగురు ఉన్నారని వివరించారు. 'వారిని గుర్తించడానికి మా బృందాలు క్లిష్టమైన ప్రాంతాలలో రాత్రింబవళ్లు పనిచేస్తున్నాయి.' అని ఆయన చెప్పారు. మృతుల్లో నేపాల్, భూటాన్ దేశాలకు చెందిన ఇద్దరు ఉన్నారని అధికారులు తెలిపారు. అక్టోబరు 5 తెల్లవారుజామున కురిసిన భారీ వర్షాలతో.. డార్జిలింగ్ కొండల్లో భారీ కొండచరియలు విరిగిపడ్డాయని, దిగువన ఉన్న దూయర్స్ ప్రాంతంలో వరదలు సంభవించాయని తెలిపారు.

20కి చేరిన దగ్గు సిరప్ బాధిత మరణాలు

ఛింద్వారా: మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా జిల్లాలో దగ్గు సిరప్ తాగి మరో ఇద్దరు చిన్నారులు చనిపోయారు. దీంతో, దగ్గు సిరప్ సంబంధిత మరణాల సంఖ్య 20కి చేరుకుంది. తమియా బ్లాక్‌లోని భరియాధానా గ్రామానికి చెందిన రెండున్నరేళ్ల బాలిక ధని దెహోరియా, జున్నార్‌దియోకు చెందిన రెండేళ్ల జయుషా యదువంశీ సోమ, మంగళవారాల్లో చనిపోయినట్లు అదనపు కలెక్టర్ ధీరేంద్ర సింగ్ చెప్పారు. దగ్గు మందు తాగిన తర్వాత వీరిద్దరూ కిడ్నీలు ఫెయిలై ప్రాణాలు కోల్పోయారన్నారు. జిల్లాకే చెందిన మరో ఆరుగురు చిన్నారులు నాగ్‌పూర్‌లోని మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు.

హరియాణా ఐపీఎస్ అధికారి ఆత్మహత్య

చండీగఢ్: హరియాణా సీనియర్ ఐపీఎస్ అధికారి వై. పూరన్ కుమార్(52) మంగళవారం మధ్యాహ్నం చండీగఢ్‌లోని తన నివాసంలో తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. 2001 బ్యాచ్ ఐపీఎస్ అయిన పూరన్ కుమార్..పోలీసు అధికారుల హక్కులు, సీనియారిటీ తదితర సమస్యలపై ముందుండి పోరాడే అధికారిగా ఈయనకు పేరుంది. ఇటీవలే ఈయన రొహతక్‌లోని పోలీస్ ట్రెయినింగ్ సెంటర్‌కు ఐజీగా నియమితులయ్యారు. ఈయన భార్య అమ్‌నీత్ పి.కుమార్ ఐఏఎస్ అధికారిణి. కమిషనర్‌గా పనిచేస్తున్న ఈమె ప్రస్తుతం జపాన్‌లో పర్యటిస్తున్న సీఎం నాయబ్ సైనీ వెంట వెళ్లిన బృందంలో ఉన్నారు.

మిలటరీ కోసం ఐఆర్ఎస్ఏ

విడుదల చేసిన డీఆర్‌డీవో

న్యూఢిల్లీ: మిలటరీ కమ్యూనికేషన్‌కు కీలకమైన ఇండియన్ రేడియో సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్చర్(ఐఆర్ఎస్ఏ)ను మంగళవారం రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) విడుదల చేసింది. ఐఆర్ఎస్ఏ అనేది సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియో (ఎస్‌డీఆర్)ల కోసం రూపొందిన సమగ్ర సాఫ్ట్‌వేర్ స్పెసిఫికేషన్. ఆధునిక సైనిక కమ్యూనికేషన్ వ్యవస్థలకు ఎస్‌డీఆర్‌లు కీలకంగా మారడంతో 2021 నుంచి ఐఆర్ఎస్ఏను ప్రవేశపెట్టారు. అప్పుడే జాతీయ సాఫ్ట్‌వేర్ స్టాండర్డ్ అవసరాన్ని గుర్తించారు. ఇందుకోసం డీఆర్‌డీవో సారథ్యంలో 2022లో ఒక సాంకేతిక బృందం ఏర్పాటైంది. భారత్‌లో డిజైన్ చేసి, భారత్ కోసం రూపొందించిన ఐఆర్ఎస్ఏ 1.0 ఇప్పుడు ప్రపంచ అవసరాలను తీర్చేందుకు సిద్ధమైందని రక్షణ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. రక్షణ కమ్యూనికేషన్ సాంకేతికతలో భారత్ ఆత్మనిర్భరత దిశగా సాగే ప్రయాణంలో ఇదో ముఖ్యమైన అడుగని రక్షణ శాఖ పేర్కొంది.

ఢిల్లీలో నేపాలీ గ్యాంగ్‌స్టర్ ఎన్‌కౌంటర్

న్యూఢిల్లీ: ఢిల్లీలోని జాంగ్‌పురాలో ఒక వైద్యుడి హత్య కేసులో పరారీలో ఉన్న, నేపాలీ గ్యాంగ్ నాయకుడిని మంగళవారం రాత్రి ఢిల్లీ పోలీస్ ప్రత్యేక బృందం, గురుగ్రామ్ క్రైమ్ బ్రాంచ్ సంయుక్తంగా జరిపిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. ఆగ్నేయ ఢిల్లీలోని ఆస్తా కంజ్ పార్క్ సమీపంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. గ్యాంగ్‌స్టర్‌పై రూ.50,000 రివార్డు కూడా ఉంది. మృతుడు నేపాల్‌కు చెందిన భీమ్ మహాబహదూర్ జోరా (39). 2024 మే నెలలో.. జాంగ్‌పురాలోని 63 ఏళ్ల జనరల్ ఫిజీషియన్ యోగేష్ చందర్ పాల్ నివాసంలో దోపిడీకి పాల్పడ్డాడు. ఈ సందర్భంగా వైద్యుడిని హత్య చేసిన కేసులో జోరా ప్రధాన నిందితుడు.

జామామసీద్‌ను నిర్మించిన కుతుబ్‌షా ఎవరు?

పదిహేనో శతాబ్దం చివరి నాటికి క్షీణ దశకు చేరిన బహమనీ సామ్రాజ్యం అయిదు రాజ్యాలుగా చీలిపోయింది. అందులో గోల్కొండ కుతుబ్‌షాహీ రాజ్యం ఒకటి. ఈ రాజ్యస్థాపకుడు సుల్తాన్ కులీకుతుబ్‌షా. ఇతడు 1496 నుంచి 1518 వరకు సుబేదార్‌గా తెలంగాణ ప్రాంతాన్ని పాలించాడు. 1518లో స్వతంత్రం ప్రకటించుకున్నాడు. కుతుబ్‌షాహీలు తొలుత తెలంగాణను పాలించారు. 1565లో విజయనగర సామ్రాజ్య పతనం తర్వాత ఇతర తెలుగు ప్రాంతాలు కూడా వీరి ఆధీనంలోకి వచ్చాయి. తెలంగాణ అనే పదం వీరి కాలం నుంచే ప్రాచుర్యం పొందింది. కుతుబ్‌షాహీలు సుమారు రెండు శతాబ్దాల (1496-1687) పాటు తెలంగాణను పాలించారు. వీరు తెలుగు భాషా సాహిత్య సంస్కృతులను ఆదరించి తెలుగు ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

కుతుబ్‌షాహీ యుగం

కులీకుతుబ్‌షా తన బంధువులతో కలసి మధ్య ఆసియా నుంచి దక్కన్‌కు వలస వచ్చాడు. ఇతడు బహమనీ సుల్తాన్ మహమూద్ షా (1482-1518) కొలువులో చేరి సేనాపతి అయ్యాడు. ఆ సమయంలో ఇతడు తెలంగాణ ప్రాంతంలో దోపిడీ దొంగలను అణచివేశాడు. ఎదురు తిరిగిన సామంతులను దారిలోకి తెచ్చాడు. 1487లో బహమనీ రాజ్యంలో దక్కనీ, అఫాకీ(స్థానికేతర)ల మధ్య ఘర్షణలు తలెత్తాయి. కులీ వీటి నుంచి సుల్తాన్‌ను రక్షించాడు. గోవా పాలకుడైన బహదూర్ జిలానీ (1493) సుల్తాన్‌పై తిరుగుబాటు చేశాడు. ఈ తిరుగుబాటును అణచివేసే ప్రయత్నంలో నాటి తెలంగాణ పాలకుడైన కుతుబ్ ఉల్‌ముల్క్ డకానీ మరణించాడు. దీంతో మహమూద్ షా ఆ బాధ్యతను కులీకుతుబ్‌షాకు అప్పగించాడు. తిరుగుబాటును కులీ పూర్తిగా అణచి వేశాడు. దీంతో మహమూద్‌షా అతడికి కుతుబ్ ఉల్‌ముల్క్ బిరుదునిచ్చి 1496లో గోల్కొండ జాగీర్‌దార్‌గా నియమించాడు. కులీకుతుబ్‌షా 1518లో స్వతంత్రం ప్రకటించుకొని తెలంగాణ ప్రాంతాన్ని పాలించాడు. గోల్కొండను కాకతీయుల కాలంలో నిర్మించారు. దీన్ని గతంలో మంగళారం అని పిలిచేవారు. కులీ స్వతంత్రంగా పాలన చేపట్టిన తొలినాళ్లలో మెదక్ జిల్లా కోహిర్ నుంచి ఓరుగల్లు వరకు మాత్రమే ఇతడి పాలనలో ఉండేది. ఓరుగల్లు నుంచి తూర్పు తీరం వరకు ఉన్న ప్రాంతాన్ని షితాబ్‌ఖాన్ (సీతాపతిరాజు) పాలించేవాడు. ఇతడు గజపతుల సామంతుడు. షితాబ్‌ఖాన్ 1504లో ఓరుగల్లు కోటను కైవసం చేసుకున్నాడు. ఇతడు స్వతంత్రంగా ఓరుగల్లు రాజ్యపాలన చేపట్టాడు. ఇతడి మంత్రి ఎనుములపల్లి పెద్దనామాత్యుడు. చరిగొండ ధర్మన్న అనే కవి పెద్దనామాత్యుడి వద్ద ఆశ్రయం పొందాడు. ధర్మన్న రచించిన చిత్రభారతంలో షితాబ్‌ఖాన్ ప్రశంస కనిపిస్తుంది. వరంగల్, ఖమ్మంమెట్టు, నల్లగొండ ప్రాంతాలు షితాబ్‌ఖాన్ రాజ్యంలో భాగంగా ఉండేవి. కులీకుతుబ్‌షా ఓరుగల్లుపై దాడి చేసి ఇతణ్ని సంహరించాడు.

రాజ్య విస్తరణ

రాచకొండ, పానుగల్లు, ఘనపురం (మహబూబ్‌నగర్), దేవరకొండ, నల్లగొండ, ఉర్లుగొండ, ఉంద్రుగొండ, అనంతగిరి దుర్గాధిపతులు స్వతంత్రంగా పరిపాలించేవారు. కృష్ణదేవరాయల మరణానంతరం (1529) కులీకుతుబ్‌షా ఈ దుర్గాలను జయించి రాజ్యాన్ని విస్తరించాడు. తర్వాత కరీంనగర్ జిల్లాలో కివాం ఉల్‌ముల్క్‌ను ఓడించాడు. ములంగూర్, ఎల్గందుల, రామగిరి కోటలను స్వాధీనం చేసుకున్నాడు. ఆదిల్‌షాతో యుద్ధం చేసి కోవిలకొండను ఆక్రమించాడు. హరిచంద్ తిరుగుబాటును అణచి నల్లగొండను వశం చేసుకున్నాడు. తర్వాత కృష్ణానదీ తీరం వరకు రాజ్యాన్ని విస్తరించాడు. కొండపల్లి, ఇంద్రకొండ, ఏతగిరి, దుర్గాధీశులను ఓడించాడు. దీంతో కృష్ణా, గోదావరి నదుల మధ్య ఉన్న తీరాంధ్ర కూడా ఇతడి పాలనలోకి వచ్చింది. కులీకుతుబ్‌షా కవి పండితులను ఆదరించాడు. ఇతడికి ఆరుగురు కుమారులు. చివరి వాడైన ఇబ్రహీం కుతుబ్‌షాను దేవరకొండ పాలకుడిగా నియమించాడు.

యువరాజు, పెద్ద కుమారుడైన హైదర్ ముందే మరణించాడు. రెండో కుమారుడైన కుతుబుద్దీన్ యువరాజు అయ్యాడు. కానీ రాజకీయాల పట్ల శ్రద్ధ పెట్టలేదు. మిగతా ముగ్గురు తండ్రి బతికుండగానే సింహాసనాన్ని ఆకాంక్షించారు. నాలుగో కుమారుడైన అబ్దుల్ కరీం తిరుగుబాటు చేశాడు. ఇతడు బీజాపూర్ వెళ్లి సుల్తాన్‌తో సంప్రదింపులు జరిపాడు. గోల్కొండను ముట్టడించాలని భావించాడు. ఆ ప్రయత్నాల్లోనే మరణించాడు. కులీకుతుబ్‌షా మూడో కుమారుడైన జంషీద్, అయిదో కుమారుడైన దౌలత్ వారసత్వం కోసం కలహించుకున్నారు. దీంతో కులీకుతుబ్‌షా జంషీద్‌ను గోల్కొండలో, దౌలత్‌ను భువనగిరిలో బంధించాడు. జైలు నుంచి తప్పించుకున్న జంషీద్ తండ్రిని హత్య చేశాడు. సోదరుడైన కుతుబుద్దీన్‌ను చిత్రహింసలకు గురి చేసి జైల్లో ఉంచాడు. అనంతరం సింహాసనాన్ని ఆక్రమించాడు. ఇతడు రాజ్యాన్ని విస్తరించలేదు. కానీ తన రాజ్య భాగాలను కోల్పోలేదు.

మల్కిభరాముడు

కులీ ఆరో కుమారుడు ఇబ్రహీం కుతుబ్‌షా (1550-80). ఇతడు విజయనగర రాజుల సాయంతో సింహాసనాన్ని ఆక్రమించాడు. కవి పండితులను ఆదరించి మల్కిభరాముడిగా పేరొందాడు. ఇతడు విజయనగరంలో ఏడేళ్లపాటు శరణార్థిగా ఉన్నాడు. వారి సహాయంతోనే సింహాసనాన్ని ఆక్రమించాడు. కానీ వారి పతనానికే కారణమయ్యాడు. బీజాపూర్, అహ్మద్‌నగర్, గోల్కొండ, విజయనగర రాజులు దక్కన్‌పై ఆధిపత్యం కోసం ప్రయత్నించారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లోనే ఇబ్రహీం తళ్లికోట యుద్ధంలో విజయనగర రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడాల్సి వచ్చింది. ఈ యుద్ధంలో ఓటమి వల్ల విజయనగర సామ్రాజ్యం పతనావస్థకు చేరింది. దీంతో ఇబ్రహీం కుతుబ్‌షా తీరాంధ్రను జయించడానికి మార్గం సుగమమైంది. ఇతడు 1571లో రాజమండ్రి, దాని పరిసర ప్రాంతాలను జయించాడు. 1579లో కొండవీటిని స్వాధీనం చేసుకున్నాడు. తర్వాత వినుకొండ, ఖమ్మం దుర్గాలను, కసింకోటను వశం చేసుకున్నాడు.

ఇబ్రహీం కుతుబ్‌షా తన పాలనా కాలంలో హుస్సేన్‌సాగర్, ఇబ్రహీం పట్నం చెరువులను తవ్వించాడు. ఇబ్రహీంబాగ్, పూల్‌బాగ్, లంగర్ (భిక్షా గృహాలు)ను ఏర్పాటు చేశాడు. మూసీనదిపై పురానాపూల్ వంతెనను నిర్మించాడు.

ఇబ్రహీం మరణానంతరం మహమ్మద్ కులీ కుతుబ్‌షా (1580-1612) అధికారం చేపట్టాడు. ఇతడు 14వ ఏట రాజ్యానికొచ్చాడు. ఇతడు ఇబ్రహీం, భాగీరథిల సంతానం. దక్కన్ ముస్లింల సహకారంతో అశ్వారావు చేసిన కృషి వల్ల మహమ్మద్ కులీ అధికారంలోకి వచ్చాడు. ఇతడు కవి అయినప్పటికీ రాజ్య విస్తరణలో అలక్ష్యం ప్రదర్శించలేదు. దక్షిణాన పెనుగొండ, గండికోటలను జయించాడు. తూర్పున శ్రీకాకుళం వరకు రాజ్యాన్ని విస్తరించాడు. అనేక తిరుగుబాట్లను అణచివేశాడు. 1592లో రాజధానిని గోల్కొండ నుంచి హైదరాబాద్‌కు మార్చాడు. ఇదే సమయంలో మొగలులు విజృంభించి 1590 నాటికి ఉత్తర భారతాన్నంతా ఆక్రమించారు.

అనంతరం వారు దక్కన్‌పై దృష్టి సారించి అహ్మద్‌నగర్‌ను వశపర్చుకున్నారు. ఈ ప్రభావం మహమ్మద్ కులీపై కూడా పడింది. ఎన్నో రకాల ఒత్తిళ్లను ఎదుర్కొన్నప్పటికీ ఇవేవీ కులీ కళాపోషణను ప్రభావితం చేయలేదు. తన ప్రియురాలైన భాగమతి పేరు మీద భాగ్యనగరాన్ని నిర్మించాడు. కులీ ఆమెకు హైదర్ మహెల్ అనే పేరు పెట్టాడు. దీంతో భాగ్యనగరం హైదరాబాద్‌గా వ్యవహారంలోకి వచ్చింది.

ఇతడు చార్మినార్ (1591), చార్‌కమాన్(1592), జామామసీద్(1597-1598)లను నిర్మించాడు. దారుల్ షిఫా, దాద్ మహల్, ఖుదాదాద్ మహల్, నద్ది మహల్‌లను నిర్మించాడు. భాగెమహమ్మది, బన్నత్ ఘాట్, కోహినూర్ తదితర నిర్మాణాలు చేపట్టాడు. ఇవన్నీ ఇతడి కళాభిరుచికి నిదర్శనం.

కులీ మరణం తర్వాత అతడి అల్లుడయిన సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా(1612-26) సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతడు మొగలులతో సఖ్యతగా వ్యవహరించాడు. ఇతడి కాలంలోనే డచ్చివారు, బ్రిటిషర్లు తీరాంధ్ర వెంట వర్తక స్థావరాల్ని నెలకొల్పారు. మహమ్మద్ కుతుబ్‌షా ఖైరతాబాద్ మసీద్‌ను నిర్మించాడు. మక్కా మసీదు నిర్మాణానికి పునాది వేశాడు. 1624లో ఈద్‌గాను నిర్మించాడు. అమ్మాన్ భవనం, నబీబాగ్ కూడా ఇతడి కాలం నాటివే.

పతనం ఆరంభం..

మహమ్మద్ తర్వాత అతడి పెద్ద కుమారుడైన అబ్దుల్లా కుతుబ్‌షా(1626-72) రాజ్యానికి వచ్చాడు. ఇతడు మొగలుల నుంచి స్వతంత్రతను నిలబెట్టుకోలేకపోయాడు. దక్కన్‌లో మొగలులను ఎదిరించిన మలికంబర్ 1626లో, బీజాపూర్ సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్ షా 1627లో మరణించారు. వీరి మరణంతోపాటు కొన్ని ఇతర కారణాల వల్ల దక్కన్‌పై మొగలుల దండయాత్రకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి.

మొగల్ చక్రవర్తి షాజహాన్ 1636లో గోల్కొండపై దండెత్తాడు. అబ్దుల్లా కుతుబ్‌షా అతడితో సంధి చేసుకుని మొగలుల ఆధిపత్యాన్ని అంగీకరించాడు. నాటి నుంచి కుతుబ్‌షాహి రాజ్య క్షీణదశ ప్రారంభమైంది. అబ్దుల్లా ఒకవైపు సామంతుడిగా ఉంటూనే కర్ణాటక రాజ్యంపై ఆధిపత్యం కోసం ప్రయత్నించాడు. తన సేనాని మహ్మద్ సయీద్ మీర్‌జుంలాను 1645లో కర్ణాటకపై దండయాత్రకు పంపాడు. ఫలితంగా కర్ణాటక రాజ్య తూర్పు భాగాలు అబ్దుల్లా రాజ్యంలో భాగమయ్యాయి. 1653లో విశాఖపట్టణం సుల్తాన్ వశమైంది. తీరాంధ్ర గోల్కొండ సామ్రాజ్యంలో విలీనమైంది. ఈ విజయాలతో విదేశీ వర్తకుల వ్యాపార స్థావరాలు గోల్కొండ రాజ్య పరిధిలోకి వచ్చాయి. దీంతో వారికి గోల్కొండ రాజ్యంతో సంబంధాలు ఏర్పడ్డాయి.

కర్ణాటక విజయాలతో అబ్దుల్లా సేనాని మహమ్మద్ సయీద్‌లో అత్యాశ మొదలైంది. ఇతడు తిరుగుబాటు చేసి స్వతంత్రం ప్రకటించుకున్నాడు. దక్కన్ సుబేదార్, షాజహాన్ కుమారుడైన ఔరంగజేబుకు చాడీలు చెప్పాడు. అతడి మాటలు నమ్మిన ఔరంగజేబు 1656లో గోల్కొండపై దండెత్తాడు. అబ్దుల్లా కుతుబ్‌షా అతి కష్టం మీద ఔరంగజేబుతో సంధి చేసుకున్నాడు. కుతుబ్‌షా తన రెండో కుమార్తెను ఔరంగజేబు కుమారుడైన మహమ్మద్ సుల్తాన్‌కు ఇవ్వడానికి అంగీకరించాడు. మహమ్మద్‌ను తన వారసుడిగా ప్రకటించడానికి, కోటి హొన్నులు కప్పం కట్టడానికి అబ్దుల్లా ఒప్పుకున్నాడు. దీంతో గోల్కొండలో మొగల్ అధికారుల ఆధిపత్యం పెరిగింది. ఫలితంగా గోల్కొండ రాజ్యం తన ప్రాభవాన్ని కోల్పోయింది. ఈ సంక్షోభాన్ని అదనుగా భావించిన ఐరోపా కంపెనీలు కుతుబ్‌షాహీల పట్ల అవిధేయంగా ప్రవర్తించాయి. సంక్షోభానంతరం అబ్దుల్లా వారిని దారిలోకి తెచ్చుకున్నాడు.

తానీషా పాలన

1672లో అబ్దుల్లా మరణించడంతో వారసత్వ వివాదం ఏర్పడింది. అనూహ్య పరిస్థితుల్లో అబుల్ హసన్ తానీషా (1672-87) కుతుబ్‌షాహీ రాజ్య వారసుడయ్యాడు. తానీషా సుల్తాన్ పదవిని చేపట్టగానే ఔరంగజేబుకు అనేక కానుకలు పంపాడు. మొగలులకు సామంతుడిగా ఉండేందుకు అంగీకరించాడు. ఇందుకు ఔరంగజేబు ఒప్పుకున్నాడు. కానీ తానీషా శివాజీకి సహాయపడకూడదని, పేష్కను సమయానికి చెల్లించాలని షరతులు విధించాడు. మొగలులతో ఎప్పటికైనా ప్రమాదమేనని తానీషా భావించాడు. అందుకే రాజ్యాన్ని పటిష్టం చేసే పనిలో నిమగ్నమయ్యాడు. తాను అధికారంలోకి రావడానికి తోడ్పడిన ముజఫర్‌ను మీర్ జుమ్లా (ప్రధానమంత్రి)గా నియమించాడు. కానీ అతడు అన్ని వ్యవహారాల్లో తలదూర్చేవాడు. అది సహించని తానీషా ముజఫర్‌ను తొలగించాడు. హనుమకొండకు చెందిన మాదన్నను ప్రధానిగా, అక్కన్నను సర్వసైన్యాధ్యక్షుడిగా నియమించాడు. మాదన్న రాజ్య వ్యవహారాలను చక్కదిద్దాడు. కర్ణాటక ప్రాంతంలో పాశ్చాత్య వర్తకులు సృష్టించిన అలజడులను అణచివేశాడు. తిరుగుబాటుదారులపై కఠిన చర్యలు తీసుకున్నాడు. ఉన్నత పదవుల నుంచి స్థానికేతరులను తొలగించి స్థానికులను నియమించాడు. నీటి వనరుల నిర్మాణాలు చేపట్టి వ్యవసాయాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాడు. దళారీలను తొలగించి రైతులపై జరిగే దౌర్జన్యాలను అరికట్టాడు. గనులను పునరుద్ధరించి రాజ్య సంపదను పెంచాడు.


ఔరంగజేబు దండయాత్ర

ఇదే సమయంలో ఔరంగజేబు దక్కన్ రాజ్యాలన్నింటినీ నిర్మూలించడానికి ఉద్యుక్తుడయ్యాడు. మొగలుల నుంచి రాజ్యాన్ని రక్షించుకోవడానికి తానీషా 1677లో శివాజీతో సంధి చేసుకున్నాడు. ఈ సంధి కుదరడంలో అక్కన్న మాదన్నలు ముఖ్య పాత్ర పోషించారు. ఇది ఔరంగజేబు ఆగ్రహానికి కారణమైంది. కొంత కాలానికి శివాజీ మరణించాడు. దీంతో ఔరంగజేబు అదను చూసుకొని 1685లో గోల్కొండపై దండెత్తాడు. మొగలు సైన్యానికి ఔరంగజేబు కుమారుడైన షా ఆలం నాయకత్వం వహించాడు.

మొదట గోల్కొండకే విజయం లభించింది. కానీ సేనానుల నమ్మక ద్రోహంతో గోల్కొండ ఓడిపోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో తానీషా మొగలులతో సంధి చేసుకున్నాడు. ఈ సంధి ప్రకారం పాత బకాయిల కింద మొగలులకు కోటి హొన్నులు చెల్లించాలి. ఏటా రెండు లక్షల హొన్నుల కప్పం చెల్లించాలి. మల్ఖేడు, సేడం ప్రాంతాలను మొగలులకు అప్పగించాలి. అక్కన్న మాదన్నలను పదవుల నుంచి తొలగించాలి. మొదటి మూడు షరతులను తానీషా అమలు చేశాడు.

కానీ అక్కన్న మాదన్నలను తొలగించడంలో ఆలస్యం చేశాడు. ఇది సహించని ముస్లిం సర్దార్లు 1686 మార్చి 24 రాత్రి అక్కన్న మాదన్నలను హత్య చేశారు. వారి తలలను ఔరంగజేబుకు కానుకగా పంపారు. అయినా ఔరంగజేబు సంతృప్తి చెందలేదు. బీజాపూర్ ఆక్రమణ అనంతరం 1687 ఫిబ్రవరి 7న మళ్లీ గోల్కొండపై దండెత్తాడు. ఎనిమిది నెలల హోరాహోరీ యుద్ధం తర్వాత ఒక సేనాని ద్రోహంతో గోల్కొండ మొగలుల వశమైంది. అబుల్ హసన్ తానీషాను బంధించి దౌలతాబాద్ కోటకు తరలించారు. దీంతో కుతుబ్‌షాహీల పాలన అంతరించింది. గోల్కొండ రాజ్యం మొగల్ సామ్రాజ్యంలో భాగమైంది.

అర్థరహిత పదాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటే ఆ ప్రక్రియ?



టెట్/డీఎస్సీ

చైల్డ్ డెవలప్‌మెంట్ & పెడగాజీ

వైయక్తిక భేదాలు

1. వీటిలో శాబ్దికేతర సామూహిక పరీక్ష?
   1) బీనే సైమన్ 2) ఆర్మీ ఆల్ఫా
   3) ఆర్మీ బీటా 4) భాటియా నిష్పాదన
2. వీటిలో శాబ్దిక పరీక్ష కానిది?
   1) బీనే సైమన్ 2) ఆర్మీ ఆల్ఫా
   3) రావన్స్ ప్రోగ్రెసివ్ టెస్ట్
   4) ఒటిస్ మానసిక సామర్థ్యాల పరీక్ష
3. సెప్టెంబరు 5, 1971 ఏ వారం? అని ఉపాధ్యాయుడు ప్రశ్నిస్తే రాజు అనే విద్యార్థి క్యాలెండర్ సహాయంతో ఆదివారం అని సమాధానం ఇచ్చాడు. గిల్‌ఫర్డ్ ప్రకారం రాజు ఉపయోగించిన ఉత్పత్తి?
   1) యూనిట్లు 2) వర్గాలు
   3) అంతర్భావాలు 4) సంబంధాలు
4. ఈ-మెయిల్, టెలిగ్రాం, పోస్ట్ కార్డు, బుక్‌ల్లో వేరుగా ఉన్నదేది? అని ఉపాధ్యాయుడు ప్రశ్నిస్తే.. బుక్ తప్ప మిగిలినవి ప్రసార సాధనాలని రాము సమాధానమిచ్చాడు. రాములో గమనించే ఉత్పత్తి గిల్‌ఫర్డ్ ప్రకారం?
   1) వర్గాలు 2) సంబంధాలు
   3) అంతర్భావాలు 4) రూపాంతరాలు
5. అవగాహన అనే లక్ష్యంతో ఫలితాలను ఊహించడమనే స్పష్టీకరణం గిల్‌ఫర్డ్ ఉత్పత్తుల్లో ఏ కారకాన్ని సూచిస్తుంది?
   1) వర్గాలు 2) సంబంధాలు
   3) అంతర్భావాలు 4) రూపాంతరాలు
6. వినియోగమనే లక్ష్యంలో ఫలితాలను ఊహించడమనే స్పష్టీకరణం గిల్‌ఫర్డ్ ఉత్పత్తుల్లో ఏ కారకాన్ని సూచిస్తుంది?
   1) వర్గాలు 2) సంబంధాలు
   3) అంతర్భావాలు 4) రూపాంతరాలు
7. ప్రజ్ఞా విభాజన పట్టికకు సంబంధించి సరి కాని ప్రవచనం?
   1) సగటు కంటే తక్కువ 81-90 ప్రజ్ఞా లబ్ధి
   2) అల్పబుద్ధులు 51-70 ప్రజ్ఞాలబ్ధి
   3) ఉన్నత ప్రజ్ఞావంతులు121-140ప్రజ్ఞాలబ్ధి
   4) మంద బుద్ధులు 25-50 ప్రజ్ఞాలబ్ధి
8. ప్రజ్ఞా విభజన పట్టికలో ఆరోహణ క్రమంలోని సరైన జతను గుర్తించండి?
   1) మందబుద్ధులు, అల్పబుద్ధులు, మూఢులు, బుద్ధిహీనులు
   2) మందబుద్ధులు, మూఢులు, అల్పబుద్ధులు, బుద్ధిహీనులు
   3) మూఢులు, బుద్ధిహీనులు, అల్ప బుద్ధులు, మందబుద్ధులు
   4) బుద్ధిహీనులు, మందబుద్ధులు, అల్ప బుద్ధులు, మూఢులు
9. Rose పదం చూసినప్పుడు ప్రయోజ్యుడు XOP అనే అర్థరహిత పదాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటే ఆ ప్రక్రియ?
   1) స్మృతి- విస్మృతి 2) ద్వంద్వ సంసర్గలు
   3) గుర్తింపు 4) ఏదీకాదు
10. 'మానవులందరూ మర్త్యులే. సోక్రటీస్ మానవుడు కాబట్టి మర్త్యుడే' అని ఆలోచించడం ఏ రకమైన ఆలోచన?
   1) విభిన్న 2) హేతుబద్ధ
   3) ఊహాలోచన 4) సమైక్య
11. రిమోట్ అసోసియేషన్ టెస్ట్ ఏ ప్రవర్తనాంశాన్ని మాపనం చేస్తుంది?
   1) సృజనాత్మకత 2) ప్రజ్ఞ
   3) సహజ సామర్థ్యాలు 4) స్మృతి
12. వీటిలో సరికాని జత?
   1) అమూర్తంగా ఆలోచించడమే ప్రజ్ఞ-టెర్మన్
   2) గ్రహణ శక్తిని ప్రజ్ఞ అంటారు- గాల్టన్
   3) భౌతిక సామాజిక పరిసరాలకు అనుగుణంగా ప్రవర్తించడమే ప్రజ్ఞ- పియాజే
   4) అభ్యసించగల సామర్థ్యమే ప్రజ్ఞ-స్పెన్సర్
13. వీటిలో అంతర వ్యక్తిగత భేదాలను సూచించేది?
   1) రాజు శారీరకంగా బలవంతుడు, ఉద్వేగంగా అస్థిరుడు
   2) రాజు స్నేహితుల కంటే వ్యవహారిక దక్షత గలవాడు
   3) రాజు చదవడం, రాయడం రెండూ ఇష్టపడతాడు
   4) రాజు గణితం కంటే సాంఘిక శాస్త్రాన్ని ఇష్టపడతాడు
14. వీటిలో సరికాని జత?
   1) డాల్టన్ ప్రణాళిక- మోరిసన్
   2) విన్నెట్కా ప్రణాళిక- వాష్ బర్న్
   3) గారీ ప్రణాళిక-విలియం బర్ట్
   4) నాన్ గ్రేడెడ్ పద్ధతి- గుడ్ లాడ్
15. ప్రజ్ఞ, సృజనాత్మకతలకు సంబంధించి సరికాని ప్రవచనం?
   1) ప్రజ్ఞ ఉన్న వ్యక్తులందరూ సృజనా త్మకంగా ఉండాలని లేదు
   2) సృజనాత్మకత ఉన్న వారందరికీ ఎంతో కొంత ప్రజ్ఞ ఉంటుంది
   3) సృజనాత్మకంగా ఉండాలంటే ప్రజ్ఞ అవసరం లేదు
   4) విభిన్న ఆలోచన ఉన్నవారికి సృజనాత్మకత ఎక్కువ
16. ఉపాధ్యాయుడు 4×5×6 అనే ప్రశ్నను ఇచ్చినపుడు విద్యార్థి ఉపయోగించే విషయం?
   1) చిత్రాలు 2) చిహ్నాలు
   3) వర్గాలు 4) సంబంధాలు
17. పావురం, గరుడపక్షి, నెమలి, కంగారుల్లో సరికానిది గుర్తించమని ఉపాధ్యాయుడు ప్రశ్నిస్తే.. కంగారు జంతువు, మిగిలినవి పక్షులని విద్యార్థి సమాధానమిచ్చాడు. గిల్‌ఫర్డ్ ప్రకారం విద్యార్థి ఉపయోగించిన ఆలోచన ఫలితం?
   1) పద్ధతులు 2) వర్గాలు
   3) సంబంధాలు 4) యూనిట్లు
18. విద్యార్థి శారీరక వయసు పదేళ్లు. ఐతే 16 ఏళ్ల వారికి ఉద్దేశించిన పరీక్షను సాధించాడు. ప్రజ్ఞా లబ్ధి ఆధారంగా ఆ విద్యార్థి ఏ వర్గీకరణకు చెందుతాడు?
   1) ఉన్నత 2) అత్యున్నత
   3) సగటుకంటే ఎక్కువ 4) ప్రతిభ కలవారు
19. రెండు ప్రపంచయుద్ధాలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపాయి. మూడో ప్రపంచయుద్ధం జరిగితే అనర్థాలేమిటి? అని ఉపాధ్యాయుడు ప్రశ్నిస్తే.. గిల్‌ఫర్డ్ ప్రకారం ఆ విద్యార్థి ఉపయోగించిన ఉత్పన్నాలు?
   1) వర్గాలు 2) సంబంధాలు
   3) అంతర్భావాలు 4) రూపాంతరాలు
20. వీనిలో సాధారణ కారకం(జి)కు సంబంధించి సరికాని ప్రవచనం?
   1) అభ్యసనం, సాధారణ ప్రజ్ఞను ప్రభావితం చేస్తుంది
   2) వంశపారంపర్యత సాధారణ ప్రజ్ఞను నిర్ధారిస్తుంది
   3) గణితం, సైన్సులో ప్రతిభ సాధారణ కారకంపై ఆధారపడి ఉంటుంది.
   4) సాధారణ కారకం (జి) ప్రజ్ఞను నిర్ధారించే ప్రధాన అంశం
21. ద్వికారక సిద్ధాంతం ప్రకారం తీవ్ర భాషాపరమైన అభిరుచులు ఏ కారకంపై ఆధారపడి ఉంటాయి?
   1) జి 2) పి 3) ఎస్ 4) జి1
22. వీటిలో వ్యక్తంతర్గత భేదాన్ని సూచించేది?
   1) రాణి తన వయసు వారితోపాటు మార్కులు సాధిస్తుంది
   2) రాణి తెలుగులో చూపిన అభిరుచి గణితంలో చూపదు
   3) రాణి క్రీడల్లో ఇతరుల కంటే ప్రతిభ చూపుతుంది
   4) రాణి క్రీడలు, చదువుకు సమాన ప్రాధాన్యమిస్తుంది
23. వీటిలో సరికాని ప్రవచనం?
   1) జ్ఞానం సహాయంతో ప్రజ్ఞను మెరుగు పర్చుకోలేం
   2) జ్ఞానం ప్రజ్ఞ అనే గమ్యాన్ని చేరడానికి సహకరిస్తుంది
   3) జ్ఞానం సహాయంతో ప్రజ్ఞను మెరుగు పర్చుకోవచ్చు
   4) ప్రజ్ఞ వల్ల జ్ఞాన సముపార్జన జరుగుతుంది
24. వీటిలో అంతర వ్యక్తిగత భేదాలను సూచించనిది?
   1) రాజులో తన వయసువారి కంటే మానసిక పరిపక్వత ఎక్కువ
   2) రాజు చదవడం ఇష్టపడినంత రాయడం ఇష్టపడడు
   3) రాజు తన స్నేహితుల కంటే వ్యవహారిక దక్షత కలవాడు
   4) రాజు క్రికెట్ ఏ స్థాయిలో ఆడతాడో హాకీ కూడా అదేస్థాయిలో మిగతావారి కంటే బాగా ఆడగలడు

సమాధానాలు

1) 4	2) 3	3) 4	4) 1	5) 4
6) 3	7) 4	8) 3	9) 2	10) 2
11) 1	12) 4	13) 2	14) 1	15) 3
16) 2	17) 2	18) 2	19) 3	20) 1
21) 3	22) 2	23) 3	24) 2	

మనోవిజ్ఞాన శాస్త్రం- స్వభావం, పద్ధతులు

1. విద్యపై సాంఘిక ఆర్థిక స్థితి ప్రభావాన్ని కనుక్కోవడానికి చేసే పరిశోధనలో స్వతంత్ర చరం?
   1) వయసు 2) ప్రజ్ఞ
   3) సాంఘిక ఆర్థిక స్థితి 4) విద్య
2. వీటిలో ప్రవర్తన లక్షణాన్ని వర్ణించడంలో సరైన ప్రవచనం?
   1) స్తబ్దమైంది 2) స్థిరమైంది
   3) గతి శీలమైంది 4) అచేతనమైంది
3. ఉపాధ్యాయుడు తరగతిలోని విద్యార్థుల ను మూడు సమూహాలుగా విభజించాడు. వీటిలో మొదటి సమూహానికి హోంవర్క్ చేస్తే బహుమతి ఇస్తానని తెలిపాడు. రెండో సమూహానికి హోంవర్క్ ఇచ్చాడు. కానీ దండన/ బహుమతి ప్రకటించలేదు. మూడో సమూహానికి ఇంటి పని చేయక పోతే దండిస్తానని చెప్పాడు. ఇందులో నియం త్రిత సమూహం?
   1) ఒకటోది 2) రెండోది
   3) మూడోది 4) ఒకటి, మూడు సమూహాలు
4. నవజాత శిశువును అధ్యయనం చేయడానికి ఉపయోగపడని పద్ధతి?
   1) పరిశీలన 2) అంతః పరీక్షణ
   3) వ్యక్తి అధ్యయన 4) ప్రయోగాత్మక
5. 'నిన్నటికంటే ఈ రోజు పాఠం బాగా అర్థమైందని'టీచర్‌తో విద్యార్థి చెప్పినప్పుడు ఆ విద్యార్థి ఉపయోగించిన పద్ధతి?
   1) పరిశీలన 2) అంతః పరీక్షణ
   3) వ్యక్తి అధ్యయన 4) ప్రయోగాత్మక
6. వ్యక్తి అధ్యయనంలో అన్ని విషయాలను సక్రమంగా విశ్లేషణ చేయడానికి ఉపయో గించాల్సిన పరిశీలన పద్ధతి?
   1) సంచరిత 2) అసంచరిత
   3) నియంత్రిత 4) అంతఃపరిశీలన
7. విద్యామనోవిజ్ఞాన శాస్త్రం ఆధునిక విద్యకందించిన విషయం?
   1) ఆశయాలు ఎందుకు నిర్ణయించుకోవాలి
   2) ఏ ఆశయాలు నిర్ణయించుకోవాలి
   3) ఎలా లక్ష్యాలు సాధించాలి
   4) ఏ పాఠ్యాంశాలు బోధించాలి
8. 'పని చేయని, పని చేసే తల్లులు-వారి పిల్లల సాధన' అనే అంశాల గురించి ప్రయోగపూర్వకంగా ఫలితాలు తెలుసుకో వాలనుకున్న పరిశీలకుడు పరీక్షించాల్సిన స్వతంత్ర చరం?
   1) పని చేయని తల్లులు
   2) పనిచేసే తల్లులు 3) 1, 2
   4) పనిచేసే తల్లుల పిల్లల విద్యాసాధన
9. కేస్‌స్టడీలో ప్రధానంగా ఉపయోగించే పద్ధతి?
   1) ప్రయోగ 2) అసంచరిత పరిశీలన
   3) సమాంతర అధ్యయన(Cross Sectional)
   4) కాలక్రమ (Longitudinal)
10. ప్రయోగ పద్ధతిలో వేర్వేరు వయసున్న శిశువులను ప్రయోజ్యులుగా ఎంపిక చేసుకొని అధ్యయనం చేసే పద్ధతి?
   1) సంచరిత పరిశీలన
   2) అసంచరిత పరిశీలన
   3) సమాంతర అధ్యయన (Cross Sectional)
   4) కాలక్రమ (Longitudinal)
11. ప్రజ్ఞ ప్రభావం సృజనాత్మకతపై ఉందదని పేర్కొన్న పరిశోధకుడు నియంత్రించిన మధ్యస్థ చరం?
   1) ప్రజ్ఞ 2) సృజనాత్మకత
   3) ప్రేరణ 4) ప్రజ్ఞ, సృజనాత్మకత
12. సాంఘిక ఆర్థిక స్థితి ప్రభావం విద్యార్థుల సాధనపై ఉంటుందనే పరిశోధనలో ప్రయోగ ఫలితం?
   1) విద్యార్థుల సాంఘిక ఆర్థిక స్థితి
   2) విద్యార్థుల వైఖరి 3) విద్యార్థుల సాధన
   4) విద్యార్థుల అభిరుచి
13. బోధనానుభవం ప్రభావం బోధనా సామర్థ్యంపై ఉందో లేదో తెలుసుకోవాల నుకునే ప్రయోగంలో బోధనాభిరుచి ఏ చరం?
   1) స్వతంత్ర 2) పరతంత్ర
   3) మధ్యస్థ 4) అస్థిర
14. 'నేను ఆందోళనలో ఉన్నానని' పేర్కొన్న వ్యక్తి ఉపయోగించిన పద్ధతి?
   1) పరిశీలన 2) అంతఃపరీక్షణ
   3) ప్రయోగ 4) వ్యక్తి అధ్యయన
15. ఉపాధ్యాయుడు ఆట స్థలంలో విద్యార్థుల ప్రవర్తనను వీడియో సహాయంతో గమనించడం ఏ పరిశీలన?
   1) నియంత్రిత 2) సంచరిత
   3) ప్రయోగ 4) అసంచరిత
16. శైశవ దశలోని లక్షణాలను తెలుసుకోవడానికి తగని పద్ధతి?
   1) ప్రయోగ 2) వ్యక్తి అధ్యయన
   3) అంతఃపరీక్షణ 4) పరిశీలన
17. వ్యక్తి అధ్యయన పద్ధతిలో సమస్యాత్మక విద్యార్థి కానిది?
   1) ప్రతిభావంతుడు
   2) అభ్యసన వైకల్యత ఉన్నవాడు
   3) సగటు ప్రజ్ఞ ఉన్న విద్యార్థి
   4) చదువులో వెనకబడిన విద్యార్థి
18. గ్రామీణ/పట్టణ ప్రాంతాల ప్రభావం విద్యార్థి వ్యక్తీకరణ నైపుణ్యాలపై ఉందో లేదో తెలుసుకునే ప్రయోగ పరిశోధనలో మధ్యస్థ చరం కానిది?
   1) వ్యక్తీకరణ నైపుణ్యాలు 2) అభిరుచి
   3) కుటుంబం 4) విద్యార్హతలు
19. విల్ హెల్మ్ ఊంట్‌కు సంబంధించి సరికాని ప్రవచనం?
   1) సంరచనాత్మక వాదానికి మూలపురుషుడు
   2) సంసర్గవాదానికి మూలపురుషుడు
   3) మనోవిజ్ఞానశాస్త్ర పితామహుడు
   4) ప్రయోగాత్మక మనో విజ్ఞానశాస్త్ర పితామహుడు
20. హెర్బర్ట్ సోపానాల్లో సరైన వరుస క్రమం?
   1) సన్నాహం, సంసర్గం, ప్రదర్శన, అన్వయం,సాధారణీకరణం, సింహా వలోకనం
   2) సన్నాహం, ప్రదర్శన, అన్వయం, సంసర్గం,సాధారణీకరణం, సింహావ లోకనం
   3) సన్నాహం, ప్రదర్శన, సంసర్గం, సాధారణీకరణం, సింహావలోకనం, అన్వయం
   4) సన్నాహం, ప్రదర్శన, సంసర్గం, సాధారణీకరణం, అన్వయం, సింహా వలోకనం.
21. జీన్ పియాజె తన ముగ్గురి పిల్లల సంజ్ఞానాత్మక వికాసాన్ని అనేక ఏళ్ల పాటు పరిశీలించాడు. ఇది ఏ రకమైన పరిశోధనా పద్ధతి?
   1) అంతఃపరిశీలన
   2) సమాంతర (Cross sectional)
   3) కాలక్రమ (Longitudinal)
   4) వ్యక్తి అధ్యయన పద్ధతి
22. ఉపాధ్యాయుడు తరగతిలోని విద్యార్థు లను రెండు సమూహాలుగా విభజించి, ఒక సమూహానికి స్వతంత్ర చరం ప్రవేశ పెట్టాడు. రెండో సమూహానికి స్వతంత్ర చరం ప్రవేశపెట్టలేదు. ప్రయోగం అనంతరం ఫలితాలు విశ్లేషించాడు. ఇది ఏ రకమైన సమూహ నమూనా?
   1) ఏక 2) నియంత్రిత
   3) పరిభ్రమణ 4) ద్వి
23. ఉపాధ్యాయుడు తరగతి గదిలో బోధిస్తూ విద్యార్థుల ఇంగితాలను గమనించడం ఏ పరిశీలన?
   1) అసంచరిత 2) ప్రయోగ
   3) సంచరిత 4) స్వయం
24. ప్రస్తుత నార్కోఅనాలిసిస్ పద్ధతికి మూలమైన వాదం?
   1) గెస్టాల్ట్ 2) మనో విశ్లేషణ
   3) ప్రవర్తన 4) సంరచనాత్మక
25. ఆదాయ ప్రభావం ఉద్యోగ సంతృప్తిపై ఉందో లేదో తెలుసుకునే ప్రయోగంలో మధ్యస్థచరం కానిది?
   1) ఉద్యోగి వైఖరి 2) ఉద్యోగి సంతృప్తి
   3) ఉద్యోగి అభిరుచి 4) ఉద్యోగి ప్రేరణ

సమాధానాలు

1) 3	2) 3	3) 2	4) 2	5) 2
6) 1	7) 3	8) 3	9) 4	10) 3
11) 3	12) 3	13) 3	14) 2	15) 4
16) 3	17) 3	18) 1	19) 2	20) 4
21) 3	22) 2	23) 3	24) 3	25) 2

పీడనం పెరగడం వల్ల నీటి భాష్పీభవన స్థానం?

భౌతిక శాస్త్రంలో ముందుగా భౌతిక రాశులు, బలం, ఉష్ణం, కాంతి, ధ్వని, అయస్కాంతత్వం, విద్యుత్ మొదలైన పాఠ్యాంశాలపై పట్టు సాధించాలి. వీటి కోసం 10వ తరగతి వరకు ఉన్న భౌతిక శాస్త్ర పాఠ్యపుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. వీటితో పాటు శుద్ధగతిక శాస్త్రం, విశ్వ గురుత్వాకర్షణ, ప్రవాహిలు, తలతన్యత, ద్రవ్యరాశి కేంద్రం, ఆధునిక భౌతిక శాస్త్రం లాంటి అంశాలపై కూడా ఇటీవల ప్రశ్నలు అడుగుతున్నారు. వీటి కోసం 6 నుంచి 10వ తరగతి పాఠ్యపుస్తకాలతోపాటు ఇంటర్మీడియట్ స్థాయి పుస్తకాలను కూడా చదవాలి. అభ్యర్థికి 10వ తరగతి వరకు ఉన్న అన్ని అంశాలపై సాధారణ అవగాహన ఉండాలనేది జనరల్ స్టడీస్ ముఖ్య ఉద్దేశం. పరీక్షల దృష్ట్యా జనరల్ సైన్స్‌లో భౌతిక శాస్త్రానికి వెయిటేజీ ఉంది.

శిక్షణా సంస్థల్లో కొంతమంది అధ్యాపకులు తరచుగా కొన్ని టాపిక్స్‌ను మాత్రమే బోధించి, వాటి నుంచే ప్రశ్నలు వస్తాయని చెబుతారు. కానీ పోటీ పరీక్షలకు సంబంధించి నిర్దిష్టంగా ఒక టాపిక్ నుంచి ప్రశ్నలు వస్తాయని చెప్పలేం. వర్తమాన అంశాల ప్రాధాన్యాల ఆధారంగా ఏ పాఠ్యభాగం నుంచైనా ప్రశ్నలు ఇవ్వవచ్చు. అందువల్ల అభ్యర్థులు గత ప్రశ్నపత్రాలను పరిశీలించడం ద్వారా ప్రశ్నల సరళిపై అవగాహన పెంచుకొని వాటికి అనుగుణంగా సన్నద్ధమవ్వాలి.

భౌతిక శాస్త్రంలో సాధారణంగా స్టాండర్డ్ జీకే, ప్యూర్ సైన్స్, అప్లయిడ్ సైన్స్ లేదా జనరల్ సైన్స్ అనే మూడు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. శాస్త్రవేత్తలు, పరికరాల పేర్లు, ఆవిష్కరణలు- సంవత్సరాలు మొదలైనవి స్టాండర్డ్ జీకేకు సంబంధించిన అంశాలు. కొన్ని ఉదాహరణలు..

1. టెలిస్కోప్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
2. అచ్చుయంత్రాన్ని కనుగొన్నదెవరు?
3. విశ్వ గురుత్వ నియమాన్ని ప్రతిపాదించిందెవరు?
4. ఐన్‌స్టీన్‌కు ఏ సిద్ధాంతానికి నోబెల్ బహుమతి లభించింది?
5. ఐన్‌స్టీన్‌కు నోబెల్ బహుమతి ఏ సంవత్సరంలో లభించింది?
6. 'యురేకా' అని అరిచిందెవరు?

సమాధానాలు

1) గెలీలియో 2) జాన్ గూటన్ బర్గ్
3) న్యూటన్
4) ఐన్‌స్టీన్ 'ఫొటో ఎలక్ట్రిక్ ఎఫెక్ట్' కనుగొన్నందుకు నోబెల్ బహుమతి లభించింది. వాస్తవానికి ఈయన సాపేక్ష సిద్ధాంతానికి నోబెల్ వస్తుందని భావించారు.
5) 1921
6) ఆర్కిమెడిస్. గ్రీకు భాషలో 'యురేకా' అంటే 'కనుగొన్నాను' లేదా 'తెలుసుకున్నాను' అని అర్థం. నూతన విషయాన్ని కనుగొన్న సందర్భంలో ఆర్కిమెడిస్ 'యురేకా' అని గట్టిగా అరుస్తూ వీధుల వెంట తిరిగారు.



ప్యూర్ సైన్స్‌లో భాగంగా ఒక్కోసారి ఫిజిక్స్‌లో సమస్య (ప్రాబ్లం)లపై కూడా ప్రశ్నలు అడగవచ్చు. సులభమైన అంశాలు, దాదాపుగా నేరుగా సమాధానం గుర్తించేవిధంగా ఈ ప్రశ్నలు ఉంటాయి. గతంలో ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో సమస్యలపై అడిగిన కొన్ని ప్రశ్నలను గమనించండి.

1. ఒక వస్తువు వేగాన్ని రెట్టింపు చేస్తే దాని గతిశక్తి ఎన్నిరెట్లు అవుతుంది?
2. ఒక రేడియోధార్మిక మూలకం అర్ధజీవిత కాలం 4 సంవత్సరాలు. అయితే అది 3/4వ వంతు విఘటనం చెందడానికి పట్టే కాలం ఎంత?
3. ఒక గ్రహం, దాని నక్షత్రానికి మధ్య ఉన్న దూరం రెట్టింపు అయితే దాని ఆవర్తన కాలం ఎన్ని రెట్లు అవుతుంది?

సమాధానాలు

1) 4 రెట్లు 2) 8 సంవత్సరాలు 3) $2\sqrt{2}$ రెట్లు

మూడో విభాగమైన అప్లయిడ్ సైన్స్ నుంచి అత్యధిక ప్రశ్నలు వస్తాయి. ఫిజిక్స్‌లో సుమారు తొంభై శాతం ప్రశ్నలు ఈ విభాగం నుంచే ఉంటాయి. దీంట్లో భాగంగా మౌలికాంశాలతో పాటు వివిధ ధర్మాలు, నియమాలు, సూత్రాలు, సిద్ధాంతాలు, వాటి అనువర్తనాలపై ప్రశ్నలు అడుగుతారు.

ఉదా: కాంతి ధర్మాలు, అయస్కాంతాల సాధారణ ధర్మాలు, ధ్వని ధర్మాలు.

నియమాలకు సంబంధించి న్యూటన్ గమన నియమాలు, కెప్లర్ గ్రహగమన నియమాలు, న్యూటన్ విశ్వ గురుత్వాకర్షణ నియమం, ఆర్కిమెడిస్ సూత్రం, ప్లవన సూత్రం, బెర్నౌలీ సిద్ధాంతం, ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం, పాస్కల్ సూత్రం మొదలైనవాటిని క్షుణ్నంగా చదవాలి. వీటి ఆధారంగా నిజ జీవితంలో జరిగే సంఘటనల్ని విశ్లేషించుకోవాలి. అభ్యర్థి సబ్జెక్ట్‌కు సంబంధించిన విషయ పరిజ్ఞానాన్ని పరిశీలించడంతో పాటు జనరల్ సైన్స్‌లో ప్రశ్నలను అడగడంలో ఉన్న మరో ముఖ్య ఉద్దేశం విశ్లేషణా సామర్థ్యాన్ని పరీక్షించడం. విషయాన్ని బట్టీపట్టడం కంటే అర్థం చేసుకుంటూ చదివినప్పుడే ఎలాంటి ప్రశ్నలు ఇచ్చినా సులభంగా సమాధానాలను గుర్తించవచ్చు. ఎక్కువగా ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలను చదవడం వల్ల నిర్మాణాత్మక పరిజ్ఞానం, సామర్థ్యం, తార్కిక విశ్లేషణ సాధ్యం కాదు. అందువల్ల ప్రధాన కాన్సెప్ట్‌లను క్షుణ్నంగా అధ్యయనం చేయడం ప్రయోజనకరం. పాఠ్యాంశాలపై పట్టు సాధించిన తర్వాత సాధ్యమైనంత ఎక్కువగా ప్రశ్నలను సాధన చేయాలి. అభ్యర్థులు ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని చదివితే మంచి మార్కులు సంపాదించవచ్చు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఫిజిక్స్

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో ఒక వస్తువు భారం దేంట్లో గరిష్ఠంగా ఉంటుంది?
   1) శూన్య ప్రదేశం 2) హైడ్రోజన్
   3) గాలి 4) నీరు
2. నీటిలో తేలియాడుతున్న వస్తువు దృశ్య భారం ఎంత?
   1) శూన్యం
   2) వస్తువు నిజ భారంలో సగం
   3) వస్తువు నిజ భారానికి సమానం
   4) వస్తువు నిజ భారానికి రెట్టింపు
3. ఒక ప్రవాహిలో మునిగి ఉన్న వస్తువు ఘ.ప. 200 ఘనపు సెంటీమీటర్లు. అయితే అది ఎంత ఘనపరిమాణం ఉన్న నీటిని స్థానభ్రంశం చెందిస్తుంది?
   1) 0 2) 50 ఘ.సెం.మీ.
   3) 200 ఘ.సెం.మీ.
   4) 400 ఘ.సెం.మీ
4. ఒక ప్రవాహిలో వేలాడుతున్న వస్తువు దృశ్యభారం ఎంత?
   1) దాని నిజ భారానికి రెట్టింపు
   2) నిజ భారానికి సమానం
   3) నిజ భారంలో సగం 4) శూన్యం
5. ఆకుపచ్చని కాంతిలో పసుపు పచ్చని పుష్పం ఏ వర్ణంలో కనిపిస్తుంది?
   1) తెలుపు 2) నలుపు
   3) ఆకుపచ్చ 4) పసుపు పచ్చ
6. కిందివాటిలో ప్రాథమిక వర్ణం కానిది?
   1) ఎరుపు 2) ఆకుపచ్చ
   3) పసుపుపచ్చ 4) నీలం
7. అణు రియాక్టర్లలో మితకారిణి విధి ఏమిటి?
   1) చర్యా వేగాన్ని మార్చడం
   2) న్యూట్రాన్ల వేగాన్ని పెంచడం
   3) న్యూట్రాన్ల వేగాన్ని తగ్గించడం
   4) ఉష్ణోగ్రతను తగ్గించడం
8. భారజలం రసాయనిక నామం?
   1) డై హైడ్రోజన్ ఆక్సైడ్
   2) హైడ్రోజన్ డయాక్సైడ్
   3) డ్యుటీరియం ఆక్సైడ్
   4) హైడ్రోజన్ పెరాక్సైడ్
9. ఒకే సైజు, ఒకే ఆకృతిలో ఉన్న A, B అనే రెండు లోహపు డబ్బాలను ఒకే పదార్థంతో తయారు చేశారు. వాటిని 4°C ఉష్ణోగ్రత వద్దనున్న నీటితో పూర్తిగా నింపి ఒకదాన్ని వేడిచేసి, మరో దాన్ని చల్లారిస్తే ఆ రెండింటిలో నీటి ఘనపరిమాణం ఏమవుతుంది?
   1) Aలో పెరిగి Bలో తగ్గుతుంది
   2) Aలో తగ్గి Bలో పెరుగుతుంది
   3) రెండింటిలో పెరుగుతుంది
   4) రెండింటిలో తగ్గుతుంది
10. పీడనం పెరగడం వల్ల నీటి భాష్పీభవన స్థానం?
    1) పెరుగుతుంది
    2) తగ్గుతుంది
    3) స్థిరంగా ఉంటుంది
    4) పెరగవచ్చు లేదా తగ్గవచ్చు
11. కిందివాటిలో దయా అయస్కాంత పదార్థం కానిది?
    1) బంగారం
    2) వజ్రం
    3) కోబాల్ట్
    4) ఆల్కహాల్
12. మాక్ నంబర్ దేనికి సంబంధించింది?
    1) ఉష్ణోగ్రత 2) వేగం
    3) పీడనం 4) భారం
13. ఒక ట్యూబ్ లైట్ 40 వాట్ల సామర్థ్యాన్ని కలిగి ఉంది. దాన్ని ఎన్ని గంటలపాటు వెలిగిస్తే 1 యూనిట్ కరెంట్ వినియోగం అవుతుంది?
    1) 40 2) 25
    3) 24 4) 10
14. ఉష్ణోగ్రతతో నీటి స్పర్శ కోణం?
    1) పెరుగుతుంది
    2) తగ్గుతుంది
    3) స్థిరంగా ఉంటుంది
    4) స్పర్శ కోణం ఉష్ణోగ్రతపై ఆధారపడదు
15. భూస్థావర ఉపగ్రహాలు భూ ఉపరితలం నుంచి ఎంత ఎత్తు వద్ద తిరుగుతాయి?
    1) 1000 కి.మీ.
    2) 3200 కి.మీ.
    3) 3600 కి.మీ.
    4) 36,000 కి.మీ.
16. భూ ఉపరితలం నుంచి పైకి వెళ్లేకొద్ది పీడనం?
    1) తగ్గుతుంది
    2) పెరుగుతుంది
    3) స్థిరంగా ఉంటుంది
    4) పెరగవచ్చు లేదా తగ్గవచ్చు
17. సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిందెవరు?
    1) టాలమీ
    2) కోపర్నికస్
    3) గెలీలియో
    4) న్యూటన్
18. భూమిపై ప్రదేశం లేదా విశ్వంలోని ఏదైనా స్థానం ఆధారంగా ఒక వస్తువు ద్రవ్యరాశి, భారానికి సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
    1) ద్రవ్యరాశి, భారం రెండూ స్థిరంగా ఉంటాయి
    2) ద్రవ్యరాశి, భారం రెండూ మారతాయి
    3) ద్రవ్యరాశి స్థిరంగా ఉంటుంది కానీ భారం మారుతుంది
    4) భారం స్థిరంగా ఉంటుంది కానీ ద్రవ్యరాశి మారుతుంది
19. 1 కేజీ, 10 కేజీల ద్రవ్యరాశి ఉన్న రెండు వస్తువులను సమాన వేగాలతో నిటారుగా పైకి విసిరితే, ఆ రెండింటిలో ఏది గరిష్ఠ ఎత్తుకు చేరుతుంది?
    1) 1 కేజీ ద్రవ్యరాశి ఉన్న వస్తువు
    2) 10 కేజీ ద్రవ్యరాశి ఉన్న వస్తువు
    3) రెండూ సమాన గరిష్ఠ ఎత్తునకు చేరుకుంటాయి
    4) వాటి గరిష్ఠ ఎత్తు అనేది పైకి విసిరిన సాధారణ వేగంపై ఆధారపడి ఉంటుంది
20. కాలానికి ప్రామాణిక ప్రమాణం ఏది?
    1) సెకన్
    2) నిమిషం
    3) గంట
    4) రోజు

సమాధానాలు

1) 1; 2) 1; 3) 3; 4) 4; 5) 2; 6) 3; 7) 3; 8) 3; 9) 3; 10) 1; 11) 3; 12) 2; 13) 2; 14) 2; 15) 4; 16) 1; 17) 2; 18) 3; 19) 3; 20) 1

What is the average selling price of..

BANK EXAMS
QUANTITATIVE APTITUDE


Model Questions

Directions (Q. No. 1-5) : Study the pie chart carefully and answer the given questions.


The Pie chart shows the percentage breakup of the people is living in a six floors building and the other pie chart shows the percentage breakup of the male members are living in that building.

Note: All the data is given for 2017.

Total number of people = X



Total number of male = 300



1. If the total number of females live on 3^{rd} floor is 1/3rd of the total number of males live on 3^{rd} floor then find the total number of people lives on 3^{rd} floor and 4^{th} floor together?
   a) 166 b) 176
   c) 156 d) 148
   e) 184
2. If the total number of females live on 5^{th} floor and 6^{th} floor together is 32 then find the difference between the total number of people lives on 1^{st} and 2^{nd} floor together to that of the total number of people lives on 5^{th} and 6^{th} floor together?
   a) 100 b) 72 c) 80
   d) 84 e) 96
3. If the total number of females live on 3^{rd} floor is 50% of the total number of males lives on 2^{nd} floor then the total number of people live on 1^{st} floor is what percentage of the total number of people live on 2^{nd} floor?
   a) 72% b) 85%
   c) 90% d) 55%
   e) 80%
4. The total number of people live on 5^{th} floor in 2017 is 80. In 2018, the total number of people live on all floors together is increased by 20% from that previous year then find the difference between the total number of people live on 1^{st} and 3^{rd} floor together to the total number of people lives on 4^{th} and 6^{th} floor together in 2018. (The percentage breakup in 2018 will remain the same)
   a) 144 b) 156
   c) 162 d) 140
   e) 136
5. The total number of males live on 1^{st} floor, 2^{nd} floor and 3^{rd} floor together is approximately what percentage more/less than of the total number of males live on 4^{th} floor, 5^{th} floor and 6^{th} floor together.
   a) 167% b) 97%
   c) 67% d) 34%
   e) 125%


Directions (Q. 6-10): Study the following information carefully and answer the given questions.

Among 400 cricket players, 45% played in IPL-1 and 6.25% played only in IPL-1. Again, 57.5% players played in IPL-2 and 11.25% players played only in IPL-2. Again, 72.5% players played in IPL-3 and 27.5% players played only in IPL-3. Twenty per cent players played in all three IPL tournaments.

6. How many players are there who played in IPL 1 and IPL2 but not in IPL 3?
   a) 30 b) 35
   c) 40 d) 65
   e) 45
7. What is the percentage of players who played in IPL 2 and IPL 3 but not in IPL 1?
   a) 12.5% b) 16.25%
   c) 22.75% d) 24%
   e) None of these
8. What is the percentage of the players who played in at least two IPL tournaments?
   a) 30% b) 35%
   c) 45% d) 50%
   e) 55%
9. The number of players who played only in either IPL 1 or IPL 2 is what percentage of the players who played in all three IPL?
   a) 72%
   b) 75%
   c) 82.5%
   d) 85%
   e) None of these
10. The number of players who played in at most one IPL tournament is what percentage more/less than the number of players who played in at least one IPL?
    a) 55% more b) 55% less
    c) 40% more d) 40% less
    e) None of these

Direction (Q. No. 11-15): Refer the following line graph and answer the questions based on it.

The line graph shows the percentages of markup on CP and discount offered on MP of six different articles sold by a shopkeeper.



11. Selling price of article C is Rs.528 and the marked prices of articles C and E are the same. What is the average selling price of both the articles in Rupees?
    a) 534.5 b) 544.5 c) 554.5
    d) 524.5 e) None of these
12. Cost Price of article A is Rs.450 and that of article D is Rs.600. What is the ratio of marked price of both the articles?
    a) 5 : 6 b) 3 : 4 c) 3 : 5
    d) 4 : 5 e) None of these
13. If the cost price of article E is double to that of article A, the marked price of article E is how much percent more than that of article A?
    a) 50% b) 40% c) 60%
    d) 30% e) None of these
14. For which article, the profit percent is the minimum?
    a) D and E b) D c) E
    d) E and F e) None of these
15. If the cost price of each of the article B and F is Rs.800, then what is the total profit earned by shopkeeper on both the articles?
    a) Rs.152
    b) Rs.248
    c) Rs.184
    d) Rs.216
    e) Cannot be determined

KEY & SOLUTIONS

1.

Floor	Total number of males
1^{st} floor	15
2^{nd} floor	24
3^{rd} floor	36
4^{th} floor	105
5^{th} floor	66
6^{th} floor	54


The total number of males on 3^{rd} floor = 36
The total number of females on 3^{rd} floor 36/3 = 12
The total number of people on 3^{rd} floor = 36 + 12 = 48
So, we know that
12% = 48
The total number of people on 3^{rd} floor and 4^{th} floor
= 12% + 32% = 44%
The total number of people on 3^{rd} floor and 4^{th} floor
= (48/12)× 44 = 44× 4 = 176
Ans: b

2. The total number of males live on 5^{th} and 6^{th} floor together
= 66 + 54 = 120
The total number of females live on 5^{th} and 6^{th} floor together = 32
The total number of people live on 5^{th} and 6^{th} floor together
= 120 + 32 = 152
So, (20% + 18%) = 152
38% = 152
The percentage of people live on 1^{st} and 2^{nd} floor together
= 8% + 10% = 18%
So, required difference
= 38 - 18 = 20%
Then, (152/38)×20 = 80 **Ans: c**

3. The percentage of the total number of people live on 1^{st} floor = 8%
The percentage of the total number of people live on 2^{nd} floor = 10%
So, required percentage =
= (8/10)×100 = 80%
Ans: e

4. The total number of people live on 5^{th} floor in 2017 = 80
So, 20% = 80
100% = (80/20) ×100 = 400
So the total number of people lives on all floors in 2017 = 400
So the total number of people lives on all floors in 2018
= (400/100)×120 = 480
So, required difference
= (32% + 18%) - (8% + 12%)
= 30%
Then, (30/100)×480 = 144
Ans: a

5. The total percentage of people live on 1^{st}, 2^{nd} floor and 3^{rd} floor together
= 5 + 8 + 12 = 25%
The total percentage of people live on 4^{th}, 5^{th} floor and 6^{th} floor together
= 35 + 22 + 18 = 75%
So, required percentage
= [(75-25)/75]×100
= (50/75)×100 = 67%(Approx)
Ans: c

6. 

x + y + 80 + 25 = 180
or x + y = 75 ______(i)
y + z + 80 + 110 = 290
or, y + z = 100 ______(ii)
x + z + 80 + 45 = 230
or x + z = 105 ______(iii)
From eqn (i), (ii) and (iii),
x = 40, y = 35, z = 65 **Ans: c**

7. Required percentage
= (65/400)×100 = 16.25 **Ans: b**

8. At least two IPL = 40 + 35 + 65 + 80 = 220
Required%
= (220/400)×100 = 55%
Ans: e

9. Only IPL-1 = 25, only IPL-2 = 45
\ Total = 70
Required%
= (70/80)×100 = 87.5% **Ans: e**

10. At least one IPL = 400
At most one IPL = 25 + 45 +110 = 180
\ Required%
= [(400-180)/400]×100 = 55%
Ans: b

11. Marked price of article C
= [100/(100-20)]×528 = Rs.660
Then, marked price of article E
= Rs. 660
Selling price of article E
= 660×(100-15)/100 = Rs.561
Required average
= (528+561)/2 = Rs.544.5
Ans: b

12. Required ratio
= 450×(100+60)/100:
600×(100+50)/100
= 4 : 5 **Ans: d**

13. Let the cost price of article A be Rs. 100 Then, the cost price of article E = Rs. 200
Marked price of article A
= 100 + 60% of 100 = 160
Marked price of article E
= 200 +20% of 200 = 240
Required percentage
= [(240-160)/160]×100 = 50%
Ans: a

14. Profit% = (100+Markup%) × [(100-Discount%)/100]-100
Profit% for article A
= (100+60) × [(100-25)/100]-100
= 20%
Similarly,
Profit% for article B = 19%
Profit% for article C = 32%
Profit% for article D = 5%
Profit% for article E = 2%
Profit% for article F = 8% **Ans: c**

15. Profit% = (100+markup%) × [(100-Discount%)/100]-100
Profit % for article B = 19%
Profit % for article F = 8%
Total profit = 19% of 800 + 8% of 800 = 27% of 800 = Rs. 216
Ans: d